శనివారం
29•6•2019
కరీంనగర్
• వెల. రూ.6.50
• సంపుటి 9 • సంచిక 4
• పేజీలు: 16 + 16

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

నిజామాబాద్ జిల్లా మాక్లూర్ మండలం కృష్ణానగర్ వద్ద వరినాట్లు వేస్తున్న రైతు కూలీలు

యూఎస్‌ఏ 243వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కేక్ కోస్తున్న యూఎస్ కాన్సుల్ జనరల్ క్యాథరిన్ హడ్డా, రాష్ట్ర గవర్నర్ నరసింహన్ దంపతులు

## 40 దేశాల్లో టీఆర్ఎస్ సభ్యత్వ నమోదు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** టీఆర్ఎస్ ఎన్నారై శాఖ ఆధ్వర్యంలో 40 దేశాల్లో పార్టీ సభ్యత్వ నమోదు శుక్రవారం ప్రారంభమైంది. టీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు చేతుల మీదుగా టీఆర్ఎస్ ఎన్నారై కోఆర్డినేటర్ మహేశ్ బిగాల పార్టీ సభ్యత్వం తీసుకొన్నారు. టీఆర్ఎస్ పార్టీకి 33 జిల్లాల్లో కార్యాలయాలను నిర్మిస్తున్నందుకు మహేశ్ బిగాల సంతోషం వ్యక్తంచేశారు.

టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేతులమీదుగా సభ్యత్వ నమోదు అందుకుంటున్న మహేశ్ బిగాల

హజ్‌హౌస్‌లో 'డ్రైవర్ ఎంపవర్‌మెంట్' పథకం కింద అందజేసిన వాహనాలను జెండాఊపి ప్రారంభిస్తున్న మంత్రులు మహమూద్‌అలీ, కొప్పుల ఈశ్వర్ తదితరులు

## మైనార్టీల అభ్యున్నతి కేసీఆర్‌తోనే సాధ్యం

'డ్రైవర్ ఎంపవర్‌మెంట్' పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మంత్రులు కొప్పుల ఈశ్వర్, మహమూద్ అలీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మైనార్టీ వర్గాలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకే సీఎం కేసీఆర్ రాష్ట్ర బడ్జెట్‌లో రూ.2 వేలకోట్లు కేటాయించారని, దీనిని పూర్తిస్థాయిలో వినియోగించి మైనార్టీలను ప్రగతిబాటలో నడిపేందుకు చర్యలు తీసుకుంటున్నారని మంత్రులు కొప్పుల ఈశ్వర్, మహమూద్‌అలీ అన్నారు. 'డ్రైవర్ ఎంపవర్‌మెంట్' పథకం కింద శుక్రవారం హజ్‌హౌస్‌లో 67 మంది మైనార్టీ యువతకు సబ్సిడీతో కార్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. మైనార్టీల అభ్యున్నతి సీఎం కేసీఆర్‌తోనే సాధ్యమవుతుందని, భవిష్యత్‌లో మరిన్ని పథకాలు అమలుచేసి మైనార్టీలకు తోడ్పాటు అందజేస్తామని పేర్కొన్నారు. 'డ్రైవర్ ఎంపవర్‌మెంట్' పథకాన్ని మైనార్టీ యువత సద్వినియోగం చేసుకోవాలన్నారు. మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ అక్బర్ హుస్సేన్ మాట్లాడుతూ.. మైనార్టీ యువతను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు సీఎం కేసీఆర్ రూ.25 కోట్ల సబ్సిడీని మంజూరు చేశారని తెలిపారు. మైనార్టీలంతా సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మైనార్టీ సంక్షేమశాఖ కార్యదర్శి బెనహర్ మహేశ్‌దత్ ఎక్కా, డైరెక్టర్ షానవాజ్ ఖాసీం, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండీ కాంతి వెస్లీ, నాంపల్లి ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్, హజ్‌కమిటీ చైర్మన్ మసిఉల్లాఖాన్, వక్ఫ్ బోర్డు చైర్మన్ మహ్మద్ సలీం, ఉర్దూ అకాడమీ చైర్మన్ రహీముద్దీన్ అన్సారీ పాల్గొన్నారు.

# కృష్ణాగర్భంలో గోదారి పరవళ్లు

### అలైన్‌మెంట్‌పై అధ్యయనం చేయనున్న రెండురాష్ట్రాల ఇంజినీర్లు

వచ్చేనెల 15లోగా నివేదిక ఇచ్చేందుకు మొదలైన కసరత్తు.. వచ్చేనెల 2న రెండు రాష్ట్రాల ఇంజినీర్ల భేటీకి నిర్ణయం

ఐదారు ప్రతిపాదనల్ని సిద్ధంచేసి ప్రభుత్వానికి సమర్పించే అవకాశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** గోదావరి గతిని మార్చి లక్షల ఎకరాలకు జీవంపోసే కాళేశ్వరం స్ఫూర్తిగా మరో చారిత్రాత్మక ప్రాజెక్టును చేపట్టేందుకు తెలంగాణ, ఏపీ ప్రభుత్వాలు సిద్ధమవుతున్నాయి. ఏటా వృథాగా సముద్రంలోకి పరుగులు పెడుతున్న గోదారమ్మను దారిమళ్లించి కృష్ణమ్మ గర్భంలో పోయాలని రెండురాష్ట్రాల ముఖ్యమంత్రులు నిర్ణయించారు. శుక్రవారం ముఖ్యమంత్రుల సమావేశంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించే లక్ష్యంగా సాగింది. తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న కృష్ణాబేసిన్‌ను గోదావరిజలాలతో సుసంపన్నం చేయాలనే నిర్ణయానికొచ్చారు. పలు ప్రతిపాదనలపై చర్చించిన సీఎంలు.. ఇన్‌టేక్ పాయింట్లు, అలైన్‌మెంట్‌పై అధ్యయనంచేసి ప్రాథమిక నివేదిక సమర్పించాలని ఇంజినీర్లను ఆదేశించారు.

నాగార్జున సాగర్ (ఫైల్)

శ్రీశైలం (ఫైల్)

#### రోజుకు నాలుగు టీఎంసీల మళ్లింపు

కృష్ణా బేసిన్‌కు రెండుమార్గాల్లో రెండు టీఎంసీల చొప్పున రోజుకు నాలుగు టీఎంసీల గోదావరిజలాలను మళ్లించాలని సమావేశంలో నిర్ణయించినట్టు తెలిసింది. రెండు టీఎంసీలను నాగార్జునసాగర్‌కు, రెండు టీఎంసీలను శ్రీశైలం జలాశయానికి తరలించాలని దాదాపుగా ఖరారైంది. గోదావరిపై ఎక్కడ నీటిని ట్యాప్ (ఇన్‌టేక్ పాయింట్) చేయాలనే దానిపై పలు ప్రతిపాదనలు చర్చకొచ్చాయి. దీంతోపాటు నాగార్జునసాగర్ రెండు టీఎంసీల తరలింపు అనేది ఖరారు కాగా... నాగార్జునసాగర్ నుంచి శ్రీశైలంకు మరో రెండు టీఎంసీల తరలింపా? నేరుగా శ్రీశైలం జలాశయానికి రెండు టీఎంసీల తరలింపా? అనే దానిపై సాధ్యాసాధ్యాలను పరిశీలించాల్సిందిగా ఇద్దరు సీఎంలు.. ఇంజినీర్లను ఆదేశించారు. వచ్చేనెల 15లోగా దీనిపై ప్రాథమిక నివేదిక సమర్పించాల్సిందిగా గడువు విధించారు. అవసరమైతే హెలికాప్టర్లను వినియోగించి.. విశ్రాంత ఇంజినీర్లతో ఈ అధ్యయనాన్ని చేపట్టాలని స్పష్టం చేశారు. ఏపీ తరపున జలవనరులశాఖ ముఖ్య కార్యదర్శి ఆదిత్యనాథ్, తెలంగాణ తరపున ఈఎన్సీ మురళీధర్‌రావు పర్యవేక్షించాలని ఆదేశించినట్టు సమాచారం.

#### సమావేశమైన రెండు రాష్ట్రాల ఇంజినీర్లు

ముఖ్యమంత్రుల ఆదేశంతో రంగంలోకి దిగిన రెండురాష్ట్రాల ఇంజినీర్లు, విశ్రాంత ఇంజినీర్లు శుక్రవారం సాయంత్రం జలసౌధలో భేటీ అయ్యారు. రెండు రాష్ట్రాల ఈఎన్సీలు మురళీధర్‌రావు, వెంకటేశ్వరరావు, అంతర్రాష్ట్ర విభాగం సీఈలు నర్సింహారావు, నాగేశ్వరరావు, కర్నూలు సీఈ నారాయణరెడ్డి, తెలంగాణ విశ్రాంత ఇంజినీర్ల సంఘం అధ్యక్షుడు చంద్రమౌళి, ప్రధాన కార్యదర్శి మేరెడ్డి శ్యాంప్రసాద్ రెడ్డి, వెంకట్రామారావు, సత్తిరెడ్డి, ఏపీ తరపున రహమాన్, బీఎస్ఎన్‌రెడ్డి, సుబ్బారావు, రోశయ్య పాల్గొన్నారు. టోపోషీట్ల ఆధారంగా ఎక్కువ ప్రతిపాదనల్ని పరిశీలించి.. ఐదారు ప్రతిపాదనల్ని ముఖ్యకార్యదర్శులకు సమర్పించాలని నిర్ణయించినట్టు తెలిసింది. వచ్చే నెల 2వతేదీన హైదరాబాద్‌లో ఇరురాష్ట్రాల ఇంజినీర్లు సమావేశం కావాలని ఈ భేటీలో నిర్ణయించారు. ప్రాథమిక నివేదిక ముఖ్యకార్యదర్శులస్థాయిలో పరిశీలన జరిగాక సీఎంలకు వివరించనున్నారు. అనంతరం ఇద్దరు ముఖ్యమంత్రులు సమావేశమై ప్రతిపాదనలపై తుది నిర్ణయం తీసుకునే అవకాశముంది.

### నాగార్జునసాగర్‌కు మళ్లింపుపై ప్రతిపాదనలు (ప్రాథమిక స్థాయిలోనివి)

- పోలవరం నుంచి ప్రకాశం బరాజ్.. ఆపై ఎత్తిపోతల ద్వారా పులిచింతలకు అక్కడ నుంచి టెయిల్‌పాండ్ ద్వారా నాగార్జునసాగర్ డ్యాంలోకి ఎత్తిపోయడం.
- దుమ్ముగూడెం నుంచి నేరుగా నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు తరలించడం
- ఇచ్చంపల్లి దిగువన 50 కిలోమీటర్లు.. కంతనపల్లికి దిగువన సుమారు రెండుకిలోమీటర్లు.. రాంపూర్ పాయింట్ నుంచి గోదావరిజలాల్ని రోజుకు రెండు టీఎంసీల చొప్పున మళ్లించాలి. వాటిని ఎస్సారెస్పీ కాకతీయకాల్వలో పోయడం వల్ల మూసీలోకి వస్తాయి. అక్కడి నుంచి దేవరకొండ ప్రాంతంలోని గొట్టిముక్కల జలాశయంలో పోస్తే.. అక్కడ అలుగుపోసి నాగార్జునసాగర్‌కు చేరతాయి. లేదా మూసీ నుంచి నల్లగొండ సమీపంలోని ఉదయసముద్రంలోకి తరలించడం తద్వారా అలుగుపోయడం వల్ల అడవిదేవులపల్లి చెరువు ఆపై నాగార్జునసాగర్‌లోకి జలాలను పంపడం.

### శ్రీశైలం జలాశయానికి మళ్లింపుపై ప్రతిపాదనలు

- నాగార్జునసాగర్‌కు గోదావరి జలాల మళ్లింపుపై ఉన్న ప్రతిపాదనల్లో ఒక దానిని ఎంపికచేస్తారు. తద్వారా సాగర్‌కు గోదావరిజలాలు వస్తాయి. ఈ క్రమంలో నాగార్జునసాగర్‌లో సుమారు 560 అడుగుల స్థాయిలోనే శ్రీశైలం వద్ద టెయిల్‌పాండ్ నుంచి రివర్స్ బుల్ పంపింగ్ ద్వారా డ్యాంలోకి నీటిని ఎత్తిపోయవచ్చు. అంటే అవసరానికి అనుగుణంగా నాగార్జునసాగర్‌లోకి జలాల్ని తరలించడంతోపాటు వయా సాగర్ ద్వారా శ్రీశైలం జలాశయానికి గోదావరిజలాల తరలింపు.
- నేరుగా శ్రీశైలం జలాశయానికి తరలించాలనే ప్రతిపాదన కూడా సమావేశంలో వ్యక్తమయింది. ఇందుకనుగుణంగా ఇచ్చంపల్లి దిగువన 50 కిలోమీటర్లు.. కంతనపల్లికి దిగువన సుమారు రెండుకిలోమీటర్లు.. రాంపూర్ పాయింట్ నుంచి గోదావరి జలాలను రోజుకు రెండు టీఎంసీల చొప్పున మళ్లించాలనే ప్రాథమిక ప్రతిపాదన వచ్చింది.

## వెల్లివిరిసిన స్నేహబంధం

- దేశానికి గొప్ప సందేశం
- నాడు తీవ్ర భావోద్వేగాలు.. నేడు బలపడుతున్న బంధాలు
- ఇరుగుపొరుగు చెలిమికి నిదర్శనంగా నిలిచిన సీఎంల భేటీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తమిళనాడు, కర్ణాటక మధ్య కావేరీ వివాదం ఆరని మంటలా కొనసాగుతూనే ఉన్నది! మహారాష్ట్ర, గుజరాత్ మధ్య ఇప్పటికీ అనేక సమస్యలు! జార్ఖండ్, బీహార్ మధ్యా అదే పరిస్థితి! అనేక ఇరుగుపొరుగు రాష్ట్రాల మధ్య వివాదాలు! కానీ.. దాయాది రాష్ట్రాలంటేనే కీచులాడుకోవడమనే దుష్టసంప్రదాయాన్ని తొలిగించి, రెండు రాష్ట్రాల మధ్య స్నేహబంధంతో ప్రగతికి ఎలా బాటలు తీయవచ్చునో నిరూపించాయి తెలుగు రాష్ట్రాలు! ఐదేండ్ల క్రితం తీవ్ర భావోద్వేగాల నడుమ ఉమ్మడి రాష్ట్ర విభజన జరిగింది. విభజన ఇరు రాష్ట్రాల వికాసానికేనని తెలంగాణ ఉద్యమకారులు చెప్పిన మాటలు పెడచెవిన పెట్టిన నాటి ఉమ్మడి రాష్ట్ర పాలకులు, విభజన అనంతరం ఏపీని పాలించిన తెలుగుదేశం నాయకులు.. రెండు రాష్ట్రాల మధ్య పరిస్థితిని నానాటికి మరింత జటిలం చేసేందుకే ప్రాధాన్యం ఇచ్చారు. విభజిత ఏపీ పట్ల తెలంగాణ సీఎం కేసీఆర్ అనేక సందర్భాల్లో సానుకూల ధోరణి ప్రదర్శించినా.. నాటి ఏపీ సీఎం చంద్రబాబు కనీస సానుకూలత చూపలేకపోయారు. కానీ.. ఇప్పుడు ఏపీ కొత్త ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన జగన్మోహన్‌రెడ్డి.. తెలంగాణతో కలిసి పనిచేసేందుకు ముందుకురావడంతో రెండురాష్ట్రాల మధ్య సుహృద్భావ వాతావరణం నెలకొన్నది. ఫలితమే.. శుక్రవారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రుల భేటీ. ఇరుగుపొరుగు రాష్ట్రాలు ఎలా వ్యవహరించాలో దేశానికే స్ఫూర్తినిచ్చేలా సీఎంల భేటీ సాగింది. నీటి పంపకాల విషయంలో మాకెన్ని? అంటే.. మాకెన్ని? అనే చర్చలే తప్పించి.. ఇన్ని నీళ్లున్నాయి.. ఇలా వాడుకుంటే రెండు రాష్ట్రాల్లోని ప్రతి ఎకరాకు నీళ్లందుతాయనే ప్రతిపాదనలు రావటం విశేషం.

### దశ దిశ చూపారు

కేసీఆర్ మాట్లాడిన విధానం స్ఫూర్తిదాయకంగా ఉన్నదని ఏపీ సీఎస్ ఎల్వీ సుబ్రమణ్యం అన్నారు. 'మీరు తండ్రిలాంటి వాళ్లు. మా గురించి (ఏపీ రాష్ట్రం) చెప్పడం చాలా సంతోషం. భేషజాలు లేవన్న మీరు.. హృదయపూర్వకంగా మాట్లాడి రెండు రాష్ట్రాలకు దశ, దిశ చూపారు. కుటుంబపెద్దగా వాత్సల్యంతో పరిష్కారం చూపిస్తున్నారు. విధేయులమై పని చేస్తామని హామీ ఇస్తున్నాను' అంటూ ఎల్వీ సుబ్రమణ్యం సమావేశంలో తన మనసులోని భావాలను వ్యక్తంచేశారు. విభజన సమస్యలన్నీ పరిష్కారం అయ్యేవరకు అదే పనిమీద ఉంటామని తెలంగాణ సీఎస్ ఎస్కే జోషి స్పష్టంచేశారు. సమావేశానికి హాజరైన ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఓ సీనియర్ ఐఏఎస్ అధికారి మాట్లాడుతూ.. దేశంలోనే పరిపాలనలో కేసీఆర్ రోల్‌మోడల్ అని అన్నారు. దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాల్లో అనేక హోదాల్లో పనిచేసిన తాను.. కేసీఆర్ వంటి నేతను ఎక్కడా చూడలేదని చెప్పారు. రెండు తెలుగు రాష్ట్రాల ప్రజలకు ఆయన మార్గనిర్దేశనం అవసరమని అభిప్రాయపడ్డారు.

## ఇరురాష్ట్రాల సీఎంల భేటీ అభినందనీయం

సీపీఐ రాష్ట్రకార్యదర్శి చాడ వెంకటరెడ్డి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలుగు రాష్ట్రాల మధ్య నెలకొన్న వివిధ సమస్యలపై ఇరురాష్ట్రాల ముఖ్యమంత్రులు సమావేశమవ్వడం అభినందనీయమని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి అన్నారు. శుక్రవారం పార్టీ రాష్ట్ర కార్యాలయంలో నేతలు అజీజ్ పాషా, పశ్య పద్మతో కలిసి ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాల మధ్య జల వివాదాలకు సంబంధించిన విధి విధానాల ఖరారుకు అఖిలపక్ష సమావేశం ఏర్పాటుచేయాలని కోరారు. కాళేశ్వరం నిర్వహణకు సంబంధించి విద్యుత్ చార్జీల తగ్గింపుపై అఖిలపక్షం ఇచ్చిన సూచనలను పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు. పార్టీ ఫిరాయింపులకు సంబంధించి ఉప రాష్ట్రపతి గతంలో చేసిన వ్యాఖ్యలకు కట్టుబడి ఉంటారని భావించామని కానీ, టీడీపీ రాజ్యసభ సభ్యుల విషయంలో అది జరుగలేదన్నారు.

# దేశాభివృద్ధికి ట్రిపుల్ 'ఐ' మంత్రం

ఆవిష్కరణలు దేశీయ కోణంలో ఉంటేనే ఫలితం.. అన్ని మెట్రో నగరాల కంటే హైదరాబాద్ ఉత్తమం

'మేడిన్ హైదరాబాద్' పుస్తకావిష్కరణలో టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

'మేడ్ ఇన్ హైదరాబాద్' పుస్తకావిష్కరణ కార్యక్రమానికి హాజరైనవారిని ఉద్దేశించి మాట్లాడుతున్న టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు. (ఇన్‌సెట్‌లో) 'మేడ్ ఇన్ హైదరాబాద్' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కేటీఆర్, జయేశ్‌రంజన్ తదితరులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** అభివృద్ధి చెందిన దేశాల సరసన మన దేశం నిలిచేందుకు ట్రిపుల్ 'ఐ' (ఇన్నోవేషన్, ఇంక్లూజివ్ గ్రోత్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్) మంత్రం ఫలితమిస్తుందని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు చెప్పారు. కీలకమైన ఆవిష్కరణల్లో భారతీయ కోణం ఉండాలన్నారు. దేశంలోని అన్ని మెట్రో నగరాల కంటే హైదరాబాద్ అన్ని విషయాల్లోనూ ఉత్తమంగా ఉన్నదని స్పష్టం చేశారు. హైదరాబాద్ కేంద్రంగా ఆవిర్భవించి ప్రగతి పథంలో పయనిస్తున్న 25 స్టార్టప్‌ల విజయగాథలతో రూపొందించిన 'మేడ్ ఇన్ హైదరాబాద్' పుస్తకాన్ని శుక్రవారం హైదరాబాద్‌లోని ఓ కన్వెన్షన్ సెంటర్లో జరిగిన కార్యక్రమంలో కేటీఆర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమాజ గతిని మార్చే డైనమిక్ ఆలోచనలకు ప్రభుత్వం, ప్రైవేటు వేదికలు మద్దతివ్వాలన్నారు. 'ఆవిష్కర్తలను, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించడంలో మన దేశ ఆలోచనా ధోరణి మారాలి. ఇటీవల ప్రధాని మోదీ నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో నేను టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ హోదాలో పాల్గొని 'న్యూ ఇండియా' అనే అంశంపై ప్రసంగించా. వివిధ దేశాల్లో పర్యటించడం ద్వారా తెలుసుకున్న విషయాలతో మూడు 'ఐ'ల ఆధారంగా భారత్ అభివృద్ధి చెందుతుందని తెలిపాను. ఇన్నోవేషన్, ఇంక్లూజివ్ గ్రోత్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కలగలిపిన ట్రిపుల్ ఐ మంత్రంతోనే ఇది సాధ్యమవుతుంది. ఈ మూడింటికి భారతీయ దృక్కోణం ఉండాలి. ఆవిష్కరణలను ప్రోత్సహించడంలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే ముందంజలో ఉన్నది' అని చెప్పారు.

పల్సస్ సంస్థ ఎండీ, సీఈవో శ్రీనుబాబుకు పుస్తకాన్ని అందజేస్తున్న కేటీఆర్

#### చేయాల్సింది చాలా ఉన్నది..

అనంతరం 'యువర్ స్టోరీ' వ్యవస్థాపకురాలు శ్రద్ధాశర్మ నిర్వహించిన ఫైర్‌చాట్‌లో కేటీఆర్ పాల్గొని పలు అంశాలపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. రాజకీయాలు కష్టసాధ్యమన్న భావనలో నిజం లేదని, ప్రజలకు మేలు చేయాలనే ఆలోచనతో అభివృద్ధి కోసం తపించే గుణం ఉన్నవారికి రాజకీయాలే ఉత్తమ వేదికని తెలిపారు. 'వారసత్వం వల్ల రాజకీయ ప్రవేశం సులభం కావచ్చు. కానీ వారసత్వం వల్లే రాణించలేం. ఇంకా చెప్పాలంటే.. భారీ ఆకాంక్షలను నిలబెట్టుకునేలా వ్యవహరించడం అతిపెద్ద సవాలు. నా కెరీర్ పూర్తయిపోలేదు. ఇప్పుడే మొదలయింది. చేయాల్సింది ఎంతో ఉన్నది' అని కేటీఆర్ స్పష్టం చేశారు. శ్రద్ధాశర్మ మాట్లాడుతూ.. రాజకీయాల్లో కేటీఆర్ కొత్త పంథాను అనుసరిస్తూ యువతకు స్ఫూర్తిగా నిలిచారని అభినందించారు. కేటీఆర్ ఐటీ మంత్రిగా ఉన్నప్పుడు స్టార్టప్‌లను ప్రోత్సహించేందుకు ఎంతో కృషి చేశారని ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జయేశ్ రంజన్ కొనియాడారు.

## ప్రయోజనకర రచనలు చేయండి

రచయితలకు తెలుగు వర్సిటీ వీసీ ఎస్వీ సత్యనారాయణ సూచన

11 మందికి సాహితీ పురస్కారాలు బహూకరణ

అవార్డు స్వీకరించిన 'నమస్తే తెలంగాణ' న్యూస్ ఎడిటర్ సంతోష్‌కుమార్

తెలుగు వర్సిటీలో పురస్కారాలు అందుకున్న సాహితీవేత్తలు.. (ఇన్‌సెట్‌లో) కోవెల సంతోష్‌కుమార్‌ను సత్కరించి పురస్కారం అందజేస్తున్న దృశ్యం

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** ప్రామాణికమైన, ప్రయోజనకరమైన రచనలు కావాలని పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ ఉపాధ్యక్షుడు ఆచార్య ఎస్వీ సత్యనారాయణ అన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి 400 కుపైగా రచనలు పరిశీలనకు వచ్చాయని, వివిధ దశల్లో వడబోసి న్యాయనిర్ణేతలు ఉత్తమ గ్రంథాలను ప్రకటించినట్టు తెలిపారు. డాక్టర్ ఆఫ్ లెటర్స్ (డీలిట్) కోర్సును ప్రవేశపెట్టేందుకు వీలుగా 2020 ఆరంభంలో ప్రకటన విడుదల చేయాలని నిర్ణయించామన్నారు. 2017కుగాను తెలుగు సాహిత్యంలోని వివిధ ప్రక్రియల్లో ఎంపికైన ఉత్తమ గ్రంథ రచయితలకు శుక్రవారం పొట్టి శ్రీరాములు తెలుగు వర్సిటీ సాహితీ పురస్కారాలను బహూకరించింది. పురస్కారాలు అందుకొన్నవారిలో వచన రచనలో 'దేవరహస్యం' గ్రంథానికి 'నమస్తే తెలంగాణ' దిన పత్రిక న్యూస్ ఎడిటర్ కోవెల సంతోష్‌కుమార్, పద్య కవితలో చింతూరి మల్లయ్య (మన్యభారతం), వచన కవితలో నారాయణస్వామి (వానొస్తదా?) తరపున శ్రీనివాస్, గేయ కవితలో తుమ్మూరి రామ్మోహన్‌రావు (ఎలకోయిల పాట), బాల సాహిత్యంలో కొల్లూరి స్వరాజ్యం వెంకటరమణమ్మ (అనగా అనగా పిల్లల కథలు), కథ-కథానికలో బీ మురళీధర్ (నెమలి నార), నవలా ప్రక్రియలో భూతం ముత్యాలు (మొగలి), సాహిత్యంలో అట్లా వెంకటరమణారెడ్డి (శైలీశిల్పం వెయ్యేండ్ల కవిత్వం), నాటకంలో భారతుల రామకృష్ణ (సప్తసారభాలు), అనువాదంలో మెహక్ హైదరాబాదీ (గుప్పెట్లో జారే ఇసుక) ఉన్నారు. 'రాయక్య మాన్యం' గ్రంథానికి రచయిత్రి ఉత్తమ గ్రంథం అవార్డును జూపాక సుభద్ర అందుకొన్నారు. రూ.20,116 నగదు, ప్రశంసాపత్రం అందజేశారు.

## బీసీ ప్రతిపాదిత కులాలవారి వివరాల సేకరణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** బీసీ జాబితాలో చేర్చాలని కొన్ని కులాల ప్రతినిధులు విజ్ఞప్తి చేస్తున్నారని, ఏ ప్రాతిపదికన చేర్చాలనే విషయమై వివరాలను సేకరిస్తున్నట్టు తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ బీఎస్ రాములు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ కులాల ప్రతినిధులు శనివారం (ఈ నెల 29) నుంచి జూలై 5 వరకు నిర్దిష్టమైన విజ్ఞప్తులు, సూచనలు సమర్పించేందుకు అవకాశం కల్పిస్తున్నామని చెప్పారు. బీసీ జాబితాలో చేర్చేందుకు వారివద్ద ఉన్న వివరాలు, సామగ్రి, సాక్ష్యాలను కులాలకు నిర్దేశించిన తేదీ, సమయంలో సమర్పించాలని కోరినట్టు ఆయన తెలిపారు.

రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం చిలుకూరు గ్రామంలో విజయనిర్మల అంతిమయాత్ర. (ఇన్‌సెట్‌లో) చిలుకూరులోని వ్యవసాయక్షేత్రంలో అంత్యక్రియలు నిర్వహిస్తున్న కుమారుడు నరేశ్

## విజయనిర్మలకు కన్నీటి వీడ్కోలు

అంతిమ సంస్కారాలు నిర్వహించిన తనయుడు నరేశ్

అంత్యక్రియల్లో పాల్గొన్న సినీ ఆర్టిస్టులు, రాజకీయ నాయకులు

**మొయినాబాద్:** నటి, దర్శకురాలు, సూపర్ స్టార్ కృష్ణ సతీమణి విజయనిర్మల అంతిమ సంస్కారాలు అశ్రునయనాల మధ్య శుక్రవారం ముగిశాయి. ఆరోగ్య సమస్యలతో బుధవారం అర్ధరాత్రి కన్నుమూసిన విజయనిర్మలకు కుటుంబసభ్యులు, అభిమానులు కన్నీటి వీడ్కోలు పలికారు. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం చిలుకూరు గ్రామంలోని వారి వ్యవసాయక్షేత్రంలో అంత్యక్రియలు నిర్వహించారు. హైదరాబాద్ నానక్‌రాంగూడ నుంచి ఔటర్‌రింగ్‌రోడ్డు మీదుగా చిలుకూరులోని విజయకృష్ణ వ్యవసాయక్షేత్రం వరకు అంతిమయాత్ర కొనసాగింది. ఆమె తనయుడు నరేశ్ అంతిమ సంస్కారాలు నిర్వహించారు. తమ అభిమాన నటిని కడసారి చూసేందుకు మొయినాబాద్, చేవెళ్ల, శంకర్‌పల్లి మండలాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. దహనసంస్కారాల్లో హీరో కృష్ణతోపాటు చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, ఏపీకి చెందిన ఎంపీ గల్లా జయదేవ్, మాజీ మంత్రి గల్లా అరుణకుమారి, పలువురు సినీ నటులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు. అంతకుముందు నానక్‌రాంగూడలోని కృష్ణ నివాసంలో సినీ, రాజకీయ ప్రముఖులు విజయనిర్మల భౌతికకాయానికి నివాళులర్పించారు.

## త్వరలో ఉన్నత విద్యామండలి విభజన

- 58:42 నిష్పత్తిలో పంపకాలు
- విభజన అంశాలతో ప్రభుత్వానికి అధికారుల నివేదిక

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర ఉన్నత విద్యామండలిని త్వరలో విభజించనున్నారు. అందుకు సంబంధించిన ఏర్పాట్లు దాదాపు పూర్తయ్యాయి. ఉమ్మడి సంస్థల విభజనకు తెలంగాణ, ఏపీ ఇప్పటికే పరస్పరం అంగీకరించిన నేపథ్యంలో ఉన్నత విద్యామండలి విభజనకు సంబంధించిన అంశాలతో ప్రభుత్వానికి నివేదిక అందజేసినట్టు రాష్ట్ర ఉన్నత విద్యామండలి అధికారులు తెలిపారు. ఉన్నత విద్యామండలిలో ఉన్న రూ.134.29 కోట్ల నిధులను 58:42 నిష్పత్తిలో పంచుకోనున్నారు. ఈ నిష్పత్తి ప్రకారం తెలంగాణ ఉన్నత విద్యామండలికి రూ.56.40 కోట్లు, ఏపీకి రూ.77.89 కోట్లు లభిస్తాయి. ఈ మేరకు అధికారులు వివరాలను సిద్ధం చేశారు. ప్రస్తుతం తెలంగాణ ఉన్నత విద్యామండలిలో 34 రెగ్యులర్ పోస్టులుండగా 24 మంది పనిచేస్తున్నారు. విభజన నిష్పత్తి ప్రకారమే ఉద్యోగులను విభజించనున్నారు. కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తున్న 34 మంది సిబ్బందిని కూడా విభజించాలని అధికారులు సూత్రప్రాయంగా నిర్ణయించారు. రెగ్యులర్, కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఏపీ ఉద్యోగులు తమ రాష్ట్రానికి వెళ్లేందుకు సుముఖత వ్యక్తంచేస్తున్నారు. సాధ్యమైనంత త్వరగా విభజన ప్రక్రియ పూర్తిచేయాలని కోరుతున్నారు. ఈ నేపథ్యంలో ఉన్నత విద్యామండలి చైర్మన్ తుమ్మల పాపిరెడ్డి సంబంధిత అధికారులతో శుక్రవారం భేటీఅయి పలుఅంశాలపై చర్చించారు.

## మరో 84 కేజీబీవీల్లో జూనియర్ కళాశాలలు

హోదా పెంచుతూ ఉత్తర్వులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలో మరో 84 కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాల (కేజీబీవీ)లో జూనియర్ కళాశాలల హోదా పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ఈ మేరకు శుక్రవారం పాఠశాల విద్యాశాఖ కమిషనర్ టీ విజయ్‌కుమార్ ఉత్తర్వులు జారీచేశారు. 2019-20 విద్యా సంవత్సరం నుంచే కేజీబీవీల్లో

శనివారం
29•6•2019
కరీంనగర్

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

శుక్రవారం ప్రగతిభవన్‌లో సమావేశానికి వెళ్తున్న తెలంగాణ, ఏపీ ముఖ్యమంత్రులు కే చంద్రశేఖర్‌రావు, వైఎస్ జగన్మోహన్‌రెడ్డి

జల సంకల్పం

PUBLISHED FROM KARIMNAGAR I HYDERABAD I WARANGAL I KHAMMAM I NALGONDA I MAHABUBNAGAR I NIZAMABAD

# కలిసి నడుద్దాం

## మాకు భేషజాలు.. ఇగోలు లేవు.. వివాదాలకు ఇక చరమగీతం

## ఇరు రాష్ట్రాల సీఎంలు కేసీఆర్, జగన్ ప్రకటన

- తెలుగు రాష్ట్రాల్లోని ప్రతి మూలకు సాగునీరు
- గోదావరి నీళ్లు కృష్ణకు తరలించే ప్రతిపాదన
- జూలై 15కల్లా వ్యూహం ఖరారుచేయాలి
- అధికారులు, నిపుణులు, ఇంజినీర్లతో కమిటీ
- ఉభయరాష్ట్రాల ముఖ్యమంత్రుల ఆదేశం
- సమర్థ సాగునీటి వినియోగంపై కేసీఆర్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్
- రెండురాష్ట్రాల సంబంధాల్లో గుణాత్మక మార్పు
- స్వచ్ఛమైన హృదయంతో వైఎస్ జగన్
- కత్తులు దూసేది లేదు.. చేతులు కలుపాలి
- సమావేశంలో ముఖ్యమంత్రి కేసీఆర్
- సమస్యల పరిష్కారంలో కేసీఆర్ సహకారం గొప్పది
- తెలంగాణ, ఏపీ రెండూ ఒకటేనన్న భావనను ప్రజల్లోకి తీసుకువెళదాం
- ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్

**సుహృద్భావ వాతావరణంలో చర్చలు**

**జూలై 15 తర్వాత ఏపీలో ఇద్దరు సీఎంల భేటీ**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

అందుబాటులో ఉన్న నీటివనరులను సంపూర్ణంగా, సమర్థంగా వినియోగించి రెండు తెలుగు రాష్ట్రాల్లోని ప్రతి మూలకు సాగునీరు, మంచినీరు అందించే విషయంలో కలిసి ముందుకు సాగుతామని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రులు కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు, వైఎస్ జగన్మోహన్‌రెడ్డి స్పష్టంచేశారు. రెండు తెలుగు రాష్ట్రాలు పచ్చగా కళకళలాడాలని, వ్యవసాయానికి, తాగునీటికి, పరిశ్రమలకు నీటికొరత రాకుండా చూడాలనే లక్ష్యంతో ఉన్నామని చెప్పారు. నదీజలాల వినియోగానికి సంబంధించి గతంలో ఉన్న వివాదాలను గతం గతః అన్న రీతిలో మర్చిపోయి, మంచి మనసుతో రెండు రాష్ట్రాలకు ఎంత వీలయితే అంత మేలుచేసే విషయంలో రెండు ప్రభుత్వాలు ఏకాభిప్రాయంతో ఉన్నాయని ప్రకటించారు. రెండు రాష్ట్రాల మధ్య నెలకొన్న సమస్యలను సుహృద్భావ వాతావరణంలో చర్చల ద్వారా పరిష్కరించునే దిశగా అడుగువేయాలన్న నిర్ణయంమేరకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రుల తొలి అధికారిక సమావేశం శుక్రవారం ప్రగతిభవన్‌లో జరిగింది. ఉదయం 11.30 గంటలకు ప్రారంభమైన సమావేశం సాయంత్రం వరకు కొనసాగింది. ఈ సమావేశంలో కేసీఆర్, జగన్ మాట్లాడుతూ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రెండూ వేర్వేరు అనే భావన తమకు లేదని, రెండు రాష్ట్రాల ప్రజలు బాగుండాలన్నదే తమ అభిమతమని వెల్లడించారు. ఉభయరాష్ట్రాల ప్రయోజనాల కోసం రెండు ప్రభుత్వాలు పనిచేస్తాయని ప్రతినబూనారు. కృష్ణానదిలో నీటి లభ్యత తక్కువ అవుతున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్‌లోని రాయలసీమ ప్రాంతం, తెలంగాణలోని పాలమూరు, ఉమ్మడి నల్లగొండ జిల్లాలు ఎదుర్కొంటున్న దశాబ్దాల సాగునీటి కష్టాలను దూరం చేసేందుకు గోదావరి నీటిని శ్రీశైలానికి తరలించాలని ఇద్దరు ముఖ్యమంత్రులు నిర్ణయించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభ ఉపన్యాసం చేస్తూ ఏపీ సీఎం జగన్‌కు, ఏపీ అధికారుల బృందానికి స్వాగతం పలికారు. ఇటీవల జరిగిన ఎన్నికల తర్వాత రెండు రాష్ట్రాల సంబంధాల్లో గుణాత్మక మార్పు వచ్చిందని సంతోషం వ్యక్తంచేశారు. తెలుగు రాష్ట్రాలు కలిసి నడిస్తేనే ప్రగతి సాధ్యమని చెప్పారు. గోదావరి, కృష్ణానదుల్లో కలిపి నాలుగువేల టీఎంసీల నీటి లభ్యత ఉన్నదని, ఈ నీళ్లను ఉపయోగించుకుని రెండు రాష్ట్రాలను సుభిక్షం చేయవచ్చునని కేసీఆర్ అన్నారు. కృష్ణానదిలో నీటి లభ్యత తక్కువగా ఉన్నందున గోదావరి నుంచి శ్రీశైలం, నాగార్జునసాగర్ రిజర్వాయర్లకు నీటిని తరలించాలని ప్రతిపాదించారు. ఈ మేరకు వ్యూహం ఖరారుచేయాలని అధికారులను ఉభయ సీఎంలు ఆదేశించారు. జూలై 15లోగా ఇరు రాష్ట్రాల అధికారులు, ఇంజినీర్లు, నీటిపారుదల నిపుణులు ఒక కమిటీగా ఏర్పడి,

మిగతా 4వ పేజీలో

## ముంబై మునిగింది!

- ముంచెత్తిన వాన.. వేర్వేరు ఘటనల్లో నలుగురు మృతి
- ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం

9

## ట్రంప్.. మోదీ.. 5జీ టెక్నాలజీ

- జపాన్‌లో జీ-20 సదస్సు సందర్భంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో ప్రధాని మోదీ భేటీ
- ఇరాన్, వాణిజ్యం, రక్షణ తదితర అంశాలపై చర్చ

9

# హెరిటేజ్ ఎక్కడ?

## తెలంగాణ హెరిటేజ్ యాక్ట్‌లో ఎర్రమంజిల్ భవనం లేదు

- పాత భవనాలను కూల్చొద్దు.. కొత్తవి కూల్చొద్దు.. మరేం చేయాలి?
- పిల్స్ వేయడం సులువే.. వాటికి ఆధారాలు కూడా కావాలి
- మీడియా కథనాల ఆధారంగా కేసుల విచారణ జరుగదు
- ఎర్రమంజిల్‌లో అసెంబ్లీ భవన నిర్మాణంపై స్టేకు హైకోర్టు నిరాకరణ
- భవనాల ఎంపిక, నిర్మాణంలో ప్రభుత్వానిదే అంతిమ నిర్ణయం
- అదనపు అడ్వకేట్ జనరల్ జే రామచంద్రరావు



**కోర్టుకు నిజాలు మాత్రమే వెల్లడించాలి**

**సచివాలయం కూల్చివేతపై 2016లో పిల్స్ వేసినవారిని తప్పుబట్టిన హైకోర్టు**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**

ఎర్రమంజిల్‌లోని భవనానికి తెలంగాణ హెరిటేజ్ (ప్రొటెక్షన్, ప్రిజర్వేషన్, కన్జర్వేషన్ అండ్ మెయింటెనెన్స్) యాక్ట్- 2017 ప్రకారం హెరిటేజ్ గుర్తింపు లేదని హైకోర్టు పేర్కొన్నది. పాత భవనాలను కూల్చొద్దు.. కొత్త భవనాలను కూల్చొద్దంటే మరి ప్రభుత్వం ఏం చేయాలంటూ పిటిషనర్లను ప్రశ్నించింది. ఎర్రమంజిల్‌లో ప్రస్తుతం ఉన్న భవనాన్ని కూల్చి అసెంబ్లీ భవనాన్ని నిర్మించాలన్న ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ దాఖలైన రెండు ప్రజాప్రయోజన వ్యాజ్యాలపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రాఘవేంద్రసింగ్ చౌహాన్, జస్టిస్ షమీమ్ అక్తర్‌తో కూడిన ధర్మాసనం శుక్రవారం విచారణ చేపట్టింది. వీటిపై తదుపరి విచారణను జూలై 8కి వాయిదా వేసిన ధర్మాసనం.. పిటిషనర్లు కోరినట్టుగా స్టేగానీ, స్టేటస్ కోగానీ ఇవ్వడానికి నిరాకరించింది. కాగా, సచివాలయం కూల్చబోమని ప్రభుత్వం హామీ ఇచ్చిందంటూ కోర్టును తప్పుదోవ పట్టించారని 2016లో పిల్స్ వేసిన పిటిషనర్లపై హైకోర్టు ధర్మాసనం ఆగ్రహం వ్యక్తం చేసింది. అసెంబ్లీ భవనం

మిగతా 5వ పేజీలో

# దశాబ్దాలుగా దక్కని భూహక్కు

సాగుచేసుకొంటున్న భూమిలో గిరిజన రైతులు బిక్కిబాయి, మాణిక్‌బాయి

- 90 ఏండ్ల నుంచి సాగులో ఉన్నా రికార్డుల్లోకి ఎక్కని పేర్లు
- గిరిజన రైతులపై రెవెన్యూ అధికారుల శీతకన్ను
- మూడు తరాలుగా ఒకే భూమిని సాగుచేసుకొంటున్న బాధితులు
- బిలా దాఖలు భూములకు పట్టాలివ్వలేమంటున్న అధికారులు
- హక్కు కల్పించాలంటున్న రంగారెడ్డి జిల్లా మోకిలతండా రైతులు

**రంగారెడ్డి** జిల్లా శంకర్‌పల్లి మండలం మోకిలతండాలోని గిరిజన రైతు కుటుంబాలు తరతరాలుగా ఆ భూమిని సాగుచేసుకొంటున్నాయి. నిజాం కాలంలో మాలిక్ పట్టేళ్లకు పైసలు కట్టి పొలాలు దున్నుకునేవారు. 1970 దశకంలో అప్పటి ప్రభుత్వం భూమి శిస్తు కట్టాలంటే కట్టారు. తమకు పట్టాలు ఇవ్వాలని అడిగితే మాత్రం రెవెన్యూ అధికారులు వారి వైపు కన్నెత్తికూడా చూడటంలేదు. వీళ్లు సాగుచేసుకొంటున్నది.. రెండు గ్రామాల మధ్య బిలా దాఖలు (గ్యాప్ ల్యాండ్ లేదా మిగులు) భూమి అని.. పట్టాలివ్వడం కుదరదని అధికారులు తేల్చేశారు. అదే భూమికి ఈ రైతులతో శిస్తు కట్టించుకొంటారు. పట్టా చేయాలనేసరికి భూమి తీరు మారిపోతున్నది. ఫలితంగా వీళ్లు బ్యాంకు రుణాలు పొందలేకపోతున్నారు. ప్రభుత్వం అందించే రైతుబంధు వంటి సంక్షేమ పథకాలు అందడంలేదు. రైతుబీమా వర్తించడంలేదు. దాదాపు 90 ఏండ్లుగా కాస్తులో ఉన్నామని.. పట్టాలివ్వాలని కనిపించిన అధికారులందరికీ మొక్కినా కనికరించేవారే లేరని బాధిత రైతులు వాపోతున్నారు.

వివరాలు 8వ పేజీలో

ప్రముఖ రచయిత్రి

## అబ్బూరి ఛాయాదేవి కన్నుమూత

- హైదరాబాద్‌లో చికిత్సపొందుతూ తుదిశ్వాస
- కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత
- సీఎం కేసీఆర్, ప్రముఖుల సంతాపం

5

## మున్సిపాలిటీల్లో కొత్తగా 754 వార్డులు

- మున్సిపల్ చట్టాన్ని సవరిస్తూ ఆర్డినెన్స్
- పాత చట్టం ప్రకారమే మున్సిపోల్స్
- కసరత్తులో వేగం పెంచిన సర్కార్

5

శుక్రవారం ప్రగతిభవన్‌లో నిర్వహించిన తెలంగాణ-ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల ముఖ్యమంత్రుల తొలి అధికారిక సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు. చిత్రంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డితోపాటు తెలంగాణ మంత్రులు ఈటల రాజేందర్, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, వీ శ్రీనివాస్‌గౌడ్, ఏపీ మంత్రులు బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్, బాలినేని శ్రీనివాస్‌రెడ్డి, కురసాల కన్నబాబు, పేర్ని వెంకట్రామయ్య కూడా ఉన్నారు.

# కలిసి నడుద్దాం

మూడోపేజీ తరువాయి...

అధ్యయనం చేసి నివేదిక అందజేయాలని సూచించారు. సమావేశం వివరాలను అనంతరం తెలంగాణ, ఏపీ మంత్రులు ఈటల రాజేందర్, బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి మీడియాకు వెల్లడించారు. ఇద్దరు ముఖ్యమంత్రుల సమావేశం జరిగిన శుక్రవారాన్ని చారిత్రాత్మక దినంగా అభివర్ణించారు. ప్రధానంగా నదీజలాల అంశంపైనే చర్చించినట్టు తెలిపారు.

### వివాదాలతో మరో తరానికి కూడా నీళ్లివ్వలేం : సీఎం కేసీఆర్

ముఖ్యమంత్రుల భేటీ సందర్భంగా సీఎం కేసీఆర్ మాట్లాడుతూ 'బేషజాలు లేవు. బేసిన్ల గొడవ లేదు. అపోహలు లేవు. వివాదాలు అక్కరలేదు. వివాదాలే కావాలనుకుంటే మరోతరానికి కూడా మనం నీళ్వివ్వలేం. కేసీఆర్, జగన్ వ్యక్తిగతంగా ఆలోచించరు. ప్రజలకోణం నుంచే ఆలోచిస్తరు. ప్రజలు నమ్మి మాకు ఓటేశారు. వారికి మేలుచేయడమే మా బాధ్యత. రెండు రాష్ట్రాలు కలిసి నడిస్తేనే ప్రగతి. తెలంగాణ, ఏపీల సంబంధాల్లో ఇప్పుడు గుణాత్మకమార్పు వచ్చింది. పూర్తి అవగాహనతో, పరిస్థితిని సంపూర్ణంగా అర్థం చేసుకుంటూ, రెండు రాష్ట్రాల ప్రజలు మన వారే అనే భావనతో ముందుకుపోవాలని నిర్ణయించుకున్నాం. ఏపీ సీఎం జగన్ స్వచ్ఛమైన హృదయంతో వ్యవహరించారు. కలిసి నడుద్దామనుకున్నాం. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభోత్సవంలో గోదావరి నదీపరివాహక ప్రాంతంలోని ముఖ్యమంత్రులు కలిసి పాల్గొనటం మంచి సంకేతం ఇచ్చింది. మహారాష్ట్రతో సయోధ్య కుదుర్చుకోవటం ద్వారా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించుకోగలిగాం. అదేవిధంగా రెండు రాష్ట్రాల మధ్య మంచి సంబంధాలుంటే, అంతిమంగా ప్రజలకు మేలు కలుగుతుంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు కలిసి పనిచేయాలని నిర్ణయించుకున్నాయి. ప్రజలకు ఎంత వీలైతే అంత మేలు చేయడమే మా లక్ష్యం' అని చెప్పారు.

సమావేశంలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్. చిత్రంలో ఏపీ సీఎం వైఎస్ జగన్ కూడా ఉన్నారు.

సహజ సరిహద్దు రాష్ట్రాలైన తెలంగాణ, ఏపీ కలిసి ముందడుగు వేయాలని నిర్ణయించుకున్న తర్వాత జరిగిన తొలి సమావేశం గొప్ప ప్రారంభమని సీఎం కేసీఆర్ అన్నారు. విభజన సమస్యలను సామరస్యపూర్వకంగా, సానుకూల దృక్పథంతో పరిష్కరించుకుంటామని చెప్పారు. రెండు రాష్ట్రాల మధ్య ఖడ్గచాలనం అవసరం లేదని, కరచాలనం కావాలన్నారు. కత్తులు దూసేదిలేదని, చేతులు కలుపాలని చెప్పారు. ఇరుగుపొరుగు రాష్ట్రాలతో ఇచ్చిపుచ్చుకునేలా వ్యవహరించాలనేది తమ విధానమని, అదే విధానంతో మహారాష్ట్రతో వ్యవహరించి ఫలితం సాధించామని కేసీఆర్ గుర్తుచేశారు. ప్రాజెక్టుల నిర్మాణం త్వరితగతిన పూర్తిచేసి, ప్రజలకు ఫలితాలు అందించాలని ఆంధ్రప్రదేశ్ అధికారులకు సూచించారు.

### సులభమార్గంలో సాగునీటి కష్టాలు తీర్చాలి: ఏపీ సీఎం జగన్

తక్కువఖర్చుతో రెండు రాష్ట్రాల ప్రజలకు కావాల్సిన నీరు అందించడమే లక్ష్యంగా పని చేయాలని నిర్ణయించుకున్నామని ఏపీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి చెప్పారు. 'ఉత్తమమైన, సులభమైన మార్గం ద్వారా సాగునీటి కష్టాలు తీర్చాలి. కృష్ణానదిలో నీటి లభ్యత తక్కువవుతున్నది. రాబోయేకాలంలో ఇంకా తగ్గవచ్చు. అందుకే గోదావరి నీటిని ఉపయోగించుకుని రాయలసీమ, పాలమూరు, నల్లగొండ ప్రాంతాల సాగునీటి సమస్యను పరిష్కరించుకోవాలని ప్రభుత్వాలు కృతనిశ్చయంతో ఉన్నాయి. నీటిని ఎలా తరలించాలనే విషయంలో అధికారులు అధ్యయనం చేసి, ప్రభుత్వానికి నివేదిక సమర్పించాలి' అన్నారు.

### కేసీఆర్ సహకారం గొప్పది

రెండురాష్ట్రాల మధ్య సమస్యల పరిష్కారంలో, నీటిపారుదలరంగం విషయంలో కేసీఆర్ అందిస్తున్న సహకారం చాలా గొప్పదని ఏపీ సీఎం జగన్ అన్నారు. తెలంగాణ, ఏపీ వేర్వేరు కాదని, రెండూ ఒకటేనని, ఇద్దరం ఒకటేననే భావన కలిగి ఉండాలని, అదే భావనను ప్రజల్లోకి తీసుకెళ్లాలని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి తాను హాజరయ్యే విషయంలో అనేకరకాల అభిప్రాయాలు వ్యక్తమయ్యాయని, కానీ రెండు రాష్ట్రాలు కలిసి నదీజలాలను ఉమ్మడి సాగునీటి అవసరాలు తీర్చే విధంగా మలుచుకుంటే ఎంతో ఉత్తమమని భావించానని వివరించారు. రెండురాష్ట్రాల మధ్య సమస్యలను ఎవరో పరిష్కరించడం కంటే, ఈ రెండు రాష్ట్రాలే పరిష్కరించుకోవాలన్నది తమ ఉద్దేశమని వివరించారు. రెండు రాష్ట్రాలు వేసిన అడుగు దేశానికి ఆదర్శంగా నిలుస్తుందన్నారు.

### నీటి లభ్యతపై కేసీఆర్ ప్రజెంటేషన్

సమావేశం సందర్భంగా నదుల్లో నీటి లభ్యతపై సీఎం కేసీఆర్ పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. మహారాష్ట్ర, కర్ణాటకలు గోదావరి, కృష్ణ, వాటి ఉపనదులపై లెక్కలేనన్ని బరాజ్‌లతో కిందికి నీరురాని పరిస్థితిని వివరించారు. సీడబ్ల్యూసీ లెక్కల ప్రకారం ఏ పాయింట్‌వద్ద ఎంత నీటిలభ్యత ఉన్నదో వివరించారు. గోదావరి, కృష్ణానదుల నీళ్లను సమర్థంగా వినియోగించుకోవడానికి ఉన్న మార్గాలను గూగుల్ మ్యాపుల సహకారంతో ప్రతిపాదించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'గోదావరి, కృష్ణా నదుల్లో కలిపి నాలుగువేల టీఎంసీల నీటిలభ్యత ఉన్నది. ఈ నీళ్లను ఉపయోగించుకుని రెండురాష్ట్రాలను సుభిక్షం చేయవచ్చు. ఎన్ని నీళ్లను ఉపయోగించుకుంటామన్నది మన సమర్థత మీద ఆధారపడి ఉంది. ఏటా దాదాపు మూడువేల టీఎంసీల నీళ్లు సముద్రం పాలవుతున్నాయి. వాటిని ఉపయోగించుకోవాలి. నీళ్లకోసం ట్రిబ్యునళ్ల చుట్టూ, కోర్టుల చుట్టూ, మరొకరి చుట్టూ తిరుగటంవల్ల ఏ ప్రయోజనమూ లేదు. రెండు రాష్ట్ర ప్రభుత్వాలు అనుకుని, కలిసి నడిస్తే చాలు. రెండునదుల్లో ఉన్న నీటిని రెండురాష్ట్రాల ప్రజలకు వినియోగించే విషయంలో ఏకాభిప్రాయం ఉంటే చాలు. కేంద్ర ప్రభుత్వం నదుల అనుసంధానం అనే ప్రతిపాదన తెస్తున్నది. మన నదుల నీళ్లు మన అవసరాలు తీర్చాక కేంద్రం ప్రతిపాదనపై మనం నిర్ణయం తీసుకోవచ్చు. కృష్ణానదిలో నీటి లభ్యత తక్కువ ఉన్నందున గోదావరి నుంచి శ్రీశైలం, సాగర్‌కు నీటిని తరలించాలి. దీనివల్ల రాయలసీమ, పాలమూరు, నల్లగొండ, నెల్లూరు, ప్రకాశం జిల్లాల నీటి గోస తీరుతుంది. పోలవరం నుంచి వేలేరు ద్వారా విశాఖపట్నం వరకు నీళ్లు తీసుకుపోవాలి. వంశధార, నాగావళి నీళ్లను కూడా సముద్రంపాలు కాకుండా సమర్థంగా వినియోగిస్తే తమకు నీళ్లు రావడం లేదని, తాము నిర్లక్ష్యానికి గురవుతున్నామనే ఉత్తరాంధ్రవాసుల బాధ కూడా తీరుతుంది' అని సీఎం కేసీఆర్ ప్రతిపాదించారు.

### సామరస్యంగా సమస్యల పరిష్కారం

**విభజన** సందర్భంగా తలెత్తిన సమస్యలన్నింటినీ సామరస్యంగా, చర్చలతో పరిష్కరించుకోవాలని ఈ సమావేశంలో రెండు రాష్ట్రాల సీఎంలు కేసీఆర్, జగన్ నిర్ణయించారు. ప్రభుత్వ సలహాదారులు, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శుల ఆధ్వర్యంలో చర్చలు శనివారం కూడా కొనసాగుతాయి. సమస్యలన్నీ పరిష్కారం అయ్యే వరకు చర్చించి నిర్ణయం తీసుకోవాలని ఇరు రాష్ట్రాల సీఎస్‌లను ఇద్దరు సీఎంలు ఆదేశించారు. ఉద్యోగుల విభజన, ప్రభుత్వ సంస్థల విభజన తదితర అంశాలపై చర్చిస్తారు. గోదావరి నీటిని తరలించే విషయంలో ప్రాతిపదికలు రూపొందించే బాధ్యతను రెండు రాష్ట్రాల అధికారులు సంయుక్తంగా స్వీకరిస్తారు. రెండు రాష్ట్రాల నీటిపారుదలశాఖ కార్యదర్శులు, ఈఎన్సీల ఆధ్వర్యంలో ఈ పని జరుగుతుంది. జూలై 15లోగా అధికారులు సీఎంలకు నివేదిక ఇస్తారు. ఆ తర్వాత ఇద్దరు సీఎంలు ఆంధ్రప్రదేశ్‌లో సమావేశమై తుది నిర్ణయం తీసుకుంటారు.

### జగన్ బృందానికి ఘనస్వాగతం

ఉదయం 11.15 గంటలకు జగన్ తన మంత్రివర్గ సహచరులు, అధికారులతో కలిసి ప్రగతిభవన్‌కు చేరుకున్నారు. సీఎం కేసీఆర్ తన మంత్రివర్గ సహచరులు, అధికారులతో కలిసి జగన్ బృందానికి ఘనస్వాగతం పలికి తెలంగాణ అధికారులను పరిచయం చేశారు. జగన్‌ను తన చాంబర్‌కు తీసుకెళ్లి కొద్దిసేపు మాట్లాడారు. 11.30 గంటలకు ఇద్దరు సమావేశమందిరానికి చేరుకున్నారు. రెండు రాష్ట్రాల బృందాలు కలిసి భోజనంచేశాయి. సమావేశంలో ఏపీ మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, అనిల్ కుమార్‌యాదవ్, బాలినేని శ్రీనివాసరెడ్డి, బీ రాజేంద్రనాథ్, కురసాల కన్నబాబు, పేర్ని వెంకట్రామయ్య (నాని), ప్రభుత్వ ప్రధాన సలహాదారు అజయ్ కల్లం, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎల్వీ సుబ్రమణ్యం, నీటిపారుదలశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆదిత్యనాథ్‌దాస్, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి ఎస్ఎస్ రావత్, విద్యుత్‌శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్ శ్రీకాంత్, సీనియర్ అధికారులు ఎల్ ప్రేమచంద్రారెడ్డి, కే ధనుంజయరెడ్డి, నీటిపారుదలశాఖ ఈఎన్సీ ఎం వెంకటేశ్వర్‌రావు, ఏపీ నీటిపారుదల నిపుణులు, రిటైర్డ్ ఇంజినీర్లు, తెలంగాణ ప్రభుత్వం తరపున మంత్రులు ఈటల రాజేందర్, నిరంజన్‌రెడ్డి, శ్రీనివాస్‌గౌడ్, వేముల ప్రశాంత్‌రెడ్డి, టీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కే కేశవరావు, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్‌శర్మ, ప్రభుత్వ సలహాదారు టంకశాల అశోక్, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి, జెన్‌కో ట్రాన్స్‌కో సీఎండీ డీ ప్రభాకర్‌రావు, సీఎంవో ముఖ్యకార్యదర్శి ఎస్ నర్సింగ్‌రావు, ఆర్థికశాఖ ముఖ్య కార్యదర్శి రామకృష్ణారావు, నీటిపారుదలశాఖ ఈఎన్సీ మురళీధర్, రిటైర్డ్ ఇంజినీర్ శ్యాంప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎంల సమావేశానికి హాజరైన ఏపీ అధికారులు అజయ్‌కల్లాం, సజ్జల రామకృష్ణారెడ్డి, ఎల్వీ సుబ్రహ్మణ్యం, ఆదిత్యనాథ్‌దాస్, ఎస్ఎస్ రావత్, ఎన్ శ్రీకాంత్, ఎల్ ప్రేమచంద్రారెడ్డి, కే ధనుంజయరెడ్డి, ఎం వెంకటేశ్వర్‌రావు

సమావేశానికి హాజరైన తెలంగాణకు చెందిన ఎంపీ కే కేశవరావు, రాజీవ్‌శర్మ, టంకశాల అశోక్, సీఎస్ ఎస్కేజోషి, నర్సింగ్‌రావు, దేవులపల్లి ప్రభాకర్‌రావు, రామకృష్ణారావు, మురళీధర్

**ముహూర్తం**

సూర్యోదయం: 5.49 గంటలకు

సూర్యాస్తమయం: 6.50 గంటలకు

వికారినామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, కృష్ణపక్షం, ఏకాదశి ఉదయం 6.47 వరకు, తదుపరి ద్వాదశి, నక్షత్రం: భరణి ఉదయం 9.58 వరకు, తదుపరి కృత్తిక, అమృతఘడియలు: తె.జా. 5.01 నుంచి ఉదయం 6.37 వరకు, రాహుకాలం: ఉదయం 9.04 నుంచి 10.42 వరకు, దుర్ముహూర్తం: తె.జా. 5.49 నుంచి ఉదయం 7.33 వరకు, వర్జ్యం: రాత్రి 10.00 నుంచి 11.36 వరకు.

**లోకం పోకడ**

స్మార్ట్‌ఫోన్ ఎంత ప్రమాదమో మా ఫ్రెండ్స్‌కు రోజూ పొద్దంతా ఛాటింగ్‌లో చెప్తూనే వున్నా మమ్మీ!

# మా స్నేహం దేశానికే ఆదర్శం

**ఇదో చారిత్రాత్మకమైన రోజు**

- రెండురాష్ట్రాలు అన్నిరంగాల్లో పురోగమించాలి
- అన్నదమ్ముల్లా అంశాల పరిష్కారం
- సీఎంల భేటీ అందుకు తొలి అడుగు
- మీడియాతో తెలంగాణ, ఏపీ మంత్రులు ఈటల, బుగ్గన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రెండు తెలుగు రాష్ట్రాలు అన్నదమ్ముల్లా కలిసిమెలిసి జీవించే సంప్రదాయాన్ని నెలకొల్పడమే కాకుండా, రెండురాష్ట్రాల స్నేహబంధం దేశానికే ఆదర్శంగా నిలువాలనేది ఇద్దరు ముఖ్యమంత్రుల అభిమతమని, అందులో భాగంగానే రెండు రాష్ట్రాల సీఎంల భేటీతో ముందడుగు వేశామని తెలంగాణ వైద్యారోగ్యశాఖ మంత్రి ఈటల రాజేందర్, ఏపీ ఆర్థికశాఖ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి స్పష్టంచేశారు. ఇద్దరు ముఖ్యమంత్రుల భేటీ జరిగిన శుక్రవారాన్ని చారిత్రాత్మక దినంగా అభివర్ణించారు. ప్రగతిభవన్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు, ఏపీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి, రెండు రాష్ట్రాల మంత్రులు, అధికారుల భేటీల తర్వాత ఈటల, బుగ్గన మీడియాతో మాట్లాడారు. సమావేశం చర్చల సారాంశాన్ని వివరించారు. ప్రధానంగా నదీజలాల అంశంపైనే సుదీర్ఘంగా చర్చించినట్టు తెలిపారు. మీడియా సమావేశంలో మంత్రులు ఏమన్నారో వారి మాటల్లోనే..

### గొప్ప రాష్ట్రాలుగా విరాజిల్లాలి: ఈటల

రెండు రాష్ట్రాల ప్రజలు మళ్లీ అన్నదమ్ముల్లా కలిసిమెలిసి జీవించే సంప్రదాయం నెలకొల్పాలనేది తెలంగాణ ప్రభుత్వ అభిమతం. ఇరురాష్ట్రాల ప్రజల సంక్షేమం, ఇరు రాష్ట్రాల సమస్యల పరిష్కారం ధ్యేయంగా పనిచేయాలని సీఎం కేసీఆర్ నిర్ణయించారు. విడిపోయిన రాష్ట్రాలు కలిసికట్టుగా, ఎంత గొప్పగా ముందుకుపోతున్నాయోనన్న సంప్రదాయాన్ని ఈ దేశానికి అందించాలని తెలంగాణ భావిస్తున్నది. ఈ సమావేశంలో అనేక చిన్న చిన్న సమస్యలతోపాటు మరీ ముఖ్యంగా నదీజలాల అంశంపై సుదీర్ఘ చర్చ జరిగింది. నీళ్ల కోసం ప్రజలు ఎట్ల తపనపడ్డరో.. కరంటు కష్టాలు ఎదుర్కొని కరువుకాటకాలతో ఎట్ల ఇబ్బందిపడ్డరో ఆనాటి ఉద్యమనేతగా కేసీఆర్ కండ్లారా చూశారు. అందుకే ఏపీ అయినా, తెలంగాణ అయినా.. రెండు రాష్ట్రాల్లో తాగు, సాగునీరు లేక ఇబ్బంది పడుతున్న మెట్ట ప్రాంతాలతోపాటు కోస్తాంధ్ర, రాయలసీమ, మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాలకు నీళ్లందించాలని సంకల్పించారు. దీనిపై ఇరురాష్ట్రాల ఇంజినీర్లు అధ్యయనం చేసి, రైతాంగం, పొలాలకు నీళ్లందించే చర్యలను వేగవంతం చేయాలని కోరారు. ఇప్పటికే తెలంగాణలో ఈ సమస్యను అధిగమించేందుకు చేపట్టిన చర్యలను సమావేశంలో సీఎం కేసీఆర్ వివరించారు. అందుకే నదీజలాలను రెండురాష్ట్రాలకు ఉపయోగపడేలా చేసుకోవాలని నిర్ణయించారు. పొరుగు రాష్ట్రాలతో ఘర్షణ వాతావరణం లేకుండా, ఇచ్చిపుచ్చుకొనే ధోరణితో ఉండాలనేది తెలంగాణ అభిమతం. గతంలో తెలంగాణ సర్కారు మహారాష్ట్రతో చేసుకున్న ఒప్పందం, కర్ణాటకతో మాట్లాడుకున్న తీరు అందరికీ తెలుసు. ఈరోజు ఏపీతో కలిసిమెలిసి ఉండే పరిస్థితిని చూస్తున్నాం. చర్చల ద్వారా, అన్నదమ్ముల్లాగా ప్రజాకోణంలో ప్రజాసమస్యలు పరిష్కరించుకుంటేనే రాష్ట్రాలు బాగుపడతయని, ప్రజలకు మేలు జరుగుతుందని భావించే రాష్ట్రాల్లో తెలంగాణ ముందుంటుంది. రెండు రాష్ట్రాలు అన్నదమ్ముల్లాగా, మనస్పర్థలు లేకుండా, కలిసి పనిచేసి అన్నిరంగాల్లో దేశంలోనే గొప్ప రాష్ట్రాలుగా ఎదిగేందుకు పునాదులు వేసుకోవాలని ఇద్దరు సీఎంలు నిర్ణయించారు. మిగిలిన అంశాలపై రెండురాష్ట్రాల సలహాదారులు, ప్రధాన కార్యదర్శులు, ఇతర అధికారులు శనివారం కూడా చర్చించి పరిష్కారాలను సాధించాలని నిర్ణయించారు. తెలంగాణ, ఏపీ రాష్ట్రాలు రెండు వ్యవసాయిక రాష్ట్రాలైనందున దేశంలోనే వ్యవసాయరంగంలో గొప్ప రాష్ట్రాలుగా ఎదగాలని, కరంటు కష్టాలు తీర్చుకొని, గొప్ప రాష్ట్రాలుగా విరాజిల్లాలనేది ఇన్ని గంటల సమావేశ సారాంశం. అందుకు శుక్రవారం జరిగిన భేటీతో ముందడుగు పడింది. ఈ ఒరవడి, సంప్రదాయం ముమ్ముందు కూడా కొనసాగించాలని నిర్ణయించాం.

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ మంత్రి ఈటల రాజేందర్. చిత్రంలో ఏపీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి కూడా ఉన్నారు.

### నదీజలాల వినియోగంపై మార్గనిర్దేశం...

సమావేశంలో భాగంగా రెండు రాష్ట్రాలు గోదావరి, ఇతర నదీజలాల్ని ఎలా వినియోగించుకోవాలో పరిశీలనచేశారు. ఒక పరిష్కారాన్ని ఇవ్వాలని అధికారులను ఆదేశించాం. షెడ్యూల్-9, 10 అంశాలను కూడా పరిష్కరించుకునేందుకు ప్రధాన కార్యదర్శులు, ప్రధాన సలహాదారులకు ఆదేశాలిచ్చాం. అన్ని అంశాల్లో ఇచ్చిపుచ్చుకునే ధోరణితో రెండు రాష్ట్రాలు అభివృద్ధిలో ముందుకుపోవాలని, భారతదేశానికే ఆదర్శంగా నిలువాలని ఆలోచనచేశాం. ప్రస్తుతం గోదావరిలోనే మిగులుజలాలు అధికంగా ఉన్నాయి. అందుకే గరిష్ఠ వినియోగం కోసం ఏయే ప్రాంతాలకు గోదావరిజలాల్ని తరలించి, వినియోగించుకునేందుకు అవకాశం ఉన్నదో అధ్యయనం చేయాలని నిర్ణయించాం. రెండురాష్ట్రాల ఇంజినీరింగ్‌శాఖలకు బాధ్యత అప్పగించాం. నదీజలాల తరలింపునకు ఉన్న మంచి మార్గాలపై ప్రాథమిక నివేదిక ఇచ్చేందుకు జూలై 15 గడువుగా పెట్టుకున్నాం.

### అందుకే భవనాలు అప్పగించాం...

హైదరాబాద్ పదేండ్లపాటు ఉమ్మడి రాజధానిగా ఉన్నా.. గత ఏపీ ప్రభుత్వం వివిధ కారణాలతో ఇక్కడి భవనాలను ఖాళీచేసి అమరావతికి తరలివెళ్లింది. కరంటు బిల్లులు, శుభ్రత, నిర్వహణ వంటి కొన్ని అంశాలతో ఆ భవనాలు ముడిపడి ఉన్నాయి. ఇక్కడి భవనాలు ఖాళీగా పెట్టి భూత్‌బంగ్లాలుగా మార్చడం కన్నా తెలంగాణ ప్రభుత్వానికి అప్పగిస్తే మంచిదని ఆ నిర్ణయం తీసుకున్నాం.

### ఇద్దరు సీఎంలు రాజనీతిజ్ఞులు: బుగ్గన

ఇదొక చారిత్రాత్మక దినం. ఏపీ, తెలంగాణ సీఎంలు, మంత్రులు, ప్రధాన కార్యదర్శులు, ప్రధాన సలహాదారులు, ఇతర అధికారులు, ఇంజినీరింగ్ నిపుణులు అందరూ సమావేశమయ్యారు. విభజన చట్టంలోని పలు అంశాలను పరిష్కరించుకునేందుకు ఈ భేటీ నిర్వహించారు. ప్రధానంగా రెండు రాష్ట్రాలు కలిసి నదీజలాలను ఎలా వినియోగించుకోవాలనే దానిపై ఒక దిశానిర్దేశాన్ని నిర్ణయించారు. ఇద్దరు సీఎంలు నాయకులుగా కాకుండా రాజనీతిజ్ఞులుగా వ్యవహరించారు. 'మనం ఒకరి దగ్గరికిపోయేదేముంది? మన సమస్యలను మనమే కూర్చుని పరిష్కరించుకుందాం' అని నిశ్చయించారు. అధికారులు, యంత్రాంగం అందరికీ మనమంతా ఒక్కటే అనే స్ఫూర్తిని అందించాం. భవిష్యత్తులో ప్రతి విషయంలో కలిసి నడువాలని నిర్ణయించాం. నదీజలాల విషయానికొచ్చేసరికి.. సరిహద్దు రాష్ట్రాలు కర్ణాటక, మహారాష్ట్ర, ఒడిశా, ఛత్తీస్‌గఢ్ ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఏదైనా అంశాలు వచ్చినప్పుడు రెండు తెలుగు రాష్ట్రాలు ఉమ్మడిగా పరస్పర ప్రయోజనం ఉండేలా ఒక కార్యాచరణ తయారుచేసుకోవాలని నిర్ణయించాం. రెండు రాష్ట్రాలకు సంబంధించిన కొన్ని అంశాలపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శులు రెండ్రోజులు చర్చించి తుది నిర్ణయానికి రావాలని చెప్పాం.

### చట్టాల్ని గౌరవించాలనే కూల్చివేత

విజయవాడ కరకట్ట పక్కన ఉన్న అక్రమ నిర్మాణ కూల్చివేత వెనక వాస్తవాలున్నాయి. రిజర్వ్ కన్జర్వేషన్ చట్టం ప్రకారం ఇన్ని కిలోమీటర్ల పరిధిలో నిర్మాణాలు చేపట్టవద్దు. మాజీ సీఎం చంద్రబాబు అక్కడ ఉండే ప్రైవేటు అతిథిగృహాన్ని నివాసంగా చేసుకున్నారు. ఆ అతిథి గృహాన్ని చట్టవిరుద్ధంగా కట్టారు. అదేవిధంగా అక్కడ ఒక సమావేశ మందిరం కూడా నిబంధనలకు విరుద్ధంగా కట్టుకున్నారు. కానీ మనం చేసుకున్న చట్టాలు, రూపొందించుకున్న నిబంధనల్ని మనమే అనుసరించకపోతే ఇతరులను అనుసరించాలని చెప్పే నైతికత మనకు ఎక్కడ ఉంటుందని ఇప్పుడు దాని కూల్చివేతకు సీఎం జగన్ ఆదేశించారు. అందుకే ఆ అక్రమ నిర్మాణంలోని తాత్కాలిక షెడ్డును విప్పి, నిబంధనలు అనుమతించే ప్రదేశంలో ఏర్పాటుచేయాలని చూస్తున్నాం. దీనిని అనవసరంగా వివాదంగా మారుస్తున్నారు.

# రాష్ట్రంలో రెండ్రోజులు వానలు

■ రేపు అల్పపీడనం ఏర్పడే అవకాశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఉత్తర బంగాళాఖాతం దాని పరిసరాల్లో ఈనెల 30న అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు. ఇది తీవ్రమై 48 గంటల్లో వాయుగుండంగా మారొచ్చని చెప్పారు. శని, ఆదివారాల్లో రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి నుంచి మోస్తరు వానలు కురిసే అవకాశం ఉన్నదని పేర్కొన్నారు. ఉత్తర కోస్తాంధ్ర, దక్షిణ ఒడిశా తీరాలకు దగ్గరలో పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో సముద్రమట్టానికి 4.5 నుంచి 7.6 కిలోమీటర్ల ఎత్తున ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్నదని అధికారులు తెలిపారు.

**చల్లబడ్డ గ్రేటర్ హైదరాబాద్**

రుతుపవనాల ప్రభావంతో రాగల 48 గంటల్లో గ్రేటర్ హైదరాబాద్‌లోని పలుచోట్ల ఓ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. గాలిలో తేమశాతం పెరుగడంతో వాతావరణం చల్లబడిందని చెప్పారు.

టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో సిరిసిల్ల కలెక్టర్ కృష్ణభాస్కర్‌కు 25లక్షల విరాళం చెక్కును అందజేస్తున్న హోనర్ హోమ్స్ డైరెక్టర్లు వెంకటేశ్వర్లు, బాలు చౌదరి, స్వప్నకుమార్

# సిరిసిల్ల కలెక్టర్‌కు రూ.25 లక్షల విరాళం

■ సీఎస్ఆర్ కింద అందజేసిన హోనర్‌హోమ్స్ సంస్థ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్)గా ప్రముఖ నిర్మాణ సంస్థ హోనర్‌హోమ్స్ రాజన్న సిరిసిల్ల కలెక్టర్‌కు రూ.25 లక్షల విరాళం చెక్కును అందించింది. శుక్రవారం బేగంపేటలో టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో కలెక్టర్ కృష్ణభాస్కర్‌కు చెక్కును అందించారు. సమాజాభివృద్ధికి తమవంతు తోడ్పాటునందించాలనే ఉద్దేశంతో ఈ మొత్తాన్ని అందజేసినట్టు సంస్థ డైరెక్టర్లు పీ వెంకటేశ్వర్లు, ఎం బాలుచౌదరి, స్వప్నకుమార్ తెలిపారు. కార్యక్రమంలో నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే గణేశ్ బిగాల, టీఆర్ఎస్ ఎన్నారై కోఆర్డినేటర్ మహేశ్ బిగాల పాల్గొన్నారు.



బీసీ కమిషన్ సభ్యుడు వకుళాభరణం కృష్ణమోహన్‌రావు 'చుక్కాని' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



# అభివృద్ధిలో పీవీది చెరుగని ముద్ర

■ మాజీ ప్రధానికి నివాళులర్పించిన సీఎం కేసీఆర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు ఆర్థిక సంస్కరణలు ప్రవేశపెట్టి దేశాభివృద్ధిలో చెరగని ముద్రవేశారని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు అన్నారు. మాజీ ప్రధాని పీవీ జయంతి సందర్భంగా సీఎం కేసీఆర్ శుక్రవారం ఘన నివాళులర్పించారు. దేశానికి పీవీ చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు.

పీపీ సమాధి వద్ద పుష్పాంజలి ఘటిస్తున్న మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్. చిత్రంలో ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి, బీసీ కమిషన్ సభ్యుడు వకుళాభరణం కృష్ణమోహన్‌రావు ఉన్నారు.

# పీవీ గొప్ప రాజనీతిజ్ఞుడు

■ ఘనంగా జయంతి ఉత్సవాలు..

■ ప్రముఖుల నివాళి

ఢిల్లీలో పీవీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న ఎంపీలు బండ ప్రకాశ్, కెప్టెన్ లక్ష్మీకాంతారావు, కేవీపీ రామచంద్రరావు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ/ బేగంపేట:** మాజీ ప్రధాని, పీవీ నరసింహారావు 98వ జయంతి ఉత్సవాలను శుక్రవారం నెక్లెస్ రోడ్డులోని పీవీ జ్ఞానభూమిలో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్, ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి, బీసీ కమిషన్ సభ్యుడు వకుళాభరణం కృష్ణమోహన్‌రావు, భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ తదితరులు పీవీ సమాధికి, చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా దేశానికి పీవీ చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. పీవీ గొప్ప రాజనీతిజ్ఞుడని, తెలంగాణ బిడ్డగా ప్రధాని పదవిని చేపట్టి యావత్ దేశానికి గుర్తింపు తెచ్చిన మహనీయుడని శ్లాఘించారు. పీవీ సేవలను గుర్తించిన రాష్ట్ర ప్రభుత్వం ఆయన జయంతిని అధికారికంగా నిర్వహిస్తూ గౌరవాన్ని చాటుతున్నదని తలసాని చెప్పారు. పీవీ నరసింహారావు శతజయంతి ఉత్సవాలను రాష్ట్ర ప్రభుత్వం ఘనంగా నిర్వహిస్తుందని పేర్కొన్నారు. పీవీ సమాధి వద్ద ఆయన జీవిత విశేషాలకు సంబంధించిన చిత్రాలతో కూడిన ఛాయాచిత్ర ప్రదర్శన, వైద్య, రక్తదాన శిబిరాలను ఏర్పాటుచేశారు. మాజీ ముఖ్యమంత్రి రోశయ్య, తెలంగాణ కాంగ్రెస్ నాయకులు మర్రి శశిధర్‌రెడ్డి, భట్టి విక్రమార్క, వీ హనుమంతరావు, బీజేపీ నేతలు డాక్టర్ లక్ష్మణ్, బండారు దత్తాత్రేయ, సరస్వతీ ఉపాసకుడు దైవజ్ఞశర్మ నివాళులర్పించారు. కార్యక్రమంలో రాంగోపాల్‌పేట కార్పొరేటర్ అరుణగౌడ్, పీవీ కుమారుడు ప్రభాకర్‌రావు పాల్గొన్నారు.

# సంతోష బీజాలు నాటాలి

■ విత్తన విప్లవం రావాలి.. ప్రపంచం ఆకలి తీరాలి

■ ఇస్టాలాంటి సదస్సులు ఇందుకు వేదిక కావాలి

■ గవర్నర్ నరసింహన్ పిలుపు

■ నాణ్యమైన విత్తనోత్పత్తికి చిరునామా తెలంగాణ

■ రైతులు ఆర్థికంగా ఎదిగేందుకు ప్రభుత్వం ప్రణాళికలు

■ ఇస్టా ముగింపు వేడుకల్లో మంత్రి నిరంజన్‌రెడ్డి

శుక్రవారం ఇస్టా ముగింపు సదస్సులో గవర్నర్ నరసింహన్‌ను సన్మానిస్తున్న మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి. చిత్రంలో రైతు సమన్వయ సమితి అధ్యక్షుడు గుత్తా సుఖేందర్‌రెడ్డి, వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారథి, కమిషనర్ రాహుల్ బొజ్జా, ఇస్టా కో-ఆర్డినేటర్ డాక్టర్ కే కేశవులు ఉన్నారు.

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** విశ్వమంతా విత్తన విప్లవం రావాలి.. ప్రపంచం ఆకలి తీరాలి.. ఆహారభద్రతతోనే మానవాళి సంతోషం అని గవర్నర్ నరసింహన్ తెలిపారు. ఇస్టాలాంటి సదస్సులు ప్రపంచవ్యాప్తంగా సంతోష బీజాలు (సీడ్స్ ఆఫ్ హ్యాపినెస్) నాటాలని ఆకాంక్షించారు. హెచ్ఐసీసీలో మూడు రోజులపాటు జరిగిన అంతర్జాతీయ విత్తన సదస్సు శుక్రవారం ముగిసింది. ఈ కార్యక్రమానికి గవర్నర్ నరసింహన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వ్యవసాయంలో విత్తనం చాలా కీలకమని, కల్తీ విత్తనం అమ్మడం అంటే ఆత్మహత్యను ప్రోత్సహించినట్టేనని అన్నారు. కుంచించుకుపోతున్న భూమి, నీటి వనరులు, కరంటు సదుపాయం నేపథ్యంలో ప్రపంచ మానవాళి ఆహారభద్రత కోసం విత్తన విప్లవం రావాలని సూచించారు. రైతులు గ్రామాల నుంచి పట్టణాలకు వలసవెళ్తే ప్రజల ఆకలి తీర్చేదెవరని.. వలసదారులకు పట్టణంలో ఉపాధికల్పన ఎలా సాధ్యం? అని గవర్నర్ ప్రశ్నించారు. నాణ్యమైన విత్తనాలు అందించడం, వ్యవసాయానికి అనువైన వాతావరణం కల్పించడంతోనే రైతులను గ్రామాలలోనే ఉంచగలమని వివరించారు. భూమిలో ఎలాంటి విత్తునాటితే అలాంటి దిగుబడే వస్తుందని.. కాబట్టి విత్తన నాణ్యతపై సంపూర్ణ పరిశోధన జరుగాలని సూచించారు. నాణ్యమైన విత్తనం, క్షేత్రం, సాగు, పంటకోత, సంతోషం ఒక చట్రంలా పనిచేస్తాయని చెప్పారు. రైతు అభివృద్ధే రాష్ట్రాభివృద్ధి అని.. అన్నిరకాల వనరులను ఉపయోగించుకొని వారు ఆర్థికంగా ఎదిగేందుకు తెలంగాణ ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నదని వ్యవసాయశాఖమంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి తెలిపారు. నాణ్యమైన విత్తనోత్పత్తికి తెలంగాణ చిరునామాగా మారిందని అన్నారు. రాష్ట్రంలో 3 లక్షల మంది శిక్షణ పొందిన విత్తనోత్పత్తిదారులున్నారని.. 3లక్షల ఎకరాల్లో ఉత్పత్తి జరుగుతున్నదని తెలిపారు. ఏడాదికి 65 లక్షల క్వింటాళ్ల నాణ్యమైన విత్తనాలు ఉత్పత్తి అవుతున్నాయన్నారు. దేశంలోని పది రాష్ట్రాలకు తెలంగాణ నుంచి విత్తనాలు సరఫరా అవుతున్నాయని వివరించారు. విత్తన రంగ సవాళ్లను ఎదుర్కొనేందుకు అంతర్జాతీయ విత్తన పరిశోధన సంస్థ (ఇస్టా), భారత విత్తన పరిశ్రమ కలిసి పనిచేయాలని మంత్రి సూచించారు. సమావేశంలో ఇస్టా చైర్మన్ క్రెగ్ మెక్‌గ్రిల్, రైతు సమన్వయ సమితి రాష్ట్ర అధ్యక్షుడు గుత్తా సుఖేందర్‌రెడ్డి, వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారథి, కమిషనర్ రాహుల్ బొజ్జా, ఇస్టా కో-ఆర్డినేటర్ డాక్టర్ కే కేశవులు, రాష్ట్ర విత్తనాభివృద్ధిసంస్థ చైర్మన్ కొండబాట కోటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

**కూచన్‌పల్లిని విత్తనోత్పత్తి గ్రామంగా మార్చండి: శేరి సుభాష్‌రెడ్డి**

**మెదక్ ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** మెదక్ జిల్లాలోని తన స్వగ్రామం కూచన్‌పల్లిని విత్తనోత్పత్తి గ్రామంగా తీర్చిదిద్దేందుకు తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ సహకరించాలని ముఖ్యమంత్రి రాజకీయ సలహాదారు, ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి కోరారు.గ్రామ రైతులందరూ విత్తనోత్పత్తి పంటల వైపు మొగ్గు చూపేలా చేస్తానని, తక్షణం విత్తనోత్పత్తి పంటల కోసం వంద ఎకరాలు ఇచ్చేందుకు సిద్ధమని చెప్పారు. రైతులకు ప్రోత్సాహం అందించి వారు ఆర్థికంగా ఎదిగేందుకు తోడ్పడాలని అన్నారు. ఇస్టా సదస్సు సందర్భంగా ఏర్పాటు చేసిన విత్తన ఎగ్జిబిషన్‌ను శుక్రవారం ఆయన సందర్శించారు.

## శాశ్వతంగా పేదరిక నిర్మూలనకు కృషి

■ టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణలో సంక్షేమ పథకాల అమలు ద్వారా శాశ్వతంగా పేదరిక నిర్మూలనకు ప్రభుత్వం కృషిచేస్తున్నదని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు అన్నారు. బీసీ కమిషన్ సభ్యుడు వకుళాభరణం కృష్ణమోహన్‌రావు వెలువరించిన చుక్కాని- సంక్షేమానికి పునర్నిర్వచనం పుస్తకం తొలిప్రతిని శుక్రవారం బేగంపేటలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. వివక్ష రహిత సమాజ నిర్మాణమే ధ్యేయంగా.. దార్శనికత కలిగిన ప్రజానాయకుడిగా ముఖ్యమంత్రి కేసీఆర్ చేస్తున్న కృషి దేశానికి ఆదర్శంగా నిలుస్తున్నదన్నారు. తెలంగాణ ప్రభుత్వం సంక్షేమ కార్యక్రమాలను పుస్తక రూపంలోకి తెచ్చిన వకుళాభరణంను కేటీఆర్ అభినందించారు.

## వసతిగృహాల సమస్యలపై త్వరలో సమావేశం

■ మంత్రి కొప్పుల ఈశ్వర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** వసతి గృహాల్లో వసతులపై త్వరలో సమావేశం నిర్వహిస్తామని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ టీఎన్జీవో నేతలకు హామీ ఇచ్చారు. టీఎన్జీవో అధ్యక్షుడు కారం రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి మామిళ్ల రాజేందర్ శుక్రవారం మంత్రుల నివాసగృహాల సముదాయంలో ఆయనను కలిశారు.

# అబ్బూరి ఛాయాదేవి ఇకలేరు

■ హైదరాబాద్‌లో చికిత్సపొందుతూ తుదిశ్వాస

■ మెడికల్ కళాశాలకు మృతదేహం అప్పగింత

■ 2005లో కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు

■ సీఎం కేసీఆర్‌తోపాటు ప్రముఖుల సంతాపం

ఛాయాదేవికి కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్‌లో నివాళి అర్పిస్తున్న దృశ్యం. (ఇన్‌సెట్) ఛాయాదేవి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ/మాదాపూర్:** ప్రముఖ తెలుగు కథా రచయిత్రి, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత అబ్బూరి ఛాయాదేవి (85) కన్నుమూశారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె హైదరాబాద్‌లోని ఓ దవాఖానలో చికిత్సపొందుతూ శుక్రవారం తెల్లవారుజామున తుదిశ్వాస విడిచారు. ఆమె కోరిక మేరకు పార్థివదేహాన్ని ఈఎస్ఐ మెడికల్ కళాశాలకు, కండ్లను ఎల్వీ ప్రసాద్ దవాఖానకు అప్పగించారు. రచయిత్రి అబ్బూరి ఛాయాదేవి మృతిపట్ల సీఎం కేసీఆర్ సంతాపం తెలియజేశారు. తెలుగు సాహిత్యానికి ఆమె చేసిన సేవలను గుర్తుచేసుకున్నారు. ఛాయాదేవి కుటుంబసభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. పలువురు సాహితీవేత్తలు కూడా ఆమె మృతికి సంతాపం ప్రకటించారు.

**ఛాయాదేవి రచనలు.. అందుకున్న అవార్డులు**

ఛాయాదేవి 1933 అక్టోబర్ 13న రాజమహేంద్రవరంలో జన్మించారు. ఆమె భర్త అబ్బూరి వరద రాజేశ్వరరావు కూడా తెలుగు రచయిత. 1951-53 మధ్య నిజాం కళాశాలలో ఆమె ఎంఏ పూర్తిచేశారు. 1953లో కాలేజీ మ్యాగజైన్‌లో ప్రచురించిన 'అనుభూతి' ఆమె మొదటి కథ. ఛాయాదేవి కొండాపూర్‌లోని సీఆర్ ఫౌండేషన్‌లో ఉంటున్నారు. మహిళల సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చి వారిలో చైతన్యం నింపేలా కథలు రాశారు. న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయంలో డిప్యూటీ లైబ్రేరియన్‌గా పనిచేస్తూ 1982లో స్వచ్ఛందంగా పదవీ విరమణ చేశారు. ఆ తర్వాత రచనలపైనే పూర్తిస్థాయి దృష్టిసారించారు. ఛాయాదేవి రాసిన కొన్ని తెలుగు కథలను.. హిందీ, మరాఠీ, తమిళ, కన్నడ భాషల్లోకి అనువదించారు. ఆమె రాసిన 'బోన్‌సాయి బతుకు' అనే కథ 1972లో నేషనల్ బుక్‌ట్రస్టు వారి కథాభారతి సంకలనంలో ప్రచురితమైంది. ఈ కథతో ఛాయాదేవి మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. 1993లో వాసిరెడ్డి రంగనాయకమ్మ సాహిత్య పురస్కారం, 1996లో మృత్యుంజయ పుస్తకం పేరుతో రాసిన రచనలకు తెలుగు విశ్వవిద్యాలయం నుంచి ఉత్తమ రచయిత్రి అవార్డును అందుకున్నారు. 2000లో పలు సాహితీ పురస్కారాలు అందుకున్న ఆమె.. 2005లో 'తనమార్గం' అనే కథా సంకలనానికి కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు సొంతం చేసుకున్నారు.

**పలువురు సాహితీవేత్తల సంతాపం**

అబ్బూరి ఛాయాదేవి మృతికి పలువురు సాహితీవేత్తలు సంతాపం ప్రకటించారు. తెలుగు సాహిత్యం గర్వించదగిన కథా రచయిత్రి అబ్బూరి ఛాయాదేవి అని సాహిత్య అకాడమీ అధ్యక్షుడు నందిని సిధారెడ్డి పేర్కొన్నారు. చిరకాలం గుర్తు పెట్టుకోదగిన ఉత్తమ కథల్ని రచించి తెలుగు కథకు ప్రత్యేక గౌరవాన్ని తెచ్చిపెట్టారని అన్నారు. తెలుగు సాహితీలోకం ఉత్తమ స్త్రీవాద రచయిత్రిని కోల్పోయిందని తెలుగు విశ్వవిద్యాలయం వీసీ సత్యనారాయణ అన్నారు. ఛాయాదేవి స్వయంకృషితో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారని తెలంగాణ సారస్వత పరిషత్తు అధ్యక్షుడు ఆచార్య ఎల్లూరి శివారెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ జే చెన్నయ్య చెప్పారు. ఛాయాదేవి మరణం సాహితీ ప్రపంచానికి తీరని లోటన్నారు. మంచికథల రచయిత, మంచి మనిషి ఛాయాదేవి గారి నిశ్శబ్ద నిష్క్రమణ చాలా బాధాకరమని కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత, ప్రముఖ స్త్రీవాద సాహిత్య విమర్శకురాలు ఆచార్య కాత్యాయని విద్మహే అన్నారు. సాహిత్య విమర్శలో కూడా ఆమె కృషి చెప్పుకోదగినదని పేర్కొన్నారు. సామాన్య ప్రజలపక్షాన కథలు రాసినటువంటి మేటి రచయిత్రి ఛాయాదేవి అని, అట్టడుగువర్గాల ప్రజలకు, ధనవంతులకు మధ్య ఆలోచనల్లో వైరుధ్యాన్ని కండ్లకు కట్టినట్టు చూపించారని తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి నర్సింహారెడ్డి అన్నారు. కథా సాహిత్యంలో బలమైన ముద్రవేశారని ఓయూ తెలుగు శాఖాధిపతి ఆచార్య సూర్య ధనుంజయ పేర్కొన్నారు. ఆమె మరణం సాహితీలోకానికి తీరనిలోటని సీనియర్ పాత్రికేయులు ఏబీకే ప్రసాద్, పాటల రచయిత సుద్దాల అశోక్‌తేజ సంతాపం ప్రకటించారు. ఛాయాదేవి మరణం తనను బాధించిందని తెరసం అధ్యక్షుడు డాక్టర్ నాళేశ్వరం శంకరం పేర్కొన్నారు. తెలుగు కథా సాహిత్య లోకం ఒక ఆణిముత్యాన్ని కోల్పోయిందని, ఛా యాదేవి కుటుంబసభ్యులకు, మిత్రులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నట్టు నిజాం కళాశాల తెలుగుశాఖ అసిస్టెంట్ ప్రొఫెసర్ పగడాల నాగేందర్ చెప్పారు. ఛాయాదేవి ఆర్భాటాలు లేని అసలు సిసలైన స్త్రీవాద రచయిత్రి అని, ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని రచయిత, సినీ దర్శకులు నామాల రవీంద్రసూరి అన్నారు. ఛాయాదేవి రచనలే కాదు.. వారి జీవనవిధానం, వ్యక్తిత్వం కూడా ఆదర్శనీయమే అని ఓయూ తెలుగుశాఖ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎస్ రఘు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు కేవీ రమణాచారి, సీఆర్ ఫౌండేషన్ కార్యదర్శి చెన్నమనేని వెంకటేశ్వరరావు, కోశాధికారి చెన్నకేశవరావు, గౌరవ అధ్యక్షుడు సురవరం సుధాకర్‌రెడ్డి, డాక్టర్ కే నారాయణ, ప్రధాన కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి, సీపీఐ కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి, దర్శకురాలు నందినిరెడ్డి, 'మలుపు' ప్రచురణకర్త బాల్‌రెడ్డి తదితరులు ఛాయాదేవి మృతికి సంతాపం ప్రకటించారు. భూమిక ఎడిటర్ కొండవీటి సత్యవతి, వసంత బాలగోపాల్, ఓల్గా, సజయ తదితరులు ఛాయాదేవి భౌతికకాయాన్ని వైద్యశాలకు అందజేశారు.

# మున్సిపాలిటీల్లో 754 కొత్త వార్డులు

■ చట్టాన్ని సవరిస్తూ ఆర్డినెన్స్

■ పాత చట్టం ప్రకారమే మున్సిపోల్స్

■ కసరత్తులో వేగం పెంచిన సర్కార్

**ప్రత్యేక ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** పురపాలక సంఘాల ఎన్నికల నిర్వహణకోసం రాష్ట్ర ప్రభుత్వం కసరత్తును వేగవంతంచేసింది. ఎన్నికల ప్రక్రియను ప్రారంభించేలా మున్సిపల్ చట్టానికి సవరణ చేసింది. పాత మున్సిపల్ చట్టం ప్రకారమే ఎన్నికలు జరుగనున్నాయి. ఈ క్రమంలో వార్డుల సంఖ్య పెంచుకోవడానికి వీలుగా మున్సిపల్ నిబంధనల్లో ప్రభుత్వం స్వల్ప సవరణలు చేసింది. ఈ మేరకు తెలంగాణ మున్సిపల్ లాస్ (అమెండ్‌మెంట్) ఆర్డినెన్స్ -2019ని గవర్నర్ ఈఎస్ఎల్ నరసింహన్ శుక్రవారం విడుదలచేశారు. ఈ సవరణ ద్వారా కొన్ని స్వల్పమార్పులతో అన్ని మున్సిపాలిటీలలో వార్డులను ప్రభుత్వం ఖరారుచేసింది. 2011 లెక్కల ప్రకారం మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో జనాభా 76,08,073 ఉండగా, 2,631 వార్డులున్నాయి. తాజా ఆర్డినెన్స్ ప్రకారం వీటి సంఖ్య 3,385కు పెరుగనున్నది. అంటే కొత్తగా 754 వార్డులు ఏర్పడ్డాయి. చట్ట సవరణకు అనుగుణంగా ఎన్నికల ప్రక్రియను పురపాలక పరిపాలనాశాఖ ప్రారంభించింది.

## ఎంసెట్‌కు 51,114 మంది స్లాట్ బుకింగ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఇంజినీరింగ్ కాలేజీల్లో సీట్ల భర్తీకి ఈ నెల 24 నుంచి ప్రారంభమైన స్లాట్ బుకింగ్ కోసం శుక్రవారం నాటికి 51,114 మంది విద్యార్థులు హాజరైనట్టు ఎంసెట్ అడ్మిషన్స్ కన్వీనర్ నవీన్‌మిట్టల్ తెలిపారు. రెండురోజులుగా కొనసాగుతున్న సర్టిఫికెట్ల పరిశీలనకు 20,856 మంది హాజరయ్యారని, శుక్రవారం 10,451 మంది హాజరయ్యారని తెలిపారు. జూలై 3వ తేదీ వరకు సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. స్లాట్ బుక్‌చేసుకొన్నవారు జూలై 1 నుంచి 4 వరకు నిర్వహించే వెబ్‌కౌన్సెలింగ్ ద్వారా ఆప్షన్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

## మెడికల్ ప్రవేశాలకు సర్టిఫికెట్ల పరిశీలన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కేఎన్ఆర్ యూహెచ్ఎస్ పరిధిలోని వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాలకు కన్వీనర్ కోటా సీట్ల భర్తీకి ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ శుక్రవారం ముగిసింది. శనివారం నుంచి జూలై 5 వరకు అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించేందుకు ఐదు కేంద్రాలు నిర్వహిస్తున్నట్టు విశ్వవిద్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది. అభ్యర్థుల వివరాల ఆధారంగా ప్రొవిజినల్ మెరిట్‌లిస్ట్‌ను వెబ్‌సైట్‌లో పొందుపరిచినట్టు తెలిపారు.వివరాలకు www.knruhs.in,www.knruhs.telangana.gov.in పరిశీలించాలన్నారు.

# హెరిటేజ్ ఎక్కడ?

మూడోపేజీ తరువాయి...

కోసం ప్రభుత్వం కూల్చాలని యోచిస్తున్న ఎర్రమంజిల్ భవనం హెరిటేజ్ భవనం అని, దాంతోపాటు పక్కనే నూతనంగా నిర్మించిన జలసౌధను కూడా కూల్చేందుకు యత్నిస్తున్నదని పిటిషనర్ల తరపు న్యాయవాదులు పేర్కొన్నారు. దీనిపై ధర్మాసనం స్పందిస్తూ 'మీ వాదన ప్రకారం పాత భవనాలను కూల్చొద్దు.. కొత్త భవనాలను కూల్చొద్దు. మరి ప్రభుత్వం ఏం చేయాలి' అని ప్రశ్నించింది. ఎర్రమంజిల్ భవనానికి చట్టప్రకారం హెరిటేజ్ గుర్తింపు లేదని పేర్కొన్నది. ఎర్రమంజిల్ భవనం కూల్చివేతపై అభ్యంతరం వ్యక్తంచేస్తూ నవాబ్ ఫక్రుల్ ముల్క్ వారసులు లేఖ రాశారని పిటిషనర్లు పేర్కొనగా.. 'ఈ లేఖపై ఎలాంటి స్టాంప్ గానీ, సీల్‌గానీ లేదు. లేఖ స్వీకరించినట్టుగా ఎటువంటి గుర్తింపు లేదు. దీనికి చట్టబద్ధత ఎలా ఉంటుంది. అభ్యతరం ఉంటే వారసులే స్వయంగా పిల్ వేయవచ్చు కదా?' అని ధర్మాసనం ప్రశ్నించింది. నగరం మధ్యలో ఉన్న ఎర్రమంజిల్‌లో అసెంబ్లీ నిర్మాణం చేపడితే ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతాయని, రాజధానిలో ఒక భాగంతో మరోభాగానికి సంబంధాలు తెగిపోతాయనే పిటిషనర్ల వాదనపై ధర్మాసనం స్పందిస్తూ.. తీవ్రమైన వాదన చేసేటప్పుడు ఆధారాలు చూపాలని.. అవిలేకుండా తీవ్రమైన ఆరోపణలు ఎలా చేస్తారని ప్రశ్నించింది. పిల్స్ వేయడం సులభమేనని, అందులో పేర్కొన్న అంశాలకు ఆధారాలు తీసుకురావడం చాలా కష్టమైనపని అని పేర్కొన్నది. మీడియాలో కథనాలను ఆధారంగా చేసుకుని కేసులను విచారించలేమని, అధారాల్లేకుండా పిల్స్‌ను అనుమతించరాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసిందని పేర్కొన్నది.

**నిరూపించలేకపోయారు: ఏఏజీ**

ఎర్రమంజిల్‌లో అసెంబ్లీ భవనాన్ని నిర్మించాలన్న ప్రభుత్వ నిర్ణయంలో ఉల్లంఘన ఎక్కడ జరిగిందో పిటిషనర్లు నిరూపించలేకపోయారని అదనపు అడ్వకేట్ జనరల్ జే రామచంద్రరావు పేర్కొన్నారు. ధర్మాసనం జోక్యం చేసుకుంటూ.. ఉమ్మడి ఏపీలో 294 మంది ఎమ్మెల్యేలు, 90 మంది ఎమ్మెల్సీలు ఉన్నప్పుడు సరిపోయిన అసెంబ్లీ భవనం.. 119 మంది ఎమ్మెల్యేలు, 42 మంది ఎమ్మెల్సీలకు ఎందుకు సరిపోవడం లేదని ప్రశ్నించింది. అన్నిసౌకర్యాలు ఉన్న భవనాన్ని వదిలి.. కొత్త భవనాన్ని నిర్మించడం వల్ల ప్రజాధనం వృథా అవుతుందన్న పిటిషనర్ల ప్రశ్నకు సమాధానం ఇవ్వాలన్నది. దీనిపై ఏఏజీ సమాధానం ఇస్తూ ప్రజల చేత ఎన్నికైన ప్రభుత్వాలు కొన్ని అంశాల్లో విధాన నిర్ణయాలు తీసుకుంటాయని.. వాటిల్లో జోక్యం చేసుకోవద్దని సుప్రీంకోర్టు పలుతీర్పుల్లో స్పష్టంచేసిందని పేర్కొన్నారు. ఏ భవనం అనుకూలంగా ఉంటుంది.. ఏ భవనం ఎంపికచేసుకోవాలి అనే అంశంలో ప్రభుత్వానిదే అంతిమ నిర్ణయమని 'పాల్కో' తదితర కేసుల్లో సుప్రీంకోర్టు తెలిపిందని చెప్పారు. నోయిడాలో భవనాలను కూల్చకుండా సుప్రీంకోర్టు అడ్డుకుందని ధర్మాసనం గుర్తుచేసింది. అసెంబ్లీ భవనానికి సంబంధించిన ప్లాన్ అందజేయాలని ధర్మాసనం కోరగా.. దానిపై ప్రస్తుతం ఆర్కిటెక్టులు, నిపుణులు పనిచేస్తున్నారని త్వరలోనే వాటిని అందజేస్తామని ఏఏజీ పేర్కొన్నారు. నూతన భవనం ప్లాన్, ఎర్రమంజిల్ భవనానికి సంబంధించిన ఫ్లోర్‌ప్లాప్, అందులో ఎన్నిగదులు ఉన్నాయి.. ఎన్ని వినియోగంలో ఉన్నాయి వంటి పూర్తివివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించిన కోర్టు.. తదుపరి విచారణను జూలై 8కి వాయిదా వేసింది. పిటిషనర్లు కోరినట్టుగా స్టేగానీ, స్టేటస్ కోగానీ ఇవ్వడానికి ధర్మాసనం నిరాకరించింది.

## కోర్టుకు నిజాలు మాత్రమే వెల్లడించాలి

■ సచివాలయం కూల్చివేతపై 2016లో పిటిషనర్లకు అక్షింతలు

సచివాలయాన్ని కూల్చొద్దంటూ 2016లో పిల్ దాఖల

మనీష్ తివారీ గారు దేశ విభజన గురించి ప్రశ్నిస్తున్నారు! నేనొక ప్రశ్న అడుగదల్చుకున్నాను. ఎవరు దేశ విభజనకు బాధ్యులు? ఇవ్వాళ మూడింట ఒకభాగం భూభాగం మన అధీనంలో లేదు. దానికెవరు బాధ్యులు?.

**అమిత్ షా, కేంద్ర హోంమంత్రి**

జమ్మూకశ్మీర్ విషయంలో బీజేపీ తన వైఫల్యాలను కప్పిపుచ్చుకోవటం కోసం రాష్ట్రపతి పాలన అంటున్నది. కశ్మీర్‌లో ఇప్పుడున్న పరిస్థితి ఏమిటంటే.. ప్రతి ఆరు నెలలకోసారి రాష్ట్రపతి పాలనను పొడిగించాలి. బీజేపీ-పీడీపీ సంకీర్ణ ప్రభుత్వ పాలన కారణంగానే ఈ పరిస్థితి వచ్చింది.

**మనీష్ తివారీ, కాంగ్రెస్ ఎంపీ**

**చరిత్రలో నేడు**

**1613**

ఇంగ్లండ్, లండన్‌లోని అగ్ని ప్రమాదంలో కాలి బూడిదైన 'షేక్స్‌పియర్ గ్లోబ్ థియేటర్'.

**1926**

కెనడా తొమ్మిదో ప్రధానిగా ఆర్థర్ మేఘన్.

**1949**

రెండో ప్రపంచ యుద్ధం తర్వాత కొరియా నుంచి సేనలను ఉపసంహరించుకున్న అమెరికా.

పోలీసులకు, పౌరులకు మధ్య సంబంధాలు దెబ్బతినడం విషాదకరం. హాంకాంగ్‌లో ఇటీవల నిరసన ప్రదర్శనల సందర్భంగా అదే జరిగింది. పోలీసుల పేర్లను కూడా ఉటంకిస్తూ సోషల్ మీడియాలో వారికి వ్యతిరేకంగా ప్రచారం సాగుతున్నది. నిరసనల పట్ల కొందరు పోలీసులు అతిగా ప్రవర్తించారు. రాజకీయ అంశాలపై నిరసన ప్రదర్శనలు సాగుతున్నప్పుడు, ఎట్లా వ్యవహరించాలనే విషయమై పోలీసులకు శిక్షణ ఇవ్వాలె. అయితే విధి నిర్వహణలోని పోలీసులను వెంటాడటం తగదు. ప్రజలకు, పోలీసులకు మధ్య సత్సంబంధాలను నెలకొల్పడానికి చర్యలు తీసుకోవాలె.

**సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్**

బంగ్లాదేశ్‌లో 17 లక్షల మంది బాల కార్మికులున్నారు. వీరిలో అనేక మంది హానికర పరిస్థితుల్లో పనిచేస్తున్నారు. బాల కార్మిక వ్యవస్థను నిర్మూలించడానికి ఎన్ని చట్టాలు చేసినా అమలు కానప్పుడు ఫలితం ఉండదు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు సంబంధించిన అంతర్జాతీయ ఒడంబడికలపై బంగ్లాదేశ్ సంతకం చేసింది. సుస్థిరాభివృద్ధి లక్ష్యాల ప్రకారం కూడా ఈ మేరకు చర్యలు తీసుకోవలిసిందే. 2025 నాటికి బాల కార్మికులు ఉండకూడదనేది లక్ష్యం. ఈ లక్ష్యం నెరవేరాలంటే ప్రభుత్వం మరింత క్రియాశీలంగా కృషిచేయాలె.

**ది డైలీ స్టార్**



# కశ్మీర్ సమస్య

జమ్మూకశ్మీర్‌లో రాష్ట్రపతి పాలనను మరో ఆరునెలల పాటు పొడిగించే బిల్లును శుక్రవారం లోక్‌సభ ఆమోదించిన సందర్భంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా వ్యాఖ్యలు గమనార్హమైనవి. లోక్‌సభలో ఈ బిల్లును ప్రవేశపెట్టిన అమిత్ షా రాష్ట్రపతి పాలన గడువు ముగిసేలోగా అసెంబ్లీ ఎన్నికలు జరిపిస్తామనే దృఢ విశ్వాసాన్ని వ్యక్తంచేశారు. జమ్మూకశ్మీర్ పరిస్థితి మెరుగుపరుచడానికి తమ ప్రభుత్వం ఎంతో కృషి చేసిందనీ, ఏడాదిలో ఎన్నో సమస్యలను పరిష్కరించామని కూడా ఆయన అన్నారు. శాంతిభద్రతల పరిస్థితి అదుపులో ఉన్నదనీ, ప్రజల హక్కుల కోసం ఎంతో కృషిచేశామని కూడా అన్నారు. కశ్మీర్‌లో పరిస్థితి మెరుగుపడ్డదని చెప్పలేం కానీ, మోదీ ప్రభుత్వం స్పష్టమైన వ్యూహంతో వ్యవహరిస్తున్నదనేది మాత్రం స్పష్టం. జమ్మూకశ్మీర్‌లో కేంద్ర పాలన పెంచడానికి బిల్లును ప్రవేశపెట్టడానికి ముందే అమిత్ షా ఆ రాష్ట్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా కశ్మీర్‌లోని బకర్వాలాల్, గుజ్జర్ తదితర సామాజికవర్గాల ప్రతినిధులతో అమిత్ షా మాట్లాడారు. పహాడీలు తదితర బలహీన వర్గాలను ప్రస్తావించారు. వీరికి రిజర్వేషన్ సౌకర్యాలను పటిష్టంగా అమలుచేస్తామని హామీ ఇచ్చారు. వివిధ రాష్ట్రాలలో బీజేపీ నాయకత్వ ఎన్నికల వ్యూహాలను గమనించినప్పుడు జమ్మూకశ్మీర్ విషయంలో ఏమి చేయబోతున్నదో అర్థం చేసుకోవడం కష్టమేమీ కాదు. జమ్ము, లడాఖ్ ప్రాంతాలలో మతపరమైన కేంద్రీకరణ తేవడం ద్వారా బీజేపీ లబ్ధి పొందడానికి ప్రయత్నిస్తున్నది. కశ్మీర్‌లో ప్రధాన స్రవంతి కశ్మీరీయులను వదిలి ఇతర బలహీనవర్గాలను చేరదీసే ప్రయత్నం సాగిస్తున్నది. పీడీపీతో పాటు అధికారం పంచుకున్న కాలంలోనే జమ్ము కశ్మీర్‌లో అధికారంలోకి రావడానికి బీజేపీ ప్రయత్నించి విఫలమైంది. బీజేపీ ప్రజాస్వామ్య పద్ధతిలో అధికారంలోకి రావడానికి ప్రయత్నించడంలో తప్పులేదు. అయితే ఎన్నికల విషయంలోనే కాకుండా విస్తృతస్థాయిలో ప్రజాస్వామిక పరిస్థితులు నెలకొల్పడానికి ప్రయత్నించినప్పుడే ఫలితం ఉంటుంది.

**అమెరికా తదితర పెద్ద దేశాల ఒత్తిడులను తట్టుకొని మన దేశానికి అనుకూలమైన స్వతంత్ర విదేశాంగ విధానాన్ని అమలు చేయవచ్చు. ప్రపంచీకరణ నేపథ్యంలో దేశ స్వావలంబన దెబ్బతినకుండా కాపాడవచ్చు. ఒక్క కశ్మీర్ సమస్యను పరిష్కరించినా అది గొప్ప విషయమే అవుతుంది. రెండవ సారి కూడా ప్రజలు బీజేపీకే పట్టం కట్టారు. మోదీ-షా జోడీ దేశ సమస్యలను పరిష్కరించడం ద్వారా ఆ నమ్మకాన్ని నిలుపుకోవాలె.**

గత ఐదేండ్లలో జమ్ముకశ్మీర్ పట్ల బీజేపీ నాయకత్వం అనుసరించిన విధానాలు సఫలం కాలేదనేది స్పష్టం. కేంద్రం భిన్నవర్గాలతో చర్చలు జరిపి, చతురతతో వ్యవహరించినప్పుడల్లా అక్కడ ప్రశాంత పరిస్థితులు నెలకొంటున్నాయి. మోదీ తొలి విడుత పరిపాలనా కాలంలో పరిస్థితులు మరింత దిగజారాయి. బీజేపీ-పీడీపీ పొత్తు ప్రయోగం కూడా విఫలమైంది. ఇప్పుడు మళ్ళా చర్చల ద్వారా సాధారణ పరిస్థితులు నెలకొల్పే ప్రయత్నాలు సాగుతున్నాయి. అమిత్ షా ఇటీవల కశ్మీర్ సందర్శించినప్పుడు హుర్రియత్ నాయకులను కలువలేదు. కానీ వారితో తెరచాటు మంతనాలు సాగుతున్నట్టు తెలుస్తున్నది. ఏ విధంగానైనా ప్రశాంత పరిస్థితులు నెలకొల్పి జమ్మూకశ్మీర్‌లో సత్వరం ఎన్నికలు జరుపడం మంచిది. గతేడాది జూన్‌లో బీజేపీ-పీడీపీ కూటమి ప్రభుత్వం కూలిపోయిన నాటి నుంచి రాష్ట్రం కేంద్ర పాలనలోనే ఉన్నది. తొందరగా ఎన్నికలు జరుపాలనే డిమాండ్ బలంగా వినబడుతున్నది. లోక్‌సభతో పాటే అసెంబ్లీకి కూడా ఎన్నికలు జరుపాల్సింది. కానీ అక్కడి పరిస్థితి దృష్ట్యా జరు పలేదు. లోక్‌సభ ఎన్నికల్లో ఒక్క అనంతనాగ్ స్థానానికే మూడు దశలుగా ఎన్నికలు జరుపవలసి వచ్చిందంటే అక్కడి పరిస్థితిని ఊహించు కో వచ్చు. గతంలో ఆరేండ్ల పాటు ఎన్నికలు జరుగని సందర్భాలున్నాయని గుర్తుచేస్తూ, కేంద్ర పాలన పొడిగింపును అమిత్ షా సమర్థించుకున్నారు. అయితే గతంలో అయినా, ఇప్పుడైనా నిర్ణీత వ్యవధిలో ఎన్నికలు జరిపించవలసిందే. దీనివల్ల ప్రజా ప్రభుత్వం ఏర్పడుతుంది. మరోవైపు కశ్మీర్ విషయంలో మన వాదన అంతర్జాతీయ సమాజం ముందు నైతికంగా బలహీనపడుతుంది. కశ్మీర్ పరిస్థితి పాకిస్థాన్ చేస్తున్న వాదనలకు బలం చేకూర్చినట్టవుతుంది. ప్రజాప్రాతినిధ్య ప్రభుత్వం లేనప్పుడు అక్కడి ఆందోళనలకు నైతికతను సమకూర్చే ప్రయత్నాలు జరుగవచ్చు. అందువల్ల ఏ విధంగా చూసినా ఎన్నికలు నిర్ణీత వ్యవధిలో జరుపడానికి ప్రయత్నించవలసిందే.

పార్లమెంట్‌లో చర్చ సందర్భంగా అమిత్ షా నెహ్రూ చేసిన తప్పిదం వల్లనే కశ్మీర్‌లోని మూడోవంతు భూ భాగం మన అధీనంలో లేదని వ్యాఖ్యానించడం వివాదాస్పదమైంది. నెహ్రూ కాలం నాటి పరిస్థితులు వేరు. స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్ళలో దేశం అనేక సమస్యలను ఎదుర్కొంటున్నది. వందలాది సంస్థానాలను విలీనం చేయడం మొదలుకొని పేదరికం, మత వైషమ్యాల వంటి అనేక జాడ్యాలను ఎదుర్కొంటూ దేశాన్ని ప్రజాస్వామ్య బాటలో నడుపవలసి వచ్చింది. అంతర్జాతీయంగా అనేక ఒత్తిడుల మధ్య దేశం నిలదొక్కుకొని స్వావలంబన సాధించడం సాధారణ విషయం కాదు. ఇప్పుడు భారత్ బలమైన దేశంగా నిలబడ్డదీ అంటే నాటి నాయకులు వేసిన పునాదులే కారణం. నెహ్రూను విమర్శించే బదులు మోదీ- అమిత్‌షా జోడీ తాము ఏదైనా సాధించి చూపితే బాగుంటుంది. ఇప్పటికీ దేశం అనేక సమస్యలను ఎదుర్కొంటున్నది. వాటిని పరిష్కరించడం ద్వారా మోదీ-అమిత్ షా తమ పరిపాలనా చాతుర్యాన్ని నిరూపించుకోవచ్చు. అమెరికా తదితర పెద్ద దేశాల ఒత్తిడులను తట్టుకొని మన దేశానికి అనుకూలమైన స్వతంత్ర విదేశాంగ విధానాన్ని అమలు చేయవచ్చు. ప్రపంచీకరణ నేపథ్యంలో దేశ స్వావలంబన దెబ్బతినకుండా కాపాడవచ్చు. ఒక్క కశ్మీర్ సమస్యను పరిష్కరించినా అది గొప్ప విషయమే అవుతుంది. రెండవ సారి కూడా ప్రజలు బీజేపీకే పట్టం కట్టారు. మోదీ-షా జోడీ దేశ సమస్యలను పరిష్కరించడం ద్వారా ఆ నమ్మకాన్ని నిలుపుకోవాలె.

**జనగళం**

### పసలేని ప్రసంగం

ఉభయసభలను ఉద్దేశించి రాష్ట్రపతి చేసిన ప్రసంగానికి ధన్యవాదాలు చెబుతూ చేసిన మోదీ ప్రసంగం శ్రోతలను, వీక్షకులను పెద్దగా అలరించలేదనే చెప్పాలి. మోదీ ఎంతసేపు కాంగ్రెస్‌ను, విమర్శించడమే తప్పా రెండోసారి అఖండ మెజారిటీతో గెలిచిన తమ పార్టీ ప్రజల కోసం ఏం చేస్తుందో చెప్పలేకపోయారు. అప్పుడెప్పుడో ఇందిరాగాంధీ కాలంలో జరిగిన ఎమర్జెన్సీ గురించి ప్రస్తావించారే తప్పా దేశవ్యాప్తంగా జరుగుతున్న హిందుత్వ దాడులు, మూకదాడుల గురించి ఎక్కడా ప్రస్తావించలేదు. గో మాంసం తింటున్న వారిపై దాడులు, మూకదాడులు జరుపుతున్న వారి గురించి ఎక్కడా చెప్పలేదు. ముందుగా మోదీ రానున్న ఐదేండ్లలో దేశం కోసం ఏం చేస్తాడో చెప్పాలి.

**- కొలిపాక శ్రీనివాస్, సముద్రాల, హుస్నాబాద్**

### స్నేహపూరిత వాతావరణం

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విభజన ఐదేండ్ల తర్వాత ఇరు రాష్ట్రాల మధ్య స్నేహపూరిత వాతావరణం నెలకొనటం ఆహ్వానించదగిన పరిణామం. హైదరాబాద్‌లోని ఏపీ భవనాల అప్పగింత మొదలు, నీళ్ల వాటా దాకా ఇరు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కూర్చొని చర్చలు జరుపుతున్నారు. దీంతో రెండు రాష్ట్రాల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇకముందు కూడా ఇలాంటి వాతావరణమే కొనసాగాలని ప్రజలు కోరుకుంటున్నారు. ఇద్దరు సీఎంలు ఆ దిశగానే ప్రయాణించాలి.

**-పి.సంపత్, రాములపల్లి, జగిత్యాల**

### మండుతున్న కూరగాయల ధరలు

నగరంలో కూరగాయల ధరలు మండిపోతున్నాయి. సామాన్య ప్రజలు కూరగాయలు కొనలేని పరిస్థితి ఏర్పడుతున్నది. వంద రూపాయలు పట్టుకొని మార్కెట్‌కు వెళ్తే కనీసం కిలో కూరగాయలు కూడా రావటం లేదని ప్రజలు వాపోతున్నారు. నగర శివారు ప్రాంతాల్లో కూరగాయల సాగును ప్రోత్సహించటమే కాదు, రాష్ట్రవ్యాప్తంగా కూడా కూరగాయల పంట సాగుకు తగిన ప్రోత్సాహం అందించాలి.

**- బుర్ర రాఘవేంద్ర గౌడ్, అంబర్‌పేట్, హైదరాబాద్**

ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా: 8-2-603/1/7.8.9. కృష్ణాపురం, రోడ్ నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

ముక్తసరి

**దేవులపల్లి ప్రభాకరరావు**

# బహుముఖ ప్రతిభా భాస్కరుడు

**పీవీ అత్యంత క్లిష్ట పరిస్థితిలో ప్రధాని బాధ్యతను చేపట్టడానికి 20 ఏండ్ల ముందు- అప్పటి ఏపీ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న సమయంలో-1971లో సీఎం పదవిని చేపట్టవలసి వచ్చింది. పీవీ 1951 నుంచి చివరిశ్వాస వరకు, విరామం లేకుండా అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ)లో సభ్యుడు. ఇది కూడా ఒక రికార్డు. విలువలను, సైద్ధాంతిక సారూప్యతను, ఏకీభావాన్ని గౌరవించిన పెద్దాయన పీవీ. కష్టాల్లో, నష్టాల్లో, సుఖాల్లో, దుఃఖాల్లో, అన్ని కాలాల్లో ఆయన తన మాతృ సంస్థకు అంకితమైనాడు.**

పెద్దాయన పీవీ (పాములపర్తి వెంకట నరసింహారావు మాజీ ప్రధాని) జయంతి నిన్న. ఆ కారణజన్ముడు జన్మించి నిన్నటికి 98 ఏండ్లు. మరో రెండేండ్లకు ఆయన శత జయంతి ఉత్సవాలు దేశమంతటా ఘనంగా జరుగుతాయనడంలో సందేహం లేదు. పీవీ అన్న రెండు అక్షరాలతో ఆయన ప్రపంచ ప్రసిద్ధుడు. హరి అను రెండక్షరాలతో పాతకాలు హరిస్తాయంటారు. పీవీ అన్న రెండక్షరాలు ఎన్నో జ్ఞాపకాలు, సమకాలిక చరిత్రకు సంబంధించినవి ఊటలుగా పొంగి రావడానికి కారణమౌతాయి. ఆయన నిజంగా కారణజన్ముడు. కొందరు అకారణజన్ములు ఎన్నో తంటాలు పడి, తిమ్మిని బమ్మి చేసి బమ్మిని తిమ్మి చేసి, విద్వేషపు విషం కక్కి, అసహనం చిచ్చుపెట్టి, బ్రిటిష్ పాలన రోజుల్లో పోలీస్‌స్టేషన్లలో కూర్చోబెట్టగానే క్షమార్పణ పత్రాలు రాసిచ్చి తర్వాత రాజులై ఊరేగినా స్వాతంత్ర్య సమరంలో సర్వత్యాగాలు చేసిన యోధులతో, ఉద్యమమే ఊపిరులైనవారితో సమానులు కాలేరు. కారణజన్ములు చరిత్ర నిర్మించడానికి అవతరించి సర్వదా స్మరణీయులవుతారు. పీవీ మహత్తర జీవితం అన్ని దశలలో బాల్యం నుంచి ఢిల్లీలో చివరి శ్వాస పీల్చే వరకుకారణజన్ముడు గానే కన్పిస్తాడు.

పీవీ బహుభాషా ప్రవీణుడే కాదు, బహుముఖ ప్రతిభా భాస్కరుడు. పసితనంలోనే ఆయన ప్రతిభా సౌరభాలు పరిమళించాయి. హనుమకొండలో విద్యార్థిగా పీవీ ఫుట్‌బాల్ ఆడుతుండగా రోజూ చూసేవాడినని ఆచార్య బిరుదరాజు రామరాజు తమ జ్ఞాపకాలలో రాశారు. తెలంగాణ తెలుగు వాఙ్మయానికి తన అక్షరశక్తితో పీవీ అందించిన అమూల్య కానుకలలో మొదట చెప్పవలసింది 'కాకతీయ' వారపత్రిక. పీవీ పాత్రికేయత సహస్ర దళాలతో, పలు ప్రయోగాలతో విప్పారింది కాకతీయ పత్రికలోనే. రాచరిక పాలన నుంచి హైదరాబాద్ సంస్థానం విముక్తి అనంతరం 1948లో వరంగల్ నగరం నుంచి ప్రచురితమైన 'కాకతీయ' తెలుగు వారపత్రిక ఇద్దరు సంపాదకులలో ఒకరైన పీవీ పలు ప్రజ్ఞల గురించి, విశేషించి గ్రంథ పఠనం, సృజనాత్మక రచనా ప్రావీణ్యం, క్రీడా రంగంలో ఆయన ఆసక్తి, సంగీతజ్ఞత, కళాభిజ్ఞత తదితర ప్రతిభా కిరణాల గురించి మరో సంపాదకుడు పాములపర్తి సదాశివరావు ఒక రచనలో వివరించారు. ఆ రచన పీవీ జీవన ప్రాశస్త్యానికి అమూల్య దర్పణం. పీవీ అనేక రంగాల్లో నిస్సందేహంగా పెద్దాయన అని చెప్పడానికి సదాశివరావు రచన నిశ్చయంగా ఉపకరిస్తుంది.

బాల్యం నుంచి, ముఖ్యంగా విద్యార్థి దశ నుంచి పీవీ వ్యక్తిగత ప్రగతిని పరికించిన వారెవరూ ఆయన రాజకీయ రణరంగంలో రాణిస్తాడని, భవిష్యత్తులో ఒకరోజు దేశానికి నాయకత్వం వహిస్తాడని ఊహించి ఉండరు. హనుమకొండ పాఠశాలలో గణితశాస్త్రంతో సహా అన్ని పాఠ్యాంశాలలో ప్రప్రథముడిగా, పలు భాషల కోవిదుడుగా నెగ్గుతున్న పీవీని బ్రిలియంట్ బాయ్ అనుకున్నారు, ఉత్తమ విద్యార్థిగా పరిగణించారు, మహా మేధావి కాబోతున్నాడని ఉగ్గడించారు. అంతకుమించిన దూరంలో ఆయన భాసించనున్నాడని, కల్మష కాసారంలో ఆయన కల్హారం వలె శోభిస్తాడని, ఆయన అందుకోబోతున్న ఎత్తు హిమాలయ శిఖరాన్ని అధిగమిస్తుందని ఎవరూ ఊహించలేదు. మొద టి నుంచి పీవీ ఎవరికీ అంతుపట్టని మౌనముని-వల్మీకంలేని వాల్మీకి ఆయన. పాఠశాల నాటి నుంచి కాళోజీ కవి సోదరులు (రామేశ్వరరావు, నారాయణరావు) పీవీకి సీనియర్లు. పాఠశాల చదువులో అపార శ్రద్ధాసక్తులు ప్రదర్శిస్తూ అద్వితీయుడుగా నిలిచినా పీవీ దేశభక్తి, సమాజ సేవారక్తి లేనివాడు కాడు. ఇప్పటి కొందరివలె ఆయన దేశభక్తి రొయ్యల దండను మెడలో వేసుకుని తిరుగలేదు. దేశభక్తి పేరిట దందాలు చేయలేదు.

విద్యార్థి దశలో, పీవీలో నిద్రాణమై ఉన్న దేశభక్తి 'వందేమాతరం' ఉద్యమం నాటికి ఉద్దీపించింది. వందేమాతరం ఉద్యమంలో (1937) పాల్గొని ఇంటర్మీడియెట్ క్లాసులను బహిష్కరించిన పీవీని ఆయన సహచరులను నిజాం ప్రభుత్వం, ఓయూ బహిష్కరణకు గురిచేశాయి. దేశభక్తి, స్వాతంత్ర్య, జాతీయ ఉద్యమాల ప్రభావం ఉప్పొంగి వచ్చినా పీవీ చదువుకు స్వస్తి పలుకలేదు. నాగపూర్ వెళ్లి పీవీ ఉన్నత విద్యార్జన కొనసాగించారు. ఉన్నత విద్యలో కూడా పీవీ స్వర్ణపతక విజేత. నాగ్‌పూర్ విశ్వవిద్యాలయం నుంచి ప్రథమశ్రేణిలో ఆయన కు ఎల్.ఎల్.బి. డిగ్రీతో పాటు, స్వర్ణ పతకం కూడా లభించింది. అంతకుముందే ఆయన పూనాలోని సుప్రసిద్ధ ఫెర్గూసన్ కళాశాలలో గణితం అభిమాన విషయంగా బీఎస్సీ డిగ్రీ పొందారు. అప్పటి బ్రిటిష్ ఇండియా బొంబై ప్రెసిడెన్సిలో కేవలం స్థానికుడు కాడన్న కారణంతో పీవీకి ఉన్నతమైన న్యాయమూర్తి పదవీ లభించలేదు. అది భవిష్యత్ భారతం అదృ ష్టం అనుకోవాలె.

పీవీ మహత్తర జీవితంలో అన్నీ విచిత్ర సంఘటనలు, పరిణామాలు, మలుపులు. 27 ఏండ్ల యువ ప్రాయంలో ఓరుగల్లు నుంచి 'కాకతీయ' తెలుగు వార పత్రికకు కంకణం కట్టి, అందులో స్వయంగా ఎన్నో వ్యాసాలు, విమర్శలు, కథలు, కవితలు రాసిన పీవీ పాత్రికేయత కే మిగిలి ఉంటే తెలుగు పత్రికారంగం సంపద్విలసితం అయ్యేది. సమా జ

**1991లో 10వ లోక్‌సభకు జరిగిన ఎన్నికల్లో మొత్తం 545 స్థానాల్లో భారత జాతీయ కాంగ్రెస్ (కాంగ్రెస్ పార్టీ) గెల్చింది 244 స్థానాలే. మిత్రపక్షాలతో కలిపితే కాం గ్రెస్ కూటమి స్థానాలు 252 మాత్రమే. మెజార్టీ లేకపోయినా పీవీ మైనారిటీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి ఐదేండ్లు సమర్థవంతంగా పరిపాలన నిర్వహించి ఆర్థిక సంస్కరణలను విజయవంతంగా అమలుజరిపారు. అందువల్లనే పీవీ నిశ్చయంగా పెద్దాయన.**

సంస్కరణకు, క్షాళనకు ఒక అస్త్రంగా ఎంతో ఉపయోగపడేది. కాని, పెద్దాయన జీవితంలో అది జరుగలేదు. అదొక విచిత్ర పరిణామం. 1939 లో, నాగ్‌పూర్ విద్యార్థిగా, త్రిపుర వెళ్లి భారత జాతీ య కాంగ్రెస్ మహాసభలో పాల్గొన్న పీవీకి దేశం పిలుపు వినిపించింది. ఉన్నతోద్యోగాలు, ఊర్జిత సంపాదనలు, ఉల్బణ ద్రవ్యరాశుల వైపు ఆయన మనసు మళ్లలేదు. నాగ్‌పూర్, పూనా నగరాల్లో విద్యార్థిగా చదువుపట్ల అమిత శ్రద్ధ చూపుతున్న, స్వర్ణ పతకాలను సాధిస్తున్న పీవీ అహోరాత్రులు మేధోమథనం చేస్తూ ప్రపంచ ప్రసిద్ధ వాఙ్మయ సంద్రాన్ని ఆపోశనం పట్టారు. ఆయన విజ్ఞాన పిపాసను తీర్చడానికి అప్పుడు అందుబాటు లో ఉన్న ప్రపంచ సారస్వతం సరిపోలేదు. అన్నింటిలో పెద్దాయన పీవీ నిండుకుండ-విపులు విశ్వవిజ్ఞానం మూర్తీభవించిన పెద్దకొండ. ఇవ్వాళ్టి డొల్లుకుండల సొల్లు గోలను వింటున్నప్పుడు ఆశ్చర్యం కలుగుతుంది. తెలంగాణ పల్లెపెద్దల ముతకబట్ట, జేబులున్న బనీను తొడిగి కూర్చున్న పీవీని చూసినప్పుడు ఈయనేనా ప్రపంచ ప్రసిద్ధుడైన మన తెలంగాణ బిడ్డ అని సంభ్రమాశ్చర్యాలతో స్టన్ అయేవాణ్ణి! ఆయన ఆలోచనలలో భాగస్వామి కాగలిగే అవకాశం లభించడం అదృష్టమే.

నేరుగా నాగ్‌పూర్ నుంచి హైదరాబాద్ వచ్చిన పీవీ ఒక దిగ్గజం మరో దిగ్గజం వద్దకు వెళ్లినట్లు అప్పటికే న్యాయవాదిగా, బహుభాషా పండితు డిగా, స్టేట్ కాంగ్రెస్ ప్రముఖుడిగా ప్రఖ్యాతి పొందిన బూర్గుల రామకృష్ణారావు వద్దకు వెళ్లి జూనియర్ లాయర్‌గా చేరారు. మరో విచిత్ర పరిణామం-హైదరాబాద్ సంస్థానం సరిహద్దుల్లో శిబిరాలు పెట్టి నిజాం పాలనకు వ్యతిరేకంగా పోరాడుతున్న కాంగ్రెస్ వాదులకు రహస్యంగా ఆయుధాలను సేకరించే బాధ్యతను, ప్రచార విభాగం విధులను పీవీకి అప్పగించారు. అక్షర ఆయుధ ప్రయోగ నిష్ణాతుడికి, అపర ద్రోణాచార్యునికి మర తుపాకుల మళ్లింపు బాధ్యతా! మరో విచిత్రం-మహా మనీషి బూర్గుల పట్ల పీవీకి అంతులేని గౌరవం. కానీ, రాజకీయ దృక్పథంలో విభేదించిన పీవీ స్టేట్ కాంగ్రెస్‌లో స్వామి రామానంద తీర్థ అనుయాయి. స్వామీజీయే తన రాజకీయ గురువు అని నమ్మినవాడు పీవీ. హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ అధ్యక్షుడు స్వామీజీ పీవీని ప్రధాన కార్యదర్శిగా నియమించారు. స్వామీజీకి సోషలిస్టు, అభ్యుదయవాది అన్న ప్రసిద్ధి వచ్చింది. పీవీ గురువును మించిన శిష్యుడు, సోషలిస్ట్, అభ్యుదయవాది.

పీవీ అత్యంత క్లిష్ట పరిస్థితిలో ప్రధాని బాధ్యతను చేపట్టడానికి 20 ఏండ్ల ముందు అప్పటి ఏపీ తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్న సమయంలో, 1971లో సీఎం పదవిని చేపట్టవలసి వచ్చింది. పీవీ. 1951 నుంచి చివరి శ్వాస వరకు, విరామం లేకుండా అఖిల భారత కాంగ్రెస్ కమిటీ (ఏఐసీసీ) లో సభ్యుడు. ఇది కూడా ఒక రికార్డు. ఆయన విలువలను, సైద్ధాంతిక సారూప్యతను, ఏకీభావాన్ని గౌరవించిన పెద్దాయన. కష్టాల్లో, నష్టాల్లో, సుఖాల్లో, దుఃఖాల్లో, అన్ని కాలాల్లో ఆయన తన మాతృసంస్థకు అంకితమైనాడు. 1991 మే నెల 21న రాజీవ్ గాంధీ మృతి తర్వాత 8 రోజులకే మే 29న పీవీ మొదట జాతీయ కాంగ్రెస్ అధ్యక్ష పదవీ గురుతర బాధ్యతను స్వీకరించవలసి వచ్చింది. అమెరికాలో బైపాస్ సర్జరీ అనంతరం హైదరాబాద్‌లో గ్రంథ పఠనం, రచనతో కొంత విశ్రాంత జీవితం గడుపాలనుకున్న పీవీకి అది సాధ్యం కాలేదు. తన ఆరోగ్యం, విశ్రాంతి కంటే దేశం పిలుపు, దేశం శ్రేయస్సు, పార్టీ ఆదేశం అతి ముఖ్యమని పీవీ భావించారు. 70 ఏండ్ల వయస్సులో పీవీ 1991 జూన్ 21న స్వతంత్ర భారత లౌకిక గణతంత్ర 13వ ప్రధానిగా ప్రమాణ స్వీకారం చేశారు.

'కొరకండి, నరకండి' క్షుద్ర నినాదంతో రాజ్యం చేస్తున్నవాళ్లకు భిన్నంగా పీవీ ఆధ్యాత్మిక భావ సాగరుడు. తితిదే ప్రచురించి న 'ఋగ్వేదసంహిత'కు పీవీ ఉత్కృష్ట పీఠికను రచించి పెద్దాయనగా భాసించాడు. పీవీ అన్నారు 'చరిత్ర తొలి క్షణాలనుంచే భారత సమాజం నిగ్రహ స్ఫూర్తికి ప్రసిద్ధి పొందింది. ప్రపంచంలో ఎక్కడాలేని స్ఫూర్తి ఇది. మనం సెక్యులర్ రాజ్యాంగాన్ని రూపొందించుకున్నాం. మతతత్వం అతి ప్రమాదకరమైన విష క్రిమి..' ఈ రోజు భారత ప్రజలకు శిరోధార్యం కావలసిన పవి త్ర వాణి ఇది. దేశాన్ని ముక్కలు చేసే తత్వం కాదు పీవీది. 1991లో 10వ లోక్‌సభకు జరిగిన ఎన్నికల్లో మొత్తం 545 స్థానాల్లో భారత జాతీయ కాం గ్రెస్ (కాంగ్రెస్ పార్టీ) గెల్చింది 244 స్థానాలే. మిత్రపక్షాలతో కలిపితే కాం గ్రెస్ కూటమి స్థానాలు 252 మాత్రమే. మెజార్టీ లేకపోయినా పీవీ మైనారిటీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసి ఐదేండ్లు సమర్థవంతంగా పరిపాలన నిర్వహించి ఆర్థిక సంస్కరణలను విజయవంతంగా అమలుజరిపారు. అందువల్లనే పీవీ నిశ్చయంగా పెద్దాయన. ఇదేమాట 1994లో పీవీ అమెరికా వెళ్లినప్పుడు అప్పటి అధ్యక్షుడు బిల్ క్లింటన్ ఈ మాటల్లో వివరించారు.. "Mr.Narasimha Rao stru-ck me as a leader of great wisdo-m and experience...".

# నీటికరువు చెబుతున్న నిజాలు

విశ్లేషణ

**ఐజే అహ్లూవాలియా**

ఈ మధ్య ఎక్కడచూసినా ప్రధానంగా నగరాల్లో నీటి సమస్య కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నది. తమిళనాడులోని చెన్నై నగరంలో నీటి కరువు సమస్య ఎంత తీవ్రరూ పం దాల్చిందో పత్రికల్లో పతాకశీర్షికల్లో చూస్తున్నాం. చెన్నైలో ఒక గ్రాం బంగారం కన్నా ఒక ట్యాంకర్ నీటిధర ఎక్కువగా ఉన్నది. ఈ నేపథ్యంలోంచే చెన్నైలో నీరుకన్నా బంగారం చౌక అన్నది ప్రచారంలోకి వచ్చింది. ఈ క్రమంలోనే.. రాంచీలో కూడా నీటి కటకటకు సంబంధించి మీడియాలో ఎన్నో కథనాలు వచ్చాయి. మధ్యప్రదేశ్‌లోని చాలా పట్టణాలు, నగరాల్లో నీటికోసం దాడులు, కత్తులతో పొడుచుకోవటాలు, హత్యలు జరిగాయి. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వం నీటి ట్యాంకర్లు, నీటి నిలువ ఉండే చెరువులు, నదుల చుట్టూ పోలీసు కాపాలా పెట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. దేశంలో పరిస్థితి ఇలా ఉంటే దక్షిణాఫ్రికా కేప్‌టౌన్ నగరంలో నీటికరువు తీవ్రరూపం దాల్చి ఆధునిక చరిత్రలోనే ప్రత్యేక పరిస్థితిగా ప్రచారంలోకి వచ్చింది. ఈ నీటి కరువు గురించి బీబీసీ కూడా ప్రత్యేక కథనాన్ని ప్రసారం చేసింది. ప్రపంచవ్యాప్తంగా తీవ్ర నీటిఎద్దడిని ఎదుర్కొంటున్న నగరాల్లో మన దేశంలోని బెంగళూరు కూడా ఉన్నది.

ప్లానింగ్ కమిషన్ 2009

వేములవాడ శ్రీ పార్వతీ రాజరాజేశ్వరస్వామి వారి ఆలయం శుక్రవారం భక్తులతో రద్దీగా కనిపించింది. భక్తులు ధర్మగుండంలో స్నానాలు ఆచరించి కోడెమొక్కు తీర్చుకున్నారు. దాదాపు 6 వేల మంది భక్తులు దర్శించుకున్నారని, ఆర్జితసేవల ద్వారా రాజన్నకు సుమారు రూ.5 లక్షల ఆదాయం సమకూరినట్టు ఆలయ అధికారులు వెల్లడించారు.
- వేములవాడ కల్చరల్

# స్వగ్రామానికి గల్ఫ్ బాధితుడు

## టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చొరవ ఫలితం

**తిమ్మాపూర్, నమస్తే తెలంగాణ:** సౌదీలో ఇబ్బందులు పడుతున్న కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మక్తపల్లికి చెందిన పాలేటి వీరయ్య టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చొరవతో స్వదేశానికి చేరుకున్నాడు. మక్తపల్లికి చెందిన వీరయ్య 2017లో ఉపాధి కోసం సౌదీకి వెళ్లి అక్కడ ఒంటెల కాపరిగా కుదిరాడు. యజమాని వీరయ్యను వేధించాడు. అతడి దగ్గరున్న ఆధారాలు లాక్కొని చిత్రహింసలకు గురిచేశాడు. వీరయ్య సౌదీలో అనుభవిస్తున్న నరకయాతనను గత నెలలో సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేయడంతో వైరల్‌గా మారింది. దీనికి స్పందించిన కేటీఆర్ మాజీ విదేశాంగ మంత్రి సుష్మాస్వరాజ్ సహకారంతో సౌదీ ఎంబసీతో మాట్లాడి వీరయ్యను స్వదేశానికి తీసుకొచ్చారు. రెండ్రోజుల క్రితం వీరయ్యను భారత ఎంబసీ ద్వారా తత్కాల్ పాస్‌పోర్ట్‌పై టికెట్ ఇప్పించి ముంబైకి తీసుకొచ్చారు. వీరయ్యను అతడి కుటుంబ సభ్యులు శుక్రవారం ఉదయం ముంబై నుంచి జగిత్యాలకు తీసుకువచ్చారు. అతడు ఇంటికి చేరుకోగానే కుటుంబ సభ్యులు, బంధువులు భావోద్వేగానికి లోనయ్యారు. తల్లి చనిపోతే చివరి చూపునకు కూడా పంపించలేదనీ, ఆమె ఫొటో పట్టుకుని వీరయ్య రోదించిన తీరు కంటతడి పెట్టించింది.

తల్లి చిత్రపటం పట్టుకుని రోదిస్తున్న వీరయ్య

## ట్రిపుల్ ఐటీ
## రెండో ప్రవేశ జాబితా విడుదల

**బాసర:** బాసర ట్రిపుల్ఐటీ కళాశాలలో 2019-20 విద్యాసంవత్సరానికి గాను 1404 సీట్ల భర్తీకి విద్యార్థుల ఎంపిక జాబితాను ఈనెల 15న విడుదల చేసిన విషయం తెలిసిందే. కౌన్సెలింగ్‌కు 81 మంది విద్యార్థులు హాజరుకాకపోవడంతో వీరి స్థానంలో ప్రవేశం సాధించిన విద్యార్థుల రెండో జాబితాను వీసీ అశోక్‌కుమార్ శుక్రవారం బాసర ట్రిపుల్ ఐటీలో విడుదల చేశారు. వీరు జూలై 3న, గ్లోబల్ సీట్లకు ఎంపికైన వారికి 4న కౌన్సెలింగ్ నిర్వహిస్తామని వీసీ తెలిపారు.

# గర్వపడుతున్నా..

## సిరిసిల్లలో తొలి ఎకో ఫ్రెండ్లీ వీధి దుకాణాల ఏర్పాటుపై కేటీఆర్ ట్వీట్

**సిరిసిల్ల, నమస్తే తెలంగాణ:** తొలిసారిగా ఎకో ఫ్రెండ్లీ వీధి దుకాణాలు రాజన్న సిరిసిల్లలో ఏర్పాటు కావడంపై గర్వపడుతున్నానని సిరిసిల్ల ఎమ్మెల్యే, టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ట్విట్టర్ ద్వారా పేర్కొన్నారు. వివరాలు ఇలా.. దేశంలోనే తొలి ఎకో ఫ్రెండ్లీ పట్టణ వీధి దుకాణాలు సిరిసిల్లలో ఏర్పాటయ్యాయని డెటాల్, ఎన్డీటీవీ సంయుక్తంగా 'బనేగా స్వచ్ఛ ఇండియా' పేరుతో నిర్వహిస్తున్న ట్విట్టర్ ఖాతాలో శుక్రవారం ట్వీట్ చేయగా.. సదరు ట్వీట్‌ను చూసిన సిరిసిల్ల ఎమ్మెల్యే కేటీఆర్.. దేశంలోనే తొలి ఎకో ఫ్రెండ్లీ పట్టణ వీధి దుకాణాలను తాను ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గంలో ఏర్పాటు కావడం గర్వపడుతున్నానని రీ-ట్వీట్ చేశారు.

నిజామాబాద్ జిల్లా వర్ని మండలం జాకోరా గ్రామంలో ఫంక్షన్‌హాల్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి

# గ్రామాలన్నీ మెరవాలి

## అన్ని పంచాయతీలకు భవనాలు నిర్మించాలి ▪ ప్రతీ గ్రామంలో శ్మశానం ఉండాలి: మంత్రి ఎర్రబెల్లి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రవ్యాప్తంగా అన్ని గ్రామపంచాయతీల పరిధిలో మౌలిక వసతులు మెరుగుపర్చాలని, పూర్తి పారిశుద్ధ్య నిర్వహణతో గ్రామాలు మెరవాలని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖల మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు చెప్పారు. రాష్ట్రంలోని అన్ని పంచాయతీలకు కార్యాలయాలు నిర్మించాలని, సీసీ రోడ్ల నిర్మాణం, మరమ్మతు పనులు చేపట్టాలని, ప్రతీ గ్రామంలో శ్మశాన వాటిక కచ్చితంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉపాధిహామీ, మిషన్ భగీరథ, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్, ఉపాధి కల్పన-మార్కెటింగ్ విభాగాల అధికారులతో మంత్రి శుక్రవారం సచివాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఉపాధి హామీ నిధుల వినియోగంలో పకడ్బందీగా వ్యవహరించాలని, ఆఖరు నిమిషంలో హడావుడి చేయకుండా ఇప్పటినుంచే పనులు చేస్తే ఉపాధి నిధులు ఎక్కువ మొత్తంలో అందివస్తాయని తెలిపారు. ఉపాధి హామీ పథకంలో చేపట్టే పనులపై కొత్త సర్పంచ్‌లకు అవగాహన కల్పించాలని సూచించారు. 2019-20 ఉపాధి హామీ పథకం కింద మెటీరియల్ కాంపొండ్ రూపంలో రూ.1,200 కోట్లు ఈ ఏడాది రాష్ట్రానికి అందే అవకాశాలు ఉన్నాయని అధికారులు వివరించారు. మిషన్ భగీరథ పనులను ఎట్టి పరిస్థితుల్లో జూలై 15 వరకు పూర్తిచేయాలని మంత్రి ఆదేశించారు.

**నిరుద్యోగులకు ఉపాధి**

నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని మంత్రి ఎర్రబెల్లి అధికారులను ఆదేశించారు. ప్రస్తుత ఏడాదిలో 90 వేల మందికి ఉపాధి కల్పించాలని లక్ష్యంగా పెట్టుకొన్నామని, అవసరమైతే ఇంకా ఎక్కువ మందికి ఉపాధి అవకాశం కల్పించాలని సూచించారు. ఇందుకోసం నిరుద్యోగ యువత వివరాలు సేకరించాలని, శిక్షణ పొందినవారికి ఉద్యోగావకాశాలు కల్పించడంపై దృష్టిపెట్టాలని ఉపాధి కల్పన, మార్కెటింగ్ మిషన్ అధికారులను మంత్రి ఆదేశించారు.

**గౌరవ వేతనం విడుదల చేసిన సీఎం కేసీఆర్‌కు ఎమ్మెల్సీల ధన్యవాదాలు..**

ఎంపీటీసీ, జెడ్పీటీసీ సభ్యుల గౌరవవేతనం నిధులను విడుదలచేసిన సీఎం కేసీఆర్‌కు పలువురు ఎమ్మెల్సీలు ధన్యవాదాలు తెలిపారు. ఎమ్మెల్సీలు పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, కసిరెడ్డి నారాయణరెడ్డి, పురాణం సతీశ్ శుక్రవారం హైదరాబాద్‌లో మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావును కలిసి పుష్పగుచ్ఛం అందజేసి ధన్యవాదాలు తెలిపారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీలకు సంబంధించిన గౌరవవేతనాలను ప్రభుత్వం రెండ్రోజుల క్రితం విడుదల చేసిన విషయం తెలిసిందే.

శుక్రవారం సచివాలయంలో ఉపాధి హామీ, మిషన్ భగీరథ, పంచాయతీ రాజ్ అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

## రంగారెడ్డి జెడ్పీలోకి పంచాయతీరాజ్ కార్యాలయం!

**రంగారెడ్డి జిల్లా, నమస్తే తెలంగాణ:** పంచాయతీరాజ్ శాఖ ప్రధాన కార్యాలయాన్ని ఖైరతాబాద్‌లోని రంగారెడ్డి జిల్లా పరిషత్ కార్యాలయంలోకి తరలించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ప్రస్తుతమున్న సచివాలయ భవనాలను కూల్చివేసి కొత్త సచివాలయాన్ని నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినందున పాత సచివాలయంలోని పంచాయతీరాజ్ కార్యాలయాన్ని తరలించనున్నారు. ఈ నేపథ్యంలో పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు శుక్రవారం ఉదయం రంగారెడ్డి జెడ్పీ కార్యాలయాలన్ని సందర్శించారు. ఆయనకు జెడ్పీ సీఈవో జితేందర్‌రెడ్డి స్వాగతం పలికారు. రంగారెడ్డి జెడ్పీ కార్యాలయంలో కొత్తగా నిర్మించిన భవనాన్ని, గదులను పరిశీలించిన మంత్రి.. ఆ భవనంలో మార్పులు, చేర్పులు చేయాలని ఆదేశించారు. పంచాయతీరాజ్ ప్రధాన కార్యాలయాన్ని నెల రోజుల్లోగా ఇక్కడికి తరలించేందుకు ఉన్నతాధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

## కుప్పకూలిన గ్లైడర్

### ప్రాణాలతో బయటపడ్డ ఇద్దరు

**ములుగు:** సిద్దిపేట జిల్లా ములుగు మండలం మామిడ్యాల గ్రామంలో గురువారం సాయంత్రం సాంకేతిక లోపంతో గ్లైడర్ కుప్పకూలింది. ప్రైవేట్ వ్యక్తులకు చెందిన గ్లైడర్ (చాపర్ కంటే తక్కువ సామర్థ్యం కలది)లో హైదరాబాద్ వాసి రాందేవర్, బెంగళూర్‌కు చెందిన అర్చిత్ మామిడ్యాల శివారులో విహరిస్తుండగా కుప్పకూలింది. గాయపడ్డ వారిని గజ్వేల్ దవాఖానలో చేర్పించారు. మెరుగైన చికిత్స కోసం శుక్రవారం హైదరాబాద్ తరలించారు.

## రెండు వేల నోట్లు రెట్టింపు చేస్తామంటూ మోసం

**చౌటుప్పల్, నమస్తే తెలంగాణ:** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ మండలం ఖైతాపురంలో రెండు వేల నోట్లను రెట్టింపు చేస్తామంటూ ఓ ముఠా మోసానికి పాల్పడింది. ఏపీలోని ప్రకాశం, గుంటూరు జిల్లాలకు చెందిన షేక్ బాషా, షేక్ చిన్నవలి, షేక్ సైదాలు ముఠాగా ఏర్పడి ఖైతాపురం వాసి గోపి ఐలయ్యను నమ్మించి రూ.12 లక్షలతో ఉడాయించారు. బాధితుని ఫిర్యాదు మేరకు పోలీసులు రంగంలోకి దిగారు. గురువారం రాత్రి వలిగొండ క్రాస్ రోడ్డు వద్ద షేక్ సైదాను అరెస్ట్ చేసి రూ.12లక్షలు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు పంపారు.

## కోటి ఎకరాలకు నీరివ్వడమే ప్రభుత్వ లక్ష్యం

### స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి

**వర్ని:** కోటి ఎకరాలకు సాగునీరందించి బీడు భూములను సాగులోకి తేవడమే ప్రభుత్వ లక్ష్యమని స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లా వర్ని మండలం జాకోరలో రూ.25 లక్షలతో నిర్మించనున్న ఫంక్షన్‌హాల్‌కు శుక్రవారం ఆయన భూమి పూజ చేశారు. రూ.17 లక్షలతో నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ .. ప్రజల అవసరాలు గుర్తించిన వారే నిజమైన నాయకులని, వారి అవసరాలను తీర్చినప్పుడే అది నిజమైన ప్రభుత్వం అవుతుందన్నారు. ఆగస్టులో కాళేశ్వరం నీరు ఎస్సారెస్పీలోకి రానున్నాయని వెల్లడించారు. శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి అలీసాగర్‌ను నింపి, ఎత్తుపెంచి రివర్స్ వాటర్ ద్వారా సాగుకు నీరందించనున్నట్టు తెలిపారు. అనంతరం పలువురు లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ హరిదాస్ పాల్గొన్నారు.

## స్వరాష్ట్రంలో శరవేగంగా అభివృద్ధి

▪ విద్యాశాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి

**ఆత్మకూర్ ఎస్ :** స్వరాష్ట్రంలో శరవేగంగా అభివృద్ధి సాగుతున్నదని విద్యాశాఖమంత్రి జగదీశ్‌రెడ్డి పేర్కొన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం వల్లే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని చెప్పారు. శుక్రవారం సూర్యాపేట జిల్లా ఆత్మకూర్ ఎస్ మండలం పాతర్లపహాడ్‌లో రాజ్యాంగనిర్మాత అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం రూ.1.10కోట్లతో నిర్మించిన 33/11కేవీ విద్యుత్ ఉపకేంద్రం ప్రారంభించారు. ఎస్సీ సబ్‌ప్లాన్ కింద మంజూరైన రూ.25 లక్షలతో సీసీ రోడ్లకు, రూ.25 లక్షల వ్యయంతో నిర్మించిన కమ్యూనిటీహాల్‌కు, రూ.5లక్షల వ్యయంతో చేపట్టిన ఖబ్రస్థాన్ ప్రహరీకి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఉమ్మడి పాలకులు తెలంగాణను సర్వనాశనం చేశారని ఆరోపించారు. ఆంధ్రాపార్టీలు ఇంకా కొనసాగితే ఈ ఊరిలో సబ్‌స్టేషన్ ఉండేది కాదని.. సీసీ రోడ్లు వచ్చేవి కాదని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ రాష్ట్రంలో సబ్బండవర్గాలకు సంక్షేమపథకాలు అందిస్తూ ఆదర్శన పాలన కొనసాగిస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

సూర్యాపేట జిల్లా పాతర్లపాడులో సబ్‌స్టేషన్ ప్రారంభిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

## భార్యాబిడ్డలకు విషం కలిపిన బిర్యానీ పెట్టి

# భర్త ఆత్మహత్య

▪ ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి
▪ ఖమ్మం నగరంలో విషాదం

**రఘునాథపాలెం:** భార్యాభర్తల మధ్య మనస్పర్థలు కుటుంబాన్నే బలితీసుకున్నాయి. భార్యాబిడ్డలకు బిర్యానీలో విషంకలిపి తినిపించి ఆపై తానూ తిని ఆత్మహత్య చేసుకోవడంతో నలుగురూ మృతిచెందారు. ఈ ఘటన ఖమ్మంలో శుక్రవారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా ముదిగొండ మండలం వల్లభి గ్రామానికి చెందిన కోయ రాంప్రసాద్(43) ప్రైవేటు కళాశాలలో లెక్చరర్‌గా పని చేస్తుండేవాడు. 1996లో రాంప్రసాద్‌కు ముదిగొండ మండలం బాణాపురానికి చెందిన మేనమరదలు సుచిత్ర(38)తో వివాహమైంది. వీరికి రుచిత(13), జాహ్నవి(9) సంతానం. ఐదేండ్ల క్రితం ఖమ్మం నగరం శ్రీరాంనగర్ కాలనీలోని న్యూడీఎంకే రెసిడెన్స్‌లో ఓ ఫ్లాటు కొనుక్కొని అందులో నివాసం ఉంటున్నారు. ఏడాది క్రితం రాంప్రసాద్ లెక్చరర్ ఉద్యోగాన్ని వదిలేసి ముదిగొండలోని బంధువులకు చెందిన గ్రానైట్‌లో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నాడు. గ్రానైట్ పేరుతో కాలయాపన చేస్తున్నాడనే విషయంలో భార్యాభర్తల మధ్య మనస్పర్థలు ఏర్పడినట్టు సమాచారం. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెందిన రాంప్రసాద్ గురువారం రాత్రి బిర్యానీలో పురుగుల మందు కలిపి భార్యాకుమార్తెలకు అందించాడు. బిర్యానీ తిన్న కాసేపటికే తల్లీబిడ్డలు ముగ్గురు బెడ్‌రూంలో నిద్రించారు. విషమిచ్చిన బిర్యానీ తిన్నారని గ్రహించుకున్న రాంప్రసాద్ తానూ అదే బిర్యానీ తిని మరో బెడ్రూంలో పడుకున్నాడు. శుక్రవారం ఉదయం ముదిగొండ మండలంలో ఉండే రాం ప్రసాద్ తండ్రి వెంకయ్య ఓ శుభకార్యానికి హాజరయ్యేందుకు ఖమ్మం వచ్చాడు. కొడుకు రాంప్రసాద్‌కు ఫోన్ ఎత్తకపోవడంతో తన మేనల్లుడైన వెంకటరమణ, మరో ఇద్దరిని తీసుకొని రాంప్రసాద్ ఇంటికి వచ్చాడు. లోపల గడియపెట్టి ఉండటాన్ని గమనించి గట్టిగా తలుపులు కొట్టారు. తీయకపోవడంతో బెడ్‌రూం కిటికీ తలుపు తీసి చూడగా.. కోడలు, పిల్లలు అచేతనంగా పడి ఉండటాన్ని గమనించి.. తలుపులను పగులకొట్టి చూడగా కొడుకు, కోడలు, పిల్లలు విగతజీవులుగా కన్పించారు. ఒకే కుటుంబానికి చెందిన నలుగురూ మృతిచెందడంతో కుటుంబ సభ్యులు రోదిస్తున్న తీరు పలువురిని కంటతడి పెట్టించింది. సమాచార మందుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని దర్యాప్తు జరుపుతున్నారు.

రాంప్రసాద్ కుటుంబ సభ్యులు (ఫైల్)

## జూలై ఒకటిన తెరుచుకోనున్న బాబ్లీ గేట్లు

**కమ్మర్‌పల్లి, నమస్తే తెలంగాణ:** ఎస్సారెస్పీ ఎగువన గోదావరి నదిలో మహారాష్ట్ర సర్కారు నిర్మించిన బాబ్లీప్రాజెక్టు గేట్లను జూలై ఒకటిన ఎత్తనున్నారు. గోదావరిలో ఎస్సారెస్పీ గర్భంలోనే బాబ్లీ ప్రాజెక్టును నిర్మించారని, దీంతో ఎస్సారెస్పీ నీటిలభ్యతకు ఆటంకం కలుగుతుందని ఉమ్మడి రాష్ట్రప్రభుత్వం అప్పట్లో సుప్రీం కోర్టు ను ఆశ్రయించింది. దీంతో బాబ్లీ ప్రాజెక్టు మొత్తం గేట్లను ఏటా జూలై 1నుంచి అక్టోబర్ 28 వరకు సాగునీటి అవసరాలకు, మార్చి ఒకటిన తాగునీటి అవసరాల కోసం 0.5 టీఎంసీల నీటిని దిగువకు వదలాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఈ ఆదేశాల అమలులో భాగంగా జూలై 1న ప్రాజెక్టు 14 గేట్లను ఎత్తనున్నారు. ఎస్సారెస్పీ, బాబ్లీ ప్రాజెక్టు, కేంద్ర జలసంఘం అధికారులు గేట్ల ఎత్తే ప్రక్రియ నిర్వహిస్తారు. కాగా బాబ్లీలో ప్రస్తుతం నీరు లేక వెలవెలబోతున్నది.

# మొదలైన టీఆర్ఎస్ సభ్యత్వ నమోదు

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:** పలు జిల్లాల్లో శుక్రవారం టీఆర్ఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం ప్రారంభమైంది. నాయకులు, కార్యకర్తలు సభ్యత్వాలు తీసుకోవడానికి ఆసక్తి చూపుతున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలోని ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ నివాసం వద్ద సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. నాగర్‌కర్నూల్ జెడ్పీ వైస్ చైర్మన్ బాలాజీ సింగ్, టీఆర్ఎస్ నాయకులు ఎడ్మ సత్యం, జెడ్పీటీసీ భరత్‌లకు పార్టీ క్రియాశీల సభ్యత్వాలను ఎంపీ రాములు, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ అందించారు. నారాయణపేట జిల్లా కోస్గి, మద్దూర్ మండలాల్లో కొడంగల్ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి సభ్యత్వ నమోదును ప్రారంభించారు. వికారాబాద్ జిల్లా పరిగిలో టీఆర్ఎస్ సభ్యత్వ నమోదును ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి ప్రారంభించారు. వరంగల్ పశ్చిమ నియోజకవర్గ సభ్యత్వ నమోదు కార్యక్రమం హన్మకొండలో జరిగింది. ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ ప్రారంభించి పలువురికి సభ్యత్వాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కుడా చైర్మన్ మర్రి యాదవ రెడ్డి, డిప్యూటీ మేయర్ సిరాజోద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తిలో టీఆర్ఎస్ పార్టీ సభ్యత్వాలను అందజేస్తున్న ఎంపీ రాములు, ఎమ్మెల్యే జైపాల్ యాదవ్

వరంగల్ అర్బన్‌జిల్లా హన్మకొండలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే దాస్యం వినయ్‌భాస్కర్ చేతుల మీదుగా సభ్యత్వం తీసుకుంటున్న నాయకులు

రాజస్థాన్‌లోని అజ్మీర్‌దర్గాలో మాజీ మంత్రి, జడ్చర్ల ఎమ్మెల్యే డాక్టర్ సీ లక్ష్మారెడ్డి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రాష్ట్రం బంగారు తెలంగాణ కావాలని.. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని.. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పథకం సాధ్యమైనంత త్వరగా పూర్తవ్వాలని మొక్కుకున్నట్టు తెలిపారు. సీఎం కేసీఆర్ ఆయురారోగ్యాలతో జీవించాలని కోరుకుంటూ ప్రత్యేకంగా చాదర్ సమర్పించారు. లక్ష్మారెడ్డి వెంట సంగీత నాటక రంగ అకాడమీ చైర్మన్ బాత్మి శివకుమార్, మరో 100 మంది కార్యకర్తల వెళ్లారు.
- మహబూబ్‌నగర్ నమస్తే తెలంగాణ ప్రధాన ప్రతినిధి

దివంగత మాజీ ప్రధాని పీవీ నర్సింహారావు జయంతి సందర్భంగా శుక్రవారం మాజీ డిప్యూటీ సీఎం కడియం శ్రీహరి, ఎమ్మెల్యేలు వొడితెల సతీశ్‌కుమార్, దాస్యం వినయ్‌భాస్కర్, జెడ్పీ చైర్మన్ సుధీర్‌కుమార్ తదితరులు వరంగల్ అర్బన్ జిల్లా హన్మకొండ బస్టాండ్ సమీపంలోని పీవీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. - రెడ్డికాలనీ(వరంగల్)

## చెన్నైలో నల్లగొండ వాసి హత్య

**మిర్యాలగూడ రూరల్:** చెన్నైలో నల్లగొండ వాసి దారుణహత్యకు గురయ్యాడు. ఈ నెల 26 హత్య జరుగగా ఆలస్యంగా వెలుగు చూసింది. కుటుంబసభ్యుల కథనం ప్రకారం.. నల్లగొండ జిల్లా మిర్యాలగూడ మండలం తడకమళ్లకు చెందిన శ్రవణ్(20) చెన్నైలో అమిత్ర హోటల్ మేనేజ్‌మెంట్ కళాశాలలో ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. తనతోపాటే చదివే యువతితో శ్రవణ్ స్నేహంగా ఉండటాన్ని జీర్ణించుకోలేని తోటి స్నేహితుడు షణ్ముకం ఈనెల 26న కళాశాల ఆవరణలో శ్రవణ్‌ను కత్తితో పొడిచి హతమార్చి పోలీసులకు లొంగిపోయాడు.

శ్రవణ్ (ఫైల్)

# నకిలీ విత్తనాలపై ఉక్కుపాదం

## 68 క్వింటాళ్ల నకిలీ మక్కజొన్న విత్తనాలు స్వాధీనం

**శంకరపట్నం/నర్సంపేట, నమస్తేతెలంగాణ:** నకిలీ విత్తనాలపై అధికారులు, పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. వరంగల్ రూరల్ జిల్లాలోని నర్సంపేట, కరీంనగర్ జిల్లాలోని శంకరపట్నంలో దాడులు నిర్వహించి సుమారు 68 క్వింటాళ్ల మక్కజొన్న విత్తనాలు స్వాధీనం చేసుకున్నారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఉదయం నర్సంపేట్ నుంచి కొత్తగూడెం వైపు ప్రధానరహదారిపై తొమ్మిది ఆటోట్రాలీల్లో 35 క్వింటాళ్ల మక్కజొన్న విత్తనాలు తరలిస్తుండ గా అధికారులు పట్టుకున్నారు. విత్తనాలు తీసుకువెళ్తున్న రైతులను విచారించగా కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం చింతగుట్టకు చెందిన సదాశివరెడ్డి అనే వ్యక్తి విక్రయించినట్లు తెలిపారు. అక్కడి నుంచి చింతగుట్టకు వెళ్లి సదాశివారెడ్డి ఇంట్లో సోదాలు చేయగా, దాదాపు 33 క్వింటాళ్ల నకిలీ మక్కజొన్న విత్తనాలు లభ్యమైనట్లు చెప్పారు. సదాశివరెడ్డిని అదుపులోకి తీసుకొని మొత్తం విత్తనాలను స్వాధీనం చేసుకుని నర్సంపేట్ తరలిస్తున్నట్టు తెలిపారు.

శంకరపట్నం మండలం చింతగుట్టలో నకిలీ విత్తనాలను స్వాధీనం చేసుకుంటున్న అధికారులు

# బూరుగుపల్లిలో భారీ మోసం

## ఫైనాన్స్ సంస్థ పేరిట రూ.2 కోట్లు వసూలు

### సంస్థ బోర్డు తిప్పేసినా వాయిదాలు కట్టించుకున్న ఏజెంట్లు

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:** 2016లో బోర్డు తిప్పేసిన ఓ ఫైనాన్స్ సంస్థ తరపున ఏజెంట్లు డబ్బులు వసూలు చేసిన ఘటన వికారాబాద్ జిల్లా బూరుగుపల్లిలో చోటుచేసుకున్నది. 2015లో సమృద్ధి జీవన్ మల్టీ స్టేట్ మల్టీపర్పస్ కోఆపరేటివ్ సొసైటీకి చెందిన ఏజెంట్లు సంజీవ్‌రెడ్డి, స్వప్న బూరుగుపల్లి గ్రామస్థుల నుంచి నెలకు రూ.500 చెల్లిస్తే 50నెలలకు రూ.50వేలు, నెలకు రూ.1000 చెల్లిస్తే ఐదేండ్లకు రూ.1.20లక్షలు చెల్లిస్తామని, రూ.25 వేలు ఎఫ్‌డీ చేస్తే ఐదేండ్లకు రూ.5 లక్షలు చెల్లిస్తామంటూ నమ్మించారు. గ్రామస్థుల నుంచి సుమారు రూ.2 కోట్లు వసూలు చేశారు. ఏజెంట్లు సంజీవ్‌రెడ్డి, స్వప్న బూరుగుపల్లి వారే కావడంతో గ్రామస్థులు వారిని నమ్మి డబ్బుకట్టారు. 2016లోనే సమృద్ధి జీవన్ మల్టీ స్టేట్ మల్టీ పర్పస్ కోఆపరేటివ్ సొసైటీ సంస్థ బోర్డు తిప్పేయగా ఏజెంట్లు మాత్రం ఈ విషయాన్ని స్థానికులకు తెలియనివ్వకుండా జాగ్రత్తపడి డబ్బులు వసూలు చేస్తూ వచ్చారు. తాము కట్టిన డబ్బు తిరిగి రాకపోవడంతో గ్రామస్థులు ఇటీవల పోలీసులకు ఫిర్యాదు చేశారు. బోర్డు తిప్పేసిన సంస్థ తరపున జనం నుంచి డబ్బులు వసూలు చేసినట్టు పోలీసుల విచారణలో తేలింది. దేశవ్యాప్తంగా 24 రాష్ట్రాల్లో ఈ సంస్థ మోసానికి పాల్పడినట్టు 2016లో వెలుగులోకి రాగా సదరు నిర్వాహకులు జైలు జీవితం గడుపుతుండగా.. ఏజెంట్లు మరో రకంగా మోసానికి పాల్పడ్డారు.

TS RTC
టెండరు ప్రకటన
No.01/CCE/2019-20, Dt:24-06-2019
బస్‌స్టేషన్లలో సివిల్ పనులు మరియు బస్ డిపోలో విద్యుదీకరణ పనుల కొరకు ఆన్‌లైన్ ద్వారా టెండర్లను ఆహ్వానిస్తున్నాము. పూర్తి టెండరు ప్రకటన కొరకు "http://www.tsrtc.telangana.gov.in (Tenders)"దర్శించండి. ఆన్‌లైన్‌లో పాల్గొనుటకు "https://tender.telangana.gov.in", ఇతర వివరాల కొరకు సంప్రదించండి. ఫోన్ నెం: 040-27614172 (ఉ॥ 10.30 గంటల నుండి సా॥ 5.00 గంటల వరకు)
సం/- చీఫ్ సివిల్ ఇంజినీర్

THE TELANGANA STATE DAIRY DEVELOPMENT COOPERATIVE FEDERATION LTD., LALAPET:: HYDERABAD - 500017
Website: tsdairy.telangana.gov.in
Tender Notice No.858/EE©/TSDDCFL/2019(2nd Call) Date:28-06-2019
Name of work: "Design, Supply, installation, testing and commissioning of 1 TPH cattle Feed Plant(Mash) at Ruyyadi in Adilabad District on turn-key basis". Schedule closed on 10-07-2019 by 03.00PM. For further detail visit https://tender.telangana.gov.in and further enquiry contact EE© in HO Ph: 9391841211 during the office hours. EXECUTIVE ENGINEER (CIVIL)

త

మీ వద్ద ఉన్న సమాచారాన్ని పంపించాల్సిన చిరునామాలు

ధర్మగంట
నమస్తే తెలంగాణ,
8-2-603/1/7,8,9
రోడ్డు నంబర్ 10, బంజారాహిల్స్,
హైదరాబాద్-500034.
పై అడ్రస్‌కు పోస్టుద్వారా పంపించండి.

Whatsapp No.
9346979997
dharmaganta@ntnews.com
అడ్రస్‌కు ఈ-మెయిల్ చేయండి.

స్థానిక నమస్తే తెలంగాణ కార్యాలయంలో వివరాలు అందించండి.

/NTDAILYONLINE

# దశాబ్దాలుగా దక్కని భూహక్కు

90 ఏండ్ల నుంచి సాగులో ఉన్నా రికార్డుల్లోకి ఎక్కని పేర్లు

గిరిజన రైతులపై రెవెన్యూ అధికారుల శీతకన్ను • మూడు తరాలుగా ఒకే భూమిని సాగుచేసుకొంటున్న బాధితులు

బిలా దాఖలు భూములకు పట్టాలివ్వలేమంటున్న అధికారులు • హక్కు కల్పించాలంటున్న రంగారెడ్డి జిల్లా మోకిలతండా రైతులు

**శంకర్‌పల్లి రూరల్:** రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం మోకిల- కొండకల్ గ్రామాల మధ్య కొంత బిలా దాఖలు భూమి (గ్యాప్ ల్యాండ్ లేదా మిగులు భూమి) ఉన్నది. ఇందులో 18.20 ఎకరాల భూమిని మోకిలతండాకు చెందిన కిష్టానాయక్, బద్రీనాయక్ కుటుంబసభ్యులు సాగు చేసుకొంటున్నారు. మూడు తరాలుగా వీరి కుటుంబాలే కాస్తులో ఉండి వ్యవసాయం చేసుకొంటున్నాయి. ఈ భూములనే నమ్ముకొని పంటలు సాగుచేసుకొంటూ జీవిస్తున్నాయి. వీరి తండ్రులు, తాతలు మాన్యానాయక్, హన్మనాయక్, కిష్టనాయక్, బద్రీనాయక్ కూడా ఈ భూమినే నమ్ముకొని బతికారు. ఇప్పుడు కిష్టానాయక్, బద్రీనాయక్ భార్యలు బిక్కిబాయి, మాణిక్‌బాయి, వీళ్ల కుమారులు, కుమార్తెలు వ్యవసాయం చేసుకొంటున్నారు.

### 1948లోనే శిస్తు చెల్లింపు

1948లోనే అప్పటి మాలిక్ పటేల్‌కు ఈ రైతులు పైసలు కట్టారు. ఇందుకు సంబంధించిన పత్రాలు, రసీదులు ఇప్పటికీ ఉన్నాయి. ఆ తర్వాత 1971, 1972, 1977, 1980, 1986 సంవత్సరాల్లో ప్రభుత్వానికి శిస్తులు కట్టామని, తమకు పట్టాలు అందించాలని అధికారులకు ఎన్నోసార్లు విజ్ఞప్తి చేసినట్టు బాధితులు పేర్కొన్నారు. మోకిల- కొండకల్ గ్రామాల మధ్య ఉన్న బిలా దాఖలు భూమి సుమారు 40 ఎకరాల పైచిలుకు ఉంటుంది. ఈ భూములను మొదటినుంచీ బీసీ, ఎస్సీ, ఎస్టీ కుటుంబాలు సాగుచేసుకొంటున్నాయి. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో టీడీపీ ప్రభుత్వం నిర్వహించిన జన్మభూమి కార్యక్రమాల్లో ఫిర్యాదుచేయగా, భూమి పట్టాలను అందిస్తామని హామీ ఇచ్చినప్పటికీ అది హామీగానే ఉండిపోయిందని చెప్పారు. 10-12-2014లో ఈ భూములకు సంబంధించిన విచారణ చేపట్టి పట్టాలు అందించాలని అప్పటి కలెక్టర్‌కు ఫిర్యాదుచేశామని, దీంతో రెవెన్యూ అధికారులు 12-03-2015 లో బిలా దాఖలు భూముల్లో ఎవరెవరు సాగుచేసుకొంటున్నారో పంచనామా నిర్వహించి సర్టిఫికెట్‌ను కూడా ఇచ్చారని తెలిపారు. 2017లో తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన భూరికార్డుల ప్రక్షాళనలో కూడా ఫిర్యాదుచేశామని, అయినా అధికారులు పట్టించుకోలేదని పేర్కొన్నారు.

### ఈ భూములకు పట్టా ఇవ్వలేం

మోకిల- కొండకల్ గ్రామాల మధ్య ఉన్న జాగలు మిగులు భూమి (బిలా దాఖలు) గా రికార్డులో ఉన్నది. ఈ గ్రామాలు హెచ్ ఎండీఏ పరిధిలో ఉన్నందున పట్టాలు ఇవ్వడం కుదరదు. కాగా, ఎంతోమంది గిరిజనులు, బీసీ, ఎస్సీ రైతులు కబ్జాలో ఉన్నా ఎటువంటి పట్టాలు అందించే అధికారం మాకు లేదు. ఈ భూములపై ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాల్సి ఉన్నది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ముందుకు సాగుతాం.

**- శివకుమార్, శంకర్‌పల్లి తాసిల్దార్**

### మూడు తరాలనుంచి కాస్తులో ఉన్నం

మా మామ, వారి తండ్రుల కాలం నుంచి ఈ భూములను సాగుచేసుకొంటూ జీవిస్తున్నం. ఇప్పటివరకు మూడు తరాలు మారాయి. మా మామ తండ్రులు, మామలు, నా భర్త మృతి చెందారు. భూములు సాగుచేసుకొంటేనే మా కుటుంబాలు గడుస్తాయి. గతంలో పటేల్, పట్వారీ ఉన్నప్పుడు కూడా ప్రభుత్వాలకు శిస్తు కట్టినం. టీడీపీ ప్రభుత్వం హయాంలో నిర్వహించిన జన్మభూమి కార్యక్రమాల్లో, మొన్న మొన్న జరిగిన భూరికార్డుల ప్రక్షాళనలో ఫిర్యాదులు అందించాం. ఇప్పటికైనా సీఎం కేసీఆర్ చొరవ తీసుకొని మా భూములకు పట్టాలు అందించాలి.

**- సభావత్ బిక్కిబాయి, గిరిజన రైతు**

### హక్కు కల్పించండి

ఎన్నో ఏండ్లుగా ఈ భూములను సాగుచేసుకొంటూ కుటుంబాలను పోషించుకొంటున్నం. నా భర్త భూములకు పట్టాలు అందించాలని ఎన్నో కార్యాలయాలకు తిరిగిండు. ప్రస్తుతం నా భర్త మృతి చెందిన అనంతరం ఈ భూమిని నేనే సాగు చేసుకొంటున్న. ఏటా మక్కజొన్న, జొన్న, కంది, కుసుమలు పండిస్త. ఇప్పటికైనా అధికారులు మాకు పట్టాలు అందించి, భూమిపై హక్కు కల్పించేందుకు చర్యలు తీసుకోవాలి.

**- సభావత్ మాణిక్‌బాయి, గిరిజన రైతు**

అనుబంధం-I

తెలంగాణ ప్రభుత్వం
ఆర్థిక శాఖ

**8 సంవత్సరాల తెలంగాణ ప్రభుత్వ స్టాక్ (సెక్యూరిటీలు) వేలము 2027**

| | |
|---|---|
| మొత్తం | : రూ. **1000.00** కోట్లు |
| జారీ ధర | : ప్రతి రూ. 10,000.00లకు రూ. 10,000.00 |
| కరెన్సీ | : 8 సంవత్సరాలు |
| రుణ దరఖాస్తు స్వీకరణ కాలము | :మొత్తం చేకూరిన వెంటనే ప్రకటన లేకుండా **02-07-2019** వ్యాపార వేళల అనంతరం వెంటనే ముగియగలదు. |

పై రుణము కొరకు తెలంగాణ ప్రభుత్వము చందాలు అభ్యర్థిస్తున్నది. పూర్తి వివరములను రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, హైదరాబాద్ మరియు ముంబయి నుండి ప్రభుత్వ వ్యాపార వేళలలో పొందవచ్చును.

కె. రామకృష్ణారావు
ముఖ్య ఆర్థిక కార్యదర్శి
ఆర్థిక శాఖ

DIPR R.O. No. 468-DP/CL/Advt/1/2019-20, Dt: 28-06-2019

**తెలంగాణ ప్రభుత్వం**
కలెక్టర్ కార్యాలయం వరంగల్ అర్బన్
(రెవెన్యూ (భూ. సే) శాఖ

కలెక్టర్ ఫైల్ 11 నెం.జి1/2495/2018 తేదీ: 31-05-2019
కె.డి.ఓ ఫైల్ నెం.ఎఫ్/4195/2018 తేదీ: 29-05-2019
గెజిట్ నెం.10/WGL(U)/2019 తేదీ: 03-06-2019

ఫారం-సి

(భూసేకరణ పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు పునరావాస, వ్యవస్థాపనలో పారదర్శకత (తెలంగాణ సవరణ) చట్టము 2016 లోని 10 ఎ లోని మినహాయింపు క్రమము మరియు భూసేకరణ చట్టము-2013 (చట్టము-30/2013) సెక్షన్ -8(1) (క్రమము) (రూల్ 6/12 చూడుము)

**ప్రకటన**

వరంగల్ అర్బన్ జిల్లా ఉర్సు మరియు కాశంపేట గ్రామముల ఖిలా వరంగల్ మరియు కాజీపేట మండల పరిధిలో ఈ దిగువ షెడ్యూల్ నందు చూపబడిన భూమి మిగిలిన (2-28½) ఎకరముల భూమి Construction of Additional ROB at K O/O of ROB Link Road కొరకు అవసరమున్నదని తెలంగాణా ప్రభుత్వము/జిల్లా కలెక్టర్ వరంగల్ అర్బన్ గారు భావిస్తున్నారు. కావున ఇట్టి ప్రకటన జారీచేయబడినది.

షెడ్యూలు

గ్రామము: ఉర్సు మండలము: ఖిలా వరంగల్ జిల్లా : వరంగల్ అర్బన్

| సర్వే నెం. | ఉపవిభాగ నెం. | భూమి వర్గీకరణ (వ్యవసాయం/వ్యవసాయేతర) | భూమి విస్తీర్ణం (ఎకరాలలో) | పట్టాదారు(ల) పేరు(లు)తండ్రి/భర్త పేరుతో సహా/అనుభవదారు(ల) పేరు(లు) తండ్రి/భర్త పేరుతో సహా/ప్రస్తుతము మొఖ ఉన్నవారు | ఇతర వివరములు |
|---|---|---|---|---|---|
| 503 | తరి | పట్టా | 0-11 | **పట్టాదారు పేరు**<br>రోడ్డు<br>బైరిశెట్టి చిన్నరాజయ్య<br>బైరిశెట్టి వెంకట లక్ష్మి భర్త వీరస్వామి<br>**అనుభావదారు**<br>రోడ్డు<br>ఫైట్స్<br>బైరిశెట్టి వెంకట లక్ష్మి భర్త వీరస్వామి<br>**ప్రస్తుతము మొఖ ఉన్నవారు**<br>బండి విజయ భర్త కుమారస్వామి<br>బండి మోహన్ తండ్రి కుమారస్వామి<br>బండి నవీన్ తండ్రి కుమారస్వామి<br>ఖాళీ ఫైట్స్ | ఇప్పటికే ఉన్న ఇళ్లు |
| 507 | తరి | పట్టా | 0-04 | **పట్టాదారు పేరు**<br>బైరిశెట్టి చిన్నరాజయ్య<br>బైరిశెట్టి విజ్ఞపతి తండ్రి చిన్న మల్లు<br>**అనుభావదారు**<br>బైరిశెట్టి విజ్ఞపతి తండ్రి చిన్న మల్లు<br>**ప్రస్తుతము మొఖ ఉన్నవారు**<br>ఖాళీ ఫైట్స్ | |
| 508 | తరి | పట్టా | 0-08 | **పట్టాదారు పేరు**<br>రోడ్డు<br>బైరిశెట్టి చిన్న మల్లు<br>**అనుభావదారు**<br>రోడ్డు<br>ఇంటి స్థలాలు<br>**ప్రస్తుతము మొఖ ఉన్నవారు**<br>ఖాళీ ఫైట్స్ | |
| 520 | తరి | పట్టా | 0-10 | **పట్టాదారు పేరు**<br>చిలార్గిరి రాజమల్లు తండ్రి మల్లయ్య<br>బండి ఐయ భర్త సమ్మయ్య<br>రోడ్డు<br>బైరిశెట్టి పెద్ద మల్లేశం<br>**అనుభావదారు**<br>ఇంటి స్థలాలు<br>రోడ్డు<br>బండి ఐయ భర్త సమ్మయ్య<br>**ప్రస్తుతము మొఖ ఉన్నవారు**<br>ఖాళీ ఫైట్స్ | |
| 521 | ఖుష్కి | బంధరాయి | 0-30 | **పట్టాదారు పేరు**<br>పల్లెం రాజేర్ తండ్రి పంకయ్య<br>పల్లెం సమ్మయ్య తండ్రి పంకయ్య<br>రోడ్డు<br>పల్లెం సుశీల<br>కాశీపాధుని బుచ్చయ్య<br>ఐయలక్ష్మి భర్త నారాయణ<br>శివ ప్రసాద్<br>మార్గ రామస్వామి తండ్రి గోవిందు<br>గుడిశాల శంకరయ్య తండ్రి రామయ్య<br>**అనుభావదారు**<br>మెటికోర్ ట్రస్ట్<br>ఇంటి స్థలాలు<br>రోడ్డు<br>లింగాల బుచ్చి వీరమ్మ<br>గుడిశాల శంకరయ్య తండ్రి రామయ్య<br>పల్లెం రాజేర్ తండ్రి పంకయ్య<br>ఐయలక్ష్మి భర్త నారాయణ<br>లింగాల వీరస్వామి<br>**ప్రస్తుతము మొఖ ఉన్నవారు**<br>ప్రభుత్వ భూమి | |
| 432 | ఖుష్కి | బంధరాయి | 0-06½ | **పట్టాదారు పేరు**<br>బంజరు<br>**అనుభావదారు**<br>బంజరు<br>**ప్రస్తుతము మొఖ ఉన్నవారు**<br>ప్రభుత్వ భూమి | |
| 566 | ఖుష్కి | పట్టా | 0-06 | **పట్టాదారు పేరు**<br>శ్రీ మల్ల రాంమోహన్ తండ్రి జగన్నారం<br>శ్రీ మల్ల జగన్నారం తండ్రి చిన్న మల్లు<br>రైస్‌మిల్లర్ అసోసియేషన్<br>శ్రీ మల్ల చిన్న మల్లు తండ్రి జగన్నారం<br>నెవ సంపత్ కుమార్ తండ్రి సర్వయ్య<br>**అనుభావదారు**<br>శ్రీ మల్ల రాంమోహన్ తండ్రి జగన్నారం<br>శ్రీ మల్ల జగన్నారం తండ్రి చిన్న మల్లు<br>రైస్‌మిల్లర్ అసోసియేషన్<br>శ్రీ మల్ల చిన్న మల్లు తండ్రి జగన్నారం<br>నెవ సంపత్ కుమార్ తండ్రి సర్వయ్య<br>**ప్రస్తుతము మొఖపై ఉన్నవారి పేరు**<br>వీరాచనేని నరసింహారావు తండ్రి<br>సోమశేఖర్ రావు<br>సైని శ్రీదేవి భర్త రమేష్ కుమార్<br>ఆర్.దయానంద్ తండ్రి వెంకటేశ్వర్లు<br>ఆర్.రవి కుమార్ తండ్రి వెంకటేశ్వర్లు<br>Unknown | కాంపౌండ్ వాల్స్ |
| 562 | తరి | పట్టా | 0-03 | **పట్టాదారు పేరు**<br>ఆర్.వెంకటేశ్వర్లు<br>బైరిశెట్టి కుమారస్వామి<br>**అనుభావదారు**<br>ఆర్.వెంకటేశ్వర్లు<br>ఫైట్స్<br>**ప్రస్తుతము మొఖపై ఉన్నవారి పేరు**<br>రైల్వే | కాంపౌండ్ వాల్స్ |

గ్రామము: ఉర్సు మండలము: ఖిలా వరంగల్ జిల్లా : వరంగల్ అర్బన్

| సర్వే నెం. | ఉపవిభాగ నెం. | భూమి వర్గీకరణ (వ్యవసాయం/వ్యవసాయేతర) | భూమి విస్తీర్ణం (ఎకరాలలో) | పట్టాదారు(ల) పేరు(లు)తండ్రి/భర్త పేరుతో సహా/అనుభవదారు(ల) పేరు(లు) తండ్రి/భర్త పేరుతో సహా/ప్రస్తుతము మొఖ ఉన్నవారు | ఇతర వివరములు |
|---|---|---|---|---|---|
| 563 | తరి | పట్టా | 0-03½ | **పట్టాదారు పేరు**<br>నిమ్మని శ్రీనివాస్‌రావు తండ్రి సమ్మయ్య<br>నిమ్మని సంతోష్ తండ్రి సమ్మయ్య<br>బొల్లాల రాజిరెడ్డి తండ్రి నరసింహారెడ్డి<br>రండుపట్ల సత్యపాల్ రెడ్డి తండ్రి జంగారెడ్డి<br>**అనుభావదారు**<br>ఇంటి స్థలాలు<br>బొల్లాల రాజిరెడ్డి తండ్రి నరసింహారెడ్డి<br>రండుపట్ల సత్యపాల్ రెడ్డి తండ్రి జంగారెడ్డి<br>**ప్రస్తుతము మొఖపై ఉన్నవారి పేరు**<br>Unknown<br>అక్కిసపల్లి వెంకటేశ్వర్లు తండ్రి విశ్వేశ్వర్లు<br>మండ అనంతరెడ్డి తండ్రి ప్రకాష్<br>Unknown | |
| | | మొత్తం విస్తీర్ణము | 2-01 | | |

గ్రామము: కాశంపేట మండలము: ఖిలా వరంగల్ జిల్లా: వరంగల్ అర్బన్

| సర్వే నెం. | ఉపవిభాగ నెం. | భూమి వర్గీకరణ (వ్యవసాయం/వ్యవసాయేతర) | భూమి విస్తీర్ణం (ఎకరాలలో) | పట్టాదారు(ల) పేరు(లు)తండ్రి/భర్త పేరుతో సహా/అనుభవదారు(ల) పేరు(లు) తండ్రి/భర్త పేరుతో సహా/ప్రస్తుతము మొఖ ఉన్నవారు | ఇతర వివరములు |
|---|---|---|---|---|---|
| 150 | ఖుష్కి | పట్టా | 0-03½ | **పట్టాదారు పేరు**<br>నివాస గృహములు<br>రేవూరి జెన్న రెడ్డి తండ్రి మల్లారెడ్డి<br>రేవూరి భగవాన్ రెడ్డి తండ్రి మల్లారెడ్డి<br>లింగాల సరోజన భర్త సాంబయ్య<br>**అనుభావదారు**<br>నివాస గృహములు<br>రేవూరి జెన్న రెడ్డి తండ్రి మల్లారెడ్డి<br>రేవూరి భగవాన్ రెడ్డి తండ్రి మల్లారెడ్డి<br>లింగాల సరోజన భర్త సాంబయ్య<br>**ప్రస్తుతము మొఖపై ఉన్నవారి పేరు**<br>జి.రమేష్ బాబు తండ్రి వెంకట స్వామి<br>జి.వెంకటేష్ తండ్రి రమేష్ బాబు<br>ఎస్.శ్రీనివాస్ రావు తండ్రి సమ్మయ్య<br>ఎస్.సంతోష్ తండ్రి సమ్మయ్య<br>జె.శ్రీనివాస్ తండ్రి సత్యరాజు<br>టి.నరేందర్ తండ్రి యాదగిరి<br>Unknown | కాంపౌండ్ వాల్స్ |
| 152 | ఖుష్కి | పట్టా | 0-07 | **పట్టాదారు పేరు**<br>బొల్లాన మల్లయ్య తండ్రి వీరయ్య<br>బొల్లాన విజ్ఞపతి తండ్రి కొమరయ్య<br>బొల్లాన లాంతమ్మ భర్త వీరమల్లు<br>నివాస గృహములు<br>బొల్లాన మల్లేశం తండ్రి రామస్వామి<br>బొల్లాన విజ్ఞపతి తండ్రి రామస్వామి<br>బొల్లాన కుమారస్వామి తండ్రి వీరాలు<br>బొల్లాన మల్లేశం తండ్రి వీరాలు<br>**అనుభావదారు**<br>నివాస గృహములు<br>ఇండ్ల స్థలాలు<br>**ప్రస్తుతము మొఖపై ఉన్నవారి పేరు**<br>ఇప్ప మంరయ్య తండ్రి చంద్రయ్య<br>టి.అశోక్ కుమార్<br>తొగరు శ్రీనివాస్ తండ్రి రాజయ్య<br>పి.నాగరాజు తండ్రి రాజయ్య<br>పిట్టల సాంబమూర్తి తండ్రి రామస్వామి<br>పిట్టల సురేందర్ తండ్రి రామస్వామి<br>Unknown | కాంపౌండ్ వాల్స్ |
| 153 | ఖుష్కి | పట్టా | 0-05 | **పట్టాదారు పేరు**<br>గట్టు మహేష్ తండ్రి మారుతిరావు<br>మారావు విద్యసాగర్<br>తండ్రి రాజేశ్వర్‌రావు<br>బోరి బలయ్య తండ్రి చంద్రయ్య<br>నివాస గృహములు<br>**అనుభావదారు**<br>గట్టు మహేష్ తండ్రి మారుతిరావు<br>మారావు విద్యసాగర్ తండ్రి రాజేశ్వర్‌రావు<br>నివాస గృహములు<br>**ప్రస్తుతము మొఖ ఉన్నవారు**<br>పెద్ద నర్సయ్య తండ్రి శ్రీశైలం<br>పెద్ద మారయ్యరావు తండ్రి నరసింహారావు<br>Unknown | కాంపౌండ్ వాల్స్ |
| 154 | ఖుష్కి | పట్టా | 0-06 | **పట్టాదారు పేరు**<br>నివాస గృహములు<br>**అనుభావదారు**<br>నివాస గృహములు<br>**ప్రస్తుతము మొఖ పై ఉన్న వారి పేరు**<br>బానోత్ బాలు తండ్రి తాన్యా<br>ఎ.శ్రీనివాస్ రెడ్డి తండ్రి పుల్లా రెడ్డి<br>బండి వీరన్న తండ్రి అంకయ్య<br>బద్దం లక్ష్మి రెడ్డి తండ్రి సాంబమూర్తి<br>గుగులోతు అసు తండ్రి మందలాల్<br>తోట సంధ్య భర్త బాలు రావు | కాంపౌండ్ వాల్స్ |
| 155 | ఖుష్కి | పట్టా | 0-00½ | **పట్టాదారు పేరు**<br>నివాస గృహములు<br>బోరి బలయ్య తండ్రి చంద్రయ్య<br>**అనుభావదారు**<br>నివాస గృహములు<br>**ప్రస్తుతము మొఖ ఉన్నవారు**<br>Unknown | కాంపౌండ్ వాల్స్ |
| 173 | ఖుష్కి | పట్టా | 0-06 | **పట్టాదారు పేరు**<br>నివాస గృహములు<br>**అనుభావదారు**<br>నివాస గృహములు<br>**ప్రస్తుతము మొఖ ఉన్నవారు**<br>గుండు ప్రభాకర్ తండ్రి రాజశేఖర్ | కాంపౌండ్ వాల్స్ |
| | | మొత్తం విస్తీర్ణము | 0-27½ | | |
| | | సంపూర్ణ మొత్తం విస్తీర్ణం | ఎ., 2-28½ గుం., | | |

కావున భూసేకరణ చట్టము -2013 (నెం.30/2013) లోని సెక్షన్ 11(1) ప్రకారం మరియు భూసేకరణ పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత & పునరావాస, పునఃస్థాపన (తెలంగాణా సవరణ) చట్టం -2016 (చట్టము నెం.21/2017) ప్రకారము సంబంధిత భూ యజమానులందరికీ తెలియజేయుటకు గాను ఇట్టి ప్రకటన ప్రకటన జారీ చేయబడినది. భూమి యొక్క పైన మరియు వివరములు జిల్లా కలెక్టర్, వరంగల్ అర్బన్ మరియు రెవెన్యూ డివిజినల్ అధికారి, వరంగల్ అర్బన్ గారి కార్యాలయములో ఉంచబడినవి ఇట్టిది సంబంధిత వ్యక్తులు ఏదైనా పని దినములందు కార్యాలయ వేళలలో తనిఖీ చేసుకోవచ్చు.

సదరు చట్టములోని సెక్షన్ 12 ననుసరించి, తెలంగాణా ప్రభుత్వము / కలెక్టర్, వరంగల్ అర్బన్ గారిని గాని, వారి సిబ్బందిని గాని సదరు భూమిలో ప్రవేశించి, సర్వే మరియు ఇతర పనులు చేపట్టుటకు అధికారమివ్వనైనది.

సదరు చట్టములోని సెక్షన్ 11(4) ననుసరించి, సేకరణ ప్రతిపాదించిన భూములందు జిల్లా కలెక్టర్, వరంగల్ అర్బన్ గారి అనుమతి లేకుండా, ఇట్టి ప్రాథమిక ప్రకటన జారీ చేసిన తేదీ నుండి షెడ్యూల్‌లో ప్రకటించిన భూములకు సంబంధించి క్రయ విక్రయాలు లేదా ఏ విధమైన లావాదేవీలు జరుపరాదని తెలియజేయనైనది.

ప్రతిపాదిత భూసేకరణపై ఏమైనా అభ్యంతరములు గాని ఆక్షేపణలు గాని ఉన్న యెడల మరియు నష్టపరిహారము సంప్రదింపుల ద్వారా పరిష్కారము కొరకు ప్రభావితమైన /ప్రయోజనము గల వ్యక్తులందరూ, సదరు చట్టములోని సెక్షన్ (15) ననుసరించి, ఇట్టి ప్రకటన ప్రచురించబడిన తేదీ నుండి (60) దినములలోగా జిల్లా కలెక్టర్, వరంగల్ అర్బన్ గారికి/ అధికృత అధికారి గారికి లిఖిత పూర్వకంగా దాఖలు చేసుకోవచ్చును.

Sd/- భూసేకరణ అధికారి మరియు రెవెన్యూ డివిజినల్ అధికారి, వరంగల్ అర్బన్.

Sd/- జాయింట్ కలెక్టర్, వరంగల్ అర్బన్. Sd/- జిల్లా కలెక్టర్, వరంగల్ అర్బన్.

DIPR No.: 295/LA/PP/2019-20 Date: 28-06-2019

## పాస్‌పుస్తకాలు ఇస్తలేరని ఆత్మహత్యాయత్నం

- తాసిల్ చుట్టూ తిప్పుకొంటున్నారని చిగురుమామిడిలో చెట్టెక్కిన రైతు
- తాసిల్దార్ హామీతో దిగివచ్చిన రైతు.. ప్రొసీడింగ్ అందజేత

**చిగురుమామిడి:** కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కేంద్రానికి చెందిన రైతు మల్లం అనంతరాములు తనకు పట్టాదారు పాస్‌పుస్తకం జారీచేయడం లేదని ఆవేదనతో శుక్రవారం స్థానిక తాసిల్ కార్యాలయం వద్ద చెట్టు ఎక్కి ఆత్మహత్యకు యత్నించారు. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. మల్లం అనంతరాములుకు చిగురుమామిడిలోని సర్వే నంబర్ 738/బీ/బీ లో రెండెకరాల భూమి ఉన్నది. అదే గ్రామానికి చెందిన బైరి దివాకర్‌రెడ్డి వద్ద కొనుగోలు చేసి, ఈ భూమిపై ఎలాంటి అభ్యంతరాలూ లేవని రెవెన్యూ అధికారుల ఎదుట మే 29న సంతకం చేయించారు. అనంతరాములుకు పట్టాదారు పాస్‌పుస్తకం ఇవ్వాలని దివాకర్‌రెడ్డి అధికారులకు సూచించారు. అప్పటి నుంచి పాస్‌బుక్ కోసం నెల రోజులుగా తాసిల్ కార్యాలయానికి రోజూ వెళ్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో ఆవేదనకు గురైన బాధితుడు శుక్రవారం కార్యాలయం వద్ద చెట్టు ఎక్కి పాస్‌బుక్ ఇవ్వకుంటే ఆత్మహత్య చేసుకుంటానని బెదిరించారు. వెంటనే కార్యాలయంలో ఉన్న రైతులు, సిబ్బంది వచ్చి చెట్టు దిగి రావాలని నచ్చజెప్పారు.

చెట్టుపైకి ఎక్కిన అనంతరాములు

అయినా రైతు దిగిరాకపోవడంతో చివరికి తాసిల్దార్ శ్యాంసుందర్ వచ్చి పాస్‌బుక్ ప్రొసీడింగ్ ఇస్తానని హామీ ఇవ్వడంతో అనంతరాములు దిగి వచ్చారు. తాసిల్దార్ ప్రొసీడింగ్ కాపీ ఇవ్వడంతో బాధితుడు ఇంటికి వెళ్లిపోయారు.

## పురుగులమందు డబ్బాతో కలెక్టరేట్‌కు

- పాస్‌బుక్ ఇవ్వాలని నారాయణపేట జిల్లా కందెన్‌పల్లి రైతు విన్నపం
- వివరాలు అడిగి తెలుసుకొన్న డీఆర్వో రవికుమార్
- విచారణచేసి నివేదిక ఇవ్వాలని తాసిల్దార్‌కు కలెక్టర్ వెంకట్రావు ఆదేశం

**నారాయణపేట టౌన్:** తన భూమికి పాస్‌పుస్తకం అందించాలని ఎన్నిసార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడంలేదని, చివరకు తనకు చావే మార్గమని నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం కందెన్‌పల్లి రైతు నాగేశ్ కుటుంబసభ్యులతో కలిసి పురుగులమందు డబ్బాతో కలెక్టరేట్‌కు వచ్చారు. దీంతో కలెక్టరేట్‌లో ఉన్న కొంతమంది అధికారులు హుటాహుటిన రైతు వద్ద ఉన్న పురుగులమందు డబ్బాను లాగేసుకొన్నారు. అనంతరం కలెక్టరేట్‌కు చేరుకొన్న డీఆర్వో రవికుమార్, ఏవో బాలాజీ సఫారే, దామరగిద్ద తాసిల్దార్ వినయ్‌కుమార్‌తో కలిసి బాధిత రైతు నుంచి వివరాలు సేకరించారు. బాధిత రైతు భూమికి సంబంధించి ఏమైన కోర్టు కేసు వివాదాలున్నాయా? లేక ఇతర ఏదైనా సమస్యలున్నాయా అనే కోణంలో అధికారులు పూర్తిస్థాయిలో విచారణచేశారు. ఈ విషయంపై స్పందించిన కలెక్టర్ వెంకట్రావు దామరగిద్ద తాసిల్దార్‌ను బాధిత రైతు పొలం వద్దకు వెళ్లి పూర్తిస్థాయి విచారణచేసి నివేదిక సమర్పించాలని ఆదేశించారు.



పురుగుల మందు డబ్బాతో కలెక్టరేట్‌కు వచ్చిన రైతు నాగేశ్

## తప్పుడు పత్రాలతో పట్టా మార్చారు

ఉన్నతాధికారులను ఆశ్రయించినా ఫలితం శూన్యం ■ సర్వేచేయాలని ఫిర్యాదుచేసినా పట్టించుకుంటలేరు

నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం ఎల్మపల్లి రైతు ఖాజమైనొద్దీన్ ఆవేదన

**అచ్చంపేట రూరల్:** నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం ఎల్మపల్లిలో షేక్ ఖాజామైనొద్దీన్‌కు సర్వే నంబర్ 1420లో 1.02 ఎకరాల భూమి ఉన్నది. 1967కు ముందు నుంచి వారసత్వంగా వస్తున్న ఈ భూమిని గ్రామానికి చెందిన నాసరయ్యకు 15 ఏండ్లపాటు కౌలుకు అప్పగించారు. ఏటా భూయజమాని షేక్ ఖాజామైనొద్దీన్‌కు నాసరయ్య కౌలు చెల్లిస్తూ వచ్చారు. ఇదే అదునుగా భావించిన నాసరయ్య రెవెన్యూ అధికారులను మచ్చికచేసుకొని 2017లో 1.02 ఎకరాలను తన పేరిట పట్టాచేయించుకున్నారు. దీంతో 2018 నుంచి నాసరయ్యకే రైతుబంధు వస్తున్నది. విషయం తెలుసుకొన్న బాధిత రైతు ఖాజామైనొద్దీన్ తమకు సమాచారం ఇవ్వకుం డా.. తప్పుడు పత్రాలను సృష్టించి అక్రమంగాచేసిన పట్టాను వెంటనే రద్దుచేయాలని 2017 లో తాసిల్దార్‌కు, 2018 జూన్‌లో ఆర్డీవోకు,

షేక్ ఖాజామైనొద్దీన్ దంపతులు

2018 జూలైలో కలెక్టర్‌కు ఫిర్యాదుచేశారు. అయినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. తాను భూమిని ఎవరికీ అమ్మలేదని, తనకు కండ్లు కనిపించవని, తాను ఎక్కడా సంతకం చేయలేదని బాధితుడు వాపోతున్నారు. అమ్రాబాద్ మండలం పూర్తిగా ఏజెన్సీ కావడంతో భూములు అమ్మడం, కొనడం చేయకూడదు. కానీ అప్పటి తాసిల్దార్ కృష్ణయ్య నిబంధనలకు విరుద్ధంగా తన భూమి ని ఇతరుల పేరిట చేయడం ఎంతవరకు సమంజసమని బాధిత రైతు ప్రశ్నిస్తున్నారు. అలాగే ఖాజామైనొద్దీన్ పేరిట సర్వే నంబర్ 937లో ఉన్న 3.21 ఎకరాల భూమిని చుట్టు పక్కల రైతులు దాదాపు 2 ఎకరాల వరకు కబ్జాచేశారని బాధితుడు తెలిపారు. దానిని సర్వేచేసి తన భూమిని తనకు చూపించాలని 2017 జూలైలో అధికారులకు దరఖాస్తు చేసుకున్నప్పటికీ ఎవ్వ రూ పట్టించుకోవడం లేదని బాధితుడు వాపోయారు. చివరికి బాధితుడు న్యాయం కోసం ధర్మగంటను ఆశ్రయించారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తనకు న్యాయంచేయాలని వేడుకుంటున్నారు.

### మా నాన్న భూమి ఎవరికీ అమ్మలేదు

రెవెన్యూశాఖలో డబ్బులు ఇచ్చిన వాడికే న్యాయం జరుగుతుంది. మా భూమి కబ్జాకు గురైందని, కొంత భూమిని ఇతరులకు పట్టాచేశారని 2017 లో తాసిల్దారు, ఆర్డీవో, కలెక్టర్‌కు పిర్యాధుచేసినా పట్టించుకోవడంలేదు. నా నాన్న ఖాజామైనొద్దీన్ భూమిని ఎవరికీ అమ్మలేదు. డబ్బులు ఇస్తే చాలు రెవెన్యూ అధికారులు ఎలాంటి భూమినైనా ఇతరుల పేరిట పట్టాచేస్తారు. శాఖను ప్రక్షాళన చేస్తానన్న సీఎం కేసీఆర్ ప్రకటన హర్షనీయం. అప్పుడే రైతులకు ఊరట లభిస్తుంది.

**- ఖాజా రఫియోద్దీన్, ఖాజామైనొద్దీన్ కుమారుడు**

## ఆర్నెళ్లయినా పట్టా చేస్తలేరు

- 2.24 ఎకరాల్లో పట్టా అయింది ఎకరమే
- మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండలం మేచరాజుపల్లి రైతు ఆవేదన

రైతు పర్నె రాంరెడ్డి

**నెల్లికుదురు:** మహబూబాబాద్ జ

# మా అధ్యక్ష ఎన్నికల్లో జోక్యం చేసుకోవద్దు

## పుతిన్‌తో ట్రంప్ సరదా సంభాషణ


ట్రంప్‌తో మాట్లాడుతున్న పుతిన్

**ఒసాకా, జూన్ 28:** జపాన్‌లోని ఒసాకాలో జీ-20 సదస్సు సందర్భంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ మధ్య శుక్రవారం హాస్యభరిత సంభాషణ చోటుచేసుకున్నది. తమ దేశాధ్యక్ష ఎన్నికల్లో జోక్యం చేసుకోవద్దని పుతిన్‌ను ఉద్దేశించి ట్రంప్ జోక్ చేశారు. 2016 అమెరికా దేశాధ్యక్ష ఎన్నికల్లో రష్యా జోక్యం చేసుకున్నట్లు ఆధారాలు ఉన్నాయని అమెరికా ప్రత్యేక దర్యాప్తు అధికారి రాబర్ట్ ముల్లర్ నివేదించిన నేపథ్యంలో ట్రంప్ ఈ వ్యాఖ్య చేయడం గమనార్హం. అయితే తాను పుతిన్‌ను మందలించలేదని వ్యాఖ్యానించారు. వచ్చే ఏడాది జరిగే అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో జోక్యం చేసుకోవద్దని పుతిన్‌ను హెచ్చరిస్తారా? అని ఒక విలేకరి ప్రశ్నించినప్పుడు ట్రంప్ స్పందిస్తూ 'ఆఫ్‌కోర్స్' అని అన్నారు. ఆ తర్వాత పుతిన్‌ను ఉద్దేశించి మా ఎన్నికల్లో జోక్యం చేసుకోవద్దని సరదాగా చెప్పారు. రాబర్ట్ ముల్లర్ నివేదికను పుతిన్ కొట్టి పారేసినట్లు సమాచారం. వచ్చే ఏడాది జరిగే రెండో ప్రపంచ యుద్ధ విజయం 75వ వార్షికోత్సవానికి హాజరు కావాలని ట్రంప్‌ను పుతిన్ ఆహ్వానించారు. మెక్సికో నుంచి వలసదారులు, మాదక ద్రవ్యాలను ట్రంప్ అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని పుతిన్ ప్రశంసించారు.

# మమ్మల్ని అస్థిరపరుచొద్దు

## పుతిన్‌కు స్పష్టంచేసిన బ్రిటన్ ప్రధాని థెరెసా మే

**ఒసాకా:** బ్రిటన్, దాని మిత్ర పక్షాలను అస్థిర పరిచే చర్యలు చేపట్టొద్దని రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు బ్రిటన్ ప్రధాని థెరెసా మే సూచించారు. 'బాధ్యతారాహిత్యమైన, అస్థిరపరిచే చర్యలు నిలిపివేసే వరకు' రష్యాతో సాధారణ సంబంధాలు ఉండబోవని పుతిన్‌కు మే చెప్పారు. గతేడాది రష్యా మాజీ గూఢచారి సెర్జెయి స్క్రిపాల్‌పై విషప్రయోగం జరిగిన తర్వాత పుతిన్‌తో థెరెసా మే భేటీ కావడం ఇదే మొదటి సారి. 'సైబర్ దాడులు, తప్పుడు సమాచారంతో ఇతర దేశాల వ్యవహారాల్లో జోక్యం, బ్రిటన్ దాని మిత్రపక్షాల్లో రష్యా బాధ్యతారాహిత్య అస్థిరత చర్యలను కొనసాగించినంత కాలం ఆ దేశంతో సాధారణ ద్వైపాక్షిక సంబంధాలను పునరుద్ధరించబోం' అని ఆమె చెప్పారు. స్క్రిపాల్‌పై రష్యా విష ప్రయోగం జరిపినట్లు తిరుగులేని ఆధారాలు తమ వద్ద ఉన్నాయని పుతిన్‌కు మే స్పష్టం చేశారు.

## వివిధ దేశాధినేతలతో మోదీ సమావేశం

**ఒసాకా:** జీ-20 సదస్సులో భాగంగా ప్రధాని మోదీ శుక్రవారం వివిధ దేశాధినేతలతో సమావేశం అయ్యారు. రిక్(RIC-రష్యా, ఇండియా, చైనా) సమావేశంలో భాగంగా రష్యా అధ్యక్షుడు పుతిన్, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో ఉగ్రవాద నిరోధక చర్యలు, వాతావరణ మార్పులపై చర్చించారు. జర్మనీ చాన్స్‌లర్ ఎంజెలా మెర్కెల్‌తోనూ మోదీ భేటీ అయ్యారు. కృత్రిమ మేధస్సు, సైబర్ సెక్యూరిటీ వంటి అంశాలపై చర్చించారు. జై (JAI-జపాన్, అమెరికా, ఇండియా) సమావేశంలో భాగంగా ట్రంప్, జపాన్ ప్రధాని షింజో అబేతో ఇండో-పసిఫిక్ రీజియన్, కనెక్టివిటీ, మౌలిక సదుపాయాల అభివృద్ధి వంటి అంశాలపై చర్చించారు. సౌదీ రాజు మహ్మద్ బిన్ సల్మాన్‌తో భేటీలో ద్వైపాక్షిక వాణిజ్యం, ఉగ్రవాదం, ఇంధన భద్రత అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా హజ్ కోటాను పెంచాలని కోరగా.. 1.70 లక్షల నుంచి రెండు లక్షలకు పెంచేందుకు సల్మాన్ ఒప్పుకోవడంతో మరో 30 వేలమంది హజ్ యాత్రకు వెళ్లే అవకాశం కలిగింది.



# ట్రంప్.. మోదీ.. 5జీ

ఒసాకాలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో మాట్లాడుతున్న భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ

**ఒసాకా, జూన్ 28:** భారత్‌లో 5జీ నెట్‌వర్క్ అభివృద్ధిలో తమ దేశ కంపెనీలతో కలిసి పనిచేయాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. భారత ప్రధాని నరేంద్రమోదీని కోరారు. ఇరు దేశాల మధ్య జరుగుతున్న వాణిజ్య యుద్ధానికి ముగింపు పలుకుదామన్నారు. ఇరాన్‌లో అశాంతితో చమురు రవాణా తగ్గి భారత్‌కు ఆర్థికంగా నష్టం కలుగుతున్నదని, వెంటనే ఇస్లామిక్ రీజియన్‌లో సుస్థిరత నెలకొల్పేందుకు అమెరికా కృషిచేయాలని మోదీ.. ట్రంప్ ను కోరారు. జపాన్‌లోని ఒసాకాలో జరుగు తున్న జీ-20 సదస్సు సందర్భంగా మోదీ, ట్రంప్ సమావేశమయ్యారు. లోక్‌సభ ఎన్నికల్లో గెలుపొంది మరోసారి భారత ప్రధానిగా ఎన్నికైన మోదీని ట్రంప్ అభినందించారు. 'మీరు అఖండ విజయం సాధించారు. దీనికి మీరు అర్హులు' అని కొనియాడారు. తాము మంచి స్నేహితులుగా మారడంతో భారత్-అమెరికా మధ్య సంబంధాలు గతంలో ఎన్నడూ లేనంతగా దృఢంగా మారాయన్నారు. భారత్ పట్ల ప్రేమ కురిపిస్తున్నందుకు ట్రంప్‌కు మోదీ కృతజ్ఞతలు తెలిపారు. 'ఇద్దరి మధ్య సుహృద్భావ వాతావరణంలో, ఫలవంతంగా, విస్తృతస్థాయిలో చర్చలు జరిగాయి. సాంకేతిక పరిజ్ఞానం సామర్థ్యం పెంపుతోపాటు ఇరుదేశాల మధ్య రక్షణ, వాణిజ్య సంబంధాలపై చర్చించాం. అమెరికాతో మరింత మెరుగైన సాంస్కృతిక, వాణిజ్య సంబంధాలను కోరుకుంటున్నాం' అని చర్చల తర్వాత మోదీ ట్వీట్ చేశారు.

**5జీ అభివృద్ధిలో కలిసి పనిచేద్దాం**

మోదీ, ట్రంప్ 5జీ నెట్‌వర్క్ అభివృద్ధి, ఇరాన్, వాణిజ్యం, రక్షణ తదితర అంశాలపై చర్చించారు. ముఖ్యంగా 5జీ టెక్నాలజీ విషయంలో కలిసి పనిచేద్దామని ట్రంప్ ప్రతిపాదించారు. త్వరలో మొబైల్ ఫోన్ల వినియోగదారుల సంఖ్య 100 కోట్లకు చేరడంతో భారత్ ప్రపంచంలోనే రెండో అతిపెద్ద మార్కెట్‌గా మారనున్నదని మోదీ పేర్కొన్నారు. భారత్ నిర్ణయాలు ప్రపంచానికి మార్గదర్శిగా నిలుస్తాయన్నారు. ఈ నేపథ్యంలో భారత్‌లో 5జీ టెక్నాలజీ అభివృద్ధి. విస్తరణకు అమెరికా కంపెనీల సాయం తీసుకోవాలని ట్రంప్ కోరారు. అదేసమయంలో చైనాకు చెందిన హువావేపై నిషేధం విధించాలని పరోక్షంగా సూచించారు. భద్రతారీత్యా హువావే ఉత్పత్తులను అమెరికా నిషేధించిన సంగతి తెలిసిందే. భారత్‌లో త్వరలో 5జీ ట్రయల్స్ చేపట్టనున్న నేపథ్యంలో హువావేను పక్కనబెట్టాలని అమెరికా కోరింది. మరోవైపు దీనిపై భారత్ స్వతంత్ర నిర్ణయం తీసుకోవాలని హువావే కోరుతున్నది. ఎలాంటి అవకతవకలకు పాల్పడబోమని హామీ పత్రం ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నది. దీనిపై ఇంకా ఏ నిర్ణయం తీసుకోలేదని ట్రంప్‌కు మోదీ తేల్చి చెప్పారని విదేశాంగశాఖ కార్యదర్శి విజయ్ గోఖలే తెలిపారు. '5జీ టెక్నాలజీ అభివృద్ధిలో అమెరికాతో కలిసి పనిచేసేందుకు మోదీ సంసిద్ధత వ్యక్తం చేశారు. ఇరుదేశాలకూ ప్రయోజనం కలిగేలా తదుపరి చర్యలు ఉండాలని స్పష్టం చేశారు. అంతిమంగా ప్రధాని దృష్టి మేకిన్ ఇండియా మీదే ఉన్నది' అని గోఖలే అన్నారు. మోదీ ప్రతిపాదనను ట్రంప్ స్వాగతించారని చెప్పారు. 5జీ పై మరిన్ని సంప్రదింపులకు త్వరలో ఇరుదేశాల శాస్త్రసాంకేతిక, విదేశాంగ మంత్రులు సమావేశం కావాలని నిర్ణయించారన్నారు. రక్షణ అంశాలపై చర్చలో రష్యా నుంచి భారత్ కొనుగోలు చేస్తున్న ఎస్-400 క్షిపణి నిరోధక వ్యవస్థల అంశం ప్రస్తావనకు రాలేదన్నారు.

**ఇరాన్‌లో శాంతి, సుస్థిరత నెలకొనాలి**

ఇరాన్ విషయంలో భారత్ తన ఆందోళనల ను ట్రంప్ ముందు ఉంచింది. భారత ఇంధన అవసరాల్లో 11% ఇరాన్ తీరుస్తున్నదని మోదీ గుర్తుచేశారు. ఇప్పటికే ఇరాన్ చమురు రవాణాను తగ్గించడంతో భారత్‌కు ఆర్థికంగా నష్టం కలుగుతున్నదన్నారు. ఈ పరిస్థితి నుంచి గట్టెక్కేందుకు వెంటనే ఇస్లామిక్ రీజియన్‌లో శాంతి నెలకొనాలని స్పష్టం చేశారు. దీనిపై ట్రంప్ స్పందిస్తూ ఆ ప్రాంతంలో శాంతికి తమ చర్యలను వివరించారు. త్వరలోనే చమురు ధరలు దిగివస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. కాగా, భారత్-అమెరికా మధ్య కొన్నాళ్లుగా సాగుతున్న వాణిజ్య యుద్ధానికి స్వస్తి పలికేందుకు త్వరలో ఇరుదేశాల వాణిజ్యశాఖ మంత్రుల సమావేశం కావాలని నిర్ణయించారు.

## జపాన్‌లో జీ-20 సదస్సు సందర్భంగా ప్రధాని మోదీ, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ భేటీ

- లోక్‌సభ ఎన్నికల్లో ఘన విజయంపై మోదీని అభినందించిన ట్రంప్
- 5జీ నెట్‌వర్క్, ఇరాన్, వాణిజ్యం, రక్షణ తదితర అంశాలపై చర్చ
- ఇరు దేశాల మధ్య వాణిజ్య యుద్ధానికి ముగింపు పలుకడంపైనా దృష్టి
- ఉగ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడాలని ప్రపంచ దేశాలకు పిలుపు
- టెక్నాలజీని సామాన్యుల చెంతకు చేర్చేందుకు '5-ఐ' విధానం ప్రతిపాదన

బ్రిక్స్ కూటమి సభ్య దేశాల అధినేతలతో ప్రధాని నరేంద్ర మోదీ

## ఉగ్రవాదంతో మానవాళికి ముప్పు

**ఒసాకా:** ఉగ్రవాదంతో మానవాళికి పెను ముప్పు పొంచి ఉన్నదని, అమాయకులను చంపడంతోపాటు ఆర్థికవృద్ధిని, సామాజిక సుస్థిరతను ఉగ్రవాదం దెబ్బతీస్తున్నదని ప్రధాని నరేంద్రమోదీ అన్నారు. ప్రపంచ సమస్యగా మారిన ఉగ్రవాద నిర్మూలనకు అన్ని దేశా లు కలిసి కృషి చేయాలని పిలుపునిచ్చా రు. జీ-20 సదస్సులో భాగంగా జరిగిన బ్రిక్స్ దేశాధినేతల భేటీలో మోదీ మాట్లాడుతూ డబ్ల్యూటీవో బలోపేతం, వాణిజ్యంలో రక్షణవాదం, ఇంధన భద్రత, ఉగ్రవాదం తదితర అంశాలపై మోదీ చర్చించారు. 'ఈ రోజు మనం 3 సవాళ్లపై చర్చించాలి. మొదటిది ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో అస్థిరత్వం, పతనం. రెండోది అన్ని రంగాల్లో సుస్థిరాభివృద్ధి. మూడోది ఉగ్రవాదం' అని అన్నారు. అసమానతలు తగ్గించి, సాధికారతకు కృషిచేస్తేనే ప్రగతికి సార్థకత అన్నారు. ఈ సవాళ్లను ఎదుర్కొనేందుకు ఐదు సూత్రాలను సూచించారు. 'వాణిజ్యంలో అసమానతల తొలిగింపునకు, బహుళపాక్షిక విధానాల్లో మెరుగుదలకు అంతర్జాతీయ వ్యాపార, ఆర్థిక సంస్థల్లో సంస్కరణలపై దృష్టిసారించాలి. స్థిరమైన ఆర్థికాభివృద్ధికి చమురు, గ్యాస్ తక్కువ ధరలకే అందుబాటులో ఉండేలా చూడాలి. సుస్థిర, సమ్మిళిత అభివృద్ధికి కొత్త అభివృద్ధి బ్యాంకును నెలకొల్పాలి. సంపన్న, వర్ధమాన దేశాల్లో విపత్తులను సమర్థంగా ఎదుర్కొనగలిగేలా నిర్మాణాలుండాలి. నిపుణులు ఎక్కడికైనా వెళ్లగలిగేలా నిబంధనలు సులభతరం చేయాలి' అని అన్నారు. ఉగ్రవాదంపై పోరుకు ప్రపంచస్థాయి సదస్సును నిర్వహించాలన్నారు. ఉగ్రవాద సంస్థలకు నిధులందకుండా అడ్డుకట్ట వేయాలని ప్రపంచదేశాలను బ్రిక్స్ కూటమి కోరింది.

**'5-ఐ'తో సామాన్యుల చెంతకు టెక్నాలజీ**

జీ-20 సదస్సులో ప్రధాని మోదీ మాట్లాడుతూ టెక్నాలజీ సేవలు సామాన్యులకు చేరినప్పుడే సుస్థిరాభివృద్ధి సాధ్యమన్నారు. సాంకేతికత సమాజానికి ఉపయోగపడేందుకు '5-ఐ' విధానం పాటించాలన్నారు. అవే.. సమ్మిళిత (ఇంక్లూజివ్‌నెస్), స్థానికీకరణ (ఇండిజినైజేషన్), ఆవిష్కరణ (ఇన్నోవేషన్), మౌలిక సదుపాయాల్లో పెట్టుబడి (ఇన్వెస్ట్‌మెంట్ ఇన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్), అంతర్జాతీయ సహకారం (ఇంటర్నేషనల్ కోఆపరేషన్) అని అన్నారు.

# కాంగ్రెస్‌లో రాజీనామాల వెల్లువ

## పదవుల నుంచి తప్పుకుంటున్న కీలక నేతలు

## పార్టీ అధ్యక్షుడిగా కొనసాగుతానని రాహుల్ హామీఇవ్వాలని డిమాండ్

**న్యూఢిల్లీ, జూన్ 28:** అన్ని స్థాయిల్లోనూ పార్టీని పునర్వ్యవస్థీకరించేందుకు రాహుల్ గాంధీకి పూర్తి స్వేచ్ఛనివ్వాలని పేర్కొంటూ కాంగ్రెస్ లీగల్, మానవ హక్కుల సెల్ అధ్యక్షుడు వివేక్ తంఖా తన పదవికి రాజీనామా చేసిన నేపథ్యంలో చాలామంది పార్టీ నేతలు ఆయన బాటలోనే నడుస్తున్నారు. తమ పదవులకు రాజీనామాలు సమర్పిస్తున్నారు. మధ్యప్రదేశ్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి దీపక్ బబారియా, గోవా కాంగ్రెస్ అధ్యక్షుడు గిరీశ్ చోడంకర్, తెలంగాణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పొన్నం ప్రభాకర్, ఢిల్లీ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజేశ్ లిలోథియా సహా 120 మంది ఆఫీస్ బేరర్లు తమ పదవులకు రాజీనామా చేశారు. పార్టీ అధ్యక్షుడిగా కొనసాగుతానని రాహుల్ హామీ ఇచ్చేంత వరకు రాజీనామాలు ఉపసంహరించుకోమని వారు స్పష్టంచేశారు. 'లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ పరాభవానికి బాధ్యత వహిస్తూ నేను రాజీనామా చేశా. ఇతరులు బాధ్యత వహించాలా వద్దా అన్నది వారి అభిష్టానికే వదిలేస్తున్నా' అని గురువారం హర్యానా కాంగ్రెస్ నేతలతో రాహుల్ వ్యాఖ్యానించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పార్టీలో తన టీమ్‌ను ఎంపిక చేసుకునేందుకు రాహుల్‌కు స్వేచ్ఛనివ్వాలని పేర్కొంటూ వివేక్ రాజీనామా సమర్పించారు. 'రాహుల్‌జీ.. పార్టీకి పునర్వైభవం తీసుకొచ్చేందుకు విప్లవాత్మక మార్పులు తెండి. ఎలాంటి పరిస్థితులు ఎదురైనా నేను మీతోనే ఉంటా' అని ట్వీట్ చేశారు.

**రాహుల్ కొనసాగరు: మొయిలీ**

**హైదరాబాద్:** కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా రాహుల్‌గాంధీ కొనసాగే అవకాశాల్లేవని కాంగ్రెస్ నేత వీరప్ప మొయిలీ అన్నారు. రాజీనామాను సీడబ్ల్యూసీ తిరస్కరించినా.. రాహుల్ తన నిర్ణయం నుంచి వెనుకకు మళ్లేందుకు ఒక్క శాతం కూడా అవకాశం లేదని భావిస్తున్నానని మొయిలీ శుక్రవారం పీటీఐ వార్తాసంస్థకు చెప్పారు. పార్టీకి కొత్త అధ్యక్షుడి ఎన్నికపై కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. కొంతమంది కాంగ్రెస్ నాయకులు రాహుల్‌గాంధీ సోదరి ప్రియాంకకు పార్టీ సారథ్యం అప్పగించాలని కోరుతున్న విషయాన్ని ప్రస్తావించగా, దానిపై వ్యాఖ్యానించేందుకు మొయిలీ నిరాకరించారు.

# మీరా ప్రజాస్వామ్య పాఠాలు నేర్పేది?

## దేశంలో 93సార్లు రాష్ట్రపతి పాలన విధించారు

## మూడో వంతు కశ్మీర్ మన వద్ద లేదు.. కారణమెవరు?

## లోక్‌సభలో కాంగ్రెస్‌పై అమిత్ షా నిప్పులు

## కశ్మీర్‌లో రాష్ట్రపతి పాలన మరో ఆర్నెల్లు పొడిగింపు

**న్యూఢిల్లీ, జూన్ 28:** ప్రజాస్వామ్యం గురించి కాంగ్రెస్ పార్టీ నుంచి తాము పాఠాలు నేర్చుకోవాల్సిన అవసరం లేదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. దేశంలో ఇప్పటివరకు 132 సార్లు రాష్ట్రపతి పాలన విధిస్తే.. అందులో 93 సార్లు కాంగ్రెస్ హయాంలోనే విధించారని, రాష్ట్ర ప్రభుత్వాలను ఆ పార్టీ విచ్ఛిన్నం చేసిందని మండిపడ్డారు. 'మీరా మాకు ప్రజాస్వామ్య పాఠాలు నేర్పేది?' అని కాంగ్రెస్‌ను దుయ్యబట్టారు. జమ్ము కశ్మీర్‌లో ఉగ్రవాదానికి, ఆ రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులకు కాంగ్రెస్ పార్టీనే కారణమని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వాల విధానాల కారణంగానే జమ్ము కశ్మీర్ ప్రజలకు, దేశానికి మధ్య అంతరం పెరిగిందని విమర్శించారు. ఈ అంతరాన్ని పూడ్చి, రాష్ట్రం నుంచి ఉగ్రవాదాన్ని తరిమివేసేందుకు తమ ప్రభుత్వం కృషి చేస్తున్నదని చెప్పారు. జమ్ము కశ్మీర్‌లో రాష్ట్రపతి పాలన పొడిగింపు బిల్లు, జమ్ము కశ్మీర్ రిజర్వేషన్ (సవరణ) బిల్లుకు మూజువాణి ఓటుతో శుక్రవారం లోక్‌సభ ఆమోదం తెలిపింది. దీంతో జమ్ము కశ్మీర్‌లో జూలై 3 నుంచి మరో ఆరు నెలల పాటు రాష్ట్రపతి పాలన పొడిగించినట్లయింది. గతంలో జారీచేసిన ఆర్డినెన్స్ స్థానంలో ఈ బిల్లు తీసుకొచ్చారు. అలాగే జమ్ము కశ్మీర్ రిజర్వేషన్ బిల్లు ద్వారా ఆ రాష్ట్రంలో అంతర్జాతీయ సరిహద్దు వెంబడి నివసిస్తున్న ప్రజలకు విద్య, ఉద్యోగాల్లో మూడు శాతం రిజర్వేషన్లు కల్పిస్తారు. ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకటించిన వెంటనే జమ్ము కశ్మీర్‌లో ప్రజాస్వామ్యయుతంగా, స్వేచ్ఛగా, పారదర్శకంగా ఎన్నికలు నిర్వహిస్తామని అమిత్ షా లోక్‌సభలో వెల్లడించారు. భద్రతా సిబ్బంది కొరత కారణంగానే లోక్‌సభ ఎన్నికలతోపాటే ఆ రాష్ట్ర అసెంబ్లీకి ఎన్నికలు నిర్వహించలేదని ఓ ప్రశ్నకు సమాధానమిచ్చారు. రాష్ట్రంలో పరిస్థితులు మెరుగయ్యాయని, అమర్‌నాథ్‌యాత్ర ముగిసిన అనంతరం ఎన్నికలు నిర్వహిస్తామని చెప్పారు. జమ్ము కశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370 తాత్కాలికమైనదేనని, శాశ్వతమైనది కాదని స్పష్టంచేశారు.

**కశ్మీర్ సమస్యకు నెహ్రూ నిర్ణయాలే కారణం..**

లోక్‌సభలో తొలిసారి ప్రసంగించిన అమిత్‌షా.. కాంగ్రెస్‌పై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. 'ప్రస్తుతం జమ్ము కశ్మీర్‌లో మూడో వంతు భూభాగం మన అధీనంలో లేదు. స్వాతంత్ర్యానంతరం పాకిస్థాన్.. జమ్ముకశ్మీర్‌లోకి చొరబడి, మూడో వంతు ఆక్రమించుకున్న తర్వాత కాల్పుల విరమణ ప్రకటించినది ఎవరు? నెహ్రూనే. నాటి హోం మంత్రి, డిప్యూటీ ప్రధాని సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ అభిప్రాయాలను ఆయన పరిగణనలోకి తీసుకోలేదు' అని షా విమర్శలు గుప్పించారు. కాల్పుల విరమణ ప్రకటించే ముందు సర్దార్ పటేల్‌ను పరిగణనలోకి తీసుకొని ఉంటే.. పాక్ ఆక్రమిత కశ్మీర్ ఏర్పడి ఉండేది కాదని, జమ్ము కశ్మీర్‌లో ఉగ్రవాదానికి తావుండేది కాదని ఆరోపించారు. దీనిపై కాంగ్రెస్ సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో తాను నెహ్రూ పేరుకు బదులుగా తొలి ప్రధానిగా సంబోధిస్తానని షా బదులిచ్చారు.

**ఉగ్రవాదంపై ఉక్కుపాదం..**

ఉగ్రవాదం పట్ల తమ ప్రభుత్వం జీరో టాలెరెన్స్ (ఎంతమాత్రం రాజీపడని) విధానాన్ని అవలంబిస్తున్నదని అమిత్ షా చెప్పారు. దేశాన్ని విభజించేందుకు ప్రయత్నించే వారి గుండెల్లో భయం నెలకొందని, రాబోయే రోజుల్లో ఇది మరింత పెరుగుతుందని పేర్కొన్నారు. జమ్ము కశ్మీర్‌లో 919 మందికి ప్రభుత్వం భద్రత ఉపసంహరించుకుందని, వారికి ప్రాణహాని లేకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. గతంలో దేశానికి వ్యతిరేకంగా మాట్లాడేవారికి భద్రత కల్పించే వారని, వాస్తవానికి దేశం కోసం మాట్లాడేవారే హత్యకు గురయ్యారని చెప్పారు. 'ఇన్సానియాత్ (మానవత), జమ్హూరియత్ (ప్రజాస్వామ్యం), కశ్మీరియత్ (హిందూ ముస్లింల సహజీవనం)' అన్న వాజపేయి మాటలను ఉటంకిస్తూ.. కాంగ్రెస్ పాలనలో ప్రజల హక్కులు అణచివేయబడ్డాయని విమర్శించారు. 'మెడిసిన్'తోనే ఉగ్రవాదాన్ని నిర్మూలించగలమని, ప్రజల్లో ఎలాంటి భయాందోళనలు అవసరం లేదన్నారు. జమ్ముకశ్మీర్‌లో భద్రత పెంపునకు ప్రభుత్వం రూ.2,307 కోట్లు వ్యయం చేసిందని తెలిపారు.

## క్రైస్తవుల్లో నిరుద్యోగం అత్యధికం

### కేంద్రమంత్రి నఖ్వీ వెల్లడి

**న్యూఢిల్లీ, జూన్ 28:** దేశంలో అన్ని మతాల వారికన్నా క్రైస్తవుల్లోనే నిరుద్యోగం అధికంగా ఉన్నదని కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌కు తెలిపింది. తృణమూల్ కాంగ్రెస్ ఎంపీ ప్రసన్‌బెనర్జీ అడిగిన ప్రశ్నకు కేంద్రమంత్రి ముఖ్తార్ అబ్బాస్ నఖ్వీ సమాధానమిచ్చారు. 'అన్ని మతాల పురుషులకన్నా క్రైస్తవ పురుషుల్లోనే నిరుద్యోగం అధికంగా ఉన్నది. గ్రామీణ ప్రాంతాల్లో క్రైస్తవ పురుషుల నిరుద్యోగ శాతం 6.9 కాగా.. పట్టణ ప్రాంతాల్లో 8.8 శాతంగా ఉంది. అదే గ్రామీణ ప్రాంతాల్లో హిందూ పురుషుల నిరుద్యోగ శాతం 5.7 కాగా.. ముస్లిం పురుషుల్లో 6.7 శాతం, సిక్కు పురుషుల్లో 6.4 శాతం నిరుద్యోగులు ఉన్నారు. ఇక పట్టణ ప్రాంతంలో హిందూ పురుషుల్లో 6.9 శాతం, ముస్లిం పురుషుల్లో 7.5 శాతం, సిక్కు పురుషుల్లో 7.2 శాతం నిరుద్యోగం ఉన్నది. పట్టణ ప్రాంతంలో 16.9 శాతం నిరుద్యోగంతో సిక్కు మహిళలు తొలిస్థానంలో, గ్రామీణ ప్రాంతంలో 8.8 శాతంతో క్రైస్తవ మహిళలు మొదటిస్థానంలో నిలిచారు' అని పేర్కొన్నారు.

# జల ఘోష

## తాగునీటి ఎద్దడితో అల్లాడుతున్న నగరాలు

## వచ్చే ఏడాదికి దేశంలో 21 నగరాల్లో 'డే జీరో' పరిస్థితి!

**ఆకాశగంగమ్మ** అలిగెల్లిపోయింది.. పాతాళ గంగమ్మ పైకి రానంటున్నది.. కరువు రక్కసి కోరలు చాస్తున్నది.. దేశంలో నీటి సంక్షోభం తీవ్రరూపం దాలుస్తున్నది. దాదాపు 50 శాతం ప్రాంతాల్లో తాగునీటికి తీవ్ర కొరత ఏర్పడింది. ఆలస్యంగా పలుకరించిన రుతుపవనాలు, అంతంతమాత్రంగానే వర్షాలు కురిపించడంతో చెన్నై, బెంగళూరులో పరిస్థితి దయనీయంగా మారింది. ముఖ్యంగా చెన్నై ప్రజలు నీటి సమస్యతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వచ్చే ఏడాదికి దేశంలో 21 నగరాలు 'డే జీరో' స్థితికి చేరుకుంటాయని నీతి ఆయోగ్ గతేడాది విడుదల చేసిన నివేదికలో హెచ్చరించింది. ఇందులో బెంగళూరు, చెన్నై, ఢిల్లీ, హైదరాబాద్ వంటి నగరాలు ఉన్నాయి. ఏదేని ప్రాంతంలో సొంతంగా తాగునీరు అందించలేని రోజు డే జీరోగా పరిగణిస్తారు. నీటి సంక్షోభ నివారణకు కేంద్ర ప్రభుత్వం కొత్తగా జలశక్తి మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేసింది. అయితే మిగులు జలాలు ఉన్న భారత్‌లో.. నేడు ఈ నీటి కటకటకు కారణాలేంటి?

**లభ్యత, సరఫరాలో అసమతుల్యత**

వివిధ వనరుల ద్వారా 81 శాతం కుటుంబాలు రోజుకు సగటున 40 లీటర్ల నీటిని వినియోగిస్తున్నాయి. గ్రామీణ ప్రాంతాల్లో 18-20 శాతం కుటుంబాలకు మాత్రమే నీటి కనెక్షన్లు ఉన్నాయి. నీటి లభ్యత, సరఫరాలో ఇది అసమతుల్యతకు దారి తీస్తున్నది. నీతి ఆయోగ్ నివేదిక ప్రకారం.. 75 శాతం కుటుంబాలకు ఇంటి పరిసరాల్లో తాగునీటి వసతి లేదు. అదే గ్రామీణ ప్రాంతాల్లో 84 శాతం కుటుంబాలకు తాగునీటి సౌకర్యం లేదు. రోజుకు సగటున ఒక మనిషికి 25 లీటర్ల నీరు అవసరమని డబ్ల్యూహెచ్‌వో అంచనా.

**8 శాతం నీటినే ఒడిసిపడుతున్నాం**

భారత్‌లో 100 కోట్లకుపైగా జనాభాకు నీటి అవసరాలను తీర్చగల వర్షాలు కురుస్తున్నాయి. సెంట్రల్ వాటర్ కమిషన్ వివరాల ప్రకారం.. దేశానికి గరిష్ఠంగా ఏడాదికి 3000 బిలియన్ క్యూబిక్ మీటర్ల నీరు అవసరం కాగా, 4000 బిలియన్ క్యూబిక్ మీటర్ల వర్షపాతం నమోదవుతున్నది. అయితే భారత్ కేవలం వార్షిక వర్షపాతంలో 8 శాతం నీటినే ఒడిసిపడుతున్నది. ప్రపంచంలో ఇదే అత్యల్పం.

– నేషనల్ డెస్క్

## ఇష్టారీతిన భూగర్భ జలాల వినియోగం..

భూగర్భ జలాలను ఇష్టారాజ్యంగా తోడుకోవడంలో భారత్ తొలి స్థానంలో ఉంది. ఆ తర్వాతి స్థానాల్లో చైనా, అమెరికా ఉన్నాయి. ఆ రెండు దేశాలు కలిసి వినియోగిస్తున్న భూగర్భ జలాల కంటే అధికంగా మనదేశం భూగర్భ నీటిని వాడుతుండడం గమనార్హం. దేశంలో సాగు, తాగునీటి అవసరాల్లో అత్యధిక వాటా భూగర్భ జలాలదేనని 2015లో స్టాండింగ్ కమిటీ తన నివేదికలో వెల్లడించింది. భారతీయులు ఏడాదికి సరాసరిన 230 క్యూబిక్ మీటర్ల భూగర్భ నీటిని వినియోగిస్తున్నారని, ప్రపంచ మొత్తం వినియోగంలో ఇది పావువంతు కంటే ఎక్కువేనని ఐఐటీ ఖరగ్‌పూర్, కెనడా వర్సిటీ అధ్యయనంలో తేలింది.

## ఆక్రమణలు

దేశంలో చాలా ప్రాంతాల్లో జలాశయాలు ఆక్రమణకు గురయ్యాయి. చెన్నైలో డజనుకుపైగా జలాశయాలు ఉండగా, ప్రస్తుతం చాలా వినియోగంలో లేవు. భూగర్భజలాలు అత్యధికంగా వినియోగిస్తున్న జిల్లాలు 1995లో 3 శాతం ఉండగా, 2011 నాటికి 15 శాతానికి పెరిగాయని పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ తన నివేదికలో వెల్లడించింది.

ముంబైలో మోకాళ్లలోతు మేర నిలిచిన నీటిలో రోడ్డు దాటుతున్న కుటుంబం

# 

## పాయింట్ల పట్టిక

| స్థానం | జట్టు | ఆ | గె | ఓ | ఫ.తే. | ర.రే | పా |
|---|---|---|---|---|---|---|---|
| 1. | ఆస్ట్రేలియా | 7 | 6 | 1 | 0 | +0.90 | 12 |
| 2. | భారత్ | 6 | 5 | 0 | 1 | +1.16 | 11 |
| 3. | న్యూజిలాండ్ | 7 | 5 | 1 | 1 | +1.09 | 11 |
| 4. | ఇంగ్లండ్ | 7 | 4 | 3 | 0 | +1.05 | 8 |
| 5. | బంగ్లాదేశ్ | 7 | 3 | 3 | 1 | -0.13 | 7 |
| 6. | పాకిస్థాన్ | 7 | 3 | 3 | 1 | -0.97 | 7 |
| 7. | శ్రీలంక | 7 | 2 | 3 | 2 | -1.18 | 6 |
| 8. | దక్షిణాఫ్రికా | 8 | 2 | 5 | 1 | -0.08 | 5 |
| 9. | వెస్టిండీస్ | 7 | 1 | 5 | 1 | -0.32 | 3 |
| 10. | ఆఫ్ఘనిస్థాన్ | 7 | 0 | 7 | 0 | -1.63 | 0 |

ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, ఫ.తే- ఫలితం తేలనివి, ర.రే - నెట్ ర.రేరేట్, పా-పాయింట్లు,

**వరల్డ్‌కప్‌లో నేడు** ఆఫ్ఘనిస్తాన్ X పాకిస్థాన్ - 3 గం. న్యూజిలాండ్ X ఆస్ట్రేలియా - 6 గం.

**స్టార్ స్పోర్ట్స్‌లో**

**అత్యధిక పరుగులు** 500 వార్నర్ (ఆస్ట్రేలియా)

**అత్యధిక వికెట్లు** 19 స్టార్క్ (ఆస్ట్రేలియా)

# నేను ఔటా కాదా..చెప్పండి..

### నెటిజన్లకు రోహిత్‌శర్మ ప్రశ్న

**మాంచెస్టర్:** టీమ్‌ఇండియా ఓపెనర్ రోహిత్‌శర్మ ఔట్ చిలికి చిలికి గాలివానలా మారుతున్నది. వెస్టిండీస్‌తో గురువారం జరిగిన ప్రపంచకప్ లీగ్ మ్యాచ్‌లో రోహిత్ ఔటైన తీరు అందరినీ ఆశ్చర్యపరిచిన సంగతి తెలిసిందే. కీమర్ రోచ్ బౌలింగ్‌లో షాట్ ఆడబోయిన హిట్‌మ్యాన్..వికెట్ కీపర్ షాయి హోప్ క్యాచ్‌తో వెనుదిరిగాడు. ఔట్‌పై ఫీల్డ్ ఎంపైర్ రిచర్డ్ ఇల్లింగ్‌వర్త్ తిరస్కరణతో డీఆర్ఎస్‌కు వెళ్లిన విండీస్‌కు అనూహ్యంగా సానుకూల ఫలితం దక్కింది. పలుమార్లు రిప్లేను పరిశీలించిన థర్డ్ అంపైర్ మిచెల్ గాఫ్..రోహిత్ ఔట్ అంటూ ప్రకటించాడు. దీంతో ఒకింత ఆశ్చర్యానికి గురైన ఈ ముంబైకర్ భారంగా పెవిలియన్‌కు వెళ్లడం టీవీల్లో స్పష్టంగా కనిపించింది. అయితే బంతి బ్యాటుకు తాకకపోయిన ఔట్ ఇవ్వడంపై సోషల్‌మీడియాలో రోహిత్ చర్చకు పెట్టాడు. ఫొటోను పోస్ట్ చేస్తూ తాను ఔటా కాదా మీరే చెప్పండి అంటూ ట్విట్టర్‌లో అభిమానులను ప్రశ్నించాడు. వాస్తవానికి బ్యాట్‌కు, ప్యాడ్ మధ్య నుంచి బంతి వెళ్లడం స్పష్టంగా కనిపిస్తున్నది. దీనిపై అటు సోషల్‌మీడియాలో మాజీ క్రికెటర్ల నుంచి మొదలుపెడితే అభిమానుల వరకు రోహిత్ ఔట్‌పై సెటైర్లు గుప్పిస్తున్నారు. ఆది నుంచి విమర్శలు ఎదుర్కొంటున్న డీఆర్ఎస్ పద్ధతిపై అందరూ పెదవి విరుస్తున్నారు. టెక్నాలజీతో కచ్చితమైన ఫలితాలు రావాల్సిందిపోయి..ఇలాంటి నిర్ణయాలేంటని ప్రశ్నిస్తున్నారు. మరి ఇలాంటి వాటిపై ఐసీసీ ఏం సమాధానం చెబుతుందో చూడాలి.

# ఆరెంజ్ జెర్సీలో..

### ఇంగ్లండ్‌తో మ్యాచ్‌కు కొత్త అవతారంలో కోహ్లీసేన

**న్యూఢిల్లీ:** ప్రపంచకప్‌లో భారత జట్టు జెర్సీపై గత కొన్ని రోజులుగా నెలకొన్న సందిగ్ధతకు ఎట్టకేలకు తెరపడింది. వివాదాలు, అంచనాలకు ఫుల్‌స్టాప్ పెడుతూ ఇంగ్లండ్‌తో మ్యాచ్‌లో టీమ్‌ఇండియా క్రికెటర్లు ధరించే జెర్సీని బీసీసీఐ శుక్రవారం అధికారికంగా విడుదల చేసింది. అందరూ అనుకున్నట్లుగానే నారింజ, నీలి రంగు కాంబినేషన్‌లో కొత్త డ్రెస్ అదిరిపోయేలా కనిపిస్తున్నది. జట్టు అధికారిక స్పాన్సర్ నైకీ సంస్థ అత్యుత్తమ శ్రేణిలో జెర్సీకి రూపకల్పన చేసింది. ఆటగాళ్లకు అనుకూలంగా ఉండే విధంగా డ్రెస్‌ను డిజైన్ చేశారు. తేలికపాటిగా, శరీరంపై చెమట త్వరగా ఆరిపోయేలా సౌకర్యవంతంగా జెర్సీని మలిచారు. ఫిఫా టోర్నీల తరహాలో గతానికి భిన్నంగా ఐసీసీ ఈసారి రెండు జెర్సీల ఫార్మాట్‌ను తీసుకొచ్చింది. దీని ప్రకారం ఆతిథ్య జట్టు ఇంగ్లండ్ మినహా అన్ని జట్లు వేర్వేరు రంగుల్లో జెర్సీలను(హోమ్ అండ్ అవే) ఎంచుకోవాల్సి ఉంటుంది. జెర్సీలు దాదాపు ఒకే రంగులో ఉండటం వలన ఇంగ్లండ్‌తో మ్యాచ్‌లో కోహ్లీసేన కొత్త అవతారంలో బరిలోకి దిగుతున్నది. మరి ఇన్నాళ్లు నీలి రంగుకు అలవాటు పడ్డ అభిమానులకు టీమ్‌ఇండియా అదిరేటి ఆరెంజ్ జెర్సీలో అలరించనుంది. చాహల్, షమీ, రాహుల్ కొత్త జెర్సీలు ధరించి ఫొటోలను సోషల్‌మీడియాలో అభిమానుల కోసం షేర్ చేశారు.

శుక్రవారం ఐఐటీ కాన్పూర్‌లో ఇస్రో మాజీ చైర్మన్, ప్రొఫెసర్ రాధాకృష్ణన్ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకుంటున్న భారత బ్యాడ్మింటన్ చీఫ్ కోచ్ పుల్లెల గోపీచంద్. గతంలో మాజీ రాష్ట్రపతి ఏపీజే అబ్దుల్ కలాం, మాజీ ప్రధాని మన్మోహన్ సింగ్ ఇక్కడి నుంచి డాక్టరేట్ పొందారు.

## స్వల్ప స్కోర్లను కాచుకునే సత్తా ఉంది

**మాంచెస్టర్:** స్వల్ప స్కోర్లను కాపాడుకునే సత్తా భారత్‌కు ఉందని.. ఆఫ్ఘనిస్థాన్, వెస్టిండీస్‌పై విజయాలతో స్పష్టమైందని మణికట్టు స్పిన్నర్ కుల్దీప్ యాదవ్ పేర్కొన్నాడు. 'బుమ్రా అద్భుతంగా బౌలింగ్ చేస్తున్నాడు. అంతర్జాతీయ అరంగేట్రం నుంచే ప్రత్యర్థులను ఇబ్బంది పెడుతున్నాడు. షమీ కూడా ఇరగదీస్తున్నాడు. ఆడింది రెండు మ్యాచ్‌లే అయినా అదరగొట్టాడు. మా వద్ద మెరుగైన ఫాస్ట్ బౌలింగ్ విభాగానికి తోడు స్పిన్నర్లూ ఉన్నారు. దీంతో పని తేలికవుతున్నది. జట్టుగా చూసుకుంటే మా కూర్పు బాగుంది. ఆఫ్ఘన్‌పై 225 పరుగుల స్కోరును కాపాడుకోగలిగాం. విండీస్‌పై 250 రన్స్ చేస్తే చాలు అనుకున్నాం. కానీ ధోనీ, హార్దిక్ అసమాన పోరాటంతో మెరుగైన స్కోరు అందించారు. ఈ వికెట్‌పై 270 పరుగులు భారీ స్కోరు కిందే లెక్క. తొలి ఇన్నింగ్స్ తర్వాత బంతి కాస్త ఎక్కువ టర్న్ అయింది. అయితే ఆరంభంలో షమీ రెండు వికెట్లు తీసి మంచి ఆరంభాన్నివ్వడం కలిసొచ్చింది. ఈ మ్యాచ్‌లో ఒక వికెట్ తీయడం నా వరకు సంతృప్తినిచ్చింది'అని కుల్దీప్ చెప్పుకొచ్చాడు.

## బ్రాత్‌వైట్‌కు జరిమానా

**మాంచెస్టర్:** వెస్టిండీస్ ఆల్‌రౌండర్ బ్రాత్‌వైట్‌కు మరోసారి జరిమానా పడింది. ప్రపంచకప్‌లో భాగంగా గురువారం భారత్‌తో జరిగిన మ్యాచ్‌లో నిబంధనలను అతిక్రమించినందుకు గాను ఐసీసీ.. అతడి మ్యాచ్ ఫీజులో 15 శాతం కోత విధించడంతో పాటు ఒక డీ-మెరిట్ పాయింట్ కేటాయించింది. టీమ్‌ఇండియా ఇన్నింగ్స్ 42వ ఓవర్ సందర్భంగా తాను వేసిన బంతిని వైడ్‌గా ప్రకటించిన అంపైర్ నిర్ణయంపై బ్రాత్‌వైట్ అసంతృప్తి వ్యక్తం చేయడంతో పాటు వాగ్వాదానికి దిగాడు. దీంతో అతడిపై ఆర్టికల్ 2.8 ప్రకారం చర్యలు తీసుకున్నట్లు ఐసీసీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపింది. అంతకుముందు ఇంగ్లండ్‌తో మ్యాచ్ సందర్భంగానూ ఇలాంటి తప్పిదానికే పాల్పడిన బ్రాత్‌వైట్‌కు జరిమానాతో పాటు ఒక డీ-మెరిట్ పాయింట్‌ను కేటాయించిన విషయం తెలిసిందే. దీంతో ప్రస్తుతం అతడి ఖాతాలో 2 డీ-మెరిట్ పాయింట్లు చేరాయి.

ప్రిటోరియస్ (3/25)

### కరుణరత్నే సేన సెమీస్ ఛాన్స్ దూరం

**దక్షిణాఫ్రికా చేతిలో 9 వికెట్లతో పరాజయం**

**మెరిసిన ప్రిటోరియస్, మోరిస్**

**ఆమ్లా, డుప్లెసిస్ అజేయ అర్ధశతకాలు**

తొలి బంతికే కెప్టెన్ వెనుదిరిగాడు. మిగిలిన వాళ్లకు మంచి ఆరంభాలు లభించినా వాటిని భారీ స్కోర్లుగా మలచలేక మూకుమ్మడిగా బ్యాట్లెత్తేశారు. సెమీస్ రేసులో నిలువాలంటే కచ్చితంగా నెగ్గాల్సిన మ్యాచ్‌లో శ్రీలంక సాధారణ స్కోరుకే పరిమితమైంది. బౌలింగ్‌లో మలింగ యార్కర్లు ఫలించలేదు. మిగిలినవారెవరూ ప్రభావం చూపలేదు. ఎట్టకేలకు ఆమ్లా, డుప్లెసిస్ గాడినపడటంతో దక్షిణాఫ్రికా కేవలం ఒక వికెట్ మాత్రమే కోల్పోయి టార్గెట్ ఛేజ్ చేసింది. పసికూన ఆఫ్ఘన్‌పై మినహా మరొక్క మ్యాచ్ కూడా గెలువలేకపోయిన సఫారీలు పోతూ పోతూ లంకనూ తమ వెంట పెట్టుకుపోయారు.

కరుణరత్నే

# లంక ఆశలు ఆవిరి!

**చెస్టర్ లీస్ట్రీట్:**

హాట్ ఫేవరెట్ ఇంగ్లండ్‌కు షాకిచ్చిన శ్రీలంక దక్షిణాఫ్రికాపై అదే సీన్ రిపీట్ చేయలేకపోయింది. సఫారీ పేసర్ల ధాటికి విలవిల్లాడిన లంకేయులు.. ఆ తర్వాత బౌలింగ్‌లోనూ పెద్దగా ప్రభావం చూపలేకపోవడంతో టోర్నీలో మూడో ఓటమిని మూటగట్టుకుని నాకౌట్ అవకాశాలకు దూరం చేసుకున్నారు. ఇప్పటికే 7 మ్యాచ్ లాడిన లంకేయులు కేవలం రెండింట నెగ్గి 6 పాయింట్లతో ఏడో స్థానంలో ఉన్నారు. మిగిలిన రెండు మ్యాచ్‌లు నెగ్గిన 10 పాయింట్లే ఖాతాలో చేరుతాయి. అందులో వర్షం కారణంగా 2 మ్యాచ్‌లు తుడిచిపెట్టుకుపోవడంతో వచ్చినవి 2 పాయింట్లు ఉన్నాయి. దీంతో అధికారికంగా లంక రేసులో ఉన్నా.. నాకౌట్ చేరడం ఇక అసాధ్యమే. శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో దక్షిణాఫ్రికా 9 వికెట్ల తేడాతో లంకపై విజయం సాధించింది. ప్రొటీస్ పేసర్లు ప్రిటోరియస్ (3/25), మోరిస్ (3/46), రబాడ (2/36) ధాటికి మొదట బ్యాటింగ్ చేసిన లంక 49.3 ఓవర్లలో 203 పరుగులకు ఆలౌటైంది. కుషాల్ పెరెరా (30; 4 ఫోర్లు), అవిష్క ఫెర్నాండో (30; 4 ఫోర్లు) మినహా మిగిలినవారు చెప్పుకోదగ్గ స్కోరు చేయలేకపోయారు. అనంతరం లక్ష్య ఛేదనలో దక్షిణాఫ్రికా 37.2 ఓవర్లలో వికెట్ నష్టానికి 206 పరుగులు చేసింది. ఆమ్లా (105 బంతుల్లో 80 నాటౌట్; 5 ఫోర్లు), డుప్లెసిస్ (103 బంతుల్లో 96 నాటౌట్; 10 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు. ప్రిటోరియస్‌కు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు దక్కింది.

**ఆడుతూ పాడుతూ..**

సాధారణ లక్ష్యాన్ని దక్షిణాఫ్రికా బ్యాట్స్‌మెన్ మరింత సాధారణంగా మార్చేశారు. మలింగ వేసిన తొలి ఓవర్‌లోనే ఆమ్లా 2 ఫోర్లు కొట్టి జోరు చూపెట్టాడు. 3 ఫోర్లతో మంచి టచ్‌లో కనిపించిన డికాక్ (15) మలింగ వేసిన యార్కర్‌కు క్లీన్ బౌల్డయ్యాడు. ఇక అక్కడి నుంచి ఆమ్లాతో కలిసి కెప్టెన్ డుప్లెసిస్ ఇన్నింగ్స్‌ను ముందుకు నడిపించాడు. ముఖ్యంగా ఫామ్ కోల్పోయి తంటాలు పడుతున్న ఆమ్లా చూడచక్కని షాట్లతో అలరించాడు. సాధించాల్సిన రన్‌రేట్ ఎక్కువగా లేకపోవడంతో ఆచితూచి ఆడిన ఈ జోడీ 19వ ఓవర్‌లో స్కోను 100 దాటించింది. ఈ క్రమంలో ఆమ్లా 56 బంతుల్లో అర్ధశతకం పూర్తి చేసుకోగా.. కాసేపటికే 70 బతుల్లో డుప్లెసిస్ ఫిఫ్టీ మార్క్ దాటాడు. హాఫ్ సెంచరీ తర్వాత జోరు పెంచిన డుప్లెసిస్ లక్మల్ ఓవర్‌లో 6,4తో ఊపులోకి వచ్చాడు. ఓ దశలో సఫారీ సారథి సెంచరీ పూర్తి చేసుకునేలా కనిపించినా.. లక్ష్యం మరీ చిన్నది కావడంతో అది సాధ్యపడలేదు. 68 పరుగుల వ్యక్తిగత స్కోరు వద్ద వికెట్ల ముందు దొరికిపోయిన ఆమ్లా రివ్యూ కోరి బతికిపోవడం మినహా ప్రత్యర్థికి ఎలాంటి అవకాశం ఇవ్వని ఈ జోడీ అభేద్యమైన రెండో వికెట్‌కు 175 పరుగులు జోడించి మరో 76 బంతులు మిగిలుండగానే లక్ష్యాన్ని ఛేదించింది.

ఆమ్లా (80*) డుప్లెసిస్ (96*)

**పేస్‌కు దాసోహం..**

జట్టులో ఎనిమిది మంది ప్లేయర్లు తలా 25 బంతులకు పైగా ఆడి రెండంకెల స్కోర్లు చేసినా.. వారికి దిశానిర్దేశం చేస్తూ, యాంకర్ రోల్ పోషించే ఇన్నింగ్స్ కరువవడంతో లంక తక్కువ స్కోరుకే పరిమితమైంది. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన లంకకు తొలి బంతికే పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. కాస్తోకూస్తో ఫామ్‌లో ఉన్న బ్యాట్స్‌మన్, కెప్టెన్ కరుణరత్నే (0) రబాడ వేసిన మొదటి బాల్‌కే గోల్డెన్ డక్‌గా పెవిలియన్ చేరాడు. అయినా కుషాల్ పెరెరా, ఫెర్నాండో ధాటిగానే బ్యాటింగ్ చేశారు. వీలు చిక్కినప్పుడల్లా బౌండ్రీలు బాదుతూ స్కోరు బోర్డును పరుగులు పెట్టించారు. రెండో వికెట్‌కు 67 పరుగులు జోడించాక ఫెర్నాండో.. డుప్లెసిస్‌కు క్యాచ్ ఇచ్చి ఔటయ్యాడు. ఇక అక్కడి నుంచి లంక ఇన్నింగ్స్ తడబడింది. కుదురుకున్న కుషాల్ పెరెరాను ప్రిటోరియస్ వెనక్కి పంపాడు. గత మ్యాచ్‌లో చక్కటి పోరాటం కనబర్చిన మాథ్యూస్ (29 బంతుల్లో 11) ఈ సారి కూడా మొండిగా నిలిచేందుకు ప్రయత్నించినా అది సాధ్యపడలేదు. కాసేపటికే కుషాల్ మెండిస్ (23) కూడా అతడిని అనుసరించాడు. కుదురుకున్నట్లు కనిపించిన ధనంజయ డిసిల్వ (24) డుమినీ బౌలింగ్‌లో రివర్స్ స్వీప్‌కు యత్నించి తగిన మూల్యం చెల్లించుకోగా.. జీవన్ మెండీస్ (18) భారీ షాట్ కొట్టే క్రమంలో క్యాచ్ ఔటయ్యాడు. సీనియర్ ఆల్‌రౌండర్ తిషార పెరెరా (21) కూడా పెద్దగా ప్రభావం చూపలేకపోగా.. చివర్లో ఉడాన (17) విలువైన పరుగులు జోడించడంతో లంక 200 మార్క్ దాటగలిగింది.

**స్కోరు బోర్డు**

**శ్రీలంక:** కరుణరత్నే (సి) డుప్లెసిస్ (బి) రబాడ 0, కుషాల్ పెరెరా (బి) ప్రిటోరియస్ 30, ఫెర్నాండో (సి) డుప్లెసిస్ (బి) ప్రిటోరియస్ 30, కుషాల్ మెండిస్ (సి) మోరిస్ 9బి) ప్రిటోరియస్ 23, మాథ్యూస్ (బి) మోరిస్ 11, డిసిల్వా (బి) డుమిని 24, జీవన్ మెండిస్ (సి) ప్రిటోరియస్ (బి) మోరిస్ 18, తిషార పెరెరా (సి) రబాడ (బి) ఫెలుక్వాయో 21, ఉడాన (సి అండ్ బి) రబాడ 17, లక్మల్ (నాటౌట్) 5, మలింగ (సి) డుప్లెసిస్ (బి) మోరిస్ 4, **ఎక్స్‌ట్రాలు:** 20, **మొత్తం:** 49.3 ఓవర్లలో203 ఆలౌట్. **వికెట్ల పతనం:** 1-0, 2-67, 3-72, 4-100, 5-111, 6-135, 7-163, 8-184, 9-197, 10-203, **బౌలింగ్:** రబాడ 10-2-36-2, మోరిస్ 9.3-0-46-3, ప్రిటోరియస్ 10-2-25-3, ఫెలుక్వాయో 8-0-38-1, తాహిర్ 10-0-36-0, డుమినీ 2-0-15-1.

**దక్షిణాఫ్రికా:** డికాక్ (బి) మలింగ 15, ఆమ్లా (నాటౌట్) 80, డుప్లెసిస్ (నాటౌట్) 96, **ఎక్స్‌ట్రాలు:** 15, **మొత్తం:** 206/1. **వికెట్ల పతనం:** 1-31, **బౌలింగ్:** మలింగ 10-1-47-1, ధనంజయ 4-0-18-0, లక్మల్ 6-0-47-0, తిషార పెరెరా 5.2-1-28-0, జీవన్ 7-0-36-0, ఉడాన 5-0-29-0.

**ఆనుకోని అతిథులు..**

అనాసక్తిగా సాగిన మ్యాచ్‌కు అనుకోని అతిథుల్లా తేనెటీగలు విచ్చేశాయి. శ్రీలంక ఇన్నింగ్స్ 48వ ఓవర్ ఐదో బంతి వేయడానికి ముందు ఒక్కసారిగా మైదానంలోకి తేనెటీగల గుంపులు రావడంతో వాటి నుంచి తప్పించుకునేందుకు అంపైర్లతో సహా ఫీల్డ్‌లో ఉన్న ఆటగాళ్లంతా నేలపై పడుకున్నారు. కాసేపటికి వాటిదారిన అవి వెళ్లడంతో మ్యాచ్ కొనసాగించారు.

ఆరోన్ ఫించ్

# చాంపియన్ X రన్నరప్

### 2015 ఫైనలిస్టుల మధ్య సమరం

### ఆస్ట్రేలియాను ఢీకొట్టనున్న న్యూజిలాండ్

కేన్ విలియమ్సన్

**లండన్:** ప్రపంచకప్‌లో రెండు అగ్రశ్రేణి జట్ల మధ్య సమరానికి రంగం సిద్ధమైంది. ఆడిన ఏడు మ్యాచ్‌ల్లో ఆరింట గెలిచి ఇప్పటికే సెమీఫైనల్ బెర్త్ దక్కించుకున్న డిఫెండింగ్ చాంపియన్ ఆస్ట్రేలియా ఓవైపు.. అన్నే మ్యాచ్‌ల్లో ఐదింట గెలిచి 11 పాయింట్లతో మూడో స్థానంలో ఉన్న న్యూజిలాండ్ మరోవైపు. టీమ్‌ఇండియా చేతిలో ఓటమి అనంతరం అనూహ్యంగా చెలరేగిపోతున్న ఆసీస్ ఓటమన్నదే ఎరుగకుండా దూసుకెళుతుంటే.. ఆడిన చివరి మ్యాచ్‌లో పాకిస్థాన్ చేతిలో పరాజయంతో న్యూజిలాండ్ కాస్త డీలాపడింది. 2015 ప్రపంచకప్ ఫైనల్లో ఆసీస్ చేతిలో ఓటమికి బదులు తీర్చుకోవాలని కివీస్ ఉవ్విళ్లూరుతుంటే.. విశ్వసమరంలో తమ ఆధిపత్యాన్ని కొనసాగించాలని కంగారూలు భావిస్తున్నారు. మిగిలిన రెండు మ్యాచ్‌ల్లో ఒక్క విజయం సాధించినా న్యూజిలాండ్ సెమీస్‌కు చేరే అవకాశం ఉన్నప్పటికీ.. ఆసీస్‌ను మట్టికరిపించే నాకౌట్‌లో అడుగుపెట్టాలని బ్లాక్‌క్యాప్స్ భావిస్తున్న తరుణంలో శనివారం క్రికెట్ మక్కా లార్డ్స్‌లో హోరాహోరీ పక్కాగా కనిపిస్తున్నది.

**ఓపెనర్లే బలం:** విశ్వసమరం అంటేనే అత్యుత్తమ ఆటతీరు ప్రదర్శించే ఆసీస్ ఆటగాళ్లు ఈసారి కూడా అదే ఆనవాయితీని కొనసాగిస్తున్నారు. ప్రస్తుత టోర్నీలో అత్యధిక పరుగుల, వికెట్ల వీరుల జాబితాలో అగ్రస్థానంలో ఉన్నది కూడా కంగారూలే. ఓపెనర్లు వార్నర్ (500), ఫించ్ (496) పరుగుల వరద పారిస్తున్నారు. వీరిద్దరూ ప్రతీ మ్యాచ్‌లోనూ చెలరేగిపోతుండటంతో కంగారూలకు ఎదురులేకుండా పోయింది. ఆ తర్వాత ఖవాజ, స్మిత్, మ్యాక్స్‌వెల్, స్టొయినిస్, కారీతో ఆసీస్ బ్యాటింగ్ శత్రు దుర్భేద్యంగా కనిపిస్తున్నది. బౌలింగ్‌లో జోరుమీదున్న స్టార్క్, బెరెన్‌డార్ఫ్, కమ్మిన్స్‌ను న్యూజిలాండ్ బ్యాట్స్‌మెన్ ఎలా ఎదుర్కొంటారో చూడాలి.

**కలవరపెడుతున్న ఓపెనింగ్:** న్యూజిలాండ్ పరిస్థితి ఆసీస్‌కు పూర్తి భిన్నంగా ఉంది. ఆదుకుంటారనుకున్న ఓపెనర్లు గప్టిల్, మన్రో స్థాయికి తగ్గ ప్రదర్శన చేయలేకపోతుండటంతో కివీస్‌కు మంచి ఆరంభాలు లభించడం లేదు. మిడిలార్డర్‌లో విలియమ్సన్ జట్టు భారాన్ని మోస్తుండగా.. టేలర్ ఫర్వాలేదనిపిస్తున్నాడు. లాథమ్ కూడా పెద్దగా ప్రభావం చూపలేకపోతున్నాడు. ఆల్‌రౌండర్లు నీషమ్, గ్రాండ్‌హోమ్ అంచనాలకు మించి రాణిస్తుండటం బ్లాక్ క్యాప్స్‌కు సానుకూలాంశం. బౌలింగ్‌లో బౌల్ట్, ఫెర్గూసన్, సౌథీ మంచి టచ్‌లో ఉన్నారు.

**మరో మ్యాచ్‌లో ఇప్పటి వరకు విశ్వకప్‌లో బోణీ కొట్టని పసికూన ఆఫ్ఘనిస్థాన్‌తో పాకిస్థాన్ తలపడనుంది. వరుస విజయాలతో జోరుమీదున్న సర్ఫరాజ్ సేన ఈ మ్యాచ్‌లోనూ నెగ్గి సెమీస్‌కు మార్గం సుగుమం చేసుకోవాలని భావిస్తున్నది.**

## తండ్రి కాబోతున్న వార్నర్

**లండన్:** ఆస్ట్రేలియా స్టార్ క్రికెటర్ డేవిడ్ వార్నర్ కుటుంబంలోకి కొత్తగా మరొకరు చేరబోతున్నారు. తన భార్య క్యాండిస్ ఆదివారం మూడో బిడ్డకు జన్మనివ్వబోతున్నట్లు వార్నర్ పేర్కొన్నాడు. ఇప్పటికే వార్నర్ దంపతులకు ఇద్దరు కూతుళ్లు ఇవీ మే, ఇండీ రే ఉన్నారు. ప్రస్తుతం ప్రపంచకప్ టోర్నీలో బిజీగా ఉన్న ఈ విధ్వంసక ఓపెనర్ పరుగుల వర ద పారిస్తున్నా డు. వాస్తవానికి క్యాండిస్ లండన్ బయల్దేరి రావా ల్సి ఉన్నా.. అప్పటికే నెలలు నిండటంతో ప్రయాణాన్ని విరమించుకుంది. ఏడాది కాలంలోనే క్యాండిస్ రెండు సార్లు గర్భస్రావానికి(అబార్షన్)కు గురైంది. దక్షిణాఫ్రికాతో కేప్‌టౌన్ టెస్ట్‌లో బంతిని ట్యాంపరింగ్ చేశాడన్న కారణంగా అప్పటి కెప్టెన్ స్టీవ్‌స్మిత్, వార్నర్‌పై క్రికెట్ ఆస్ట్రేలియా(సీఏ) ఏడాది నిషేధం విధించింది. ఆ సమయంలో సుదీర్ఘ ప్రయాణానికి తోడు తీవ్ర ఒత్తిళ్లతో డేవిడ్ వార్నర్ భార్య క్యాండిస్‌కు అబార్షన్ అయ్యింది.

## పంత్‌ను నాలుగులో ఆడించేవాన్ని

**మాంచెస్టర్:** ఇంగ్లండ్ పరిస్థితులపై చక్కటి అవగాహన ఉన్న రిషబ్ పంత్‌ను నాలుగో స్థానంలో ఆడించడం సరైన నిర్ణయమని భారత మాజీ క్రికెటర్ కృష్ణమాచారి శ్రీకాంత్ అభిప్రాయపడ్డాడు. గాయంతో మెగాటోర్నీకి దూరమైన ఓపెనర్ ధవన్ స్థానంలో జట్టులోకి వచ్చిన పంత్‌ను నాలుగులో బ్యాటింగ్‌కు పంపితే టీమ్‌ఇండియాకు లాభం చేకూరుతుందని.. తానైతే అదే పనిచేసే వాడినని శ్రీకాంత్ ఐసీసీకి రాసిన కాలమ్‌లో పేర్కొన్నాడు. 'టీమ్ మేనేజ్‌మెంట్‌లో నా ప్రమేయం ఉంటే నాలుగో స్థానంలో పంత్‌ను దింపేవాడిని. స్టాండ్‌బైగా ఉన్న అతడిని ఇక్కడికి రప్పించారు. ఆడటానికి అతడు సిద్ధంగా ఉన్నాడు. అన్నింటికి మించి ఇక్కడి పరిస్థితుల్లో ఆడిన అనుభవం ఉంది. గతేడాది ఇంగ్లండ్‌తో టెస్టు సిరీస్‌లో పంత్ ఆకట్టుకున్నాడు. టీమ్‌ఇండియా తదుపరి మ్యాచ్‌లో ఆతిథ్య జట్టును ఢీకొట్టనుంది. అతడిని బరిలో దించేందుకు ఇదే మంచి తరుణం. మిడిలార్డర్‌లో శంకర్, జాదవ్ ఇంకా ఆకట్టుకోలేదు. గత రెండు మ్యాచ్‌ల్లో రోహిత్ రాణించలేకపోయాడు. ఇంగ్లండ్‌తో మ్యాచ్‌లో భారత్ ఇదే జోరు కొనసాగించాలి. ఆసీస్ ఒక్క సారి జోరందుకున్నాక వెనక్కి తిరిగి చూడలేదు. కోహ్లీ పరుగులు చేయడంలో కొత్త రికార్డులు సృష్టిస్తున్నాడు'అని శ్రీకాంత్ వివరించాడు.

శ్రీకాంత్

## 'భారత్ ఓడిపోవాలనుకుంటున్నది'

**కరాచీ:** తమ జట్టు సెమీస్ ఆశలపై నీళ్లు చల్లేందుకు బంగ్లాదేశ్, శ్రీలంకపై భారత్ ఓడిపోవాలనుకుంటున్నదని పాకిస్థాన్ మాజీ క్రికెటర్ బాసిత్ అలీ వివాదాస్పద వ్యాఖ్యలు చేశాడు. ఓ న్యూస్‌చానెల్‌తో మాట్లాడుతూ 'పాక్ జట్టు సెమీస్‌లోకి రావద్దని భారత్ కోరుకుంటున్నది. అందుకే బంగ్లా, శ్రీలంక చేతుల్లో కావాలనే ఓడిపోయేందుకు సిద్ధమవుతున్నది. ఆఫ్ఘనిస్థాన్‌పై వారి ప్రదర్శన చూస్తే ప్రతి ఒక్కరికి అర్థమవుతుంది. అసలు ఏం జరుగుతుందో ఎవరికీ తెలియడం లేదు.' అని అలీ అన్నాడు.

గురుకుల టీచర్స్ TET Paper - I&II
TGT/PCT/PET/LIBRARIANS
S.I/కానిస్టేబుల్స్
FREE DEMO: 30-06-2019 at 10.08 am
RAMAIAH COMPETITIVE COACHING CENTRE
Opp: Konark Theatre Dilsukhnagar, Hyd
Cell :8885555202 9246208422

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 39,395 | 11,789 |
| ↘192 | ↘53 |

ముడి చమురు (బ్రెంట్) ↘ 65.33 డాలర్లు

**బంగారం ధరలు**

న్యూఢిల్లీ (రూ.లలో)

| | |
|---|---|
| 24 క్యారెట్లు | 34,285 |
| 22 క్యారెట్లు | 34,115 |
| వెండి (కిలో) | 38,600 |

**విదేశీ మారకం**

| కరెన్సీ | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|
| అమెరికా డాలర్ | 66.30 | 71.80 |
| యూరో | 75.20 | 83.20 |
| బహ్రెయిన్ దినార్ | 174.20 | 188.20 |
| కువైట్ దినార్ | 219.00 | 234.00 |
| సౌదీ రియాల్ | 17.40 | 19.20 |
| యూఏఈ దిర్హామ్ | 17.80 | 19.40 |

**చికెన్ ధరలు**

(రూ.లలో)

| | |
|---|---|
| ఫారం ధర | 112.00 |
| రిటైల్ లైవ్ | 134.00 |
| డ్రెస్డ్ | 194.00 |
| స్కిన్‌లెస్ | 221.00 |

**నెక్ (వంద గుడ్లకు)**

(రూ.లలో)

| | |
|---|---|
| హైదరాబాద్ | 415-00 |
| రంగారెడ్డి | 415-00 |
| మెదక్ | 415-00 |
| కరీంనగర్ | 418-00 |
| వరంగల్ | 418-00 |
| రిటైల్ ప్రైస్ | 4-75 |

# చిన్నమొత్తాలపై వడ్డీరేటు తగ్గింపు

**0.1 శాతం తగ్గించిన కేంద్రం ■ జూలై-సెప్టెంబర్ మధ్యకాలానికి వర్తింపు**

**న్యూఢిల్లీ, జూన్ 28:** చిన్నమొత్తాలపై వడ్డీరేటును 0.1 శాతం తగ్గిస్తూ కేంద్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకున్నది. తాజా నిర్ణయంతో జాతీయ పొదుపు సేవా పథకం(ఎన్ఎస్సీ), ప్రజా భవిష్య నిధి (పీపీఎఫ్)లపై చెల్లించే వడ్డీరేటు మరింత తగ్గనున్నది. ఈ వడ్డీరేటు జూలై 1 నుంచి అమలులోకి రానున్నట్లు ఆర్థిక మంత్రిత్వ శాఖ శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించింది. ప్రతి మూడు నెలలకొకసారి కేంద్ర ప్రభుత్వం చిన్న మొత్తాలపై వడ్డీరేట్లలో మార్పులు చేస్తున్నది. దీంట్లోభాగంగా గడిచిన రెండు సమీక్షలో వడ్డీరేట్లను యథాతథంగా ఉంచిన ఆర్థిక మంత్రిత్వ శాఖ..ఈసారి మాత్రం స్వల్పంగా తగ్గించింది. ప్రస్తుత సంవత్సరంలో రిజర్వు బ్యాంక్ మూడుసార్లు వడ్డీరేట్లను తగ్గించిన నేపథ్యంలో కేంద్రం ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తున్నది. కాగా, పొదుపు డిపాజిట్లపై 4 శాతం వడ్డీరేటును యథాతథంగా ఉంచిన కేంద్రం.. మిగతా స్కీంలపై మాత్రం 0.1 శాతం కోత విధించింది. ప్రతి మూడు నెలలకొకసారి పొదుపు డిపాజిట్లపై వడ్డీరేట్లను మారుస్తున్న కేంద్ర ప్రభుత్వం.. తాజాగా 2019-20 ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికానికి(జూలై-సెప్టెంబర్) గాను స్వల్పంగా తగ్గించినట్లు నోటిఫికేషన్‌లో వెల్లడించింది. దీంతో పీపీఎఫ్, ఎన్ఎస్‌సీలపై వార్షిక వడ్డీరేటు 7.9 శాతానికి తగ్గనున్నది. తగ్గించకముందు ఇది 8 శాతంగా ఉన్నది. అలాగే 113 నెలల కాలపరిమితి కలిగిన కిసాన్ వికాస్ పత్రాల(కేవీపీ) వడ్డీరేటును 7.6 శాతానికి తగ్గించింది. ప్రస్తుతం 112 నెలల కాలపరిమితి కలిగిన కేవీపీలపై 7.7 శాతం వడ్డీని ఆఫర్ చేస్తున్నది. అలాగే ఆడ పిల్లల పొదుపు పథకమైన సుకన్య సమృద్ధి ఖాతాపై వడ్డీని 8.5 శాతం నుంచి 8.4 శాతానికి తగ్గించింది. ఏడాది నుంచి మూడేండ్ల కాలపరిమితి కలిగిన టర్మ్ డిపాజిట్ల వడ్డీరేటును 6.9 శాతంగా నిర్ణయించింది. ఈ వడ్డీరేటును ప్రతి మూడు నెలలకొకసారి చెల్లింపులు జరుపుతున్నది కేంద్రం. ఐదేండ్ల కాలపరిమితి కలిగిన సీనియర్ సిటిజన్ల పొదుపు స్కీంపై వడ్డీని సైతం 8.7 శాతం నుంచి 8.6 శాతానికి తగ్గించింది.

# రికార్డుస్థాయికి విదేశీ నిల్వలు

**426.42 బిలియన్ డాలర్లకు చేరిక**

**ముంబై, జూన్ 28:** విదేశీ మారకం నిల్వలు రికార్డుస్థాయికి చేరుకున్నాయి. జూన్ 21తో ముగిసిన వారంలో చారిత్రక గరిష్ఠ స్థాయి 426.42 బిలియన్ డాలర్లకు చేరుకున్నట్లు రిజర్వు బ్యాంక్ వెల్లడించింది. అంతక్రితం వారంతో పోలిస్తే 4.215 బిలియన్ డాలర్ల మేర పెరిగాయని తెలిపింది. గతంలో ఏప్రిల్ 13, 2018న నమోదైన 426.028 బిలియన్ డాలర్ల ఇప్పటి వరకు ఇదే గరిష్ఠ స్థాయి. కానీ, గతవారంలో విదేశీ మారకం రూపంలో ఉన్న ఆస్తులు, ఇతర వాటి విలువ గణనీయంగా పెరుగడంతో రిజర్వులు కూడా అంతేస్థాయిలో దూసుకుపోయాయని తెలిపింది. అంతక్రితం వారంలో రిజర్వులు 1.358 బిలియన్ డాలర్లు తగ్గి 422.2 బిలియన్ డాలర్లకు జారుకున్న విషయం తెలిసిందే. విదేశీ కరెన్సీ రూపంలో ఉన్న ఆస్తుల విలువ భారీగా పుంజుకోవడం ఇందుకు దోహదం చేసిందని తాజా నివేదికలో తెలిపింది. గతవారంలో ఫారిన్ కరెన్సీ రూపంలో ఉన్న ఆస్తుల విలువ మరో 4.202 బిలియన్ డాలర్లు ఎగబాకి 398.649 బిలియన్ డాలర్లకు చేరాయి. డాలర్ రూపంలో ఉన్న విదేశీ కరెన్సీ ఆస్తుల విలువ..యూరో, పౌండ్, యెన్ కరెన్సీల తరుగుదల/పెరుగుదల ఆధారంగా రిజర్వులు ఉంటాయి. మరోవైపు, గతవారంలో పసిడి రిజర్వులు యథాతథంగా ఉన్నాయి. ప్రస్తుతం 22.958 బిలియన్ డాలర్ల విలువైన పసిడి రిజర్వులు ఉన్నట్లు తెలిపింది. అంతర్జాతీయ ద్రవ్యనిధి కింద ఉండే రిజర్వులు 4.2 మిలియన్ డాలర్లు ఎగబాకి 1.453 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. అలాగే ఫండ్ రూపంలో ఉన్న రిజర్వులు 9.6 మిలియన్ డాలర్లు పెరిగి 3.354 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.

## జెట్‌ను మాకు అప్పగించండి..

**ఉద్యోగ సంఘాలు, ఆడీ గ్రూపు సంయుక్తంగా బిడ్డింగ్**

**న్యూఢిల్లీ, జూన్ 28:** ఆర్థిక సంక్షోభంతో మూతపడిన జెట్ ఎయిర్‌వేస్‌ను మళ్లీ గాడిలో పెట్టడానికి కంపెనీకి చెందిన ఉద్యోగ సంఘాలు సిద్ధమయ్యాయి. దివాలా పిటిషన్‌కు సంబంధించి ఎన్‌సీఎల్‌టీ ప్రాసెసింగ్ జరుగుతున్న ప్రస్తుత తరుణంలో జెట్ ఎయిర్‌వేస్ ఎంప్లాయిస్ కన్సార్షియం, ఆడీగ్రూపులు సంయుక్తంగా శుక్రవారం 75 శాతం కొనుగోలు చేయడానికి బిడ్డింగ్‌ను దాఖలు చేశాయి. ఈ నెల 20న బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ దాఖలు చేసిన దివాలా పిటిషన్‌పై విచారించిన ముంబైలోని నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్(ఎన్‌సీఎల్‌టీ) అనుమతినిచ్చింది. ప్రస్తుతం జెట్ ఎయిర్‌వేస్‌కు రూ.8,500 కోట్ల రుణాలు బ్యాంకులకు చెల్లించాల్సి ఉండగా, ఇతర సంస్థలకు రూ.25 వేల కోట్ల వరకు చెల్లించాల్సి ఉన్నది. ఎన్‌సీఎల్‌టీ ప్రాసెసింగ్‌లో భాగంగానే 75 శాతం వాటాను కొనుగోలు చేయడానికి జెట్ ఎయిర్‌వేస్ ఎంప్లాయిస్ కన్సార్టియం, ఆడీగ్రూపులు జతకట్టాయి. దేశీయ విమానయాన రంగంలో మరో చారిత్రక ఒప్పందం జరిగిందని, ఒక విమాన యాన సంస్థను నిర్వహించడానికి ఉద్యోగ సంఘాలు ముందుకురావడం చరిత్రలో ఇదే తొలిసారని 'సబ్‌కా సాథ్..సబ్‌కా వికాస్.. సబ్‌కా విశ్వాస్' అనే నినాదంతో ముందుకు సాగుతున్నాయని సంయుక్త ప్రకటనలో ఇరు వర్గాలు వెల్లడించాయి.

# ద్రవ్యలోటు కలవరం

**రెండు నెలల్లో 52 శాతానికి చేరిక ■ ఆదాయం-ఖర్చుల మధ్య పెరుగుతున్న అంతరం**

**న్యూఢిల్లీ, జూన్ 28:** కేంద్ర ప్రభుత్వానికి ద్రవ్యలోటు కునుకులేకుండా చేస్తున్నది. ప్రభుత్వానికి వచ్చే ఆదాయం కంటే ఖర్చులు అధికమవుతుండటంతో ద్రవ్యలోటు ఆకాశమే హద్దుగా పెరుగుతున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి రెండు నెలల్లోనే ద్రవ్యలోటు 52 శాతానికి చేరుకున్నది. 2019-20 ఆర్థిక సంవత్సరానికిగాను ప్రవేశపెట్టిన సార్వత్రిక బడ్జెట్‌లో నిర్దేశించుకున్న లక్ష్యంలో సగం కేవలం రెండు నెలల్లో చేరుకోవడం కేంద్ర ప్రభుత్వానికి సంకటంగా మారింది. ఏప్రిల్-మే మధ్యకాలంలోనే ప్రభుత్వానికి వచ్చిన ఆదాయం కంటే ఖర్చు రూ.3,66,157 కోట్లుగా ఎక్కువగా ఉన్నదని కంట్రోలర్ జనరల్ ఆఫ్ అకౌంట్స్(సీజీఏ) వెల్లడించింది. 2018-19 బడ్జెట్‌లో అంచనావేసిన దాంట్లో ద్రవ్యలోటు వాటా 55.3 శాతంగా ఉన్నది. ఫిబ్రవరి1న పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో ప్రస్తుతేడాది ద్రవ్యలోటును రూ.7.03 లక్షల కోట్లకు నిర్దేశించాలని లక్ష్యంగా పెట్టుకున్నది. కానీ, గడిచిన రెండు నెలల్లోనే వీటిలో సగానికి సగం చేరుకోవడం కొంత ఇబ్బందులకు గురి చేస్తున్నది. ఈ ఏడాది కూడా జీడీపీలో ద్రవ్యలోటును 3.4 శాతానికి కట్టడి చేయాలని కేంద్రం లక్ష్యంగా నిర్దేశించుకున్నది. గతేడాది ఇంతే స్థాయిలో నమోదైంది. ఏప్రిల్-మే మధ్యకాలంలో కేంద్ర ప్రభుత్వానికి వచ్చిన ఆదాయంలో బడ్జెట్ అంచనావేసిన దాంట్లో 7.3 శాతానికి సమానం. అంతక్రితం ఏడాది కూడా ఇంతే స్థాయిలో ఆదాయం ఉన్నది. బడ్జెట్‌లో అంచనావేసినదాంట్లో మూలధన వ్యయం వాటా 14.2 శాతానికి పరిమితం కావడం కొంత ఊరటనిచ్చే అంశం. అంతక్రితం ఏడాది ఇదే రెండు నెలల్లో ఈ వాటా 21.3 శాతంగా ఉన్నది. గత రెండు నెలల్లో కేంద్రం రూ.5.12 లక్షల కోట్లను వివిధ రూపాల్లో ఖర్చు చేసింది. బడ్జెట్ అంచనావేసిన దాంట్లో వాటా 18.4 శాతంగా ఉన్నది. అంతక్రితం ఏడాది ఇది 19.4శాతంగా ఉంది.

**543 బిలియన్ డాలర్లకు విదేశీ అప్పు**

భారత విదేశీ అప్పు అమాంతం పెరిగింది. మార్చి 31తో ముగిసేనాటికి దేశీయ విదేశీ అప్పు ఏడాది ప్రాతిపదికన 2.6 శాతం ఎగబాకి 543 బిలియన్ డాలర్లకు చేరుకున్నట్లు రిజర్వు బ్యాంక్ తాజాగా వెల్లడించింది. స్వల్పకాల రుణాలు, కమర్షియల్, ప్రవాస భారతీయుల డిపాజిట్లు ఎగబాకడం ఇందుకు కారణమని ఆర్బీఐ తాజా నివేదికలో వెల్లడించింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ తరిగిపోవడం వల్లనే అప్పులు పెరిగాయని తెలిపింది. మార్చి 2019 నాటికి విదేశీ రుణాలు 543 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. అంతక్రితం ఏడాదితో పోలిస్తే 13.7 బిలియయన్ డాలర్లు ఎగబాకాయి. ఎక్స్‌టర్నల్ డెబిట్..జీడీపీలో 19.7 శాతం వాటా ఉండగా, అంతక్రితం ఏడాది మార్చి చివరినాటికి నమోదైన 20.1 శాతంతో పోలిస్తే స్వల్పంగా తగ్గినట్లు అయింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి మరింత బలపడటంతో ఇతర కరెన్సీరూపంలో ఉన్న విలువ 16.7 బిలియన్ డాలర్లని వ్యాఖ్యానించింది. మొత్తం అప్పుల్లో కమర్షియల్‌గా తీసుకునేవారి వాటా 38 శాతంగా ఉండగా, ఎన్ఆర్ఐ డిపాజిటర్ల వాటా 24 శాతం, షార్ట్ టర్మ్ ట్రేడ్ క్రెడిట్ 18.9 శాతంగా ఉన్నది. మార్చి, 2019 నాటికి దీర్ఘకాలిక రుణాలు 434.6 బిలియన్ డాలర్లకు చేరాయి. అంతక్రితం ఏడాది మార్చిలో నమోదైన దాంతో పోలిస్తే 7.5 బిలియన్ డాలర్లు ఎగబాకాయి.

### స్వల్పంగా పెరిగిన క్యాడ్

కరెంట్ ఖాతా లోటు(క్యాడ్) మరింత పెరిగింది. 2018-19 ఆర్థిక సంవత్సరానికిగాను జీడీపీలో క్యాడ్ 57.2 బిలియన్ డాలర్లు లేదా 2.1 శాతంగా నమోదైందని సెంట్రల్ బ్యాంక్ వెల్లడించింది. అంతక్రితం ఏడాది ఇది 1.8 శాతంగా ఉన్నది. విదేశీ ఎక్స్ఛేంజ్‌లో పెట్టుబడుల, ఉపసంహరణల మధ్య అంతరాన్ని క్యాడ్ అంటారు. 2017-18 ఆర్థిక సంవత్సరంలో క్యాడ్ 48.7 బిలియన్ డాలర్లుగా ఉన్నది. మార్చి 31తో ముగిసిన త్రైమాసికంలో లోటు 4.6 బిలియన్ డాలర్లు లేదా జీడీపీలో 0.7 శాతంగా ఉన్నది. డిసెంబర్ త్రైమాసికంలో 27.7 బిలియన్ డాలర్లు(2.7 శాతం), మార్చి 2018లో 13 బిలియన్ డాలర్లు(1.8 శాతం)గా నమోదయ్యాయి. ఏడాది క్రితం 41.6 బిలియన్ డాలర్లుగా ఉన్న వాణిజ్య లోటు మార్చి త్రైమాసికం నాటికి 35.2 బిలియన్ డాలర్లకు పరిమితమవడం క్యాడ్ ఈ మాత్రమైన తగ్గడానికి పరోక్షంగా దోహదం చేసింది. గతేడాది మొత్తానికి మాత్రం లోటు 160 బిలియన్ డాలర్ల నుంచి 180.3 బిలియన్ డాలర్లకు పెరిగినట్లు సెంట్రల్ బ్యాంక్ తాజా సమీక్షలో వెల్లడించింది. గత త్రైమాసికంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు 6.4 బిలియన్ డాలర్లకు చేరుకున్నాయి. గతేడాది మొత్తానికి 30.7 బిలియన్ డాలర్లుగా ఉన్నాయి. అలాగే విదేశీ పోర్ట్‌ఫోలియే ఇన్వెస్ట్‌మెంట్లు రికార్డు స్థాయి 9.4 బిలియన్ డాలర్లకు చేరాయి.

## జీఎస్టీకి రెండేళ్లు

**జూలై 1న ఉత్సవాలు: కేంద్రం**

**న్యూఢిల్లీ, జూన్ 28:** వస్తు, సేవల పన్ను(జీఎస్టీ) అమలులోకి వచ్చి రెండేళ్లు కావస్తున్నది. ఈ సందర్భంగా జూలై 1న రెండో వార్షికోత్సవం సందర్భంగా ప్రత్యేక ఉత్సవాలు నిర్వహించడానికి సిద్ధమవుతున్నది కేంద్ర ప్రభుత్వం. న్యూఢిల్లీలోని అంబేద్కర్ భవన్‌లో జరుగనున్న ఈ కార్యక్రమానికి కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో పాటు ఆ శాఖ సహాయ మంత్రి అనురాగ్ ఠాకూర్‌తోపాటు పన్నులకు సంబంధించిన ఉన్నతాధికారులు కూడా హాజరవనున్నారు. ఈ సందర్భంగా జీఎస్టీ అమలులోకి వచ్చిన నాటి నుంచి ఇప్పటి వరకు జరిగిన పలు మార్పులపై ప్రజెంటేషన్ ఇవ్వనున్నారు. రిటర్నులకు సంబంధించి ప్రస్తుతం వినియోగిస్తున్న జీఎస్టీఆర్-3బీ స్థానంలో నూతన రిటర్ను ఫైలింగ్ సిస్టాన్ని కూడా అదే రోజు ప్రారంభించనున్నారు.

## రూ.209 కోట్ల ఐఎంఏ ఆస్తుల జప్తు

**పోంజీ స్కాంలో స్వాధీనం చేసుకున్న ఈడీ**

**బెంగళూరు/న్యూఢిల్లీ, జూన్ 28:** కర్ణాటకలో జరిగిన పోంజీ స్కాంపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) విచారణను వేగవంతం చేసింది. ఇప్పటికే ఈ కేసులో ఐఎంఏ గ్రూపునకు సంబంధించిన పలు ఆస్తులను స్వాధీనం చేసుకున్న ఈడీ..తాజాగా శుక్రవారం మరో రూ.209 కోట్ల విలువైన ఆస్తులను జప్తు చేసింది. వీటిలో 20 స్థిర ఆస్తులతోపాటు బ్యాంకు డిపాజిట్లు ఉన్నాయి. పీఎంఎల్ఏ కింద దాఖలైన ఈ కేసులో రూ.197 కోట్ల విలువైన స్థిర ఆస్తులను జప్తు చేసిన ఈడీ..రూ.12 కోట్లు వివిధ బ్యాంకుల్లో సంస్థ డిపాజిట్ చేసినవి ఉన్నాయని ఈడీ వర్గాలు వెల్లడించాయి. ఐఎంఏకు వ్యతిరేకంగా ఇప్పటికే మనీ ల్యాండరింగ్ కింద క్రిమినల్ కేసును దాఖలు చేసింది ఈడీ. 40 వేల మంది పెట్టుబడిదారుల నుంచి సుమారు రూ.4 వేల కోట్ల స్థాయిలో నిధులను సేకరించిన ఐఎంఏ గ్రూపు ప్రమోటర్, మేనేజింగ్ డైరెక్టర్ మహ్మద్ మన్సూర్ ఖాన్ ప్రస్తుతం పరారీలో ఉన్నారు. వీటిలో రూ.98 లక్షలను 51 బ్యాంకు ఖాతాల్లో డిపాజిట్ చేసినట్లు గుర్తించిన ఈడీ..ఒక హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులోనే రూ.11 కోట్లు డిపాజిట్ చేయడం విశేషం. ఈ నిధులను ప్రధాన మంత్రి గరీబ్ కల్యాణ్ యోజన(పీఎంజీకేవై) పథకం కింది డిపాజిట్ చేశాడు. నల్లధనాన్ని నిర్మూలించడానికి ప్రధాని నరేంద్ర మోదీ పాత పెద్ద నోట్లను రద్దుచేస్తూ 2016లో తీసుకున్న నిర్ణయం తర్వాత వారి వద్ద ఉన్న నిధులను ఒకేసారి డిపాజిట్ చేయడానికి పీఎంజీకేవై పథకాన్ని ప్రవేశపెట్టారు. దీంతో ఈ పథకం కింద అన్ని బ్యాంకుల్లో భారీ స్థాయిలో డిపాజిట్లు వచ్చాయి.

## రుణ ఎగవేతదారులకు ఎస్బీఐ షాక్

**పదిహేను రోజుల్లో చెల్లించకపోతే కఠిన చర్యలు తప్పవు**

**న్యూఢిల్లీ, జూన్ 28:** రుణాలు ఎగ్గొట్టిన అతిపెద్ద వ్యాపారవేత్తలకు బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) గట్టి షాకిచ్చింది. ఫార్మా, జెమ్స్ అండ్ జ్యూవెల్రీ, విద్యుత్ రంగాలకు చెందిన 10 మంది ఉద్దేశపూర్వక ఎగవేతదారుల పేర్లను బయటకు వెల్లడించింది. వీరంతా వచ్చే పదిహేను రోజుల్లో వడ్డీతో సహా అన్ని అప్పులు కట్టాలని, లేదంటే న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించింది. ఈ పదిమంది దాదాపు ఎస్‌బీఐ వద్ద రూ.1,500 కోట్ల వరకు రుణం తీసుకున్నారు. వీటిని చెల్లించాలని పలుమార్లు నోటీసులు జారీ చేసినప్పటికీ ఎలాంటి సమాధానం రాకపోవడంతో వారిని ఉద్దేశపూర్వక ఎగవేతదారుల జాబితాలోకి చేర్చింది. తాజాగా వీరి పేర్లను ఓ పబ్లిక్ నోటీసు ద్వారా వెల్లడించింది. వీరిలో ముంబైకి చెందిన స్పాన్కో లిమిటెడ్ కంపెనీ అతిపెద్ద బకాయిదారుగా ఉన్నది. బ్యాంక్ వద్ద రూ.347 కోట్లు రుణం తీసుకొని ఇప్పటి వరకు ఎలాంటి చెల్లింపులు జరుపలేదు సంస్థ.

# వాణిజ్య భయాలతో నష్టాలు

**192 పాయింట్లు పడిపోయిన సెన్సెక్స్**

**ముంబై, జూన్ 28:** వాణిజ్యభయాలు చుట్టుముట్టడంతో దేశీయ స్టాక్ మార్కెట్లు కుదేలయ్యాయి. అమెరికా-చైనా దేశాల మధ్య నెలకొన్న వాణిజ్య యుద్ధమేఘాలపై ప్రస్తుతం జరుగుతున్న జీ-20 సమావేశాల్లోనే కీలక చర్చలు జరుగనుండటం మార్కెట్లకు ఏ మాత్రం రుచించలేదు. దీనికితోడు స్టాక్ మార్కెట్ నియంత్రణ మండలి సెబీ..మ్యూచువల్ ఫండ్లపై కఠిన నిబంధనలను అమలు చేయనున్నట్లు ప్రకటించడం ఈ పతనానికి ఆజ్యంపోసింది. నాన్-బ్యాంకింగేతర ఆర్థిక సేవల సంస్థలకు ఊరట నిస్తే రిజర్వు బ్యాంక్ తీసుకున్న నిర్ణయం మదుపరులు ఏ మాత్రంపట్టించుకోలేదు. ప్రారంభంలో తీవ్ర ఆటుపోటులకు గురైన సూచీలు ఆ తర్వాత నష్టాల బాట పట్టాయి. మధ్యాహ్నానికి అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన ప్రతికూల సంకేతాలు కూడా మరింత నష్టాల్లోకి నెట్టింది. వారాంతం ట్రేడింగ్ ముగిసే సరికి 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ 191.77 పాయింట్లు కోల్పోయి 39,394.64 వద్ద ముగిసింది. బ్లూచిప్ కంపెనీల్లో అమ్మకాలు పోటెత్తడంతో సూచీలు తీవ్ర ఒత్తిడికి గురయ్యాయి. జాతీయ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ 52.70 పాయింట్లు క్షీణించి 11,788.85 వద్ద స్థిరపడింది. అయినప్పటికీ ఈవారంలో సూచీలు లాభపడటం విశేషం. సెన్సెక్స్ 200 పాయింట్లు, నిఫ్టీ 64.75 పాయింట్లు చొప్పున లాభపడ్డాయి. యెస్ బ్యాంక్, ఇండస్ఇండ్ బ్యాంక్, టాటా మోటర్స్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఓఎన్‌జీసీ, బజాజ్ ఆటో, వేదాంత, టాటా స్టీల్, టీసీఎస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంకుల షేర్లు 3.29 శాతం వరకు పతనం చెందాయి. మరోవైపు బజాజ్ ఫైనాన్స్, యాక్సిస్ బ్యాంక్, ఎన్‌టీపీసీ, మారుతి, హెచ్‌యూఎల్, టెక్ మహీంద్రాలు మాత్రం లాభాల్లో ముగిశాయి. నిధులకు సంబంధించిన పథకాలు విక్రయించే మ్యూచువల్ ఫండ్ సంస్థలు 20 శాతం అట్టిపెట్టి ఉంచుకోవాలని సెబీ ఆదేశాలు జారీ చేయడంతోపాటు రిజర్వు బ్యాంక్.. ద్వై వార్షిక ఆర్థిక స్థిరత్వ నివేదికలో ప్రస్తుతం దేశ ఆర్థిక వ్యవస్థ స్థిరంగా ఉన్నప్పటికీ భవిష్యత్తులో ఇబ్బందులు తప్పవని హెచ్చరించడం మార్కెట్లను మదుపరులను కొనుగోళ్ల వైపు నడిపించలేకపోయింది. రంగాలవారీగా చూస్తే రియల్ ఎస్టేట్, క్యాపిటల్ గూడ్స్, ప్రభుత్వరంగ బ్యాంకుల షేర్లు లాభాల్లో ముగిశాయి. ఇంధన, మెటల్, టెలికం, బేసిక్ మేటిరియల్, ఆయిల్ అండ్ గ్యాస్, బ్యాంకెక్స్, ఆటో షేర్లు మాత్రం 1.52 శాతం వరకు నష్టపోయాయి. మరోవైపు డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 4 పైసలు తగ్గి 69.03 వద్ద ముగిసింది.

### కోక్స్ అండ్ కింగ్స్ భారీ పతనం

కోక్స్ అండ్ కింగ్స్ షేర్లు భారీగా పతనం చెందాయి. నగదు ప్రవాహంలో అసమతుల్యత కారణంగా కంపెనీ షేరు లోవర్ సర్క్యూట్‌ను తాకింది. స్టాక్ మార్కెట్ ముగిసే సమయానికి బీఎస్ఈలో షేరు ధర 10 శాతం తగ్గి రూ.36.45కి పడిపోయింది. ఎన్ఎస్ఈలో 9.91 శాతం క్షీణించి రూ.36.80 వద్ద ముగిసింది. దీంతో కంపెనీ షేరు 52 వారాల కనిష్ఠ స్థాయిని తాకినట్లు అయింది. బీఎస్ఈలో 5.3 లక్షల షేర్లు చేతులు మారగా, ఎన్‌సీలో 1.5 లక్షల షేర్లు ఇతరులు కొనుగోలు చేశారు.

**ఆసియా మార్కెట్లకు జీ-20 దెబ్బ**

జీ-20 సమావేశాల దెబ్బ అంతర్జాతీయ మార్కెట్లపై స్పష్టంగా కనిపించింది. వాణిజ్య యుద్ధాలతో ప్రపంచ దేశాల ఆర్థిక పరిస్థితులపై ప్రభావం పడనున్నదన్న అంచనాలు సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. చైనా ఉత్పత్తులపై సుంకం విధింపుపై వెనక్కి తగ్గేది లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించడం కూడా మార్కెట్ల పతనాన్ని శాసించింది.

### బ్యాంక్‌లకు ఒకేసారి నిధులు

**కేటాయించాలని కేంద్రానికి అసోచామ్ సూచన**

**న్యూఢిల్లీ, జూన్ 28:** ప్రభుత్వరంగ బ్యాంకులను ఆర్థికంగా ఆదుకోవడానికి ఒకేసారి భారీ స్థాయిలో నిధులను కేటాయించాలని కేంద్ర ప్రభుత్వానికి ఇండస్ట్రీ బాడీ అసోచామ్ సూచించింది. వచ్చే బడ్జెట్‌లో ఈ నిర్ణయాన్ని అమలు చేయాలని శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో సూచించింది. వచ్చే శుక్రవారం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రవేశపెట్టనున్న సార్వత్రిక బడ్జెట్‌లో..కరెన్సీ లభ్యతపై నాన్-బ్యాంకింగ్ సంస్థలు ఎదుర్కొంటున్న ఇబ్బందులపై ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉన్నదని అసోచామ్ ప్రెసిడెంట్ బీకే గోయెంకా తెలిపారు.

## చందాకొచ్చర్‌ను మరోసారి ప్రశ్నించిన ఈడీ

**దీపక్ కొచ్చర్, వీడియోకాన్ ప్రమోటర్ వేణుగోపాల్ ధూత్‌ను కూడా..**

**న్యూఢిల్లీ, జూన్ 28:** వీడియోకాన్‌కు ఇచ్చిన రుణాల కేసులో ఐసీఐసీఐ బ్యాంక్ మాజీ సీఈవో చందా కొచ్చర్, ఆమె భర్త దీపక్ కొచ్చర్‌లను మరోసారి ప్రశ్నించింది ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ). మనీ ల్యాండరింగ్ కింద నమోదైన ఈ కేసులో వీరిద్దరితో పాటు వీడియోకాన్ ప్రమోటర్ వేణుగోపాల్ ధూత్‌లను కూడా ప్రశ్నించింది. ప్రీవెన్షన్ ఆఫ్ మనీ ల్యాండరింగ్ యాక్ట్(పీఎంఎల్ఏ) ప్రకారం వీరి విచారణను రికార్డు చేసినట్లు ఒక ప్రకటనలో వెల్లడించింది. వీడియోకాన్‌కు ఇచ్చిన రూ.1,875 కోట్ల రుణం కేసులో క్విడ్ ప్రో జరిగిందని జరిగిందని ఆరోపిస్తూ ఈడీ..ఇప్పటి వరకు పలు దఫాలుగా విచారణ చేసింది. గత నెలలో ఢిల్లీలోని ఈడీ ప్రధాన కార్యాలయంలో చందా కొచ్చర్‌ను ప్రశ్నించింది. కొచ్చర్‌కు ఉన్న ఆస్తుల వివరాలను సేకరించేపనిలో పడిన ఈడీ..ఇందుకు తగ్గట్టుగా వారి నుంచి సరైన సమాచారాన్ని సేకరిస్తున్నది. ఈ కేసులో చందా కొచ్చర్ మరిది రాజీవ్ కొచ్చర్‌ను కూడా పలుమార్లు విచారించింది.

## సింగరేణితో ఎన్టీపీసీ ఒప్పందం

**80 లక్షల టన్నుల బొగ్గు కొనుగోలు కోసం..**

ఒప్పంద పత్రాలు మార్చుకుంటున్న అధికారులు

**హైదరాబాద్/మంచిర్యాల నమస్తే తెలంగాణ:** నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్టీపీసీ) ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 80 లక్షల టన్నుల బొగ్గును కొనుగోలు చేసేందుకు సింగరేణితో ఒప్పందాన్ని కుదుర్చుకున్నది. హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలోఎన్టీపీసీ చీఫ్ జనరల్ మేనేజర్ ఎస్డీ ప్రసాద్, సింగరేణి మార్కెటింగ్ జీఎం ఆంటోనిరాజా ఈ ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఈ ఒప్పంద ప్రకారం సత్తుపల్లి, మణుగూరు, మందమర్రి, రామగుండం తదితర గనుల నుంచి ఉత్పత్తి అయ్యే వివిధ రకాల గ్రేడ్ల బొగ్గును తెలంగాణతోపాటు మహారాష్ట్ర, కర్ణాటక, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఒడిశా, హర్యానా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్

MY HOME GROUP

# Life on a Greenscape

## At Tellapur | 4 BHK Luxury Villas

TS RERA NO: P01100000375

## IT'S TIME TO RETHINK YOUR HOME!

If you aspire for space and openness, There's nothing better than the villa life. Haven't we all dreamt of living in a villa? You are welcome to exquisitely manicured world of 603 villas in 2 wonderful plot sizes, the largest villa layout in the city! Ankura signals the very first experience of resort luxury that can be owned for a life time.

Street View

Clubhouse

Lawn Area

## HIGHLIGHTS

- A Gated Community of 75.46 Acres
- HMDA Approved Project
- Plot Area 272 Sq.yds & 350 Sq.yds
- Built-up Area 3,223 Sq.ft. and 4,146 Sq.ft.
- East and West Facing Villas
- Vaastu Compliant
- Exclusive Clubhouse
- Designer Landscaping
- 24 hrs Security with Intercom & CCTV Cameras
- Controlled Entry & Exit

### CLUBHOUSE - 50,667 Sq.ft.

Swimming Pool | Super Market | Pharmacy | A.T.M. | Double Height Reception / Waiting Lounge | Crèche
Food Court | Multipurpose Halls | Guest Rooms | Badminton & Squash Courts | Indoor Games | Yoga / Aerobics | GYM | Saloon & Spa

## BOOKINGS OPEN

For More Details Scan Below QR Code

For More Details Contact us:

+91 9770 800 800 | +91 9100 55 99 22, 44 | 040-6688 8888

My Home Infrastructures Pvt. Ltd., 8th Floor, Block 3, My Home Hub, Madhapur, Hyderabad - 500081.

mktg@myhomeconstructions.com www.myhomeconstructions.com

Project is approved and funded by ICICI Bank

Follow us:

MY HOME ANKURA

*Let The New Life Begin*

*Conditions Apply. This ad is conceptual & not a legal offering for sale/agreement. All images are artistic impressions and for illustrative purpose only.

నమస్తే తెలంగాణ
జిందగీ
శనివారం 29 జూన్ 2019 WWW. NTNEWS.COM /nt.zindagi

'అందరూ బాగుండాలి..
ఆ అందరిలో నేనుండాలి' అని చాలామంది చెబుతుంటారు.
అయితే.. మన చుట్టుపక్కల ఉన్నవాళ్లు ఎలా బాగుండాలో?
వారి అవసరాలేంటో? వాటిని ఎలా తీర్చాలో? మాత్రం ఆలోచించరు.
కొందరు మాత్రం.. నిత్యం సమాజ శ్రేయస్సుకోసమే ఆలోచిస్తుంటారు.
ఆ ఆలోచనలను ఆచరణలో పెడతారు.
మన చుట్టూ ఉండే వారి కష్టనష్టాలు తెలుసుకుంటారు.
అవసరమైన సాయం చేసి 'అందరూ బాగుండాలి'
అనే పదానికి న్యాయం చేస్తారు. వారిలో ఒకరే డాక్టర్ అనూహ్య రెడ్డి.
పేదల అభ్యున్నతి కోసం నిరంతరం తపిస్తున్న ఆమెను జిందగీ పలుకరిస్తే..
తనలోని మరో కోణాన్ని ఆవిష్కరించారు.

# సేవలో సహృదయురాలు

**అది** 2014. హైదరాబాద్ నగర శివారులో ఓ పెద్ద హీరో సినిమా షూటింగ్ జరుగుతున్నది. ఆ సినిమాకు కాస్ట్యూమ్ డిజైనర్‌గా పనిచేస్తున్నారు అనూహ్యారెడ్డి. ఆ సినిమాకు వందలాది మంది జూనియర్ ఆర్టిస్టులు అవసరం. అప్పటికే కొందరు జూనియర్ ఆర్టిస్టులు వచ్చివున్నారు. యూసుఫ్‌గూడ బస్తీ నుంచి రావాల్సినవారు మాత్రం ఇంకా రాలేదు. వారందరికీ కాస్ట్యూమ్స్ ఇవ్వాల్సిన బాధ్యత అనూహ్యారెడ్డిది కావడంతో.. అక్కడికొచ్చిన కొందరిని ఆరా తీశారు. యూసుఫ్‌గూడ బస్తీకి చెందిన కొందరు జూ.ఆర్టిస్టులు మద్యానికి బానిసలై, గొడవలు పెట్టుకొని, స్టేషన్ల చుట్టూ తిరుగుతున్నారని తెలుసుకున్నారు. ఆ రోజు షూటింగ్ ముగిసిన తర్వాత.. ఇంటికి వెళ్లకుండా నేరుగా యూసుఫ్‌గూడకు వెళ్లారు అనూహ్య. అక్కడ జూ.ఆర్టిస్టులు ఉండే ప్రాంతాన్ని చూసి చలించారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న చిన్నచిన్న గుడిసెలు అవి. ఎండ, వానల నుంచి రక్షణగా ప్లాస్టిక్ కవర్లు చుట్టారు. సింగిల్ బెడ్రూం అంతటి స్థలంలో పది కుటుంబాలు నివసిస్తున్నాయి. అలా వందలమంది ఆ చిన్న గుడిసెల్లో కాలం వెళ్లదీస్తున్నారు. పొద్దంతా కష్టపడి.. రాత్రి ఆ డబ్బుతో మద్యం తాగేవాళ్లను చూసి బాధపడ్డారు అనూహ్య. తిండిలేక అలమటించే కొన్ని కుటుంబాలను దగ్గర్నుంచి చూశారు. ఇలాంటి పరిస్థితి ఒక్క యూసుఫ్‌గూడ బస్తీలోనే కాదు.. నగరంలోని కొన్ని మురికివాడల్లోనూ ఉందని తెలుసుకున్నారు. కాలి నడకన హైదరాబాద్‌లోని మురికివాడల్లో గల్లీ గల్లీ తిరిగారు అనూహ్యారెడ్డి. మద్యం కారణంగా మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలు విన్నారు. కొన్ని ప్రత్యక్షంగా గుర్తించారు. అప్పుడే తనకు చేతనైన సహాయం చేసి వారికి అండగా నిలబడాలనుకున్నారు. యూసఫ్‌గూడ బస్తీలో కొందర్ని సమావేశ పరిచి కౌన్సెలింగ్ ఇచ్చారు. వారిలో కొందరు 'నువ్వెవరు మాకు చెప్పడానికి?' అని ప్రశ్నించడంతో తనలో అంతర్మథనం మొదలైంది. ఆ తర్వాత రోజే 'కోవిధ సహృదయ' ఫౌండేషన్‌ను స్థాపించారు. అప్పటి నుంచి పేదల ముఖాల్లో చిరునవ్వు చూడాలని ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్నారు అనూహ్య.

### బడిబాట పట్టించారు

నగరంలోని బస్తీల్లో వందల మంది చిన్నారులను కోవిధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బడి బాట పట్టించారు అనూహ్య. తల్లిదండ్రులు కూలీకి వెళ్తే చిన్నారులు ఇండ్లల్లో ఉంటూ చెడు వ్యసనాలకు బానిసలవుతున్నారని గుర్తించారు. తన ఫౌండేషన్ ఆధ్వర్యంలో చిన్నారులను స్థానిక పాఠశాలలకు పంపించేలా విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడి, వారిని ఒప్పించారు. అలా వందలమంది బడి మానేసిన పిల్లలను, చదువుకు దూరంగా ఉన్నవారిని తిరిగి బడికి పంపారు. ఈ క్రమంలో పేదరికంలో మగ్గుతున్న 46 మంది చిన్నారులను ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా ప్రయివేటు పాఠశాలలో చదివిస్తున్నారు. నాలుగేండ్లుగా సంస్థ ఆధ్వర్యంలో వారికి బట్టలు, పుస్తకాలు కొనిస్తున్నారు. ఫీజులు చెల్లిస్తున్నారు.

### అందరికీ యోగ..

యోగా అంటే ఉన్నవాళ్లకు మాత్రమేనని.. పేదలకు యోగా చేసే భాగ్యం లేదని కొందరు అంటుంటారు. పిల్లలు యోగా చేయవద్దని, గర్భిణులు యోగా చేస్తే ప్రమాదమని ఇంకొందరు అంటుంటారు. ఇలా యోగాపై అపోహలు ఉన్నాయి. వీటన్నింటినీ పటాపంచలు చేయడానికి ఆమె ఇటీవల ప్రపంచ యోగా దినోత్సవం రోజున జూబ్లీహిల్స్‌లో 100 మంది గర్భిణులతో యోగా చేయించారు. నిపుణులతో యోగాపై ఉన్న అనుమానాల్ని నివృత్తి చేశారు. ఆమె చేసిన కృషికి గాను ఇంటర్నేషనల్ వండర్ బుక్ ఆఫ్ రికార్డ్‌లో చోటు లభించింది.

### ఒక్క రూపాయి తీసుకోరు

కోవిధ సహృదయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరాలు, దంత వైద్య శిబిరాలు, ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. పేద విద్యార్థులకు ఆపన్న హస్తం అందిస్తున్నారు. చైతన్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో 2019 మహిళల దినోత్సవం రోజున వికలాంగులు, దివ్యాంగులను కంటికి రెప్పలా కాపాడుతున్న తల్లులను సత్కరించారు. వందమందికి 'మాతృశ్రీ' అవార్డు ఇచ్చి ఘనంగా సన్మానించారు. కోవిధ సహృదయ ఫౌండేషన్ ప్రారంభం నుంచి ఇప్పటి వరకు ఎవరి వద్ద విరాళాలు తీసుకోకుండా సేవాకార్యక్రమాలు చేస్తున్నారు అనూహ్య రెడ్డి. సంస్థ సేవలు నచ్చి వలంటీర్స్‌గా పనిచేయడానికి నగరంలోని చాలామంది యువత ముందుకొస్తున్నారు. ఫ్యాషన్ డిజైనింగ్ రంగంలో వెయ్యి కుటుంబాలకు అనూహ్య రెడ్డి ఉపాధిని కల్పిస్తున్నారు.

### జర్మనీ నుంచి డాక్టరేట్

గంగదాసు అనూహ్యారెడ్డి స్వస్థలం హైదరాబాద్. ఆమె ఇప్పటి వరకు 22 సినిమాలకు కాస్ట్యూమ్ డిజైనర్‌గా పనిచేశారు. మొదటిసారి 2004లో అప్పారావు డ్రైవింగ్ స్కూల్ సినిమాకు కాస్ట్యూమ్ డిజైనర్‌గా పనిచేశారు. అనంతరం ఆమె ప్రతిభతో పెద్ద సినిమాల్లో పనిచేశారు. నయనతార, సమంత, కాజల్, ప్రభాస్, రమ్యకృష్ణ ఇంకా ఎందరో పెద్ద హీరోలు నటించిన సినిమాలకు అనూహ్యారెడ్డి కాస్ట్యూమ్ డిజైనర్‌గా పనిచేశారు. ఇవే కాకుండా జవాన్లకు, ఆస్పత్రులకు, ప్రయివేటు సంస్థలకు యూనిఫాం డిజైనింగ్ చేస్తున్నారు. అలా సంపాదించిన డబ్బుతో సేవా కార్యక్రమాల్ని నిర్వహిస్తున్నారు. అనూహ్యారెడ్డి సేవల్ని గుర్తించిన 'జర్మనీ ఇంటర్నేషనల్ పీస్ యూనివర్సిటీ' 2018లో డాక్టరేట్ అందించింది. మహిళా పారిశ్రామిక వేత్తగా ఫ్యాషన్ డిజైనింగ్ రంగంలో ఆమెకు 'నేషనల్ ఎక్స్‌లెన్స్' అవార్డు కూడా లభించింది.

### రైతులకు పట్టాభిషేకం..

రైతు జీవన విధానం మారాలని, రైతు రాజు కావాలని అనూహ్యారెడ్డి అంటున్నారు. వచ్చే జనవరిలో తెలంగాణ వ్యాప్తంగా వంద మంది రైతులను గుర్తించి వారికి 'బంగారు హలం' బహూకరించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు అనూహ్యారెడ్డి చెబుతున్నారు. పంటలు బాగా పండించిన వారికి, సామాజిక సమస్యలపై పోరాడే రైతులకు ఈ అవార్డులు అందించనున్నారు. తెలంగాణలోని అన్ని గ్రామాల్లో 'పెద్దల కొలువు' కార్యక్రమాన్నీ ప్రారంభించనున్నారు. గ్రామంలోని పెద్దలంతా ఒకచోట కూర్చొని సమస్యల్ని పరిష్కరించుకునేలా ప్రోత్సహించడమే ఈ కార్యక్రమం ఉద్దేశం.

### వివాహం జరిపిస్తాం రండి..

ఆర్థికస్తోమత లేని ఆడపిల్లల తల్లిదండ్రులకు బాసటగా నిలబడాలని 'కోవిధ సహృదయ ఫౌండేషన్' నిర్ణయించుకున్నది. మా ఫౌండేషన్ ద్వారా గతంలో 16 పెండ్లిండ్లు జరిపించాం. వచ్చే సెప్టెంబర్‌లో మరో వంద జంటలకు ఉచితంగా సామూహిక వివాహాలు జరిపించేందుకు సిద్ధమవుతున్నాం. హిందూ సంప్రదాయ పద్ధతిలో ఈ సామూహిక వివాహాలు జరగనున్నాయి. వివాహ ఖర్చులు పూర్తిగా మేమే భరిస్తాం. భోజనం, వసతి ఏర్పాట్లు చేస్తున్నాం. ఈ సామూహిక వివాహాలకు సెప్టెంబర్ 19లోపు పేర్లు నమోదు చేసుకోవాలి. వివరాలకు 98482 74718, 75693 12029 నంబర్లను సంప్రదించొచ్చు.
**- డాక్టర్ అనూహ్యారెడ్డి,** సంఘ సేవకురాలు

...✍ పడమటింటి రవికుమార్
📷 చిన్న యాదగిరిగౌడ్

## మెరుగైన సమాజం కోసం..

**పీజీ వరకూ చదివినా ఆమె ఓ ఆస్పత్రిలో చిన్న ఉద్యోగం చేస్తుంది. అదీ డ్రైవర్‌గా. ఉద్యోగం అంటే జీతం తీసుకొని కాదు. ఉచితంగానే చేస్తున్నది. అది సామాజిక బాధ్యత, మహిళా సాధికారితగా ఆమె భావిస్తున్నది.**

కేరళలోని తిరువంబాడీ ప్రాంతం.. అందరూ మరియమ్మ అని పిలుచుకునే మరియా బాబు ఏడేండ్లుగా అంబులెన్స్ నడుపుతున్న మహిళగా అక్కడ అందరికీ తెలుసు. అక్కడే లీసా పెయిన్ అండ్ పెల్లెటీవ్ కేర్ సెంటర్లో అంబులెన్స్ డ్రైవర్‌గా పనిచేస్తుంది. అదీ కూడా ఎలాంటి వేతనం ఆశించకుండా డ్రైవర్‌గా చేయడం విశేషం. ఉద్యోగమంటే అవసరమైన వారికి సేవ చేయడం లాంటిదని మరియమ్మ అభిప్రాయం. తల్లిదండ్రులు తనను స్వేచ్ఛగా, సమానంగా పెంచడం వల్లనే ఇలా చెయ్యగలుగుతున్నానని అంటున్నది మరియమ్మ. మెరుగైన సమాజ నిర్మాణం కోసం ఆలోచించేలా తన తల్లిదండ్రులు పెంచారని అంటున్నది. వారి స్ఫూర్తితోనే తాను ఇలాంటి పనులు చేస్తున్నట్లు చెబుతున్నది. సామాజిక సంస్థలతో కలిసి పనిచేయడం ద్వారా మహిళా సాధికారత గురించి ఆమెకు చాలా అనుభవం వచ్చింది. ఇందులో భాగంగానే ఆమె పెల్లెటీవ్ కేర్ సెంటర్లో ప్రస్తుతం పనిచేస్తున్నది. ఇక్కడ ఆమె చదువుకున్న చదువుకు ఇతర ఉద్యోగాలూ వస్తాయి. కానీ ఆమె మాత్రం అంబులెన్స్ డ్రైవర్‌గానే పనిచేయడానికి ఆసక్తి చూపుతున్నది. ఇది ప్రత్యక్షంగా అవసరమైనవారికి సహాయం చేయడం మాత్రమే కాకుండా.. చాలా మంది మహిళలకు ప్రేరణగా, స్ఫూర్తివంతంగా ఉంటుందని భావించింది మరియమ్మ. అంబులెన్స్ నడపడం మరియ జీవితంలో ఒక చిన్న ప్రయత్నం మాత్రమే. అంతకుమించి ఆమె పేషంట్లకు ఇంటి వద్దకెళ్లి వైద్య సలహాలు ఇస్తున్నది. వ్యక్తిత్వ వికాస తరగతులు నిర్వహిస్తున్నది. మహిళలకు, చిన్నారులకు జ్ఞాపకశక్తిని మెరుగుపరుచుకునే మెళకువలు నేర్పుతున్నది. ఆమె ఆలోచనల్ని మహిళాభివృద్ధికై ఆచరణాత్మకంగా నిరూపించాలనుకుంటున్నది.

## పిల్లలు స్కూలుకెళ్లట్లేదా?

**స్కూళ్లు స్టార్టయ్యాయి. పది రోజులు గడుస్తున్నా.. పిల్లలు బడికి వెళ్లడానికి జంకుతుంటారు. ముఖ్యంగా పిల్లలకు స్కూల్ ఫోబియా పట్టుకుంటుంది. వేసవి సెలవుల్లో ఇంట్లో ఆటలు, ఇష్టమైన తిండ్లు, ప్రయాణాలు ఇవన్నింటి ముందు బడి అంటే భయం మొదలవుతుంది. ఈ క్రమంలో బడికి వెళ్లేలా పిల్లల్ని తయారు చేయాల్సిన బాధ్యత తల్లిదండ్రులది, ఉపాధ్యాయులది.**

- సాధారణంగా పిల్లలు బడికి వెళ్లడానికి అయిష్టత చూపడానికి కారణం వేరు చేయబడుతున్నామనే భావనే. అయితే తల్లిదండ్రుల నుంచి వేరు చేయబడుతున్నామనే భావనను తొలగించాలి. ఇందుకు స్కూలుకు వెళ్లొచ్చాక కొన్నాళ్లు తల్లిదండ్రులు పూర్తి సమయం పిల్లలకు కేటాయించాలి. స్కూల్లో జరిగిన విషయాలను చర్చించాలి.
- పిల్లలకు చిన్న చిన్న లంచాలు ఇవ్వడంలో తప్పు లేదు. స్కూలుకు వెళ్తే బొమ్మలు కొనిస్తామనో, సినిమాకు తీసుకెళ్తామనో చెబితే పిల్లలు స్కూలుకు వెళ్లడానికి భయపడరు. పిల్లలకు డబ్బులు చేతికి ఇవ్వకుండా వారికి కావాల్సిన ఆహారపదార్థాలు, చాక్లెట్లు, బిస్కెట్లు కొనిస్తే మంచిది.
- పిల్లలకు చదువు విలువ తరచూ చెబుతూ ఉండాలి. చదువుకుని గొప్ప వాళ్లు అయిన వారి గురించి చెబుతూ ఉండాలి. ఇంట్లో కూడా చదువుకునే వాతావరణం ఉండాలి. తల్లిదండ్రులు చదవడమో, రాయడమో చేస్తూ ఉంటే పిల్లలు చదువుతారు.
- కొందరు పిల్లలు స్కూలుకు వెళ్లడం ఇష్టం లేక కడుపు నొస్తుందనో, కాళ్లు నొస్తున్నాయనో చెబుతుంటారు. నిజమో కాదో తెలుసుకోవాల్సిన బాధ్యత పేరెంట్స్‌దే. పూర్తి ఆరోగ్యంగా ఉంటేనే స్కూలుకు పంపించాలి.
- పిల్లలకు ముందు స్కూలంటే భయం పోగొట్టాలి. ఈ విషయంలో ఉపాధ్యాయులదే కీలక పాత్ర. ఉపాధ్యాయుడు పిల్లలను తన సొంత పిల్లల్ల మాదిరిగా భావించి వారికి ప్రేమగా చదువు నేర్పించాలి. అలాంటప్పుడే పిల్లలు స్కూలంటే భయపడరు.

## న్యూస్ పేపర్ వాడండిలా..

**న్యూస్ పేపర్‌ను పడేస్తున్నారా? లేదా అమ్మేస్తున్నారా. ఇకపై ఇంటి అవసరాలకు ఉపయోగించండి. ఈ చిన్న టిప్స్‌ను ఉపయోగించి పాత న్యూస్ పేపర్‌ను మన ఇంటి అవసరాలకు చక్కగా ఉపయోగించుకోవచ్చు.**

- వంటింట్లో, అల్మారాల్లో నేరుగా వస్తువులు పెట్టడం వల్ల సెల్ఫులు పాడైపోతుంటాయి. న్యూస్ పేపర్‌పై కాస్తంత టాల్కం పౌడర్ చల్లి సెల్ఫుల్లో పర్చడం వల్ల వస్తువులు, బట్టలు పాడవకుండా ఉంటాయి.
- షూలు పాడవకుండా షూ మధ్యలో న్యూస్ పేపర్లను పెట్టొచ్చు. షూ తడిగా ఉంటే లోపలి భాగంలో తేమను పీల్చుకునేందుకు కూడా వాడొచ్చు. మాంసపు గ్రిల్స్‌ను శుభ్రపర్చడానికి కూడా న్యూస్ పేపర్లు ఉపయోగపడుతాయి.
- న్యూస్ పేపర్లలో వాడే రంగులను పూర్తిగా రసాయనాలతో తయారు చేస్తారు. ఈ కారణంగా న్యూస్ పేపర్లలో ఆహారపదార్థాలు తినకపోవడమే మంచిది. పూర్తి తెల్లటి కాగితాలను ఉపయోగించి ఆహారపదార్థాలను తినడంలో ఉపయోగించుకోవచ్చు.
- కూరగాయల్ని తాజాగా ఉంచడానికి కూడా న్యూస్ పేపర్లు ఉపయోగపడతాయి. కిరాణా దుకాణాల్లో పొట్లాలు కట్టడానికి కవర్ల బదులుగా న్యూస్ పేపర్లను ఉపయోగించవచ్చు. తద్వారా పర్యావరణానికి మేలు చేసిన వారమవుతాం.
- న్యూస్ పేపర్లను ఉపయోగించి గిఫ్టు ప్యాకింగులు చేసుకోవచ్చు. కిటికీ అద్దాలు, వాహనాల అద్దాలు మెరవడానికి అద్దాలపై కొద్దిగా నీళ్లు చల్లి న్యూస్‌పేపర్‌తో తుడవాలి. అద్దాలపై మొండి మరకలు పోవాలంటే కాస్తంత టాల్కం పౌడర్ చల్లి న్యూస్ పేపర్‌తో తుడిస్తే మొండి మరకలు సైతం మాయమవుతాయి.

## వైద్యమే బాధ్యతగా!

**మన దేశం ప్రశాంతంగా నిద్రపోతుందంటే దానికి కారణం సైనికులు. సరిహద్దుల చుట్టూ పడిగాపులు కాస్తూ.. ప్రజల సంక్షేమమే వారి జీవితంగా భావిస్తున్నారు వారు. అలాంటి సైనికులకు వైద్యం అందించడం తక్షణ కర్తవ్యంగా భావిస్తున్నది ఈ యువతి.**

భారతదేశ ఆర్మీలో కల్పనా కుండు యంగ్ మెడికల్ ఆఫీసర్. చిన్న వయసులోనే భారత ఆర్మీలో చేరింది. సైనికులకు వైద్యం అందించమే ధ్యేయంగా పెట్టుకున్నది. ఇండియన్ ఆర్మీలో ప్రత్యేకమైన దళంగా వైద్య దళానికి పేరున్నది. భారత జవాన్లకు వైద్యం అందించేందుకు చైనా బార్డర్‌కు వెళ్లడానికి ఎవరూ ధైర్యం చూపరు. 2019 జూన్ 20న అరుణాచల్ ప్రదేశ్‌లోని శక్తివంతమైన హిమాలయాలలో భారత సైన్యం ఎత్తైన పెట్రోలింగ్ చేపట్టింది. దీనికి కల్పనా లీడర్‌గా వ్యవహరించింది. సరిహద్దులో ఉన్న జవాన్లకు వైద్య సదుపాయాన్ని కల్పించింది. 2016లో అప్పటి రాష్ట్రపతి ప్రణబ్ ముఖర్జీ భారత సాయుధ దళాల విభాగాల్లో మహిళలు బాధ్యతలు చేపట్టడానికి అనుమతినిచ్చారు. మార్చి 2019లో భారత సాయుధ దళాల 10 శాఖలలో మహిళలకు శాశ్వత కమిషన్ అనుమతించబడింది. దీంతో మహిళలు దేశ సేవకు అంకితమయ్యారు. ప్రభుత్వ లెక్కల ప్రకారం ఆర్మీలో ప్రస్తుతం 3.80 శాతం మంది మహిళలు ఉన్నారు. వైమానిక దళంలో 13.09 శాతం, నావికాదళంలో 6 శాతం మంది మహిళలు ఉన్నారు. ప్రస్తుతం భారత్–చైనా బార్డర్‌లో సైనికులకు వైద్యం అందిస్తున్నది కల్పనా. చాలా క్లిష్టపరిస్థితులు ఉండే ఆ సరిహద్దుల్లో వైద్య వృత్తిని విజయవంతంగా కొనసాగిస్తున్న కల్పన ధైర్యానికి నెటిజన్లు సెల్యూట్ చేస్తున్నారు.

## శరీర సౌందర్యానికి..

**ముఖంపై మొటిమలు రావడం సహజం. వాటిని నిర్లక్ష్యం చేస్తే మచ్చలు రావడమూ సహజమే. ఈ క్రమంలో వంటింట్లో అందుబాటులో ఉండే పదార్థాలతో ముఖకాంతిని పెంచుకోవచ్చు. రసాయన రహిత పదార్థాలతో అందాన్ని రెట్టింపు చేసుకోవడమెలాగంటే...**

- స్నానానికి ముందు శరీరం శుభ్రం చేసుకునే బ్రష్‌తో ఒళ్లంతా ఒక్కసారి రుద్దితే చర్మంపై ఉన్న క్రిములు తొలగిపోయి ఆరోగ్యవంతంగా ఉంటుంది. వీలైతే సున్నిపిండి పెట్టి చర్మాన్ని రుద్దితే మంచి ఫలితాలు ఉంటాయి. కనీసం వారంలో ఒక్కసారైనా ఇలా చేస్తే మంచిది.
- నారింజ పండు తొక్కలు తీసి పక్కన బెట్టాలి. ఆ తర్వాత వాటిని ఎండబెట్టాలి. గ్రైండ్ చేసి పౌడర్ చేసుకోవాలి. ఆ పౌడర్‌ని పచ్చి పాలలో కలిపి ఒళ్లంతా పట్టించి రాసుకుంటే నల్లరంగు పోయి చర్మం కాంతిని సంతరించుకుంటుంది.
- కొందరి ముఖం ఎప్పుడూ జిగురుగానే కనిపిస్తుంటుంది. జిడ్డు ముఖం ఉన్నవారు క్యారెట్‌ను మిక్సీ పట్టి ఆ గుజ్జును ముఖానికి పట్టించాలి. గంటసేపు అలాగే ఉంచి ఆ తర్వాత గోరువెచ్చని నీటితో ముఖాన్ని శుభ్రం చేసుకుంటే జిడ్డు తొలిగిపోతుంది.
- పొడి చర్మం ఉన్నవారు ముల్తానీ మట్టిలో చెంచా తేనె, చెంచా బాదాం నూనె, అరచెంచా మీగడ, గులాబీ నీరు కలిపి ముఖానికి, మెడకీ, చేతులకు రాసుకోవాలి. పూర్తిగా ఆరకుండానే కడిగేసుకోవాలి. ఇలా చేయడం వల్ల చర్మంలోని సహజ నూనె గ్రంథులు బయటికి పోవు. చర్మానికి తగిన తేమ అందుతుంది.
- మొటిమలు, మచ్చలతో ముఖం కాంతి విహీనంగా కనిపిస్తున్నప్పుడు ముల్తానీ మట్టిలో చెంచా తులసి పొడి, చెంచా గంధం పొడి వేసి వాటన్నింటినీ కలిపి పచ్చి పాలతో పేస్టులా చేసుకోవాలి. దీన్ని రాత్రిపూట ముఖానికి పూతలా వేసుకుని గోరువెచ్చని నీళ్లతో కడిగేసుకుంటే సమస్య దూరమవుతుంది.

## వంటింటి చిట్కాలు

- రసానికి చింతపండు నానబెట్టేటప్పుడు చల్లని నీరు కాకుండా కొంచెం వేడినీటిని వాడడం వల్ల నాని పులుపు త్వరగా బయటకు వస్తుంది.
- గుమ్మడికాయ గింజలను పారవేసే కంటే వాటిని కొంచెం వేయించి ఉప్పు, కారం, పులుసు వేసి చట్నీ నూరుకుంటే ఎంతో రుచిగా ఉంటుంది.
- పకోడీలకు కలిపిన పిండిని పావుగంట ఊరనిచ్చి కొన్ని వెల్లుల్లి పాయలను నూరి కలిపితే పకోడీలు కరకరలాడుతూ రుచిగా ఉంటాయి.
- మినుపప్పు పిండిలో కప్పు సగ్గబియ్యం నానబెట్టి రుబ్బి కలిపితే పిండి అంటుకోకపోవడమే కాకుండా పలుచగా వస్తాయి.
- కోడిగుడ్డు ఉడికించే ముందు కొంచెం నిమ్మరసం రాస్తే ఉడుకుతుండగా గుడ్డు పగిలి సొన బయటకు రాదు.
- బత్తాయిపండ్లు నిల్వ ఉండి ఆరిపోతే ఒలిచేటప్పుడు తొక్క సులువుగా ఊడిరాదు. అందుకు ఐదు నిమిషాల ముందు వేడినీటిలో నానబెట్టి ఒలిస్తే తొక్కలు సులువుగా ఊడిపోతాయి.

నమస్తే తెలంగాణ
నిధి
[ కరీంనగర్ ]
శనివారం 29 జూన్ 2019

జీవిత బీమా

# మారుతున్న నవతరం లక్ష్యాలు

## బజాజ్ అలియెంజ్ సర్వేలో ఆసక్తికర అంశాలు

**నవతరం జీవన లక్ష్యాలు కొత్త పోకడలకు ఆనవాళ్లు అవుతున్నాయి. ప్రశాంతమైన రిటైర్‌మెంట్ జీవితం కోసమే కాదు, ఓ పారిశ్రామిక వేత్తగా ఎదగాలన్న తహతహ, ఆరోగ్యం, ఫిట్‌నెస్, ట్రావెల్ వంటివి కొత్త జీవిత లక్ష్యాలుగా నవతరం ఎంచుకుంటున్నది. పెద్ద ఇల్లు, నెలకింత పింఛన్ వంటి సంప్రదాయ రిటైర్‌మెంట్ ప్రణాళికలకు కాలం చెల్లినట్టుగా కనిపిస్తున్నది. ఐఎంఆర్‌బీతో కలిసి బజాజ్ అలయెన్జ్ లైఫ్ ఇన్సూరెన్స్ చేసిన సర్వేలో మరెన్నో ఆసక్తికర అంశాలు వెల్లడి అయ్యాయి**

మన దేశంలో జీవిత లక్ష్యాల కోసం సన్నద్ధతను తెలిపే ఇండెక్స్ మిగతా దేశాల కన్నా తక్కువగా కేవలం 53 ఉన్నట్టు ఈ సర్వే నిర్ధారించింది. అంటే దాదాపు 47 శాతం మంది భవిష్యత్ గురించి ఎలాంటి ఆలోచనలు లేకుండా జీవిస్తున్నారు. పదిమందిలో ఒకరు ఎంటర్‌ప్రెన్యూర్‌గా ఎదిగి కొత్తది ఏదైనా చేయాలన్న తపనతో ఉన్నారు. కొత్త పరిశ్రమను స్థాపించి ఎదగడం ఒక ప్రత్యామ్నాయ కెరీర్‌గా ఎంచుకునే వారి సంఖ్య పెరుగుతున్నట్టుగా ఈ సర్వే తేల్చింది. ప్రతి ఐదుగురిలో ఇద్దరు రిటైర్‌మెంట్‌కు సంబంధించిన జీవిత లక్ష్యాలను నిర్దేశించుకుంటున్నారు. ప్రశాంతమైన రిటైర్‌మెంట్ జీవితం కావాలనుకుంటున్న నవతరం 42 శాతం మంది. మెట్రో నగరాల్లో జీవించే వారిలో నలుగురిలో ఒకరు ధనవంతునిగా రిటైర్ కావాలనుకుంటున్నారు. మరో ఆసక్తికర అంశం ఉత్తరాదిలో కన్నా దక్షిణాదిలోనే 30 శాతం ఎక్కువ మంది రిటైర్‌మెంట్ లక్ష్యాలను నిర్దేశించుకుంటున్నారట. కాగా, ప్రతి ముగ్గురిలో ఒకరు ఆరోగ్యంగా ఉంటే ఆదే మహాభాగ్యంగా భావిస్తున్నారు. వీరు జీవితాంతం ఫిట్‌నెస్‌తో ఉండాలని కోరుకుంటున్నారట. మానసికంగా, శారీరకంగా ఫిట్‌గా ఉండాలనుకోవడం టాప్‌టెన్ జీవిత లక్ష్యాలలో ప్రముఖంగా ఉంది. దేశ విదేశాలు తిరిగి రావాలన్న కోరికలు బలంగానే ఉన్నాయి. ముఖ్యంగా దక్షిణాదిలో ప్రపంచమంతా చుట్టి రావాలన్న లక్ష్యం దేశీయ సగటు కన్నా 25 శాతం ఎక్కువగా ఉంది. సగానికి సగం మంది జీవితం, ఉద్యోగం మధ్య సమతుల్యతకు ప్రాధాన్యతనిస్తున్నారు. ఇలా సమతుల్య జీవితాన్ని గడపాలనుకుంటున్న వారిలో కూడా దక్షిణాది వారే 18 శాతం ఎక్కువ. సమాజంలో తమ ప్రభావాన్ని చూపించాలనుకుంటున్న వారు, అందుకోసం ఉద్యోగావకాశాల కల్పన, మరోకరి కలను నిజం చేయడానికి తోడ్పడడం, బోధన ద్వారా జ్ఞానాన్ని పంచడంతో పాటు దానధర్మాలు చేయాలనుకుంటున్న వారి సంఖ్య ఎక్కువుంది. ఇలాంటివారు దేశంలో ప్రతి ఐదుగురిలో ఒకరున్నారు.

### మహిళలదే నాయకత్వం

జీవిత లక్ష్యాలను నిర్దేశించుకోవడంలోనూ వాటిని సాధించాలన్న తపనలోనూ మహిళలదే పైచేయి. ప్రపంచం చుట్టి రావాలని 34 శాతం మంది మహిళలు కోరుకుంటుండగా, కేవలం 27 శాతం మంది పురుషులే అందుకు సన్నద్ధంగా ఉన్నారు. ప్రతి ఐదుగురు మహిళల్లో ఇద్దరు ఆరోగ్యం ఫిట్‌నెస్ లక్ష్యాలతో ఉన్నారు. మంచి బ్యాలన్స్‌డ్ జీవితాన్ని సగానికి సగం మంది మహిళలు కోరుకుంటున్నారు.

### సంప్రదాయ లక్ష్యాలూ ఎక్కువే

పెద్ద ఇల్లు, పిల్లల చదువు, లగ్జరీ కారు వంటి లక్ష్యాలూ కొత్తతరానికి ఉన్నాయి. అయితే ఇవి సొంతంగా వచ్చినవి కావు. 50 శాతం జీవిత లక్ష్యాలు కుటుంబ సభ్యుల, స్నేహితుల ప్రభావంతో నిర్ణయించుకున్నవే. 20 శాతం సోషల్ మీడియా, 19 శాతం పుస్తకాల ప్రభావంతో నిర్ణయించుకున్నారు. లక్ష్యాలను సాధిస్తామన్న విశ్వాసం 38 శాతం మందికి లేదు. ఆసక్తికరంగా మెట్రో నగరాల్లో నివసిస్తున్న వారిలో ఈ విశ్వాసరాహిత్యం ఎక్కువగా ఉంది. 48 శాతం మెట్రో నగరాల వాసులు తమ లక్ష్యాలను సాధిస్తామన్న విశ్వాసాన్ని కలిగి లేరు. 67 శాతం మంది తాము స్వంత ఇల్లును కొనగలమా? అన్న సందేహంలో ఉన్నారు. వృద్ధాప్యంలో ఆర్థిక స్వావలంబన కలిగి ఉంటామన్న నమ్మకం 70 శాతం మందికి లేదు. స్వంతంగా బిజినెస్ పెట్టి విజయం సాధిస్తామన్న నమ్మకాన్ని కలిగి లేరు. లక్ష్యాలను సాధించడానికి అవసరమైన నైపుణ్య లేమి, ఆర్థికంగా మద్దతు, ప్రణాళికాలోపం కారణాలే అందుకు కారణాలుగా పేర్కొన్నారు. అయితే, జీవిత లక్ష్యాలను సాధించడానికి 80 శాతం మంది బీమా పాలసీలను తీసుకుంటున్నారు. సొంత ఇంటి కోసం 57 శాతం మంది జీవిత బీమాతో పాటు యులిప్ పాలసీలను తీసుకుంటున్నారు. బీమాలో మదుపు చేయడం ద్వారా పిల్లల చదువు నేరవేరుతుందన్న నమ్మకంతో 53 శాతం మంది ఉన్నారు.

**మనదేశంలో యూనిట్ లింక్‌డ్ ఇన్స్యూరెన్స్ పాలసీలు (యూలిప్‌లు) 2003-2006 మధ్యకాలంలో మార్కెట్‌లోకి వచ్చాయి. రాగానే విపరీతమైన జనాదరణ పొందాయి.డిస్ట్రిబ్యూటర్లు, ఇంటర్‌మీడియరీ సంస్థలు వీటిని చురుకుగా మార్కెట్ చేశాయి. అయితే కొద్దికాలంలోనే ఆకర్షణ కోల్పోయాయి. వ్యయ నిష్పత్తి ఎక్కువగా ఉండటం, అమ్మకాలు సరిగా లేకపోవడం వల్ల ఆశించిన రీతిలో ఇన్వెస్టర్ల విశ్వాసాన్ని పొందలేకపోయాయి.**

## యూలిప్‌లు..

# సానుకూలం.. విశ్వసనీయం..

## రిస్కు కవరేజి బీమా - పెట్టుబడికి ధీమా

**మామూలుగా** బీమా ఉత్పత్తులను దీర్ఘకాలిక లక్ష్యాల కోసం రూపొందిస్తారు. జీవన దశలకు అనుగుణమైన లక్ష్యాలకు వాటిలో ఎక్కువ ప్రాధాన్యత ఉండేది. ఇది ఒకరకంగా మంచిదే అయినప్పటికీ, ఇన్వెస్టర్లు దీర్ఘకాలం వేచివుండటానికి కొంత ఇబ్బంది పడేవాళ్లు. ఇలాంటి పరిస్థితుల మధ్యలో మార్కెట్‌లోకి యూలిప్‌లను ప్రవేశపెట్టారు. తొలిదశలో మూడేళ్ల గడువు తరువాత వీటికి లిక్విడిటీ ఉండేది. ఇప్పుడది ఐదేళ్లకు పెంచారు. మూడేళ్ల తరువాత లిక్విడిటీ ఉంటుందనే విషయం ఇన్వెస్టర్లను అప్పట్లో బాగా ఆకర్షించింది. దాంతో పెద్ద ఎత్తున యూలిప్‌లను సబ్‌స్క్రైబ్ చేశారు. అయితే వాళ్లు ఇక్కడ ఒక విషయాన్ని మర్చిపోయారు. వీటిలో పెట్టుబడిని దీర్ఘకాలం కొనసాగిస్తే తప్ప తమ మదుపు లక్ష్యాలను అందుకోలేమన్న అంశాన్ని వాళ్లు గుర్తించలేదు.

- మదుపు పరంగా ఎన్నో రకాల విశిష్టతను కల్గిఉన్న యూలిప్‌లు ఆశించిన స్థాయిలో రాణించకపోవడానికి మరో కారణం- వాటితో ముడిపడి ఉన్న ఛార్జీల భారం. తరువాత కాలంలో ఈ సమస్యను పరిష్కరిస్తూ ఇన్స్యూరెన్స్ రెగ్యులేటరీ అథారిటీ అవసరమైన చర్యలు తీసుకుంది. కేటాయింపుల ఛార్జీలు, మోర్టాలిటీ ఛార్జీలను భారీగా తగ్గించింది.
- యూలిప్‌లను తక్కువ రేటుతో ఇప్పుడు ఆన్‌లైన్‌లో కొనుక్కోవచ్చు. వీటిలో మరో సానుకూల అంశం - ఇది ఒక మిశ్రమ ఉత్పత్తి. అంటే వీటిని కొనుక్కుంటే జీవిత బీమా అందుతుంది. మీరు పెట్టిన పెట్టుబడి దీర్ఘకాలంలో పెరుగుతుంది.
- కవరేజి, వ్యయం, నిధి నాణ్యత, పెట్టుబడులపై అందుకునే రాబడులు వంటి ప్రామాణిక అంశాల ఆధారంగా ఆయా పథకాలను పోల్చిచూసుకుని, అనువైన పాలసీ ఎంచుకునే వీలు వీటిలో ఉంది. సింపుల్‌గా చెప్పాలంటే, యూలిప్‌లు ఇన్వెస్టర్లకు సానుకూలం. విశ్వసనీయం కూడా. తమ దీర్ఘకాలిక ఆర్థిక లక్ష్యాలను అందుకోవడానికి ఇన్వెస్టర్లకు ఇవి తోడ్పడతాయి.
- సహజంగా ఇన్వెస్టర్లు దీర్ఘకాలంలో పెట్టుబడులు పెంచే మదుపు అవకాశం కోసం చూస్తారు. అదే క్రమంలో రిస్కు గురించి కూడా ఆలోచిస్తారు. యూలిప్‌లు ఇన్వెస్టర్లకు అలాంటి అవకాశం అందిస్తాయి. అనేక బీమా కంపెనీలు అందించే యూనిట్ లింక్‌డ్ ఇన్స్యూరెన్స్ పాలసీలు ఒకవైపు ఇన్వెస్టర్లకు జీవిత బీమా అందిస్తున్నాయి. మరోవైపు ఆ పాలసీ హోల్డర్ పెట్టిన పెట్టుబడులపై దీర్ఘకాలంలో మంచి రాబడులు అందిస్తున్నాయి. ఈ పాలసీల కోసం చెల్లించే ప్రీమియంలో కొంతమొత్తం జీవిత బీమా కవరేజికి వినియోగిస్తారు. మిగతామొత్తాన్ని మదుపు పెట్టుబడిగా చూస్తారు.
- ఈక్విటీల పరంగా దీర్ఘకాలిక మూలధన రాబడుల (క్యాపిటల్ గెయిన్స్)పై ఈ మధ్యకాలంలో కొన్ని విధానపరమైన మార్పులు జరిగాయి. దీంతో ఇప్పుడు యూలిప్‌లు, మ్యుచువల్ ఫండ్ల మధ్య పోల్చిచూడటం ఎక్కువైంది. ఈ రెండింటి లక్ష్యం ఇన్వెస్టర్లకు దీర్ఘకాలిక రాబడులు అందించడమే కాబట్టి వీటిలో కూడా ఏది బెటర్ అనే ఆలోచన ఇన్వెస్టర్లలో ఉంది.

**యూలిప్‌లతో ఇన్ని రకాల ప్రయోజనాలు ఉన్నప్పటికీ ఇన్వెస్టర్లు వాటిపై పెద్దగా ఆసక్తి చూపకపోవడం విచారకరమైన అంశం. గత చేదు అనుభవాలే దానికి ప్రధాన కారణం. మ్యుచువల్‌ఫండ్లతో పోలిస్తే ఇప్పుడు యూలిప్‌ల వ్యయ నిష్పత్తి చాలా తక్కువ స్థాయిలో ఉంది. ఇదొక పెద్ద సానుకూల అంశం. అనుకోకుండా చనిపోతే వచ్చే ప్రయోజనాలు, పన్ను రాయితీలు - ఇలాంటి అంశాల ఆధారంగా దీర్ఘకాలిక ఆర్థిక లక్ష్యాల కోసం ఇన్వెస్టర్లు వీటిని ఎంచుకోవచ్చు. పెట్టుబడులపై దీర్ఘకాలంలో మంచి రాబడులు అందించే చవకైన మదుపు మార్గం ఈ యూలిప్‌లు. అవి అందించే అవకాశాన్ని ఇనెస్టర్లు వినియోగించుకుంటే మంచిది.**

| | 3 ఏళ్ల రిటర్నులు (%) | | 5 ఏళ్ల రిటర్నులు (%) | |
|---|---|---|---|---|
| కేటగిరీ | యూలిప్ ఫండ్స్ | మ్యుచువల్ ఫండ్లు | యూలిప్ ఫండ్స్ | మ్యుచువల్ ఫండ్లు |
| లార్జ్ క్యాప్ | 9.57 | 9.58 | 15.18 | 15.31 |
| స్మాల్ అండ్ మిడ్ క్యాప్ | 16.81 | 15.89 | 24.43 | 26.93 |
| మధ్యస్థం | 7.37 | 7.75 | 9.21 | 9.74 |
| స్వల్పకాలిక బాండ్లు | 6.6 | 7.3 | NA | NA |
| అతి స్వల్పకాలిక బాండ్లు | 6.59 | 7.38 | NA | NA |

NA - Not Applicable

### యూలిప్‌ల విషయంలో ఇన్వెస్టర్లకు అనేకరకాలుగా సానుకూల ప్రయోజనాలు ఉన్నాయి. అవేమిటో ఇప్పుడు చూద్దాం.

#### రెండురకాల ప్రయోజనం

యూలిప్‌లు ఇన్వెస్టర్లకు రెండు రకాలుగా ప్రయోజనం అందిస్తాయి. ఓవైపు జీవిత బీమా, మరోవైపు పెట్టుబడులపై దీర్ఘకాలిక రాబడులు ఇస్తాయి. వ్యక్తి వార్షిక ఆదాయం కన్నా 10 నుంచి 20 రెట్ల వరకు ఇవి జీవిత బీమా కవరేజి అందిస్తున్నాయి.

#### ఫ్రీ లుక్ పీరియడ్

పాలసీ ఇష్టం లేకపోతే ఇన్వెస్టరు దానిని ఈ ఫ్రీ లుక్ పీరియడ్‌లో వెనక్కు ఇచ్చేయవచ్చు.

#### వ్యయ నిష్పత్తి

గరిష్ట స్థాయిలో వ్యయనిష్పత్తి 1.35% ఉంటుంది. మ్యుచువల్ ఫండ్లతో పోలిస్తే ఇది తక్కువ.

#### క్రమశిక్షణ

పాలసీ గడువు వరకు క్రమం తప్పకుండా మదుపు చేసే అవకాశం ఉంటుంది కాబట్టి దీర్ఘకాలంలో వీటితో ఇన్వెస్టర్లకు ఆర్థికపరమైన క్రమశిక్షణ అలవాటవుతుంది.

#### ఆర్థిక లక్ష్యాలకు రక్షణ

ఇన్వెస్ట్ చేసిన వ్యక్తి అనుకోకుండా చనిపోయినప్పుడు.....

- బీమా మొత్తాన్ని కుటుంబ సభ్యులకు అందిస్తారు. ఆపత్కాలంలో అది ఆ కుటుంబాన్ని ఆదుకుంటుంది. ఆర్థికపరమైన రక్షణ ఇస్తుంది.
- అప్పటికి ప్రీమియం చెల్లింపులు అన్నీ సరిగ్గా ఉంటే భవిష్యత్ ప్రీమియంలు చెల్లించాల్సిన అవసరం లేదు. ఇదొక మంచి ప్రయోజనం. తరువాత కూడా ప్రీమియంలు రెగ్యులర్‌గా చెల్లించినట్టు భావిస్తూ యూనిట్ల కేటాయింపు కొనసాగుతూ ఉంటుంది. ఇన్వెస్టరు ఆశించిన దీర్ఘకాలిక ఆర్థిక లక్ష్యాలను సాధించడానికి ఇది ఉపయోగపడుతుంది.

#### వైవిధ్యమైన పోర్టుఫోలియో వ్యూహాలు

- ఫిక్స్‌డ్ పోర్టుఫోలియో వ్యూహం - ఇందులో విభిన్న అస్సెట్ వర్గాలకు ముందే నిర్ధారించిన రీతిలో కేటాయింపులు జరుగుతాయి.
- లైఫ్ సైకిల్ బేస్డ్ పోర్టుఫోలియే వ్యూహం - ఇన్వెస్ట్ చేసే వ్యక్తి వయసు ఆధారంగా ఈక్విటీ, డెట్ వనరుల మధ్య సమతుల్యత పాటించడం ఈ వ్యూహంలో ప్రధాన అంశం. వయసుకు అనుగుణంగా ఈక్విటీ, డెట్ నిధుల కేటాయింపులలో మార్పులు జరుగుతూ ఉంటాయి. తమ పెట్టుబడులకు ఏవి సరైన నిధులు అనేది నిర్ణయించుకోలేని వాళ్లు ఈ వ్యూహాన్ని ఎంచుకోవచ్చు.

#### ప్రీమియం చెల్లింపుల విషయంలో సరళత

తన చాయిస్ బట్టి ఇన్వెస్టరు ఒకేసారి ప్రీమియం చెల్లించవచ్చు లేదా పరిమిత కాలం పాటు ప్రీమియం చెల్లించవచ్చు లేదా మొత్తం పాలసీ గడువుకు ఒకేసారి దాన్ని చెల్లించవచ్చు.

#### పెట్టుబడుల వైవిధ్యత

- ఇన్వెస్టరు వైవిధ్యరీతిలో పెట్టుబడులు పెట్టుకోవచ్చు.
- రిస్కు భరించే సామర్థ్యం బాగా ఉన్నప్పుడు కేవలం ఈక్విటీ వనరులనే పెట్టుబడికి ఎంచుకోవచ్చు. రిస్కు భరించే శక్తి లేనప్పుడు లేదా కొంతమట్టుకు మాత్రమే రిస్కు భరించగలిగినప్పుడు డెట్ వనరులలో పెట్టుబడి పెట్టవచ్చు.
- ఒకవేళ ఇన్వెస్టరు తీసుకునే రిస్కు మధ్యస్థ స్థాయిలో ఉంటే, ఈక్విటి, డెట్ వనరులు రెండింటినీ తనకు అనువైన రీతిలో మదుపు కోసం ఎంచుకోవచ్చు.

**నిధుల మార్పిడికి వీలు:** తన రిస్కు సామర్థ్యం, మదుపు పరమైన నిర్ణయాలకు అనువుగా ఇన్వెస్టరు పెట్టుబడి నిధులను మార్చుకోవచ్చు.

**లిక్విడిటీ:** పాలసీ తీసుకున్న ఐదేళ్ల తరువాత ఇన్వెస్టరు ఎప్పుడైనా తన పెట్టుబడులను పాక్షికంగా వెనక్కు తీసుకోవచ్చు.

**రైడర్లు :** కవరేజి, ఇతర ప్రయోజనాలు పెంచుకోవడానికి ఇన్వెస్టరు ఆయా రైడర్లను అదనంగా కలుపుకోవచ్చు. దీర్ఘకాలం మదుపు కొనసాగిస్తే అందుకుగాను బీమా కంపెనీలు ఇన్వెస్టరుకు లాయల్టీ ప్రయోజనాలు, వెల్త్ బూస్టర్లు అందిస్తాయి. వీటితో ఇన్వెస్టర్లకు అదనపు ప్రయోజనాలు అందుతాయి.

#### పన్ను ప్రయోజనాలు

- చెల్లించిన ప్రీమియంలపై ఏడాదికి గరిష్టంగా 1,50,000 రూపాయల వరకు ఆదాయ పన్ను చట్టం సెక్షన్ 80 సి కింద పన్ను ప్రయోజనం అందుకోవచ్చు.
- బీమా చేసిన వ్యక్తి వ్యక్తి (ఇన్వెస్టరు) చనిపోతే, నామినీలకు అందే పాలసీ మొత్తంపై కూడా పన్నురాయితీ ఉంటుంది. ఏ ఏడాదిలోనైనా చెల్లించిన ప్రీమియం బీమా చేసిన మొత్తంలో నిర్ధారిత శాతం మేర ఉంటే అప్పుడు ఈ పన్ను రాయితీ లభిస్తుంది.
- పాలసీ గడువు తీరిన తరువాత పాలసీ హోల్డర్ చేతికి అందే మెచ్యూరిటీ మొత్తానికి ఆదాయ పన్ను చట్టం సెక్షన్ 10 (10డి) కింద పూర్తిస్థాయిలో పన్ను మినహాయింపు ఉంటుంది.

- డి. జయంత్ కుమార్,
నేషనల్‌హెడ్, కార్పీ,
థర్డ్‌పార్టీప్రొడక్ట్స్

# తొలిసారి లోన్ తీసుకుంటున్నారా?

**మొదటి సారి తీసుకునే రుణాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకునేందుకు కొన్ని మంచి పద్ధతులున్నాయి... వాటిని క్రమశిక్షణతో పాటిస్తే ఆర్థిక భవిష్యత్తును తీర్చిదిద్దుకోవచ్చు....**

**మొదటిసారి** లోన్ కోసం అప్లయ్ చేస్తున్నారా? పేపర్లలో, ఆన్‌లైన్‌లో కనబడే అత్యంత ఆకర్షనీయ ఆఫర్లు మిమ్మల్ని ఒకింత అయోమయానికి గురిచేస్తున్నాయా? పర్సనల్ లోన్, హోం లోన్, వెహికిల్ లోన్- మీరు తీసుకునే లోన్ వీటిలో ఏదైనా కావచ్చు. లోన్ ఏదైనా పేపర్ల మీద సంతకాలు చేసే ముందు కొంత ఆచితూచి అడుగులు వేయడం మంచిది. ఎంత జాగ్ర త్తగా ఉంటే అంత బెటర్. అందుకే, మొదటిసారి లోన్ తీసుకునేముందు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, సరైన నిర్ణయాలు ఎలా తీసుకోవాలి అనే అంశాలను మనం ఇక్కడ చూద్దాం. అదే క్రమంలో, తీసుకున్న లోన్ డబ్బులను సద్వినియోగం చేసుకోవడానికి ఉన్న మార్గాలను తెలుసుకుందాం.

### ఇంతకీ మీకు లోన్ అంత అవసరమా?

మీరు పర్సనల్ లోన్ కోసం ఆలోచిస్తున్నారు అనుకోండి. ఒకటికి రెండుసార్లు ఈ ప్రశ్న వేసుకోవాల్సిందే. 'కేవలం మీ కోసమే, ముందే ఆమోదించిన ఒక ప్రత్యేకమైన మెగా లోన్ ఆఫర్ ఉంది' అని ఒక బ్యాంకు ఊరించిన మాత్రాన మీరు ఆ మాయలో పడాల్సిన అవసరం ఏమీ లేదు. ఒక్క విషయం స్పష్టంగా గుర్తుంచుకోండి. లోన్ అనేది మీది కాని డబ్బు. మీరు దాన్ని వడ్డీతో సహా తిరిగి చెల్లించాలి.ఉదాహరణకు మీరు 15% వార్షిక వడ్డీ లెక్కన 5 ఏళ్ల గడువుపై 3 లక్షల రూపాయల పర్సనల్ లోన్ తీసుకుంటున్నారు అనుకోండి. ఆ 5 ఏళ్ల గడువులో మీరు దానిపై చెల్లించే వడ్డీ మొత్తం 1,28,000 రూపాయలు. అంటే, మీరు వాస్తవానికి తీసుకున్న ఆ 3 లక్షల రూపాయలలో దాదాపుగా సగానికి సమానం!

### ఎంత లోన్ తీసుకోవచ్చు?

ఎంత మొత్తాన్ని మీ పొదుపు, పెట్టుబడులపై అందే రిటర్నులతో మేనేజ్ చేసుకోవచ్చు అనేది చూసుకోవాలి. వీలయినంత ఎక్కువ మొత్తాన్ని స్వంతంగా సమకూర్చుకోగలిగితే, మీపై రుణ భారం, వడ్డీ భారం తగ్గుతాయి. కారు లోన్ తీసుకుంటున్నారు అనుకుంటే, మీ బడ్జెట్‌కు అనువుగా మీ వెహికిల్‌ని ఎంచుకోవాలి.

### ఎంత లోన్ భరించగలరు?

మీరు తీసుకోవాలని అనుకుంటున్న లోన్ మీద ప్రతి నెలా ఎంత వడ్డీ చెల్లించాల్సి ఉంటుంది అనేది లెక్క వేసుకోండి. ప్రతినెలా వచ్చే వేతనం లేదా నికర ఆదాయం ఎంత అనేది చూసుకోండి. దీంట్లోంచి నెల నెలా ఖచ్చితంగా ఉండే ఖర్చులు (అద్దె, వినియోగ బిల్లులు, ఫీజులు, బీమా ప్రీమియం చెల్లింపులు, సిప్ చెల్లింపులు వంటివి), నిలకడలేని ఖర్చులు (ఇంటికి కావాల్సిన సరకులు, రవాణా ఖర్చులు వంటివి), ఇంకా మీరు అప్పటికే ఉన్న అప్పులకు చేసే చెల్లింపులు (క్రెడిట్ కార్డు చెల్లింపులు వంటివి) - ఇలాంటివన్నీ కలిపి మొత్తం ఎంత ఖర్చు అవుతుందో చూసుకోండి. మామూలుగా మీ నెలవారీ నికర ఆదాయంలో 50 శాతం మించి రుణ భారం పెట్టుకోవద్దు. దానిని రుణ- ఆదాయ నిష్పత్తి అంటారు. ఇది ఎప్పుడు 50 శాతానికి మించకూడదు. ఎందుకంటే, మీ నెలవారీ తప్పనిసరి ఖర్చుల్లో కోత లేకుండా, మీ ఆదాయంలో అప్పటికీ కొంత మొత్తాన్ని పొదుపు లేదా మదుపు కోసం పెట్టుకోవాలంటే ఆ నిష్పత్తి పాటించడం తప్పనిసరి. ఇది ప్రామాణికంగా తీసుకుని, మీరు కొత్తగా తీసుకునే రుణానికి అయ్యే చెల్లింపులు కలుపుకున్నా ఆ నిష్పత్తి 50% లోపు ఉంటే అప్పుడు మీరు ఆ లోన్ తీసుకోవచ్చు. ఆ నిష్పత్తిని పాటించడానికి గాను ఒక్కోసారి మీరు తీసుకోవాలనుకునే లోన్ మొత్తాన్ని కొంతమట్టుకు తగ్గించుకోవలసిన పరిస్థితి రావచ్చు. అలాంటప్పుడు ఎంత లోటు ఉందో అంత మొత్తం పొదుపు చేసుకునే వరకు లోన్ తీసుకోకుండా ఆగితే మంచిది.

### క్రెడిట్ స్కోర్ చూసుకోండి

మీ క్రెడిట్ స్కోర్ కనీసం 750 పాయింట్లు ఉండటం చాలా ముఖ్యం. క్రెడిట్ స్కోరు బాగుంటే మీరు కోరుకున్న లోన్ సులభంగా ఆమోదం పొందుతుంది. సులభతరమైన రీతిలో వాయిదాలు చెల్లించే వెసులుబాటు కూడా వస్తుంది. అదే క్రమంలో తక్కువ వడ్డీకే లోన్ పొందవచ్చు; లోన్ పొందడానికి ఏదైనా తాకట్టు పెట్టాల్సిన అవసరం కూడ ఉండకపోవచ్చు. రుణమిచ్చే సంస్థలు మీ క్రెడిట్ రేటింగ్‌ను తప్పక చూస్తాయి. దాన్ని బట్టి మీ రుణ చెల్లింపు సామర్థ్యంపై ఒక అంచనాకు వస్తాయి.

### సరైన వడ్డీరేటు ఎంచుకోండి

చలన వడ్డీ (ఫ్లోటింగ్ రేటు), స్థిర వడ్డీ (ఫిక్స్‌డ్ వడ్డీ) - ఈ రెండింట్లో మీరు ఏదో ఒక వడ్డీ రేటు ఎంచుకోవాలి. మామూలుగా స్థిర వడ్డీ కన్నా చలన వడ్డీ రేటు ఎక్కువగా ఉంటుంది. అయితే మార్కెట్‌లో వడ్డీరేటు మారినప్పుడల్లా అది మారుతూ ఉంటుంది. ఇక స్థిర వడ్డీరేట్లు పేరుకు తగినట్టు స్థిరంగా ఉంటాయి. మామూలుగా ఎక్కువ మంది ఫ్లోటింగ్ రేటు మీదనే లోన్లు తీసుకుంటారు.

### ప్రాసెసింగ్ ఫీజు కూడా చూడండి

లోన్ మీద ఉండే ప్రాసెసింగ్ ఫీజు ఆ లోన్ మొత్తానికి కలుస్తుంది. అది చూసుకోండి. మీరు తీసుకునే లోన్‌కు ఎంత ప్రాసెసింగ్ ఫీజు వసూలు చేస్తున్నారనేది తెలుసుకోండి. తదనుగుణంగా నిర్ణయం తీసుకోండి.

### చెల్లింపు గడువు చూసుకోండి

లోన్ తిరిగి చెల్లించే గడువు ఎంత ఎక్కువగా ఉంటే మీరు చెల్లించే నెలసరి వాయిదా అంత తగ్గుతుంది. అయితే మొత్తంగా గడువు తీరేనాటికి చూసుకుంటే చెల్లించిన వడ్డీ మొత్తం ఎక్కువగానే ఉంటుంది. స్వల్పకాలిక వ్యవధి ఉంటే ప్రతినెలా చెల్లించే వాయిదా మొత్తం పెరుగుతుంది. కానీ మొత్తంగా చెల్లించే వడ్డీభారం బాగా తగ్గుతుంది. చెల్లింపుల పరంగా మీకుండే సౌలభ్యత, సానుకూలతకు అనుగుణంగా రుణ చెల్లింపు గడువు ఎంచుకోండి.

### లోన్ ఒప్పందాన్ని క్షుణ్ణంగా చదవండి

ఇది చాలా ముఖ్యం. లోన్ ఒప్పందం ఆసాంతం క్షుణ్ణంగా చదవండి. మీరు తీసుకుంటున్న లోన్‌కు వర్తించే నియమ నిబంధనలను అన్నింటినీ అర్థం చేసుకోండి. లోన్ ఇచ్చే సంస్థ విధించే విభిన్న రకాల ఛార్జీల వివరాలు తెలుసుకోండి. అంటే, లోన్‌ను గడువుకన్నా ముందుగానే క్లోజ్ చేస్తే లేదా అసలు మొత్తంలో పాక్షిక రుణాన్ని తీర్చేస్తే విధించే ఛార్జీలను అర్థం చేసుకోండి. పైకి చెప్పేవి కాకుండా తెలియకుండా విధించే ఛార్జీలు ఏమైనా ఉన్నాయా అనేది తెలుసుకోండి.

### ఇక లోన్ వచ్చిన తరువాత ..

- లోన్ మొత్తం మీ చేతికి అందిన తరువాత దానిని తెలివిగా వాడుకోండి. మీ నెలవారీ బడ్జెట్‌లో ముందుగా ఈ లోన్ వాయిదా చెల్లింపునకు కావాల్సిన డబ్బులు కేటాయించండి. అవసరమైతే ఇతర ఖర్చులు కాస్త తగ్గించుకోండి. నిర్ధిష్ట గడువులోగా ప్రతినెలా వాయిదా చెల్లించడం చాలా ముఖ్యమనే విషయం మర్చిపోకండి.
- మీరు లోన్ చెల్లింపుకోసం ఒకవేళ ఆటో డెబిట్ సౌకర్యం ఎంచుకుంటే ముందుగా మీ బ్యాంకు ఖాతాలో వాయిదాకు సరిపడా డబ్బులుండేలా చూసుకోండి.
- లోన్ తీసుకునే సమయంలోనే పాక్షికంగా ముందస్తు అసలు చెల్లింపులకు వీలు కల్పించే సంస్థల నుంచి లోన్ తీసుకుంటే మంచిది. కొన్ని నెలవారీ వాయిదాల తరువాత మీ దగ్గర అప్పటికీ అదనపు డబ్బులు ఏమైనా ఉంటే లోన్ అసలు మొత్తంలో పాక్షిక చెల్లింపుల కోసం దానిని వాడండి.

అదిల్ శెట్టి
సీఈవో,
బ్యాంక్‌బజార్.కామ్

## సుడోకు

డైలీ సుడోకు 70 సమాధానం

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 6 | 3 | 9 | 2 | 5 | 4 | 7 | 8 | 1 |
| 1 | 5 | 8 | 7 | 9 | 6 | 3 | 2 | 4 |
| 2 | 7 | 4 | 8 | 3 | 1 | 9 | 6 | 5 |
| 4 | 9 | 3 | 1 | 8 | 2 | 6 | 5 | 7 |
| 5 | 1 | 7 | 6 | 4 | 9 | 2 | 3 | 8 |
| 8 | 2 | 6 | 3 | 7 | 5 | 1 | 4 | 9 |
| 3 | 4 | 1 | 5 | 6 | 7 | 8 | 9 | 2 |
| 7 | 6 | 5 | 9 | 2 | 8 | 4 | 1 | 3 |
| 9 | 8 | 2 | 4 | 1 | 3 | 5 | 7 | 6 |

1. నిలువుగా, అడ్డంగా ప్రతి వరుసలోనూ 1 నుంచి 9 వరకు అంకెలను నింపాలి.
2. ఒకసారి రాసిన అంకెను మరోసారి నింపకూడదు.
3. ప్రతి గడిలోనూ నింపిన అంకెను మళ్లీ నింపకూడదు.

సమాధానం రేపటి సంచికలో

డైలీ సుడోకు -71

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| | | 8 | | 7 | 1 | | | 4 |
| | 7 | | | | 4 | 3 | | |
| | | 9 | 8 | | | | | 2 |
| | | | | | | 2 | 3 | |
| | | 2 | 4 | | 7 | 8 | | |
| | 3 | 1 | | | | | | |
| 7 | | | | | 6 | 9 | | |
| | | 6 | 7 | | | | 5 | |
| 9 | | | 2 | 5 | | 7 | | |

నమస్తే తెలంగాణ
సంపద
[ కరీంనగర్ ]
శనివారం 29 జూన్ 2019

# ఇంటి లైటింగ్ ఇలా ఉండాలి!

**సొంతింటిని నిర్మించుకునేందుకు పెద్ద మొత్తంలో పెట్టుబడి పెడతారు.. ఎంతో శ్రమించి నచ్చిన ఇంటిని సొంతం చేసుకుంటారు.. కానీ చాలా మంది ఇంటికి మరింత శోభను తెచ్చే లైటింగ్‌పై పెద్దగా దృష్టి సారించరు. ఇలాంటి వారంతా ఏ గదిలో ఎలాంటి లైటింగ్ ఏర్పాటు చేయాలనే అంశం గురించి తప్పకుండా తెలుసుకోవాలి.**

నిజానికి ఇంట్లో ఏర్పాటు చేసే లైటింగ్ ప్రభావం అందులో నివసించే వారి మానసికస్థితిపై పడుతుందని నిపుణులు చెబుతుంటారు. మూడ్ మారడంలో దోహదం చేస్తుందంటారు. డిజైన్, వాటి ప్లేస్‌మెంట్, రంగు, గది విస్తీర్ణం, ఫర్నీచర్, సహజ కాంతి తదితర అంశాలను పరిగణలోకి తీసుకోవాలి. ఇంట్లో సరైన కాంతి ప్రసరించేలా ఏర్పాటు చేసినపుడు అనేక ప్రయోజనాలుంటాయి. విశ్వసనీయతకు, నాణ్యతకు, పనితీరుకు ఇంటీరియర్ హోమ్ లైట్ ఫిక్చర్స్ ప్రసిద్ధి చెందాయి. లైటింగ్ ఏర్పాటు వల్ల ఇంట్లోని ప్రతి మూల ప్రకాశవంతంగా కనిపించడంతో పాటు, ఫర్నీచర్ అందం మరింత ద్విగుణీకృతమవుతుంది. తేలికపాటి లైట్ ఫిక్చర్స్ పలు రకాలుగా ఉంటాయి. మోడర్న్, విక్టోరియన్, రుస్టీ, స్టుడియో వంటివి అందుబాటులో ఉన్నాయి.

### ఏ గదిలో ఎలాంటి లైటింగ్...

- ఇంటి ముఖ ద్వారం వద్ద ఏర్పాటు చేసే లైటింగ్ ఆహ్వానం పలుకుతున్నట్లుగా ఉండాలి. దీని కోసం లివింగ్ గదిలో ఒక పెద్ద లైట్ లేదా షాండ్లియర్ ఏర్పాటు చేసుకోవాలి. గోడలపై ఉండే కళాకృతులు మరింత అందంగా కనిపించేందుకు గాను అసెంట్ లైట్లను ఏర్పాటు చేసుకోవాలి. ఇంట్లోని ఇతర రూంల కంటే లివింగ్ రూంను మరింత ప్రత్యేకంగా తీర్చిదిద్దుకోవాలి. ఎందుకంటే విశ్రాంతి కోసం, ఆటల కోసం ఎక్కువ కాలం ఇక్కడే గడుపుతుంటాం.
- పడక గదిలో మసకగా ఉండే లైట్ ఏర్పాటు చేసుకోవాలి. ఇది మనస్సుకు ఆహ్లాదాన్నిస్తుంది. ప్రశాంతమైన నిద్ర సాధ్యమవుతుంది. వెలుతురును సరిదిద్దేందుకు డిమ్మర్ స్విచ్‌ను ఏర్పాటు చేసుకోవాలి.
- స్టడీరూంలో కండ్లపై వెలుతురు ప్రభావం పడకుండా టాస్క్ లైటింగ్ ఏర్పాటు చేసుకోవాలి. దీని వల్ల చదువుకునే పుస్తకం పైనే కాంతి పడుతుంది. వెలుతురును నియంత్రించేందుకు డిమ్మర్ స్విచ్ తప్పనిసరి.
- వంట గదిలో పై భాగంలో ఓవర్ హెడ్ లైటింగ్‌ని ఏర్పాటు చేసుకోవాలి. మరింత అదనపు వెలుతురు కావాలంటే నిర్దిష్ట ప్రదేశంలో చిన్న ఓవర్ హెడ్ లైట్లను అంటే స్పాట్ లైట్లను ఏర్పాటు చేసుకోవాలి. ఎల్ఈడీ లైట్లను ఏర్పాటు చేసుకోవటం మంచి ఎంపిక. డైనింగ్ రూంలో పూర్తి వెలుతురు ఉండేలా చూసుకోవాలి. సాధారణంగా షాండ్లియర్ ఏర్పాటు చేసుకోవచ్చు. పెండంట్ లైట్ల ఏర్పాటు అనేది మంచి ఎంపికనే.
- బాత్‌రూంలో ఎక్కువ వెలుతురు ఉండేలా ఏర్పాటు చేసుకోవాలి. అద్దం స్పష్టంగా కనిపించేలా చూసుకోవాలి. సరైన ఎత్తులో లైటింగ్ ఉండాలి. బాత్ రూం విస్తీర్ణం ఎక్కువగా ఉంటే షాండ్లియర్ ఏర్పాటు చేసుకోవచ్చు. పెండంట్ లైట్‌తో పాటు డిమ్మర్ స్విచ్ తప్పనిసరి.

# ఐదుగురు బిల్డర్లపై కేసు

అక్రమ నిర్మాణాల్ని చేపడుతున్నారనే అభియోగంపై పోలీసులు ఐదుగురు బిల్డర్లపై కేసు నమోదు చేశారు. స్థానిక సంస్థ నుంచి సరైన అనుమతి తీసుకోకుండా నిర్మాణాల్ని కడుతున్నారని పురపాలక అధికారులు చెబుతున్నారు. అట్టి కట్టడాలను కూల్చివేయాలని ఉత్తర్వులు జారీ చేశాక కూడా నిర్మాణాలను కొనసాగిస్తుండటంతో కఠిన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని అంటున్నారు. వీరి మీద ఐపీసీ 188, 336 సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ నిర్మాణాలపై స్థానికులు మున్సిపల్ దృష్టికి తీసుకెళ్లగా.. ఆ ఐదుమందికి షోకాజ్ నోటీసులను జారీ చేశారు. వారి వివరణ చెప్పుకునేందుకు సరైన సమయాన్ని కూడా ఇచ్చారు. కానీ, ఐదుగురు డెవలపర్లు ఇవేవీ పట్టించుకోకపోవడంతో కఠినంగానే వ్యవహరించక తప్పలేదని అధికారులు అంటున్నారు. ఈ కేసు ఘజియాబాద్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో ఇటీవల నమోదు అయ్యింది.

**కేసు నమోదైన బిల్డర్లు వీరే: గోలా బిల్డర్స్, కార్తిక్ డెవలపర్స్, రజత్ రియల్ ఎస్టేట్, మహేశర ఇన్‌ఫ్రా వ్యాలీ, విక్సన్ ప్రాజెక్టు**

# ఇక ఈస్ట్ హైదరాబాద్ జోరు..

**మొన్నటివరకూ..**
ఉప్పల్ అంటే.. ఎన్‌జీఆర్ఐ, సర్వే ఆఫ్ ఇండియా, ఉప్పల్ స్టేడియం వంటివి గుర్తుకొచ్చేవి.

**నిన్నటిదాకా..**
జెన్‌ప్యాక్ట్, పోచారంలో ఇన్ఫోసిస్, రహేజా ఐటీ పార్కు వంటివి గుర్తుకొస్తాయి..

**కానీ, నేడో..**
బహుళ అంతస్తుల భవనాలు, షాపింగ్ మాళ్లు, మల్టీప్లెక్స్ థియేటర్లు, ఆఫీస్ స్పేస్‌లు వంటివి దర్శనమిస్తున్నాయి..

ఔను.. మీరు చదివింది కరెక్టే. ఉప్పల్ అంటే ప్రస్తుతం విసిరేసినట్లు కనిపించే ప్రాంతం కాదు. మెట్రో రైలు డిపోతో ఒక్కసారిగా ఉప్పల్ రూపురేఖలు మారిపోయాయి. ప్రస్తుతం అభివృద్ధి మొత్తం ఉప్పల్ దిశగా పరుగులు పెడుతున్నది. ఇందుకు కారణాలు లేకపోలేవు. పశ్చిమ హైదరాబాద్ అపార్టుమెంట్లతో నిండిపోయింది. పైగా, రేట్లు అందుబాటులో లేకుండా పోయాయి. నిన్నటివరకూ ఉప్పల్ నుంచి పశ్చిమానికి రవాణా సౌకర్యం లేకపోవడంతో ప్రజలు పశ్చిమంలో ఉండేందుకే మొగ్గు చూపారు. కానీ, ప్రస్తుతం మెట్రో రాకతో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ఇక్కడ్నుంచి మాదాపూర్, గచ్చిబౌలి వెళ్లేందుకు ఐటీ, ఐటీఈఎస్ నిపుణులు వంటివారు ఆసక్తి చూపిస్తున్నారు. పశ్చిమంతో పోల్చితే తూర్పు హైదరాబాద్‌లో ఇండ్లు, ఫ్లాట్ల ధరలు అందుబాటులో ఉండటంతో.. ఇక్కడ ఉండటానికే అధిక శాతం మంది ఆసక్తి చూపిస్తున్నారు. పైగా, వీరిని దృష్టిలో పెట్టుకుని బహుళ అంతస్తుల భవనాలు, షాపింగ్ మాళ్లు, మల్టీప్లెక్స్ థియేటర్లు వంటివి అందుబాటులోకి వస్తున్నాయి.

ఎన్ఎస్ఎల్, డీఎస్ఎల్ వంటి సంస్థలు 120 అడుగుల రామాంతపూర్ రోడ్డులో నివాస సముదాయాలు, ప్రప్రథమ షాపింగ్ మాల్, మల్టీప్లెక్స్, ఆఫీస్ స్పేస్ వంటివి నిర్మిస్తున్నాయి. ఇక్కడ దాదాపు ఇరవై అంతస్తుల నివాస సముదాయాల నిర్మాణానికి ప్రణాళికలు జరుగుతున్నాయి. అదేవిధంగా, ఆరు స్క్రీన్ల మల్టీప్లెక్స్ థియేటర్లు, డెబ్బయ్‌కి పైగా చిన్న, మధ్య, పెద్ద రిటైల్ బ్రాండ్లు తమ ఔట్‌లెట్లను ఏర్పాటు చేస్తున్నాయి. దీంతో, ఈ ప్రాంతమంతా సరికొత్త ఆకర్షణగా నిలవనున్నది. నాగోలు స్టేషన్ నుంచి కాస్త ముందుకు వెళ్లగలిగితే చాలు.. ఆయా ప్రాంతానికి అటుఇటుగా అభివృద్ధి చెందిన కాలనీలు ఎక్కువే ఉన్నాయి. ఇక్కడ్నుంచి పశ్చిమానికి ప్రతిరోజు దాదాపు లక్ష మందికి పైగా ప్రయాణీకులు రాకపోకల్ని సాగిస్తున్నారని అంచనా. మెట్రో ద్వారా సులువుగా ప్రయాణించే అవకాశం ఉండటంతో ఉప్పల్, నాగోలు పరిసర ప్రాంతాల్లో నివసించడానికి చాలామంది ఆసక్తి చూపిస్తున్నారని అంచనా.

### లుక్ ఈస్ట్ పాలసీ..

పశ్చిమ హైదరాబాద్‌లోని ఐటీ కంపెనీల్లో పని చేసే ఉద్యోగుల్లో సుమారు 40 శాతం ఈస్ట్ హైదరాబాద్ నుంచే రాకపోకల్ని సాగిస్తారని అంచనా. ప్రస్తుతం పశ్చిమంలో కంపెనీలు అధికం కావడంతో, నగరంలోని ఇతర ప్రాంతాలను అభివృద్ధి చేయాలని టీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పురపాలక శాఖ మంత్రిగా ఉన్నప్పుడు ''లుక్ ఈస్ట్ పాలసీ''కి శ్రీకారం చుట్టారు. ఉప్పల్, పోచారం వంటి ప్రాంతాల్లో ఐటీ సంస్థలను ఏర్పాటు చేస్తే అద్దెలో 25 శాతం రిబేటు, విద్యుత్తు చార్జీల్లో 25 శాతం తగ్గింపు, ఉచితంగా ఇంటర్నెట్ సదుపాయం, మెట్రోరైలు పాసుల్లోనూ 25 శాతం తగ్గింపు వంటి ప్రోత్సాహాల్ని అందించేందుకు ప్రభుత్వం ప్రణాళికల్ని సిద్ధం చేస్తున్నది. పైగా, పశ్చిమంతో పోల్చితే ఇక్కడి ఆఫీసు అద్దెలు కూడా తక్కువుండటం విశేషం.

### 5000 మందికి ఉద్యోగాలు!

పశ్చిమ హైదరాబాద్‌లో గ్రేడ్ -ఏ ఆఫీసు స్పేస్ సుమారు రూ.65 నుంచి రూ.100 లోపు లభిస్తాయి. ఆయా ఆఫీసు ప్రాంతం, అందులోని విద్యుత్తు సరఫరా, పార్కింగ్ సదుపాయం, అది ఎంత అందుబాటులో ఉన్నది వంటి అంశాల ఆధారంగా రేటు ఆధారపడుతుంది. ఈస్ట్ హైదరాబాద్‌లో మేం చదరపు అడుక్కీ రూ.40 నుంచి రూ.60 మధ్యలో స్థలాన్ని అందజేస్తున్నాం. డీఎస్ఎల్ అబాకస్ పేరుతో నిర్మిస్తున్న 3.30 లక్షల చదరపు అడుగుల్లో ఆఫీసు సముదాయాన్ని కడుతున్నాం. రానున్న రోజుల్లో ఇందులో ఎంతలేదన్నా 3,300 మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయి. అదే, రెండు షిఫ్టుల్లో పని చేస్తే సుమారు 6,600 మంది ఇక్కడ పని చేస్తారు. కొన్ని సంస్థలు రెండు షిఫ్టులు పని చేయకపోయినా, హీనపక్షం కనీసం ఐదు వేల మంది ఇక్కడ పని చేయడానికి అవకాశమున్నది. పైగా, ఇక్కడ సంస్థలను ఏర్పాటు చేసేవారికి ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రోత్సాహాన్ని కూడా అందజేస్తున్నది.

**-మనోజ్ అగర్వాల్, ఎండీ, డీఎస్ఎల్ ఇన్‌ఫ్రా**

# గేటెడ్ కమ్యూనిటీల్లో సైకోలు!

**హైదరాబాద్‌లోని కొన్ని గేటెడ్ కమ్యూనిటీల్లో సైకోలు పడ్డారు. వీరంతా కొనుగోలుదారులుగా ప్రాజెక్టుల్లో ప్రవేశించి.. డెవలపర్లు ఏ ఒక్క పొరపాటు చేసినా.. తోటి నివాసితులను రెచ్చగొట్టి డెవలపర్లను ముప్పతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్లు తాగిస్తున్నారు. తాము అడిగిన రేటుకు బిల్డర్ ఇల్లు ఇవ్వలేదనో.. తమను పట్టించుకోవడం లేదనో.. ఇలా ఏదో ఒకటి మనసులో పెట్టుకుని.. ఏ ఒక్క చిన్న అవకాశం లభించినా.. డెవలపర్లకు చుక్కలు చూపిస్తున్నారు. వీరి వ్యవహారశైలి పట్ల సాటి కొనుగోలుదారులకు అభ్యంతరాలున్నప్పటికీ.. బయటికి చెప్పలేని పరిస్థితి. దీంతో, ఈ తరహా సైకోలకు ఆడిందే ఆట.. పాడిందే పాటగా మారింది. హైదరాబాద్ నిర్మాణ రంగం బ్రాండ్ ఇమేజీని పూర్తిగా దెబ్బ తీస్తున్న ఇలాంటి సైకోల పట్ల తోటి నివాసిలంతా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.**

**తూ**ర్పు హైదరాబాద్‌లో ఓ పేరెన్నిక గల నిర్మాణ సంస్థ. పెద్దల కోసం ఒక మంచి గేటెడ్ కమ్యూనిటీకి శ్రీకారం చుట్టింది. దాదాపు 99 శాతం కొనుగోలుదారులు ఆ సంస్థ పట్ల ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. ఆయా సంస్థ యజమాని కనిపిస్తే చాలు ఎంతో ఆత్మీయంగా మాట్లాడేవారు. అలాంటిది, అందులో ఒక్క సైకో రంగప్రవేశం చేశాడు. నిర్మాణ సంస్థ తాను చెప్పిన మాట వినలేదనే అక్కసుతో సదరు డెవలపర్‌ని ముప్పుతిప్పలు పెట్టారు. సభ్యుల్లేని అపార్టుమెంట్ సంఘాన్ని ఏర్పాటు చేసుకుని తొలుత పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అక్రమ నిర్మాణమంటూ జీహెచ్ఎంసీకి లేఖ రాశాడు. అగ్నిమాపక శాఖను సంప్రదించాడు. సైబరాబాద్ కమిషనర్‌ను కలిశాడు. పురపాలక శాఖ మంత్రి, సీఎంకూ లేఖలు రాసి.. బిల్డర్‌ని అనేక రకాలుగా వేధించాడు. కానీ, వీరిందరికీ వాస్తవం తెలిసే సరికి పుణ్యకాలం కాస్త గడిచిపోయింది. విచారణలో చివరికీ తేలిందేమిటంటే.. అతనొక సైకో అని.. కావాలనే బిల్డర్ మీద బురద జల్లుతున్నాడని అర్థమైంది.

### పొద్దున లేచినప్పట్నుంచి..

పశ్చిమ హైదరాబాద్‌లోని ఓ నిర్మాణ సంస్థ.. గచ్చిబౌలి చేరువలో గేటెడ్ కమ్యూనిటీ నిర్మించింది. అసలు ఎవరూ ఊహించక ముందే.. సాటి డెవలపర్లు అడుగు వేయకముందే.. భవిష్యత్తు అభివృద్ధిని అంచనా వేసి ఓ చక్కటి నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. ఇండ్లను చాలా అందంగా ముస్తాబు చేసింది. దాదాపు దశాబ్దం కంటే ముందే, ఆరంభమైన అట్టి నిర్మాణంలో ఒక సైకో చేరాడు. వెనక నుంచి అతనికి మద్ధతుగా కొందరు నిలిచారని సమాచారం. దశాబ్దం నుంచి నివాసితుల సంఘం ప్రతినిధిని అని చెప్పుకుంటూ ప్రభుత్వ కార్యాలయాలకు తిరుగుతూ ఫిర్యాదు చేయడమే పనిగా పెట్టుకున్నాడు. స్థానిక జీహెచ్ఎంసీ కార్యాలయానికి ప్రతిరోజూ వెళ్లడం.. అక్కడి అధికారులు, సిబ్బందిని కలవడం.. ఏదో ఒకటి చెప్పడం.. వారు పట్టించుకోకపోతే పైఅధికారులకు ఫిర్యాదు చేయడం.. ఇదే ఇతని దినచర్యగా మారింది. సాక్షాత్తు టౌన్ ప్లానింగ్ సిబ్బంది కూడా ఇతని వ్యవహారశైలితో విసుగు చెందారు. ప్రభుత్వ భూమిని డెవలపర్ కబ్జా చేశాడంటూ కొన్నిసార్లు ఫిర్యాదు చేశాడు. రెవెన్యూ విభాగానికి వెళ్లి.. బిల్డర్ ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేశాడంటూ లేఖలు సమర్పిస్తాడు. ఇలా, సదరు కొనుగోలుదారులు బిల్డర్ మీద దాదాపు ఇరవై వరకూ ఫిర్యాదులు చేశాడు. అవన్నీ క్షుణ్ణంగా పరిశీలించాక టౌన్ ప్లానింగ్ సిబ్బందికి వాస్తవమేమిటో అర్థమవుతున్నది. ఆ మొత్తం నిర్మాణాన్ని అభివృద్ధి చేసిన డెవలపర్‌నే.. ఆ ప్రాజెక్టులోకి ప్రవేశించనీయకుండా మాస్టర్ ప్లాన్ వేయడం కొసమెరుపు.

### తస్మాత్ జాగ్రత్త..

- వివిధ నగరాలకు చెందిన ప్రజలంతా హైదరాబాద్లోని గేటెడ్ కమ్యూనిటీలో స్థిర నివాసాన్ని ఏర్పాటు చేసుకుంటున్నారు. పూర్తి స్థాయి భద్రత కలిగి ఉండాలనే ఉద్దేశ్యంతో గేటెడ్ ప్రాజెక్టులను ఎంచుకోవడానికి ప్రధాన కారణం. ఇల్లు, ఆఫీసు తప్ప వేరే అంశాల గురించి పెద్దగా ప్రాధాన్యతనివ్వరు. ముఖ్యంగా, స్థానిక బిల్డర్లతో తలనొప్పి ఎదుర్కొన్నట్లుగా వ్యవహరిస్తారు. ఇదే అదనుగా భావించిన కొందరు తెలివైన కొనుగోలుదారులు.. ఒక జట్టుగా ఏర్పడి ఏదో రకంగా డెవలపర్లను బెదిరించడమే పనిగా పెట్టుకుంటున్నారు. ఒకవేళ బిల్డర్ నాసిరకమైన నిర్మాణాల్ని చేపడితే నిలదీయాల్సిందే. ఇందులో ఎలాంటి తప్పు లేదు. కానీ, బిల్డర్ అక్రమ నిర్మాణం చేపట్టాడంటూ, ప్రభుత్వ స్థలం కబ్జా చేశాడని ఫిర్యాదులు చేయడమేమిటి? డెవలపర్ అలా వ్యవహరించి ఉంటే, తగిన చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వ సంస్థలు ఉండనే ఉన్నాయి కదా! కానీ, అవన్నీ సక్రమంగా పని చేయడం లేదంటూ విమర్శిస్తూ ఫిర్యాదులు చేయడమే పనిగా పెట్టుకుని డెవలపర్లను ముప్పుతిప్పలు పెడుతున్నారు. ఇలాంటి సైకోల వల్ల జరుగుతున్న అనర్థం వల్ల ఆయా ప్రాజెక్టుల్లో కొనుగోలుదారులు అప్రమత్తంగా వ్యవహరించాలని నిపుణులు కోరుతున్నారు.
- ఒక ప్రాజెక్టులో డెవలపర్, కొనుగోలుదారుల మధ్య వివాదం ఏర్పడితే.. ఆయా నిర్మాణాలకు పెద్దగా డిమాండ్ ఉండదు. అందులో నివసించడానికి కిరాయిదారులూ ముందుకు రారు. కేవలం ఒకరిద్దరూ అదే పని పెట్టుకుని డెవలపర్‌తో గొడవ పడుతుంటే.. దాన్ని వెనక ఏదో ఒక మతలబు ఉందనే విషయాన్ని అక్కడి యజమానులు గుర్తించాలి. వీలైనంతవరకూ అట్టి బిల్డర్‌తో సమస్యను సామరస్యంగా పరిష్కరించుకోవడానికి ప్రయత్నించాలి. డెవలపర్ హామీ ఇచ్చిన సౌకర్యాలన్నీ సమకూర్చాడా? లేదా? అనే అంశం మీదే దృష్టి పెట్టి, వాటిని పరిష్కరించుకోవాలి. అలా కాకుండా, ఏండ్ల తరబడి ఒకరిద్దరు లేదా నివాసితుల సంఘంలోని కొందరు సభ్యులంతా కలిసి డెవలపర్‌కు వ్యతిరేకంగా పని చేస్తున్నారంటే.. ఏదో ఒక మతలబు ఉందనే విషయాన్ని గుర్తించాలి. ఆయా సంఘసభ్యులను పక్కన పెట్టేసి.. కొత్తవారు సంఘంలోకి ప్రవేశించి సమస్యను సామరస్యంగా పరిష్కరించుకునే ప్రయత్నం చేయాలి.

# డెవలపర్‌పై రూ. కోటి జరిమానా

రెరా ఆదేశాల్ని పాటించడంలో నిర్లక్ష్యం వహించినందుకు ఓ బడా నిర్మాణ సంస్థపై రెరా అథారిటీ రూ.కోటి జరిమానా విధించింది. పైగా, నెల రోజుల్లోపు చెల్లించాలని ఆదేశించింది. 2018 అక్టోబరు 25న రెరా జారీ చేసిన ఆదేశాల్ని సదరు సంస్థ బేఖాతరు చేసింది. దీంతో, రెరా అథారిటీ కన్నెర్ర చేసింది. సదరు సంస్థ ప్రస్తుతం చేపడుతున్న ఆరు ప్రాజెక్టులకు సంబంధించి ఎస్క్రో ఖాతా వివరాల్ని పొందుపర్చాలని ఆదేశించింది. రెరా నియమించిన ఆడిటర్ అనుమతి పొందిన తర్వాతే, బ్యాంకులు ఆ ఆరు నిర్మాణాలకు రుణమొత్తాన్ని విడుదల చేయాలని ఆదేశాలు జారీ చేసింది. ఛార్టెడ్ అకౌంటెంట్, ఆర్కిటెక్ట్, స్ట్రక్చరల్ ఇంజినీర్లు కలిసి జాయింట్ అఫిడవిట్‌ను అందజేయాలని కోరింది. తమ ఆదేశాల్ని బిల్డర్ పాటించకపోతే, ప్రస్తుతం చేపడుతున్న ఆరు ప్రాజెక్టులను రెరా నుంచి తొలగిస్తామని యూపీ రెరా అథారిటీ హెచ్చరించింది.

# లగ్జరీకి నయా చిరునామా..

| పేరు | లొకేషన్ | రేటు | నిర్మాణ దశ | హ్యాండోవర్ తేది |
|---|---|---|---|---|
| హిల్‌క్రిస్ట్ | గచ్చిబౌలి | రూ.51.75 లక్షల నుంచి.. | నిర్మాణంలో ఫేజు 2 | 2020 డిసెంబరు |
| ఆర్ఎం పాంచజన్య | మియాపూర్ | రూ. 61.56-93.58 లక్షలు | నిర్మాణంలో ఉంది | 2021 జూలై |
| లాన్సమ్ ఎటానియా | నానక్‌రాంగూడ | రూ.1.25-2.7 కోట్లు | నిర్మాణంలో ఫేజ్2 | 2021 డిసెంబర్ |
| రాంకీ వన్ గెలాక్సియా | నల్లగండ్ల | రూ.66.41-1.05 కోట్లు | నిర్మాణంలో ఉంది | 2021 డిసెంబర్ |
| వెర్టెక్స్ పాంచే | కోకాపేట్ | రూ.71.11-1.09కోట్లు | సిద్ధంగా ఉన్నాయి | 2016 పూర్తయింది |
| రష్మీ దేవీ హోమ్స్ | బాచుపల్లి | రూ.27.85-54.47 లక్షలు | నిర్మాణంలో ఉంది | 2020 మార్చి |
| ప్రెస్టీజ్ హై ఫీల్డ్స్ | గచ్చిబౌలి | రూ.74.4 లక్షలు- | నిర్మాణంలో ఉంది | 2020ఆగస్టు |
| డ్యూక్స్ గెలాక్సీ | బంజారాహిల్స్ | 1.73- 2.32 కోట్లు | గృహప్రవేశానికి సిద్ధం | గృహప్రవేశానికి సిద్ధం |
| మందాడి మ్యాగ్నస్ | మియాపూర్ | 65.52- 81.9 లక్షలు | నిర్మాణ దశ | 2020 డిసెంబరు |
| హాల్‌మార్క్ వినినియా | గచ్చిబౌలి | 64.74 లక్షలు- 1.1 కోట్లు | నిర్మాణ దశ | 2020 డిసెంబరు |
| సాలార్‌పూరియా సత్వా మ్యాగ్నస్ | షేక్‌పేట్ | 78.95 లక్షలు- 2.05 కోట్లు | నిర్మాణ దశ | 2020 డిసెంబరు |
| అనుహార్ రామిరెడ్డి టవర్స్ | మణికొండ | 59.71 లక్షలు- 1.31 కోట్లు | నిర్మాణ దశ | 2022 సెప్టెంబరు |
| ప్రెస్టీజ్ హై ఫీల్డ్స్ | గచ్చిబౌలి | రూ.74.4 లక్షల నుంచి | నిర్మాణ దశ | 2020 ఆగస్టు |

గమనిక: కేవలం అవగాహన కోసమే ఈ పట్టిక. పూర్తి వివరాల కోసం సదరు సంస్థను సంప్రదించండి.

# ఆస్ట్రియాలో సాహో

1368 అడుగుల ఎత్తులో కేబుల్ కార్స్‌లో హీరోయిన్‌తో ప్రేమగీతాన్ని పాడుకున్నారు ప్రభాస్. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'సాహో'. సుజీత్ దర్శకత్వం వహిస్తున్నారు. శ్రద్ధాకపూర్ కథానాయిక. యు.వి క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్, విక్రమ్ నిర్మిస్తున్నారు. తెలుగు, తమిళ, హిందీ భాషల్లో ఏకకాలంలో రూపొందుతున్న ఈ చిత్రం ఆగస్టు 15న ప్రేక్షకుల ముందుకురానుంది. ఆస్ట్రియాదేశంలోని అందమైన లొకేషన్స్‌లో పాటను చిత్రీకరించారు. టైరోల్ పర్వత ప్రాంతంలో 1368 అడుగుల ఎత్తులో కేబుల్ కార్స్‌లో తెరకెక్కించిన ఈ గీతం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలుస్తుందని చిత్రబృందం చెబుతున్నది. ఈ పాటకు బాలీవుడ్ కొరియోగ్రాఫర్ వైభవీ మర్చెంట్ నృత్యాలను అందించారు. పవర్‌ఫుల్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న సినిమా చిత్రీకరణ ఈ పాటతో ముగియనున్నట్లు సమాచారం. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: మది, ఎడిటింగ్: శ్రీకర్ ప్రసాద్.

ప్రభాస్

సూర్య

# సూర్య బందోబస్త్

జయాపజయాలకు అతీతంగా నవ్యతకు ప్రాముఖ్యతనిస్తూ సినిమాలు చేస్తుంటారు హీరో సూర్య. ఆయన కథానాయకుడిగా నటిస్తున్న తమిళ చిత్రం 'కప్పాన్'. కె.వి. ఆనంద్ దర్శకుడు. ఈ సినిమా 'బందోబస్త్' పేరుతో తెలుగులో అనువాదం అవుతున్నది. లైకా ప్రొడక్షన్స్ పతాకంపై సుభాస్కరణ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. తెలుగు టైటిల్, లుక్‌ను ప్రముఖ దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి విడుదలచేశారు. 'రాజకీయ ఇతివృత్తంతో రూపొందుతున్న యాక్షన్ థ్రిల్లర్ ఇది. ప్రధాన మంత్రిని ఉగ్రవాదుల ముప్పు నుంచి నిజాయితీపరుడైన ఓ సెక్యూరిటీ అధికారి ఎలా కాపాడడన్నది ఆకట్టుకుంటుంది. మోహన్‌లాల్, సూర్య పాత్రలు, నటన ప్రత్యేకాకర్షణగా నిలుస్తాయి. 'వీడొక్కడే', 'బ్రదర్స్' తర్వాత కె.వి.ఆనంద్, సూర్య కలయికలో రూపొందుతున్న మూడో సినిమా ఇది' అని చిత్రబృందం తెలిపింది. మోహన్‌లాల్, బోమన్ ఇరానీ, ఆర్య, సాయేషా సైగల్, పూర్ణ, నాగినీడు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: హారీస్ జయరాజ్, ఛాయాగ్రహణం: ఎం.ఎస్. ప్రభు

# శేఖర్‌కమ్ముల-చైతూ సినిమా షురూ

నాగచైతన్య, సాయిపల్లవి జంటగా శేఖర్ కమ్ముల దర్శకత్వంలో రూపొందిస్తున్న తాజా చిత్రం గురువారం సికింద్రాబాద్‌లోని గణపతి ఆలయంలో పూజా కార్యక్రమాలతో లాంఛనంగా ప్రారంభమైంది. ఏషియన్ గ్రూప్ పతాకంపై నారాయణదాస్ నారంగ్, పి.రామ్మోహనరావు నిర్మిస్తున్నారు. 'ఫిదా' తర్వాత శేఖర్ కమ్ముల దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం అందరిలో ఆసక్తిని కలిగిస్తున్నది. 'ఈ సినిమాకు సంబంధించిన పూర్వ నిర్మాణ పనులు మొదలయ్యాయి. సెప్టెంబర్ తొలివారంలో చిత్రీకరణ ప్రారంభిస్తాం. ఈ సంవత్సరాంతంలో ప్రేక్షకులముందుకు తీసుకొస్తాం. వైవిధ్యమైన కథాంశమిది. ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాల్ని త్వరలో తెలియజేస్తాం' అని చిత్ర బృందం తెలిపింది. ఈ సినిమాకు విజయ్ సి కుమార్ ఛాయాగ్రహణాన్ని అందించబోతున్నారు.